

ఈనాడు




విజయవాడ 12-8-2025 మంగళవారం సిటీ సంపుటి 52 . సంచిక 3
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

మద్యం కుంభకోణం
సూత్రధారి జగనే!

అనేక నిర్ణయాల్లో నాటి ముఖ్యమంత్రి పాత్ర

- మద్యం అమ్మకాల విధానాల్లో మార్పు ఆయన పనే
- అక్రమార్కుల నియామకాలకు తానే మూలం
- ఏ2, ఏ3 నియామకాలకు సిఫార్సు చేసింది అజేయ కల్లం
- అనుబంధ ఛార్జిషీట్‌లో వెల్లడించిన సిట్



ఈనాడు - అమరావతి

రాష్ట్రంలో 2019-24 మధ్య ఐదేళ్ల పాటు సాగిన మద్యం కుంభకోణంలో అప్పటి ముఖ్యమంత్రి(జగన్) పాత్ర ఉందని అనుబంధ ఛార్జిషీట్‌లో సిట్ స్పష్టంగా పేర్కొంది. మద్యం వ్యాపారాన్ని అక్రమ సంపాదనకు రాచమార్గంగా మలుచుకోవడంలో అప్పటి సీఎం ఏయే నిర్ణయాలు ఎలా తీసుకున్నారో వివరించింది. ఉన్నతాధికారుల సిఫార్సులకు భిన్నంగా నియామకాలు ఎలా చేపట్టారో వెల్లడించింది. ప్రస్తుతం ఈ కేసులో నిందితులుగా ఉన్న అధికారులతో మొత్తం మద్యం వ్యాపారాన్ని తమ కనుసన్నల్లో నడిపించేలా విధానాలను అడ్డదిడ్డంగా మార్చేయడంలో ఈ కుంభకోణంలో ఆయన అత్యంత కీలకమని అనుబంధ ఛార్జిషీట్‌లో సిట్ పేర్కొంది.

ఆ ముగ్గురి పాత్రపై అభియోగాలు

మద్యం కుంభకోణం కేసులో... సీఎంవో మాజీ కార్యదర్శి, విశ్రాంత ఐఏఎస్ అధికారి కె.ధనుంజయరెడ్డి (ఏ-31), జగన్ ఓఎస్డీ పెళ్లకూరు కృష్ణమోహన్‌రెడ్డి (ఏ-32), భారతి సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీ (ఏ-33) ప్రమేయం, పాత్రకు సంబంధించి సిట్ అభియోగాలు మోపింది. విజయవాడ ఏసీబీ కోర్టులో సిట్ అధికారులు సోమవారం అనుబంధ అభియోగపత్రం దాఖలు చేశారు. మొత్తం 124 పేజీలు.. 16కు పైగా వాల్యూమ్‌లతో దీన్ని సమర్పించారు. గతంలో వేసిన ప్రాథమిక అభియోగపత్రంలో ఏడుగురు వ్యక్తులు, 9 సంస్థలపై అభియోగాలు మోపారు... వాటికి అదనంగా ఇప్పుడు కొత్తగా ముగ్గురు నిందితులపై సిట్ అభియోగాలు నమోదు చేసింది. దీంతో 10 మంది వ్యక్తులు, 9 సంస్థలపై ఇప్పటివరకూ అభియోగాలు నమోదు చేసినట్లైంది. తాజా అభియోగపత్రంలో హవాలా లావాదేవీలు, డొల్ల కంపెనీలకు సంబంధించిన నకిలీ డైరెక్టర్ల వివరాలు తదితర అంశాలను పొందుపరిచింది.ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసేలా వ్యూహాత్మకంగా ప్రణాళికాబద్ధంగా ఈ అక్రమ నేరానికి పాల్పడ్డారని విశ్లేషించింది. రూ.3,500 కోట్ల విలువైన ఈ ఆర్థిక అరాచకంలో మూలాలు చాలా లోతుకు విస్తరించి ఉన్నాయని పేర్కొంది. ఈ కుంభకోణంలో కీలక పాత్రధారులు ఏ2 వాసుదేవరెడ్డి, ఏ3 సత్యప్రసాద్ నియామకానికి సిఫార్సు చేసింది నాడు ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారుగా ఉన్న అజేయ కల్లం అని కూడా ఈ ఛార్జిషీట్ వివరించింది.

అందులోని అంశాలు ఇలా ఉన్నాయి...

■ ప్రభుత్వంలోని కీలక వ్యక్తులే మద్యం విధానంలో మార్పులకు సంబంధించిన ప్రధాన నిర్ణయాలు తీసుకున్నారు. 2019 సెప్టెంబరు 30 వరకు మద్యం దుకాణాల కొనసాగింపునకు, లైసెన్సుల మంజూరుకు అనుమతిస్తూ అప్పటి ముఖ్యమంత్రి జగన్ 2019 జూన్ 21న నిర్ణయం తీసుకున్నారు. 2019 అక్టోబరు ఒకటి నుంచి మద్యం దుకాణాలను ప్రభుత్వ దుకాణాలుగా నడిపేందుకు వీలుగా అవసరమైన మనుషులను గుర్తించాలని ఆయనే ఆదేశాలు ఇచ్చారు.

■ 2019 జులై 29న నాటి ముఖ్యమంత్రి జగన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలోనే మద్యం వ్యాపారానికి సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దుకాణాల సంఖ్య, అవసరమైన చోట అద్దెకు తీసుకోవడం, ఆ దుకాణాలను అవసరమైన మౌలిక సౌకర్యాలు, సిబ్బంది, రవాణా ఛార్జీలు తదితర అంశాలు ముఖ్యమంత్రి సమక్షంలోనే ఖరారు చేశారు. (మిగతా 8లో)

ముడుపుల సొమ్ము చేర్చింది ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డే	జగన్ సన్నిహితులకు మద్యం ముడుపులు	ఫోన్ల లొకేషన్లతో కీలక సమాచారం	మద్యం సరఫరా ఆర్డర్లు మార్చేసి.. ఆధారాల ధ్వంసం
మనీ లాండరింగ్ ద్వారా దుబాయ్ కంపెనీలకు	వాటితో ఆస్తులు కొన్న ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్ప బాలాజీ	ఫోరెన్సిక్ విశ్లేషణతో బయటపడిన బండారం	నేరపూరిత కుట్రకు పాల్పడిన నిందితులు

13లో




పార్లమెంటు ప్రాంగణం నుంచి ఈసీ కార్యాలయానికి ర్యాలీగా బయలుదేరుతున్న రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, మల్లికార్జున ఖర్గే, శరద్ పవార్, అఖిలేశ్ యాదవ్, తిరుచ్చి శివ, టీఆర్ బాలు, డెరెక్ ఓబ్రియాన్, సంజయ్ రౌత్, రాంగోపాల్ యాదవ్ తదితరులు

ఓట్ల చోరీపై పోరు

- పార్లమెంటు నుంచి ఈసీ కార్యాలయం దాకా విపక్ష ఎంపీల నిరసన ర్యాలీ
- పోలీసుల అడ్డగింత.. తీవ్ర ఉద్రిక్తత
- బారికేడ్లపై ఎక్కి ఎంపీల నిరసన
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ సహా పలువురి అరెస్టు, విడుదల
- విపక్షాల తీరును తప్పుబట్టిన భాజపా

దిల్లీ: బిహార్‌లో ఓట్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ఓట్ల చోరీపై సోమవారం విపక్ష ఇండియా కూటమి చేపట్టిన నిరసన ర్యాలీ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, అఖిలేశ్ యాదవ్ సహా విపక్ష నేతలంతా పార్లమెంటు ఆవరణ నుంచి ఎన్నికల సంఘం (ఈసీ) కార్యాలయం వరకు ర్యాలీగా బయలుదేరగా మధ్యలోనే పోలీసులు అడ్డుకున్నారు. హైడ్రామా మధ్య వారిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్లకు తరలించారు. అనంతరం విడుదల చేశారు. తెలుపు, ఎరుపు టోపీలను ధరించిన ఎంపీలు సోమవారం ఉదయం పార్లమెంటు మకర ద్వారం నుంచి ర్యాలీగా బయలుదేరారు. ఎస్ఐఆర్ + ఓట్ల చోరీ = ప్రజాస్వామ్య హత్య, ఎస్ఐఆర్- లోకతంత్ర పర్ వార్ అనే బ్యానర్లు, ఎస్ఐఆర్, ఓటు చోరీకి వ్యతిరేకంగా ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ ఈసీ కార్యాలయం వైపు బయలుదేరారు. ర్యాలీ ప్రారంభానికి ముందు జాతీయ గీతాన్ని ఆలపించారు. ర్యాలీలో ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్, డీఎంకే నుంచి టీఆర్ బాలు, శివసేన (ఉద్ధవ్) నుంచి సంజయ్ రౌత్, (మిగతా 8లో)



పోలీసులు అడ్డుకోవడంతో బారికేడ్లు ఎక్కి ఆందోళన చేస్తున్న తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు సుస్మితా దేవ్, మహువా మొయిత్రా

మెగా డీఎస్సీ ఫలితాల విడుదల

ఈనాడు, అమరావతి: మెగా డీఎస్సీ ఫలితాలను ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. అభ్యర్థుల నుంచి వచ్చిన అభ్యంతరాలను క్షుణ్నంగా పరిశీలించి సవరించిన తుది 'కీ' ఆధారంగా నార్మలైజేషన్ విధానంలో ఫలితాలను విడుదల చేసినట్లు కన్వీనర్ వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. అభ్యర్థులు పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్ ద్వారా తుది ఫలితాలు, స్కోరు కార్డులను పొందవచ్చని చెప్పారు. ఏమైనా అభ్యంతరాలుంటే https://apdsc.apcfss.in వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్ నంబరు నమోదు చేసి, టెట్ వివరాలు సరి చేసుకోవడానికి ఈ నెల 13 వరకు అవకాశం కల్పించారు. 150 మందికి సంబంధించి డీఎస్సీలో నమోదు చేసిన టెట్ వివరాలకు, ప్రభుత్వం వద్దనున్న వివరాలకు సరిపోలడం లేదు. దీంతో వారి ఫలితాలను విడుదల చేయలేదు. కూటమి ప్రభుత్వం 16,347 ఉపాధ్యాయ పోస్టులకు ఏప్రిల్ 20న ప్రకటన విడుదల చేసింది. జూన్ 6 నుంచి జులై 2 వరకు 89 విభాగాల్లో మెగా డీఎస్సీ పరీక్షలు నిర్వహించింది.

సుంకాలు మన దేశాన్ని ఆపలేవు

- ఎవరిది డెడ్ ఎకానమీనో భవిష్యత్తే తేలుస్తుంది
- హర్ ఘర్ తిరంగాతో ప్రపంచానికి బలమైన సందేశం పంపాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: అమెరికా విధించే సుంకాలతో భారతదేశ చరిత్ర ఆగిపోతుందనుకుంటే అది వారి భ్రమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'భారతీయులకు ఉద్యోగాలు ఇవ్వొద్దని కొంతమంది అంటున్నారు. మన యువత లేకపోతే ఆ దేశాలు అభివృద్ధి చెందలేని రోజు త్వరలోనే వస్తుంది. దేశ భద్రత, సమగ్రత, సార్వభౌమత్వం విషయంలో భారత్ ఎవరికీ తలవంచదు, భయపడదు. ఇప్పుడున్నది 40 ఏళ్ల కిందటి భారతదేశం కాదు. బలమైన, దృఢమైన దేశం. (మిగతా 8లో)



హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో సెల్ఫీ పాయింట్ వద్ద జాతీయ పతాకంతో సీఎం చంద్రబాబు

రాబోయే 5 రోజుల్లో భారీ వర్షాలు

ఈనాడు, విశాఖపట్నం: బంగాళాఖాతంలో బుధవారం అల్పపీడనం ఏర్పడే అవకాశముందని భారత వాతావరణ విభాగం పేర్కొంది. ఆ తర్వాత అది వాయుగుండంగా బలపడి, శనివారం నాటికి తీరం దాటొచ్చని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్, ఇతర వాతావరణ మోడళ్లు అంచనా వేస్తున్నాయి. దీని ప్రభావంతో మంగళవారం నుంచి ఈ నెల 20 వరకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురవొచ్చని భావిస్తున్నాయి. మరోవైపు రాబోయే ఐదు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వానలు పడే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. బుధవారం నుంచి శుక్రవారం వరకు కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. మంగళవారం అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు, గుంటూరు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల (మిగతా 8లో)

అణు బెదిరింపులకు భయపడం

- అసీం మునీర్ హెచ్చరికలపై భారత్ మండిపాటు
- దేశ భద్రతకు ఎలాంటి చర్యలకైనా వెనుకాడబోమని స్పష్టీకరణ
- మునీర్ వ్యాఖ్యల్ని వక్రీకరించారన్న పాక్

దిల్లీ: సింధూ నది జలాలను అడ్డుకోవడానికి ఆనకట్టలు కడితే పేల్చేస్తామని, తమ దేశ మనుగడకు ప్రమాదం ఏర్పడితే సగం ప్రపంచాన్ని అణ్వాయుధాలతో నాశనం చేస్తామంటూ బెదిరింపులకు దిగిన పాకిస్థాన్ సైన్యాధిపతి అసీం మునీర్ ప్రేలాపనలపై భారత్ దీటుగా స్పందించింది. 'అణు బెదిరింపులకు భయపడం. దేశ భద్రత కోసం ఎలాంటి చర్యలు తీసుకోవడానికైనా వెనుకాడబోం' అని భారత విదేశీ వ్యవహారాల శాఖ స్పష్టం చేసింది. అసీం మునీర్ ఆదివారం అమెరికాలోని ఫ్లోరిడాలో ప్రవాస పాకిస్థానీలతో మాట్లాడుతూ మరోసారి భారత్‌పై వ్యతిరేకత వెళ్లగక్కారు. 'కశ్మీర్ మాకు ప్రాణంతో సమానం. అది భారత్‌లో అంతర్భాగం కాదు. కశ్మీర్ అసంపూర్ణ అంతర్జాతీయ ఎజెండా' అని పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య ఉన్న నదీ జలాల వివాదాన్ని ప్రస్తావిస్తూ.. 'సింధూ నదిపై భారత్ డ్యామ్‌లు నిర్మించే వరకు మేం ఎదురుచూస్తాం. ఆ తర్వాత వారు నిర్మించిన ఆనకట్టలను క్షిపణులతో పేల్చేస్తాం. అణ్వాయుధాలున్న పాకిస్థాన్ ఉనికికి ముప్పు ఎదురైతే సగం ప్రపంచాన్ని నాశనం చేస్తాం' అంటూ నోరుపారేసుకున్నారు. భారత్-పాక్‌తో పాటు అనేక దేశాల మధ్య యుద్ధాలను ఆపిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నాయకత్వం పట్ల పాకిస్థాన్ కృతజ్ఞతతో ఉందని చెప్పుకొచ్చారు. కాగా, మునీర్ అమెరికాలో పర్యటించడం గత రెండు నెలల్లో ఇది రెండోసారి. అణ్వాయుధాలున్న పాక్ ఎంత దుర్మార్గంగా ఆలోచిస్తుందో అంతర్జాతీయ (మిగతా 8లో)

మహిళా కండక్టర్లకు బాడీ వోర్న్ కెమెరాలు

- 5 రకాల బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం
- రాష్ట్రమంతటా ఎక్కడికైనా..
- ఈ నెల 15 నుంచి స్త్రీశక్తి పథకం అమలు

ఈనాడు - అమరావతి

ఆర్టీసీ బస్సుల్లో స్త్రీశక్తి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీచేసింది. ఐదు రకాల బస్సుల్లో రాష్ట్రమంతటా ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొంది. ఈ నెల 15 నుంచి ఈ పథకం అమల్లోకి రానున్నట్లు తెలిపింది. మహిళా ప్రయాణికుల భద్రత దృష్ట్యా అన్ని బస్సుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, మహిళా కండక్టర్లకు శరీరానికి ధరించే (బాడీ వోర్న్) కెమెరాలు సమకూర్చాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ఆర్అండ్‌బీ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్‌దండే సోమవారం ఉత్తర్వు జారీచేశారు. స్త్రీశక్తి పథకం అమలులో పాటించాల్సిన విధివిధానాలను అందులో పేర్కొన్నారు. (మిగతా 8లో)

జిల్లాలు, మండలాల సరిహద్దుల మార్పుపై మంత్రివర్గ ఉపసంఘం

- 13న సచివాలయంలో తొలి సమావేశం
- ఆ రోజున వినతుల స్వీకరణ

ఈనాడు - అమరావతి

రాష్ట్రంలో జిల్లాలు, మండలాలు, గ్రామాల పేర్లు, సరిహద్దుల మార్పులపై ప్రభుత్వం ఏడుగురు మంత్రులతో ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. మంత్రులు అనగాని సత్యప్రసాద్, పొంగూరు నారాయణ, వంగలపూడి అనిత, బీసీ జనార్దన్‌రెడ్డి, నిమ్మల రామానాయుడు, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్ ఈ ఉపసంఘంలో ఉంటారు. రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. 13న సచివాలయంలో తొలి సమావేశం జరుగుతుందని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.జయలక్ష్మి సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ అంశంపై వినతులను 13న మంత్రివర్గ ఉపసంఘానికి సమర్పించాలని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఓ ప్రకటనలో కోరారు.

పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు నేడు పోలింగ్ 14లో

ఇదీ సంగతి!





సచివాలయంలో మంత్రి కందుల దుర్గేష్‌తో భేటీ అయిన సినీ నిర్మాతలు

ఈ ఏడాది నుంచే నంది పురస్కారాలు

- సినీ పరిశ్రమ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- త్వరలోనే నూతన పాలసీ
- నిర్మాతలతో భేటీలో సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్
- సీఎం, డిప్యూటీ సీఎంలతో సమావేశం ఏర్పాటుకు నిర్మాతల విజ్ఞప్తి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని.. త్వరలోనే నూతన పాలసీ తీసుకురానున్నట్టు సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఈ ఏడాది నుంచే నంది అవార్డులు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. నంది పురస్కారాలు, నాటకోత్సవాలపై ఇప్పటికే సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పలు (మిగతా 8లో)

అమెరికాలో ధరల మోత

- ట్రంప్ సుంకాల బాదుడు ప్రభావం
- టాయ్‌లెట్ పేపర్ నుంచి డైపర్ వరకు అన్నీ భారమే
- నిత్యావసరాలు, వ్యక్తిగత సంరక్షణ వస్తువుల రేట్లూ పైపైకి

ఈనాడు - అమరావతి



ట్రంప్ దెబ్బకు అమెరికాలో వినియోగదారుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. నిత్యావసరాల నుంచి వ్యక్తిగత సంరక్షణ వస్తువుల ధరల మోతతో అక్కడి ప్రజల షాపింగ్ కార్ట్ బరువెక్కుతోంది. ఎడాపెడా సుంకాలతో భారత్ సహా వివిధ దేశాలను బాదేయడం, పెంచిన సుంకాలు ఆగస్టు 7 నుంచి అమల్లోకి రావడమే దీనికి ప్రధాన కారణం. ఫలితంగా అమెరికాలోని చాలా ప్రాంతాల్లో ఇప్పటికే దుస్తులు, బ్యాగులు సహా మరెన్నో వస్తువుల ధరలు పెరిగాయి. టాయ్‌లెట్ పేపర్ రేట్లు కూడా ఎగబాకాయి. రాబోయే రోజుల్లో డైపర్ల నుంచి షాంపూ, స్కిన్ కేర్ ఉత్పత్తులు సహా దిగుమతి చేసుకునే ప్రీమియం మద్యం, కార్లు, వాటి విడిభాగాల ధరలూ పెరగనున్నాయి. మొత్తంగా చూస్తే ఒక్కో కుటుంబంపై ఏడాదికి సగటున 2,400 డాలర్ల (భారత రూపాయి ప్రకారం రూ.2.11 లక్షలు) భారం పడుతుందని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు.

ఇదీ ట్రంప్ టారిఫ్ దెబ్బ

అమెజాన్, వాల్‌మార్ట్ తదితర దుకాణాల్లో దుస్తులు, బ్యాగులపై ఒక డాలర్ నుంచి ఎనిమిది డాలర్ల వరకు పెంచేశారు. పాత ధరల స్టిక్కర్లపైనే కొత్త వాటిని అతికిస్తున్నారు. దీనికి సంబంధించి ఇన్‌స్టాగ్రామ్ వేదికగా మెర్సిడెస్ చాండ్లెర్ అనే మహిళ వాల్‌మార్ట్‌లో పెరిగిన ధరలపై చేసిన పోస్టు వైరల్‌గా మారింది. కోట్ ధర 6.98 డాలర్ల నుంచి 10.98 డాలర్లకు.. అంటే నాలుగు డాలర్లు పెంచేశారు. బ్యాక్‌పాక్ ధర 19.97 డాలర్ల నుంచి 24.97 డాలర్లకు చేరింది. దుకాణంలో ఎక్కడ చూసినా ధరల పెరుగుదల కనిపిస్తోంది. నమ్మకపోతే మీ దగ్గరలోని దుకాణానికి వెళ్లి (మిగతా 8లో)

(c) eenadu



అలారం అందుకు పెట్టుకోండి

నిద్ర లేవడం కోసం అలారం పెట్టుకునే అలవాటును మానేయండి! దానికి బదులు నిద్రకు ఉపక్రమించడం కోసం అలారం పెట్టుకోవడం ప్రారంభించండి. దానివల్ల- మీ శరీరానికి ఎంత నిద్ర అవసరమో అదే స్వయంగా నిర్ణయించుకుంటుంది. ఆ నిర్ణయాధికారాన్ని ఫోన్ చేతిలో పెట్టకండి!

- కెవిన్ ఫెంగ్, కంటెంట్ క్రియేటర్

సరకు రవాణా నిర్వహణకు లాజిస్టిక్ కార్పొరేషన్

- ఓడరేవులకు సమీపంలో శాటిలైట్ టౌన్‌షిప్‌లు
- అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం

ఈనాడు, అమరావతి: ఓడరేవులు, విమానాశ్రయాలు, రహదారులు, రైలు, అంతర్గత జల రవాణా మార్గాల ద్వారా సరకు రవాణా నిర్వహణకు లాజిస్టిక్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఏపీతో పాటు పొరుగు రాష్ట్రాల సరకు రవాణాను కార్పొరేషన్ ద్వారా నిర్వహించాలని పేర్కొన్నారు. విమానాశ్రయాలు, ఓడరేవులు, ఏపీ మారిటైం పాలసీలో తీసుకురావాల్సిన మార్పులు, లాజిస్టిక్ కార్పొరేషన్ వంటి అంశాలపై సీఎం చంద్రబాబు సచివాలయంలో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో 20 పోర్టుల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఇప్పటికే ఉన్న ఓడరేవులు, విమానాశ్రయాల్లో భారీగా కార్యకలాపాలు జరుగుతున్నాయి. వాటికి సమీపంలో ఆర్థిక కేంద్రాలను అభివృద్ధి చేయాలి. ఓడరేవులు, విమానాశ్రయాలను అనుసంధానించేలా శాటిలైట్ టౌన్‌షిప్‌లు ఏర్పాటు చేయాలి. వాటివల్ల ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయి. ఈ తరహా సమీకృత అభివృద్ధికి ఉన్న అవకాశాలపై బ్లూప్రింట్ సిద్ధం చేయాలి. రోడ్డు, రైలు, వాయు, అంతర్గత జల రవాణా, మారిటైం రవాణాలకు ఏపీ కేంద్రంగా ఉండాలి' అని పేర్కొన్నారు.

పీపీపీ విధానంలో శాటిలైట్ టౌన్‌షిప్‌లు

పీపీపీ విధానంలో శాటిలైట్ టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. 'రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి చోదకశక్తిగా లాజిస్టిక్ కార్పొరేషన్ ఉండాలి. 175 నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసే ఎంఎస్ఎంఈ పార్కుల దగ్గరా శాటిలైట్ టౌన్‌షిప్‌ల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి. కుప్పం, దగదర్తి విమానాశ్రయాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి. భూసేకరణ పనులు నిర్దేశిత వ్యవధిలో పూర్తి చేయాలి. జాతీయ రహదారులు, విమానాశ్రయాలను కలిపేలా అంతర్గత రోడ్ల నిర్మాణం ఉండాలి. అవసరమైతే వీజీఎఫ్ విధానంలో వాటిని చేపట్టాలి' అని సీఎం వివరించారు.

మారిటైం పాలసీలో మార్పులు

కేంద్ర షిప్ బిల్డింగ్ క్లస్టర్ పాలసీకి అనుగుణంగా ఏపీ మారిటైం విధానంలో మార్పులు చేయాలన్న అధికారుల ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి అంగీకరించారు. 'ఓడ రేవులు, టెర్మినళ్లు, ఓడల నిర్మాణ యూనిట్లు, అంతర్గత జల రవాణా మార్గాలు, క్రూయిజ్ టెర్మినళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. పెట్టుబడుల ఆకర్షణకు వీలుగా పాలసీలో అవసరమైన మార్పులు చేయాలి. ఓడల నిర్మాణ యూనిట్ల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను గుర్తించాలి' అని సీఎం పేర్కొన్నారు.

రాష్ట్రంలో మరో రెండు లాజిస్టిక్ పార్కులు

- రైలు, రోడ్డు మార్గాలతో అనుసంధానం
- రూ.2,175 కోట్లతో అభివృద్ధి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా రెండు బహుళ నమూనా లాజిస్టిక్ పార్కులు (ఎంఎంఎల్‌పీ) ఏర్పాటు కానున్నాయి. వాటి ఏర్పాటు కోసం శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు, కృష్ణా జిల్లాల్లో 10 వేల ఎకరాలను ఏపీఐఐసీ గుర్తించింది. రాష్ట్రానికి ఉన్న 1,054 కి.మీ.ల తీర ప్రాంతాన్ని పోర్టు ఆధారిత ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో ఇప్పటికే రెండు లాజిస్టిక్ పార్కులను ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న విషయం తెలిసిందే. లాజిస్టిక్ హబ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడం ద్వారా చౌకగా సరకు రవాణా సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీనివల్ల ధరల విషయంలో ప్రపంచ మార్కెట్‌తో పోటీ పడే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. పార్కుల అభివృద్ధికి అవసరమైన భూములను నిర్దేశిత వ్యవధిలో ప్రభుత్వం సమకూర్చనుంది. రోడ్డు, రైలు, రవాణా సదుపాయం అందుబాటులో ఉండేలా ఈ పార్కులను అభివృద్ధి చేయనుంది. ఇప్పటికే శ్రీసత్యసాయి, అనకాపల్లి జిల్లాల్లో రెండు పార్కులను రూ.1,664 కోట్లతో ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది.

◆ నెల్లూరులో లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు 350 ఎకరాలను అధికారులు గుర్తించారు. డీపీఆర్‌ను అధికారులు ఇప్పటికే సిద్ధం చేశారు. వాటిని కేంద్ర ప్రభుత్వ పరిశీలనకు పంపారు. ◆ కృష్ణా జిల్లాలో 9,650 ఎకరాల్లో ఎంఎంఎల్‌పీ అభివృద్ధికి ప్రతిపాదించారు. దీనికి కనెక్టివిటీ ప్లానింగ్, ఇంటర్ ఏజెన్సీ సమన్వయం కోసం ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు.

రోడ్డు, రైల్వేలతో అనుసంధానించేలా ప్రాజెక్టులు

ఓడరేవులకు అనుసంధానంగా రైలు, రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టుల కోసం రూ.2,175.20 కోట్లు ఖర్చుతో ప్రాజెక్టులు రూపొందించారు. సాగరమాల ప్రాజెక్టు కింద కేంద్రం ఆర్థిక సహకారం అందించనుంది. ప్రాజెక్టుల అభివృద్ధికి రైలు, రోడ్డు మార్గాలను అనుసంధానించేందుకు అవకాశమున్న ప్రాంతాల్లో భూములను అధికారులు గుర్తించారు.

◆ కీలక రైల్వే కారిడార్‌లకు పోర్టులను అనుసంధానించేలా 5 రైల్వే కనెక్టివిటీ ప్రాజెక్టులను ప్రతిపాదించారు. పోర్టులో స్లైడింగ్, డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ అభివృద్ధికి ప్రతిపాదనలను రూపొందించారు.

విజయవాడలో.. రాష్ట్ర స్థాయి స్వాతంత్ర్య వేడుక

- అదే రోజు స్త్రీశక్తి పథకం ప్రారంభం

ఈనాడు, అమరావతి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జరిపే వేడుకల్లో రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని విజయవాడ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలుత రాజధాని అమరావతిలోని వెలగపూడి సమీపంలో నిర్వహించాలని భావించినా, ప్రతికూల వాతావరణం ఉంటుందని వేదికను మార్చింది. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు విజయవాడలో ప్రారంభమయ్యే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరిస్తారు. అదే రోజు ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం స్త్రీశక్తిని ప్రారంభించనున్నారు. ఈ సారి జిల్లాల్లో ఇన్‌ఛార్జి మంత్రులకు బదులుగా మంత్రులే జెండా ఆవిష్కరిస్తారు.

అన్ని నియోజకవర్గాల్లో స్త్రీశక్తి పథకం ప్రారంభోత్సవం

ఈనాడు, అమరావతి: మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించే స్త్రీశక్తి పథకం ఈ నెల 15 నుంచి ప్రారంభం కానుండగా.. ఈ వేడుకను అన్ని నియోజకవర్గాల్లో నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ఆర్టీసీ ఎండీ ఆదేశాలు జారీ చేశారు. సీఎం చంద్రబాబు ఈ పథకాన్ని విజయవాడలో ప్రారంభిస్తారన్నారు. ఉప ముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఆర్టీసీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, జోనల్ ఛైర్మన్లు వారు ఎంపిక చేసుకున్న జిల్లా/నియోజకవర్గ పరిధిలో పాల్గొంటారని తెలిపారు. జిల్లా ప్రజా రవాణా అధికారులు (డీపీటీవోలు) కలెక్టర్లను సంప్రదించి ఆరంభోత్సవాలకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

ఆర్టీజీఎస్‌లో 'అవేర్ 2.0' వెర్షన్!

- డాష్‌బోర్డును ఆవిష్కరించిన సీఎం
- ఈ నెల 15 నుంచి వాట్సప్ గవర్నెన్స్ ద్వారా 700 సేవలు
- సమీక్షించిన సీఎం చంద్రబాబు



ఆర్టీజీఎస్ కేంద్రాన్ని సందర్శించి సమీక్ష నిర్వహిస్తున్న సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో వర్షపాతాన్ని ముందస్తుగా అంచనా వేసేందుకు రియల్ టైం గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్)లోని అవేర్ విభాగం రూపొందించిన 'అవేర్ 2.0' వెర్షన్‌ను సీఎం చంద్రబాబు సోమవారం ఆవిష్కరించారు. డాష్ బోర్డ్ ద్వారా వివిధ రిజర్వాయర్లలో ప్రస్తుత నీటి లభ్యతను సీఎం చంద్రబాబు ఆన్‌లైన్‌లో పరిశీలించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కార్యాలయాన్ని సోమవారం ఆయన సందర్శించి.. అవేర్ 2.0 డాష్‌బోర్డ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'దీని ద్వారా పరీవాహక ప్రాంతాల నుంచి నదుల్లోకి ఎంత వర్షపు నీరు చేరుతోంది? భూమిలోకి ఎంత నీరు ఇంకుతోందన్నది సాంకేతికత ఆధారంగా అధ్యయనం చేసి వర్షపు నీటిని సద్వినియోగం చేసుకుని కరవు పరిస్థితులను అధిగమించాలి. శాంతిభద్రతల పర్యవేక్షణ, ట్రాఫిక్ నియంత్రణకు మాత్రమే, సీసీ కెమెరా వినియోగాన్ని పరిమితం చేయకుండా.. వరదలు, తుపానుల సమయంలో నీట మునిగిన ప్రాంతాలను గుర్తించి అక్కడి ప్రజలను అప్రమత్తం చేయాలి' అని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఐటీశాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్, ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్ జైన్ పాల్గొన్నారు.

డ్రోన్ల వినియోగం పెంచాలి

రాష్ట్రంలో డ్రోన్ సేవలు విస్తృతంగా అందించేలా డ్రోన్ కార్పొరేషన్ పనిచేయాలని సీఎం సూచించారు. 'పురుగు మందుల వినియోగాన్ని గణనీయంగా తగ్గించేందుకు డ్రోన్ల వినియోగించుకునేలా రైతులకు అవగాహన కల్పించాలి. అంటు వ్యాధుల నివారణ, దోమల వ్యాప్తి అరికట్టేందుకూ డ్రోన్లను వినియోగించేలా చర్యలు చేపట్టాలి' అని పేర్కొన్నారు. డ్రోన్ల ద్వారా ప్రస్తుతం 45 యూజ్ కేసులు సిద్ధంగా ఉన్నాయని అధికారులు సీఎంకు వివరించారు.

నవంబరు నాటికి డేటా లేక్

ఆర్టీజీఎస్ డేటా లేక్ పనులు నవంబరు నాటికి పూర్తి చేయాలని సీఎం సూచించారు. 'ఈ-క్రాప్, ఆయా ప్రాంతాల్లో భూసార డేటాలను విశ్లేషించి ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి. ఆగస్టు 15 నాటికి మన మిత్ర వాట్సప్ గవర్నెన్స్ ద్వారా 700 రకాల ప్రభుత్వ సేవలు ప్రజలకు అందాలి' అని అన్నారు.

డ్రోన్ సాయం.. చిన్నారి క్షేమం



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

నెల్లూరు (నేరవిభాగం), న్యూస్‌టుడే: తల్లిదండ్రులు మందలించారని ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలుడిని డ్రోన్ పట్టించింది. ఈ ఘటన సోమవారం నెల్లూరు గ్రామీణ పోలీసు స్టేషన్ పరిధిలోని పాత వెల్లంటిలో చోటుచేసుకుంది. స్థానికంగా నివాసం ఉండే నారాయణ, రమణమ్మ దంపతుల కుమారుడు మనోజ్ ఒకటో తరగతి చదువుతున్నాడు. అల్లరి పనులు చేస్తున్నాడని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురై ఇంటి నుంచి పారిపోయాడు. ఉదయం వెళ్లిన అబ్బాయి మధ్యాహ్నమైనా రాలేదు. దీంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. స్థానిక సీఐ గుంజి వేణు సిబ్బందితో కలిసి వెతికారు. ఎంతకూ కనిపించకపోవడంతో డ్రోన్ సాయం తీసుకున్నారు. బాలుడు ఉంటున్న ఇంటి పక్క వీధిలో డ్రోన్ ఎగురుతుండగా ఓ ఇంటి మిద్దెపై ఉన్న బాలుడిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు.

శ్రీశైలానికి భారీగా వరద

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల ప్రాజెక్టు నుంచి 1,36,637 క్యూసెక్కులు, సుంకేసుల జలాశయం నుంచి 67,312 క్యూసెక్కులు, హంద్రీ నుంచి 10,040 క్యూసెక్కుల నీరు వస్తోంది. శ్రీశైలం కుడి, ఎడమగట్ల జలవిద్యుత్తు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 66,202 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయ నీటిమట్టం సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి 881.80 అడుగులు, నీటినిల్వ 197.9120 టీఎంసీలుగా నమోదైంది.

అమెరికా చట్టాలను ఉల్లంఘించొద్దు!

- విద్యార్థులకు యూఎస్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ సూచన
- హైదరాబాద్‌లో 'ఎడ్యుకేషన్ యూఎస్ఏ' అవగాహన సదస్సు



అవగాహన సదస్సును ప్రారంభిస్తున్న లారా విలియమ్స్

ఈనాడు, హైదరాబాద్: అంతర్జాతీయస్థాయి విద్య కోసం అమెరికా వెళ్తున్న విద్యార్థులు అక్కడి చట్టాలను గౌరవించాలని.. వాటిని ఉల్లంఘించవద్దని హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ సూచించారు. అమెరికాలో విద్యపై అవగాహన కల్పించేందుకు అక్కడి ప్రభుత్వంలో భాగమైన 'ఎడ్యుకేషన్ యూఎస్ఏ' ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో అవగాహన సదస్సు (2025 ఫెయిర్) నిర్వహించారు. అమెరికాలోని 30కిపైగా విశ్వవిద్యాలయాలు స్టాళ్లను ఏర్పాటు చేశాయి. సదస్సును ప్రారంభించిన లారా విలియమ్స్ మాట్లాడుతూ... అమెరికాలో పౌరులైనా, విద్యార్థులైనా చట్టాలను ఉల్లంఘిస్తే సహించరని పేర్కొన్నారు. వర్సిటీల ప్రతినిధులతో ప్రత్యక్షంగా మాట్లాడి కోర్సులు, స్కాలర్‌షిప్‌లు, ఫీజులు, ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ), పరిశోధన అవకాశాలు తదితర వివరాలు తెలుసుకోవాలని సూచించారు. పలువురు విద్యార్థులతో లారా ముచ్చటించారు. వారి ఆశయాలు, లక్ష్యాల గురించి తెలుసుకున్నారు.

◆ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలతో ముఖ్యంగా భారతీయ విద్యార్థులు ఉక్కిరిబిక్కిరవుతున్న నేపథ్యంలో ఈసారి అమెరికా ఫెయిర్‌కు స్పందన తగ్గవచ్చని నిపుణులు భావించారు. అయితే సోమవారంనాటి కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఒకేసారి అందరినీ అనుమతించకుండా ముందుగానే టైమ్‌స్లాట్లు కేటాయించి లోపలికి పంపారు. అక్కడి పరిస్థితులు ఎలా ఉన్నా ముందుగా ఆయా వర్సిటీలు, ఫీజుల గురించి తెలుసుకుందామని వచ్చామని పలువురు విద్యార్థులు తెలిపారు.

ఈఎన్‌సీ శ్రీనివాస్ సస్పెన్షన్

ఈనాడు, అమరావతి: గిరిజన సంక్షేమశాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ) సబ్బవరపు శ్రీనివాస్‌ను విధుల నుంచి ప్రభుత్వం సస్పెండ్ చేసింది. గుత్తేదారు నుంచి రూ.5 కోట్లు డిమాండ్ చేసి ఏసీబీకి చిక్కిన కేసులో న్యాయస్థానం రిమాండ్ విధించడంతో సస్పెండ్ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సస్పెన్షన్ కాలంలో ఆయన ముందస్తు అనుమతి లేకుండా విజయవాడ హెడ్‌క్వార్టర్ వదిలి వెళ్లరాదని స్పష్టం చేసింది. పరిపాలన కారణాల దృష్ట్యా గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ బి.వసంతకు ఈఎన్‌సీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. విశాఖ ఎస్ఈగా కూడా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది.

కొట్టిస్తూ.. తానూ చితక్కొట్టాడు

- దళిత యువకుడిపై దాడి చేసింది వైకాపా నేతే



పవన్‌కుమార్‌ను పోలీసు లాఠీతో కొడుతున్న అనిల్‌కుమార్‌రెడ్డి ◆ పవన్‌ను హెచ్చరిస్తూ..

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: దళిత యువకుడిపై వైకాపా నేతల దాడులు, బుకాయింపుల వెనుక వాస్తవాలు బయటకు వస్తున్నాయి. బైక్ అద్దె సొమ్ము కోసం దళిత యువకుడు పవన్‌కుమార్‌ను తిరుపతిలో పోలీసు లాఠీతో చితక్కొట్టిన వైనం ఇటీవల వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. యువకుణ్ని కొట్టింది జనసేన పార్టీకి చెందిన దినేష్ అనే వ్యక్తి అని వైకాపా నేత అనిల్‌కుమార్‌రెడ్డి తొలుత బుకాయించారు. అనుచరులతో పోలీస్‌స్టేషన్ వద్ద హడావుడి కూడా చేశారు. అయితే అతడు దళిత యువకుడిని కూర్చోబెట్టి అరికాళ్లపై పోలీసు లాఠీతో చితక్కొట్టిన వీడియో సోమవారం వెలుగులోకి వచ్చింది. డబ్బు ఇచ్చేవరకు కొడుతూనే ఉంటానని అనిల్ అందులో బెదిరించడం కనిపించింది. పవన్‌కుమార్ బాకీ ఉన్న మరికొందరిని పిలిపించి వారి చేతా కొట్టించాడు. దాడికి వినియోగించిన పోలీసు లాఠీని పోలీస్ కుటుంబానికి చెందిన ఓ యువకుడి ద్వారా తెప్పించుకున్నట్లు సమాచారం. దాడి అనంతరం బాధితుడిని దాచిపెట్టి.. అతడిని బెదిరించి వీడియోలు పెట్టించిన వారిపై పోలీసులు దృష్టి సారించారు. వైకాపాకు చెందిన ఇద్దరు వ్యక్తులు అందులో కీలకపాత్ర పోషించినట్లు అనుమానిస్తున్నారు. మొత్తం 10 మందిని నిందితులుగా గుర్తించినట్లు సమాచారం.

ప్లాట్‌ఫాంపైకి దూసుకొచ్చి మహిళ ప్రాణాలు తీసిన ఆర్టీసీ బస్సు

- విశాఖ ద్వారకా బస్టాండ్‌లో దుర్ఘటన




ఘటన స్థలంలో ముత్యాలమ్మ మృతదేహం ◆ అంతర చిత్రంలో ముత్యాలమ్మ

విశాఖపట్నం(కార్పొరేషన్), న్యూస్‌టుడే: విశాఖ ద్వారకా బస్టాండ్‌లో సోమవారం సాయంత్రం ఆర్టీసీ అద్దె బస్సు అదుపు తప్పి దూసుకెళ్లడంతో మహిళ మృతి చెందింది. విశాఖ రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. శ్రీకాకుళం-1 డిపోనకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు సోమవారం సాయంత్రం ద్వారకా బస్ స్టేషన్ 25వ నంబరు ప్లాట్‌ఫాం వద్దకు వస్తుండగా అదుపు తప్పింది. ప్లాట్‌ఫాంపైకి దూసుకెళ్లి పిల్లర్‌ను ఢీ కొట్టింది. అక్కడే ఉన్న విజయనగరం జిల్లా ఎస్.కోట మండలం పోతనపల్లికి చెందిన గేదెల ముత్యాలమ్మ (47) పిల్లర్, బస్సు మధ్య నలిగిపోయి మృతి చెందింది.

◆ ముత్యాలమ్మ నగరంలో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు. గాజువాకలో పెద్ద కుమార్తె కుమారుడి అన్నప్రాసన కార్యక్రమానికి శనివారం చిన్నకుమార్తెతో కలిసి వెళ్లింది. కార్యక్రమం ముగించుకుని సోమవారం ద్వారకా బస్టాండుకు వచ్చి ఎస్.కోట బస్సు కోసం ఆమె వేచి ఉంది. ఇంతలో అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు ముత్యాలమ్మపైకి దూసుకువచ్చి ఆమె ప్రాణాలు తీసింది. పోలీసులు ఆమె మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. బస్సు వేగంగా దూసుకొచ్చిన దృశ్యం సీసీ కెమెరాల్లో రికార్డైంది.

చారిత్రక లోగిలి.. త్రివర్ణం శోభిల్లి



గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లిలోని అనంతపద్మనాభ స్వామి గుహలు త్రివర్ణ వెలుగుల్లో మెరిసిపోతున్నాయి. స్వాతంత్ర్య వేడుకల నేపథ్యంలో పురావస్తుశాఖ గుహలను కాషాయ, తెలుపు, ఆకుపచ్చ విద్యుద్దీపాలతో తీర్చిదిద్దింది. రాత్రి సమయంలో అవి ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. - న్యూస్‌టుడే, తాడేపల్లి

తిరుమలలో రాజకీయ వ్యాఖ్యలు చేసిన.. జగన్ మేనమామ రవీంద్రనాథ్‌రెడ్డిపై కేసు

తిరుమల, న్యూస్‌టుడే: తితిదే నిబంధనలకు విరుద్ధంగా తిరుమలలో రాజకీయ వ్యాఖ్యలు చేసిన వైకాపా అధ్యక్షుడు జగన్ మేనమామ, మాజీ ఎమ్మెల్యే పోచిమరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డిపై తిరుమల వన్‌టౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. శ్రీవారి ఆలయం ఎదుట రవీంద్రనాథ్‌రెడ్డి కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడంతో పాటు 2029లో వైకాపా తిరిగి అధికారంలోకి వస్తుందని చెప్పడం, జడ్పీటీసీ ఉప ఎన్నికలపై ఆయన చేసిన వ్యాఖ్యలు.. 2024 నవంబరు 18న తితిదే చేసిన బోర్డు తీర్మానం నం.93కి విరుద్ధంగా ఉన్నట్లు గుర్తించారు. ఏడుకొండల ప్రాంతంలో రాజకీయ, ద్వేషపూరిత ప్రసంగాలు నిషేధిస్తున్నట్లు ఆ తీర్మానంలో తితిదే పేర్కొంది. ఈ నేపథ్యంలో తిరుమల సెక్టార్-1 విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ దామోదరం ఫిర్యాదు మేరకు రవీంద్రనాథ్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు.

ఐదుగురు ఎంపీలు ప్రయాణిస్తున్న విమానంలో సాంకేతిక లోపం

చెన్నైలో అత్యవసర ల్యాండింగ్

చెన్నై(వడపళని), న్యూస్‌టుడే: తిరువనంతపురం నుంచి దిల్లీకి వెళ్తున్న ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో అత్యవసర పరిస్థితుల్లో చెన్నై విమానాశ్రయంలో దిగింది. తిరువనంతపురంలో ఆదివారం రాత్రి 8.17 గంటలకు బయలుదేరిన విమానంలో పార్లమెంటు సభ్యులు కేసీ వేణుగోపాల్, కొడికున్నిల్ సురేష్, అదూర్ ప్రకాశ్, కె.రాధాకృష్ణన్, మరో ఎంపీతో సహా 150 మంది ప్రయాణికులు ఉన్నారు. రాత్రి 10 గంటల సమయంలో పైలట్ ఇంజిన్‌లో సమస్య గుర్తించి.. చెన్నైలోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ రూం(ఏటీసీ)కి సమాచారం అందించారు. దీంతో చెన్నైలో అత్యవసరంగా దిగడానికి అనుమతించారు. రాత్రి 11.20 గంటలకు విమానం సురక్షితంగా ల్యాండ్ కాగా.. ప్రయాణికులను వేరే విమానంలో దిల్లీకి తరలించడానికి కావాల్సిన ఏర్పాట్లు చేశారు.

రన్‌వేపై మరో విమానం లేదు: ఎయిరిండియా


పైలట్ నైపుణ్యంతో, అదృష్టంతో తాను, పలువురు ఎంపీలు, ప్రయాణికులు ఎయిరిండియా విమాన ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్నామని కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. చెన్నై విమానాశ్రయం రన్‌వేపై ల్యాండ్ చేయించడానికి తొలిసారి పైలట్ ప్రయత్నించినపుడు అప్పటికే ఆ రన్‌వేపై మరో విమానం ఉందని అన్నారు. దాన్ని చూసి, పైలట్ రెప్పపాటులో తమ విమానాన్ని మళ్లీ పైకి లేపారన్నారు. రెండో ప్రయత్నంలో విమానం సురక్షితంగా ల్యాండైందని అన్నారు. కేసీ వేణుగోపాల్ పోస్టుపై ఎయిరిండియా స్పందించింది. విమానం తొలి ప్రయత్నంలో ల్యాండింగ్ కాకపోవడానికి చెన్నై ఎయిర్‌పోర్టులోని అదే రన్‌వేపై మరో విమానం ఉండటం కారణం కాదని పేర్కొంది. కేవలం ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ (ఏటీసీ) నుంచి వచ్చిన సూచనలతోనే తొలి ప్రయత్నంలో విమానం ల్యాండింగ్‌ను కెప్టెన్ ఆపారని స్పష్టం చేసింది.

హజ్ యాత్రికులపై అదనపు భారం పడకుండా రూ.లక్ష ఆర్థిక సాయం: మంత్రి ఫరూక్

ఈనాడు, అమరావతి: విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులపై అదనంగా పడే రూ.70 వేల భారం లేకుండా చేసేందుకు కూటమి ప్రభుత్వం రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం చేస్తున్నట్లు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్ తెలిపారు. ఈ ఏడాది రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు వెళ్లేందుకు 2,649 మంది దరఖాస్తు చేసుకున్నారని, 2019 తర్వాత ఇప్పుడే అత్యధికంగా దరఖాస్తులొచ్చాయని సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఇందులో 389 మంది విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్‌ను మొదటి ప్రాధాన్యంగా, మరో 627 మంది రెండో ప్రాధాన్యంగా ఎంచుకున్నారని తెలిపారు.

వైకాపా కార్యకర్త ఇంట్లో 144 ఎర్రచందనం దుంగలు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లె మండలం ఆలపల్లెకొత్తూరు గ్రామ సమీప పొలం వద్ద ఉన్న వైకాపా కార్యకర్త భాస్కర్‌రెడ్డి ఇంట్లో నిల్వచేసిన 144 ఎర్రచందనం దుంగలను పలమనేరు అటవీశాఖ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామ వ్యవసాయ పొలంలో ఎర్రచందనం దుంగలు ఉంచినట్లు సమాచారం రావడంతో అటవీశాఖాధికారి నారాయణ సిబ్బందితో కలిసి దాడి చేశారు. సరకును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. భాస్కర్‌రెడ్డి పరారీలో ఉన్నట్లు ఎఫ్ఆర్వో తెలిపారు.



అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు

మంగళగిరిలో నేతన్నల కృతజ్ఞత ర్యాలీ



ర్యాలీలో చేనేత చీర ప్రదర్శన

మంగళగిరి, తాడేపల్లి, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన తమ జీవితాల్లో కూటమి ప్రభుత్వం వెలుగులు నింపుతోందని గుంటూరు జిల్లా మంగళగిరిలో చేనేత వృత్తిదారులు సోమవారం కృతజ్ఞత ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా చేనేత వృత్తి పరికరాలు, 100 అడుగుల నేత చీరను ప్రదర్శించారు. పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య మాట్లాడుతూ.. చేనేత రంగాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తూ దానిపై ఆధారపడిన వారి ఆదాయాన్ని రెట్టింపు చేయాలనే సంకల్పంతో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారన్నారు. ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. చేనేతపై ఆధారపడిన వారికి ఏడాది పొడవునా ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో రూ.10 వేల కోట్లతో నూతన టెక్స్‌టైల్స్ పాలసీని కూటమి ప్రభుత్వం రూపొందించిందని తెలిపారు. కార్యక్రమంలో తెదేపా బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, తితిదే పాలక మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి పాల్గొన్నారు.

గ్రహం అనుగ్రహం

12-8-2025 మంగళవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; వర్ష రుతువు, శ్రావణ మాసం, బహుళపక్షం

తదియ: ఉ. 10-10 తదుపరి చవితి

పూర్వాభాద్ర: మ. 2-15 తదుపరి ఉత్తరాభాద్ర

వర్జ్యం: రా. 11-23 నుంచి 12-54 వరకు

అమృత ఘడియలు: ఉ. 6-31 నుంచి 8-04 వరకు

దుర్ముహూర్తం: ఉ. 8-16 నుంచి 9-07 వరకు తిరిగి రా. 10-56 నుంచి 11-42 వరకు

రాహుకాలం: సా. 3-00 నుంచి 4-30 వరకు

సూర్యోదయం: ఉ.5.45; సూర్యాస్తమయం: సా.6.25

సంకట హర చతుర్థి

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	37.0	25.0
విజయవాడ	35.6	28.0
విశాఖపట్నం	35.4	26.2
విజయనగరం	35.0	26.0
తాడేపల్లిగూడెం	34.7	26.1
నెల్లూరు	33.7	26.4
తిరుపతి	33.4	23.4
శ్రీకాకుళం	33.0	27.0
నరసాపురం	33.0	24.4
ఒంగోలు	32.3	24.6
కడప	32.0	26.0
గుంటూరు	31.0	27.0
కర్నూలు	30.9	23.5
అనంతపురం	30.4	23.2

ANDHRA PRADESH LEGISLATURE SECRETARIAT
Request for Proposal
Tender ID. 836156 Dated: 07-08-2025
Proposals are invited for selection of 'System Integrator' for implementation of the National e-Vidhan Application (NeVA) in Andhra Pradesh Legislative Council and Andhra Pradesh Legislative Assembly".
The project details, eligibility conditions and requisite forms can be downloaded from A.P. e-Procurement portal https://tender.apeprocurement.gov.in/login.html from **07-08-2025 to 03-09-2025 at 12:00 Hrs.** Last date for submitting proposals is **03-09-2025 by 15.00 Hrs.**
DIPR No.17232/CL/Advt/1/1/2021-22 Sd/- Secretary-General

APTRANSCO :: VIJAYAWADA
e-Procurement Tender Notice
The **APTRANSCO** invites bids online for **Spec No. APT-e-26/2025, Work:** "Group Health Insurance Policy for Regular Employees and their Dependents (1+5), Pensioners (GPF Service Pensioners & EPF Pensioners) (1+1) and Family Pensioners (GPF & EPF) (1) pertaining to 5 (Five) Power Utilities namely APTRANSCO, APGENCO, APEPDCL, APSPDCL AND APCPDCL for a period of 1 (one) year". **Date & Time of availability of Tender: 12-08-2025 at 03:00 PM.** Web: **http://tender.apeprocurement.gov.in.**
DIPR No.4323PP/CL/Advt/1/1/2021-22 Sd/- CHIEF ENGINEER, TRANSMISSION

APSFL ANDHRA PRADESH DRONES CORPORATION
Andhra Pradesh Drone Corporation Pvt Ltd
(An Enterprise of the Government of Andhra Pradesh)
3rd Floor, NTR Administrative Block, Pandit Nehru Bus Station NH-65, Vijayawada-520 013, Andhra Pradesh.
Notice No: APDC/RFP/07/2025, Dt. 08-08-2025
Andhra Pradesh Drones Corporation Pvt Ltd **(APDC)** invites proposals from Potential Applicants for manufacturing, testing and ancillary units covering Civilian and defense applications at drone city Kurnool, and other possible location in Andhra Pradesh. Interested firms are requested to submit their proposals. The EOI document & other details can be downloaded from the website: **www.apsfl.in.**
DIPR No. 4321PP/CL/Advt/1/1/2021-22 Sd/- Chairman & Managing Director

(c) eenadu

గిరివాసం.. ఆరోగ్య హాసం!

మైదాన ప్రాంతాలతో పోల్చితే గిరిజనులకు చాలా వ్యాధులు దూరం

- ఏఎస్ఆర్, మన్యం జిల్లాల్లోని ఆరోగ్య పరీక్షల గణాంకాలే అందుకు నిదర్శనం
- వారిలో బీపీ, మధుమేహం, గుండెపోటు, క్యాన్సర్ తదితర రుగ్మతలు తక్కువ
- ప్రకృతితో మమేకమవుతూ జీవించడమే ఆదివాసీల ఆరోగ్య రహస్యం



ఈనాడు, అమరావతి, కాకినాడ: ప్రకృతితో మమేకమై జీవించే గిరిజనులు.. మైదాన ప్రాంతాల్లో నివసించేవారితో పోల్చితే అనేక రుగ్మతలకు దూరంగా ఉంటున్నారు. గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, క్యాన్సర్ వంటి వ్యాధులు గిరిజన ప్రాంతాల్లో అత్యంత తక్కువగా ఉండడం విశేషం. రాష్ట్రవ్యాప్తంగా ఆసుపత్రుల్లో నమోదయ్యే కేసుల్లో అత్యధికంగా బీపీ, మధుమేహం, గుండె జబ్బులు, శ్వాసకోశ, అంటువ్యాధులు ఉంటున్నాయి. తర్వాత మూత్రపిండాలు, క్యాన్సర్, మానసిక కుంగుబాటు, మాతా, శిశు ఆరోగ్య సమస్యలు, కీటక జనిత వ్యాధులు నమోదవుతున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా (ఏఎస్ఆర్)లోని 22 మండలాల పరిధిలో మూడు లక్షల గిరిజన కుటుంబాలున్నాయి. వీరిలో 90% మందికి వ్యవసాయమే జీవనాధారం. తెల్లారింది మొదలు చిరుధాన్యాలు, కాఫీ, ఉద్యానపంటల సాగు కోసం కొండలబాట పడతారు. రెక్కల కష్టంపైనే పంటలు పండిస్తారు. అటవీ ఉత్పత్తుల సేకరణకు కిలోమీటర్ల కొద్దీ నడుస్తారు. ఇదే వారి ఆరోగ్యానికి రక్షణ కవచంగా మారుతోంది.

ఏజెన్సీ ప్రాంతాల్లో ఆరోగ్య సోపానాలివీ..

● 'ఏజెన్సీ ప్రాంతాల్లో 95% గ్రామాల్లో రాత్రి 8 గంటలకే అందరూ నిద్రలోకి జారుకుంటారు. ఈ అలవాటు వారి ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది' అని పాడేరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా. హేమలతాదేవి పేర్కొంటున్నారు. ● గిరిజన ప్రాంతాల్లో పండించే పంటల్లో రసాయనాల వాడకం చాలా తక్కువ. దేశీ విత్తన రకాలనే సాగుచేస్తారు. ఈ ఆహార ఉత్పత్తులు ఆదివాసీలను ఆరోగ్యంగా ఉంచుతున్నాయి.

● ఏజెన్సీలో సాధారణ ప్రసవాలే ఎక్కువ. అల్లూరి జిల్లాలో 2024-25లో 18,716 ప్రసవాలు జరిగితే.. వాటిలో 2,706 మాత్రమే శస్త్రచికిత్సలు జరిగాయి. చింతపల్లి సీహెచ్‌సీలో 2023-24లో 1,280 ప్రసవాలు జరిగితే.. 21 మాత్రమే సిజేరియన్లు చేశారు. ● గిరిజన ప్రాంతాల్లో రక్తహీనత కేసులు ఎక్కువ. డెంగీ, మలేరియా జ్వరాలూ విజృంభిస్తున్నాయి. వీటి నియంత్రణకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది.

రాష్ట్రంలో ఇటీవల వరకు జరిగిన ఎన్‌సీడీ-03 అధ్యయనంలో మిగిలిన జిల్లాల్లో కంటే బీపీ, మధుమేహం ఉన్న వారు ఏఎస్ఆర్, పార్వతీపురం మన్యం జిల్లాల్లో తక్కువగా ఉన్నట్లు తేలింది. రాష్ట్ర వ్యాప్తంగా 2.15 కోట్ల మందికి పరీక్షలు చేశారు

జబ్బు	సాధారణ జిల్లా	గిరిజన జిల్లా
బీపీ	శ్రీకాకుళం- 88,664	ఏఎస్ఆర్ 28,674(32.34%)
మధుమేహం	శ్రీకాకుళం- 38,401	ఏఎస్ఆర్ 4,706(12.25%)
బీపీ+మధుమేహం	శ్రీకాకుళం- 87,523	ఏఎస్ఆర్ 8,956(10.23%)
బీపీ	వైఎస్సార్ కడప- 81,377	మన్యం - 39,828(48.94%)
మధుమేహం	వైఎస్సార్ కడప- 47,704	మన్యం - 13,426(28.14%)
బీపీ+మధుమేహం	వైఎస్సార్ కడప 82,062	మన్యం - 22,922(29.93%)

మైదాన ప్రాంతాలైన శ్రీకాకుళం, వైఎస్సార్ కడప జిల్లాలతో పోల్చితే ఏఎస్ఆర్, మన్యం జిల్లాల్లో బీపీ, మధుమేహం కేసులు తక్కువగా ఉన్నాయి.

ఎన్టీఆర్ సేవా ట్రస్టు ద్వారా 2022-23, 2024-25 మధ్య చికిత్స పొందిన మైదాన ప్రాంత జిల్లాల వారితో ఏజెన్సీ జిల్లాలను పోలిస్తే)

గుండె	బాపట్ల 10,884	శ్రీసత్యసాయి 7,375	ఏఎస్ఆర్ 1,296	మన్యం 3,633
క్యాన్సర్	బాపట్ల 4,047	శ్రీసత్యసాయి 3,690	ఏఎస్ఆర్ 1,645	మన్యం 2,211
లివర్	బాపట్ల 650	శ్రీసత్యసాయి 596	ఏఎస్ఆర్ 265	మన్యం 615
న్యూరో	బాపట్ల 2,685	శ్రీసత్యసాయి 1,922	ఏఎస్ఆర్ 1,025	మన్యం 2,339
పల్మనరీ	బాపట్ల 776	శ్రీసత్యసాయి 1,731	ఏఎస్ఆర్ 463	మన్యం 1,691
కిడ్నీ	బాపట్ల 5,342	శ్రీసత్యసాయి 4,646	ఏఎస్ఆర్ 1,067	మన్యం 2,463

కీటక జనిత కేసుల్లో ఏఎస్ఆర్ జిల్లా టాప్

● కీటక జనిత కేసుల (డెంగీ, మలేరియా జ్వరాలు) నమోదులో ఏఎస్ఆర్ జిల్లా రాష్ట్రంలోనే తొలిస్థానంలో ఉంది. రెండు, మూడు స్థానాల్లో విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాలు ఉన్నాయి. ● ప్రభుత్వాసుపత్రుల్లో ప్రధానంగా 10 రుగ్మతలకు గడిచిన ఐదేళ్లలో చికిత్స పొందినవారి వివరాలను జిల్లాలవారీగా ప్రభుత్వం సేకరించింది. ● కీటక జనిత కేసు (ఏఎస్ఆర్)లో మినహా బీపీ, మధుమేహం, మానసిక కుంగుబాటు, శ్వాసకోశ సమస్యలు, లివర్, కిడ్నీలకు సంబంధించి అత్యధిక కేసుల నమోదులో మిగిలిన జిల్లాల పేర్లు ఉన్నాయి.

సప్తగిరులకు జలాభిషేకం!



శేషాచలం అటవీ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు తిరుమల పరిసరాల్లో జలకళ ఉట్టిపడుతోంది. ఇక్కడి జలపాతాలు పరవళ్లు తొక్కుతున్నాయి. మొదటి ఘాట్ రోడ్డులోని మాల్వాడి గుండంతోపాటు కపిలతీర్థం తదితర జలపాతాలు పాలనురగలతో కొండల పైనుంచి జాలువారుతున్నాయి. ఘాట్ రోడ్డు నుంచి రాకపోకలు సాగిస్తున్న భక్తులు, స్థానికులు ఈ సుందర దృశ్యాలను చూసి పులకించిపోతున్నారు.

– న్యూస్‌టుడే, తిరుమల, తిరుపతి (తితిదే)



'స్థానికత' తేలక నిలిచిపోయిన ప్రవేశాలు!

- ఐసెట్, ఈఏపీసెట్ రెండో విడత కౌన్సెలింగ్ వాయిదా
- ఎంటెక్ పీజీ ఈసెట్ ప్రవేశాలు, డిగ్రీ అడ్మిషన్లకూ ఎదురుచూపులు
- న్యాయస్థానం ఆదేశాలు వచ్చే వరకు ఇదే పరిస్థితి

ఈనాడు, అమరావతి: స్థానిక, స్థానికేతర కోటా అమలుకు సంబంధించి హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండడంతో రాష్ట్రంలో మొత్తం ప్రవేశాల కౌన్సెలింగ్ నిలిచిపోయింది. ఆయా కోర్సుల ప్రవేశానికి ముందు నాలుగేళ్లలో ఒక్క ఏడాది బయట రాష్ట్రంలో చదివినా స్థానికేతరులుగా పరిగణించేలా గత మే నెల్లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులపై తెలంగాణలో ఇంటర్ చదివిన పలువురు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఈఏపీసెట్ సహా అన్ని ఉమ్మడి ప్రవేశ పరీక్షల కౌన్సెలింగ్ నిలిచిపోయింది. స్థానికత అంశం తేలిన తర్వాతనే ప్రవేశాల ప్రక్రియ చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు.

విద్యా సంవత్సరం పరిస్థితి ఏంటి?

ఇంజినీరింగ్‌కు ఈ నెల 4 నుంచి తరగతులు ప్రారంభించేందుకు ఉన్నత విద్యామండలి అకడమిక్ కేలండర్ విడుదల చేసింది. ఇంజినీరింగ్ రెండో విడత కౌన్సెలింగ్ వాయిదా పడినందున కొత్త విద్యార్థులు వచ్చాక మొదటి నుంచి పాఠాలు చెప్పాల్సి వస్తుందనే ఉద్దేశంతో కొన్ని కళాశాలలు తరగతులు ప్రారంభించలేదు. ప్రాథమిక అంశాలపై అవగాహన తరగతులు నిర్వహిస్తున్నాయి.

● డిగ్రీ తరగతులు ఈ నెల 28 నుంచి ప్రారంభించాలని ఉన్నత విద్యామండలి ప్రాథమిక షెడ్యూల్ విడుదల చేసింది. స్థానికత అంశం కారణంగా తరగతుల ప్రారంభంపై అనిశ్చితి నెలకొంది.

● పీజీ ఈసెట్‌లో భాగంగా ఎంటెక్ కౌన్సెలింగ్ చేపట్టినా ఇది మధ్యలోనే నిలిచిపోయింది. బోధన రుసుములను చెల్లించలేదని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలే కొన్ని రోజుల పాటు సర్టిఫికెట్ల జారీని నిలిపివేశాయి. దీంతో కౌన్సెలింగ్‌ను వాయిదా వేశారు. ప్రభుత్వ ఆదేశాలతో సర్టిఫికెట్లను వర్సిటీలు ఇచ్చినా ఇప్పుడు స్థానికత అంశంగా కారణంగా కౌన్సెలింగ్ నిలిచిపోయింది.

● ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు నిర్వహించే ఐసెట్ కౌన్సెలింగ్ మొదటి విడత పూర్తయింది. రెండో విడత చేపట్టాల్సి ఉండగా.. ఇప్పుడు దీన్ని వాయిదా వేశారు.

● బీఫార్మసీ, ఎంఫార్మసీలకు సంబంధించిన ఫార్మసీ కౌన్సిల్ నుంచి అనుమతులు రానందున ఈ ప్రవేశాలు చేపట్టలేదు.

● బీఈడీలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్‌సెట్ కౌన్సెలింగ్ చేపట్టేందుకు ఎన్‌సీటీఈ అనుమతులు రావాల్సి ఉంది. ఇవి వచ్చిన తర్వాత చేపట్టనున్నారు.

రచయిత్రి అనిశెట్టి రజిత కన్నుమూత



కాజీపేట, న్యూస్‌టుడే: మహిళా సమానత్వం, స్త్రీ విముక్తి కోసం అనేక రచనలు చేసిన ప్రముఖ రచయిత్రి అనిశెట్టి రజిత(65) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. అవివాహితురాలైన ఆమె తెలంగాణలోని హనుమకొండలో తన స్నేహితురాలి ఇంట్లో కన్నుమూశారు. రజిత బాల్యం నుంచే ఆకాశవాణిలో ప్రసారమయ్యే ప్రముఖ రచయితల ప్రసంగాలకు ఆకర్షితురాలై రచనలు చేయడం ప్రారంభించారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో తన రచనల ద్వారా ప్రజలను చైతన్యం చేశారు. 2017లో తెలంగాణ ప్రభుత్వం ఆమెకు రాష్ట్ర విశిష్ట మహిళా పురస్కారం ప్రదానం చేసింది. ఆమె 1973లో 'చైతన్యం పడగెత్తింది' అనే రచనతో మొదలుపెట్టి 500కిపైగా కవితలు, 109 వ్యాసాలు, 38 పాటలు రచించారు. ఇరవైకిపైగా పురస్కారాలు అందుకున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేశారు. మరణానికి ముందే ఆమె తన దేహాన్ని వైద్యవిద్యార్థుల అధ్యయనం కోసం దానం చేశారు.

కోనసీమలో ఓఎన్‌జీసీ రూ.4,600 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లోని డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఓఎన్‌జీసీ సంస్థ రూ. 4,600 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ నిధులతో 10 బావులు, రెండు మానవరహిత ప్లాట్‌ఫాంలు, ఆఫ్‌షోర్ పైప్‌లైన్, ఆన్‌షోర్ గ్యాస్ ప్రాసెసింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు అనుమతుల కోసం కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖను ఓఎన్‌జీసీ ఇటీవల సంప్రదించిందని.. ఆ శాఖలో భాగమైన ఎక్స్‌పర్ట్స్ అప్రైసల్ కమిటీ (ఈఏసీ) జులై 24న జరిగిన సమావేశం మినిట్స్‌లో పేర్కొంది.

నత్తగుల్ల కిలో వెయ్యి!



చెరువుల్లో, కాలువల్లో నీటి అడుగున ఉండే పెద్ద నత్తగుల్లలను కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం వల్లూరిపాలెం కరకట్ట రహదారిలో విక్రయిస్తున్నారు. ఈ నత్తలను వండుకొని తింటే ఉబ్బసం నుంచి ఉపశమనం లభిస్తుందని అందుకే చాలా మంది కొనుగోలు చేసేందుకు ముందుకొస్తున్నారని విక్రేతలు తెలిపారు. గుల్ల నుంచి వేరుచేసిన అరకిలో నత్తలు రూ.500 ధర పలుకుతున్నాయన్నారు. ఇవి ఇదే సీజన్‌లో ఎక్కువ దొరుకుతాయని, వీటి కోసం ఉదయాన్నే చెరువులు, కాలువల్లోకి దిగి గాలించాల్సి ఉంటుందని వివరించారు. – ఈనాడు, కృష్ణా

హైదరాబాద్‌లో తమ యూనివర్సిటీ ప్రారంభాన్ని అమిటీ ప్రకటిస్తున్నది

AMITY UNIVERSITY HYDERABAD

తెలంగాణ రాష్ట్ర ప్రైవేటు విశ్వవిద్యాలయాల చట్టం 2018 ప్రకారం స్థాపించబడింది

తెలంగాణ యువతకు ప్రపంచ స్థాయి విద్య మరియు ఉద్యోగ అవకాశాల కల్పనకు కంకణం కట్టుకుంది

తమ రాష్ట్రానికే కాక దేశం కోసం కూడా గొప్పలక్ష్యాలు సాధించే సామర్థ్యం తెలంగాణ యువతకు ఉంది.

ప్రపంచస్థాయి మౌలికసదుపాయాలు, అంకిత భావం మరియు నిబద్ధత గల అధ్యాపక బృందంగల, పరిశోధన మరియు ఆవిష్కరణలపై చక్కటి శ్రద్ధ చూపే అమిటి యూనివర్సిటిని హైదరాబాదులో నెలకొల్పడానికి మేము గర్విస్తున్నాం. తెలంగాణ యొక్క తెలివైన విద్యార్థులకే కాకుండా భారతదేశం మరియు ప్రపంచంలోనే గొప్ప ప్రతిభ గల విద్యార్థులకు ఆటపట్టు అయిన హైదరాబాద్‌కు స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ క్యాంపస్‌ను అందించడమే మా లక్ష్యం.

అమిటి సంస్థలలో కనిపించే ఉత్కృష్ట విద్యా ప్రామాణాలనే అమిటి యూనిటిర్సిటి హైదరాబాద్‌లో కూడా అందించేందుకు మేము కట్టుబడిఉన్నాం.

ఈ సంవత్సరం అడ్మిషన్లు జరుగుతున్నాయి

• బి. టెక్ • బిసిఎ • బిబిఎ | • ఎం.టెక్ • ఎంసిఎ • ఎంబిఏ

బిబిఎ మరియు బిసిఏ కోర్సులు 3 మరియు 4 సంవత్సరాల వ్యవధికి అందచేయబడుతున్నాయి.

మొదటి బ్యాచ్ విద్యార్థులందరికి ఉపకార వేతనాలు

ప్రతిభ ఆధార ఉపకారవేతనాలు కూడా అందచేయబడుతాయి

బాలురు మరియు బాలికలకు 460 సీట్ల సామర్థ్యం గల ఆన్-క్యాంపస్ హాస్టల్

అమిటీ యూనివర్సిటీ హైదరాబాద్ ప్రయోజనాలు

హైదరాబాద్ విమానాశ్రయం వద్ద ప్రముఖ ప్రాంతంలో

ప్రపంచస్థాయి సదుపాయాలతో 20 ఎకరాల క్యాంపస్

వైవిధ్యభరితమైన అధ్యాపక బృందంతో కఠిన విద్యా సంస్కృతి

సునిశితంగా ఎంపిక చేయబడు ప్రతిభ గల సహచరులు

ఇంటర్న్‌షిప్‌లు, వ్యక్తిత్వ అభివృద్ధి మరియు భావవ్యక్తీకరణ నైపుణ్యం పెంపొందించే శిక్షణ ద్వారా కార్పొరేట్ రిసోర్స్ సెంటర్ అందించే ప్లేస్‌మెంట్ సపోర్ట్

లాభాపేక్షలేని అమిటి యూనివర్సిటి గ్రూపు వారసత్వం
- విద్యా రంగంలో 30+ సంవత్సరాల విశిష్టానుభవం
- 250,000+ విద్యార్థులు మరియు 700,000+ పూర్వ విద్యార్థులు
- 6,000+ అధ్యాపక సిబ్బంది
- భారతదేశమంతటా విస్తరించిన 12 యూనివర్సిటీలు
- 11 విదేశీ క్యాంపస్‌లు



20 ఎకరాల ప్రపంచస్థాయి అమిటి యూనివర్సిటి హైదరాబాద్ క్యాంపస్

దరఖాస్తు చేయడానికి మరియు వ్యవస్థాపక బ్యాచ్ మరియు మెరిట్ స్కాలర్‌షిప్‌లకు చూడండి: www.amity.edu/hyderabad.

అమిటీ యూనివర్సిటీ, ఏరోసిటి, రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, శంషాబాద్, హైదరాబాద్ | ఫోన్: 83879-83879, 93903-61996 | మెయిల్: admission@hyd.amity.edu | వెబ్‌సైట్: www.amity.edu/hyderabad.

నగర కార్యాలయం: బి-బ్లాక్, తదుపరి ఎక్స్‌ప్రెస్ సెంటర్, ఎల్ & టి మెట్రో స్టేషన్ పక్కన, పంజాగుట్ట, హైదరాబాద్


(c) eenadu

రహదారులపై విచ్చలవిడితనం

భద్రమైన ప్రయాణానికి భరోసానివ్వడంతో పాటు వాహనాల రాకపోకలు సాఫీగా సాగేలా చూడటం ట్రాఫిక్ నిబంధనల పరమోద్దేశం. వాటిని ఉల్లంఘించడమంటే ప్రమాదాలను కొనితెచ్చుకోవడం వంటిదే. ఆ సంగతి తెలిసీ రహదారి భద్రతా నియమాలను ఎంతమాత్రం పాటించని వాహనదారుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. 2023లో ఒక్క హైదరాబాద్ నగర పరిధిలోనే 55.3 లక్షల ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు నమోదైతే- నిరుడు అవి 63.9 లక్షలకు చేరాయి. నగరంలో అలాంటి కేసులు ఈ ఏడాది తొలి ఏడు నెలల్లోనే 52 లక్షలకు పైబడ్డాయి. ఇలా రహదారి నిబంధనలను అతిక్రమించిన వారికి గతేడాది విశాఖపట్నంలో రూ.25.67 కోట్ల జరిమానాలు విధించారు. దాదాపుగా ప్రతి పట్టణంలోనూ ఇదే పరిస్థితి! కేసులు పెడుతున్నా, ఫైన్లు వడ్డిస్తున్నా వాహనదారుల పోకడల్లో మార్పు రావట్లేదు. కన్నూమిన్నూ కానకుండా బండ్లను పరుగులు తీయించే వారికి దేశీయంగా లోటు లేదు. రాంగ్‌రూట్లోనో, మొబైల్‌లో మాట్లాడుతూనో, మద్యం సేవించో వాహనం నడపడం చాలామందికి అసలు పెద్ద విషయమే కాదు. కనీస పౌరస్పృహ లోపించిన ఇటువంటి వారి నేరపూరిత నిర్లక్ష్యం- తమ దారిన తాము పోయే ఇతరులకూ ప్రాణాంతకమవుతోంది. దీనికితోడు రోడ్లపై మేటవేసిన వ్యవస్థాగత లోపాలూ ప్రయాణికులకు నిత్యం నరకం చూపిస్తున్నాయి!

గడిచిన మూడేళ్లలోనే దేశవ్యాప్తంగా దాదాపు ఏడుకోట్ల వాహనాలు కొత్తగా రోడ్డెక్కాయి. వాటికి తగినట్లుగా చాలా చోట్ల రహదారులను విస్తరించలేదు. ఎక్కడికక్కడ ఇరుకిరుకు మార్గాలు, వాటిపై గోతులు, పనిచేయని సిగ్నళ్లు వంటివి ట్రాఫిక్ పద్మవ్యూహంలో సామాన్యుల అగచాట్లను రెట్టింపు చేస్తున్నాయి. పెరుగుతున్న జనాభా అవసరాలకు తగినట్లుగా నగరాల్లో డ్రైనేజీ వ్యవస్థలను ఆధునికీకరించకపోవడంతో చినుకు రాలిన ప్రతిసారీ కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతున్నాయి. ఈ క్రమంలో ఇంధన వినియోగం పెరిగి కర్బన ఉద్గారాలు కట్టుతప్పుతున్నాయి. విలువైన సమయాన్ని హరిస్తూ, ప్రజల ఉత్పాదక సామర్థ్యాన్ని తెగ్గోసేస్తున్న ట్రాఫిక్ సమస్యలు- ఆర్థికంగానూ జాతికి తీవ్ర నష్టం చేస్తున్నాయి. దిల్లీ, ముంబయి, బెంగళూరు, కోల్‌కతాల్లో రద్దీవేళల్లో నత్తనడకను తలపించే ట్రాఫిక్ మూలంగా దేశం ఏడాదికి రూ.1.47 లక్షల కోట్లను కోల్పోవాల్సి వస్తున్నట్లు 2018లో ఒక అధ్యయనంలో తేలింది. ఆ నాలుగు నగరాల్లో ట్రాఫిక్ ఇక్కట్ల కారణంగా భారతావని ఏటా నష్టపోతున్న సొమ్ము విలువ 2022 నాటికి రూ.1.92 లక్షల కోట్లకు పెరిగింది. హైదరాబాద్, చెన్నై, పుణె వంటి వాటినీ లెక్కలోకి తీసుకుంటే- అస్తవ్యస్త ట్రాఫిక్‌తో దేశార్థికానికి ఎంత కోతపడుతోందో ఊహకందదు!

జపాన్, నార్వే, స్విట్జర్లాండ్ తదితర దేశాల్లో పాఠశాల స్థాయినుంచే చిన్నారులకు ట్రాఫిక్ రూల్స్ నిష్ఠగా బోధిస్తారు. ఆ నియమాలను పాటించడం పౌరుల విధ్యుక్తధర్మమనే భావనను వాళ్ల మనసులో నింపుతారు. ప్రజాక్షేమం కోసం ఉద్దేశించిన నిబంధనలను అనుసరించే సమాజమే నాగరికమైనది అవుతుంది. తద్భిన్నంగా అరాచకత్వం రాజ్యమేలే మన రోడ్లమీద ఎవరు ఎటునుంచి దూసుకొస్తారో తెలియదు. నిబంధనలకు నీళ్లొదలడమంటే అదో గొప్ప విషయంగా భావించేవారూ కోకొల్లలు. దాంతో దేశీయ రహదారులు నిత్యం రక్తమోడుతున్నాయి. ఆ ఘోరకలిని నివారించాలంటే- ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమాలకు కట్టుబడాలి. వాటి గురించి అవగాహన కల్పించడాన్ని చదువులో అంతర్భాగం చేయాలి. ఇష్టారీతిగా బండ్లను దౌడుతీయించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటూ, పదేపదే అవే తప్పులు చేసేవారి లైసెన్సులను శాశ్వతంగా రద్దు చేయాలి. నాణ్యమైన రహదారుల నిర్మాణం, కాలానుగుణంగా వాటి విస్తరణ, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వాలు నిబద్ధం కావాలి!




సమయానికి గౌరవం ఇవ్వని వాళ్లూ, సమయస్పృహ లేనివాళ్లూ, సమయానికి తగిన పని చేయనివాళ్లూ... ఏదీ సాధించలేరు. పరిస్థితులు గందరగోళంగా ఉన్నప్పుడు కూడా ప్రశాంతంగా ఆలోచించగలిగే వారే ఏదైనా సాధించగలరు.

– 'పద్మభూషణ్' డాక్టర్ విక్రమ్ సారాభాయ్

జ్ఞానామృత భాండం

శ్రీమద్భగవద్గీత పరమ పవిత్ర గ్రంథం. అదో విశిష్ట వేదాంత బోధగా వినుతికెక్కింది. అసంఖ్యాక భాష్యాలకు నిలయమై నిలిచింది. భగవద్గీతను భక్తిశ్రద్ధలతో చదివినవారు, విన్నవారు తమ కర్తవ్యాన్ని తెలుసుకుంటారు. పరోపకార భావంతో ముందుకెళ్తారు. ప్రతి ఒక్కరూ యుక్తాయుక్త విచక్షణతో ప్రవర్తిస్తూ జీవితాన్ని సార్థకం చేసుకోవాలని చెబుతుంది గీత. ఇది మానవుణ్ని మాధవుడి స్థాయికి చేర్చి ముక్తిని ప్రసాదిస్తుంది. భవబంధాలను తొలగించి ఆత్మసాక్షాత్కారాన్ని కలిగించి శాంతిని చేకూర్చుతుంది.

సృష్టిలోని నిగూఢ రహస్యాలను కనుగొనడం మానవుడికి సాధ్యం కాదు. అందుకు ఈ లోకంలో ఆ పరమాత్ముడే శ్రీకృష్ణుడిగా అవతరించాల్సి వచ్చింది. ఆయన బోధనలే భగవద్గీత రూపంలో మనకు లభించాయి. మానవుడి మనసుకు అందని ఈశ్వరుణ్ని



అంతర్యామి

భగవద్గీతలో నిర్వచించిన విధంగా మరే ఇతర పవిత్ర గ్రంథాల్లోనూ వివరించడం కనబడదు. అర్జునుడు శ్రీకృష్ణుడి ఇష్టసఖుడు. ఏ కర్మ కారణంగానో అతడు ఈ మృత్యు ప్రపంచంలోకి వచ్చి పడ్డాడు. మోహితమైన ఈ లోకంలో చిక్కుకుపోయిన తన సఖుణ్ని ఈశ్వరోన్ముఖుడిగా చేసి తరింప చేయాలన్న తపనతో అనేక కోణాల్లో వేదాంత బోధ చేశాడా పరమాత్మ. కృష్ణభగవానుడు కేవలం అర్జునుడికి బోధించిందే అయినా సమస్త లోకానికీ జ్ఞానబోధగా భాసిల్లింది గీత. ధర్మరక్షణ కోసం భగవంతుడు ప్రతి యుగంలో అవతరించి మంచిని బోధించి చెడును తుడిచిపెట్టమని చెప్పి వెళ్తుంటాడు. ప్రపంచమంతా ఆ పరమాత్ముడి మాయామయమే. సత్వగుణ సంపన్నులైనవారు జ్ఞానమార్గం, బుద్ధియోగంతో విశేష సాధనచేసి మోక్షాన్ని పొందుతున్నారు. రజో, తమో గుణ సంజాతులకు జ్ఞానోదయం కావాలంటే, వారు ఆధ్యాత్మిక సాధనవైపు ఆకర్షితులు కావాలి. వారి స్థాయిని బట్టి ఉద్ధరించాలనే సంకల్పంతో భగవానుడు వారికి తగిన విధంగానే వేదాంతాన్ని బోధిస్తాడు. సాధన చేసి తరించమని ప్రబోధిస్తాడు.

మనిషి అస్థిర విషయాల వలలో చిక్కుకుని శాశ్వత సుఖానికి దూరమవుతున్నాడు. అఖిల సృష్టినీ ఆవరించి అఖండ జ్యోతిగా వెలుగుతున్న ఈశ్వరుడు మరెక్కడో లేడు. మనిషి దేహంలోనే ఉన్నాడు. అది తెలుసుకోలేక మానవుడు పరమాత్ముడికి దూరమైపోతున్నాడు. అందుకే 'భక్తుడివై నామీద మనసు నిలిపి పూజ చెయ్యి. నమస్కరించుకో. అప్పుడిక తప్పక నన్నే పొందుతావు' అంటూ అభయమిస్తున్నాడు పరమాత్ముడు. ఆధ్యాత్మిక పరిపూర్ణ సాధనకు భగవద్గీతను మించింది లేదు. అందులోని ఏ ఒక్క శ్లోకాన్నయినా తీసుకుని సగం చదివినా, విన్నా మనిషికి సద్గతులు కలుగుతాయని వరాహ పురాణం చెబుతోంది. స్వామి వివేకానంద సైతం భగవద్గీత పారాయణకు ఎంతో ప్రాధాన్యమిచ్చేవారు.

నిజానికి ఈశ్వరుడికి వారు, వీరనే భేదం ఉండదు. ప్రతి హృదయంలో కొలువై ఉంటాడు. ఆయన మానసాతీతుడు. రూప రహితుడు. ఆయన ఉనికిని నిర్ధారించలేం. 'ఆత్మస్వరూపుడైన ఆ పరమాత్మను దర్శించాలంటే మనసు తెరను తొలగించి తీరాలి' అని విడమరచి చెబుతోంది భగవద్గీత.

– యం.సి.శివశంకరశాస్త్రి

పర్యావరణ పరిరక్షణలో బ్రిక్స్ నెగ్గుకురాగలదా?

భౌగోళిక, రాజకీయ విభేదాలు పెచ్చుమీరడంతో అంతర్జాతీయంగా బహుళపక్ష సంస్థలు బలహీనపడ్డాయి. మరోవైపు పర్యావరణ సంక్షోభం ముంచుకొస్తోంది. ఇలాంటి తరుణంలో వాతావరణ మార్పులను తక్షణం నివారించాల్సి ఉన్నా, అమెరికా తదితర పాశ్చాత్య దేశాలు కాడి కిందపడేస్తున్నాయి. దాంతో ఆ బాధ్యతను తలకెత్తుకోవడానికి సిద్ధమని ఇటీవల బ్రెజిల్‌లో జరిగిన 17వ శిఖరాగ్ర సభలో బ్రిక్స్ ప్రకటించింది. ఈ విషయంలో అది ఎంతవరకు సఫలీకృతమవుతుంది?

బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికాలతో కూడిన బ్రిక్స్‌లో ఇరాన్, ఇథియోపియా, ఈజిప్ట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇండోనేసియా కూడా చేరాయి. 'బ్రిక్స్ ప్లస్'గా వ్యవహరిస్తున్న ఈ పది దేశాల్లో 45శాతం ప్రపంచ జనాభా నివసిస్తోంది. 35శాతం ప్రపంచ జీడీపీ బ్రిక్స్ ద్వారానే సమకూరుతోంది. అయితే, కర్బన ఉద్గారాల్లో సగం ఈ దేశాల నుంచే వెలువడుతున్నాయి. వీటిని తగ్గించడానికి బ్రిక్స్ కట్టుబడి ఉన్నప్పటికీ- సంపన్న, చమురు ఉత్పత్తి దేశాలు పూర్తిగా కలసిరావట్లేదు. ప్రపంచ సమస్యల పరిష్కారానికి దేశాలన్నీ కలసికట్టుగా కృషిచేయాలనే బహుళపక్ష వాదం క్రమంగా బలహీనపడిపోతోందంటూ రియో డి జనైరోలో బ్రిక్స్ సభను ప్రారంభిస్తూ బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనేసియో లులా డ సిల్వా వ్యక్తం చేసిన ఆవేదనలో వాస్తవముంది. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ సంక్షోభం, పేదరికం, ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్న వేళ- వాటిని పరిష్కరించాల్సిందిపోయి యుద్ధానికి అమూల్యమైన నిధులను మళ్లించడం అన్యాయమే.

వర్ధమాన దేశాలకు వారధిగా...

బ్రిక్స్ సంయుక్త ప్రకటన ఏఐ నిర్వహణ, స్వీయ వాణిజ్య రక్షణ ధోరణులు, పాలస్తీనా సమస్యలను ప్రస్తావించింది. ఇరాన్‌పై దాడులను ఖండించింది. అన్నింటినీ మించి వాతావరణ మార్పుల గురించి ప్రత్యేక శ్రద్ధ కనబరచింది. వర్ధమాన దేశాలు ఈ మార్పులను తట్టుకోవడానికీ, వాటివల్ల ఇప్పటికే జరిగిన నష్టం నుంచి తేరుకోవడానికీ 2035కల్లా ఏటా 1.3లక్షల కోట్ల డాలర్లను కేటాయించాలన్న డిమాండ్‌ను పునరుద్ఘాటించింది. అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం ముదురుతున్న నేపథ్యంలో బ్రిక్స్ కొత్త రాజకీయ, ఆర్థిక వ్యూహాలను రచించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. వాతావరణ మార్పుల నిరోధానికి హరిత ఇంధనాలతో వాహనాలను, పరిశ్రమలను నడపడం అనివార్యమవుతోంది. 2024లో మొత్తం ప్రపంచ సౌర విద్యుదుత్పాదనలో బ్రిక్స్ దేశాల వాటా 51శాతం. అమెరికా 303 టెరావాట్ అవర్ల సౌర విద్యుదుత్పాదన సాధిస్తే, చైనా అంతకు మూడింతలుగా 835 టెరావాట్ అవర్ల సౌరశక్తిని ఉత్పత్తి చేసింది. భారత్ 133, బ్రెజిల్ 75 టెరావాట్ అవర్ల సౌర విద్యుత్తును ఉత్పత్తి చేశాయి. ఈ ఏడాది చైనాలో సౌర విద్యుదుత్పాదన 42శాతం అధికమైతే, బ్రెజిల్‌లో 35, భారత్‌లో 32 శాతం చొప్పున పెరిగింది. 2023 నుంచి అంతర్జాతీయ హరిత ఇంధన ప్రాజెక్టుల్లో చైనా పదివేల కోట్ల డాలర్ల మేర పెట్టుబడి పెట్టింది. వర్ధమాన దేశాల మధ్య ఎలెక్ట్రిక్ వాహనాలు, సౌరశక్తి, జీవ ఇంధనాల రంగాల్లో సహకారం విస్తరిస్తోంది. శిలాజ ఇంధనాలపై ఆధారపడటం తగ్గించి, హరిత ఇంధనాలతో స్వావలంబన సాధించాలనే చైతన్యమూ ఆ దేశాల్లో పెరుగుతోంది.

ప్రస్తుతం హరిత ఇంధనాలవైపు పయనంలో భారత్ ముందుంది. వచ్చే ఏడాది బ్రిక్స్ శిఖరాగ్ర సభ మన దేశంలోనే జరుగుతుంది. అంతర్జాతీయ సహకారంలోనూ ఇండియా కీలక పాత్ర పోషిస్తున్న విషయాన్ని ఇక్కడ గుర్తుంచుకోవాలి. అంతర్జాతీయ సౌరశక్తి కూటమి, ప్రకృతి ఉత్పాతాలను తట్టుకోగల మౌలిక వసతుల నిర్మాణ కూటమిలో భాగస్వామిగా ఉన్న భారత్- సాంకేతికతను వాతావరణ మార్పుల నిరోధానికి ఉపయోగించే పథకాన్ని(బీఐటీఈ) కూడా చేపట్టింది. వందకు పైగా సభ్యదేశాలు ఉన్న అంతర్జాతీయ సౌరశక్తి కూటమి ఆసియా, ఆఫ్రికా, పసిఫిక్ ప్రాంతాల్లో సౌర విద్యుత్ ప్రాజెక్టులకు తోడ్పడుతోంది. బీఐటీఈ వర్ధమాన దేశాలకు వాతావరణ మార్పుల నిభాయింపు సాంకేతికతలను అందిస్తోంది. తుర్కియే, మొజాంబిక్, ఫిజీలలో ప్రకృతి ఉత్పాతాలు సంభవించినప్పుడు భారత్ పెద్దయెత్తున మానవతా సాయం అందించింది. రియో బ్రిక్స్ సభలో భారత్, చైనాలు ఉష్ణమండల అరణ్యాల సంరక్షణ ఆవశ్యకతను ముక్తకంఠంతో చాటిచెప్పాయి. కర్బన ఉద్గారాలపై ఏకాభిప్రాయం ప్రకటించాయి. ఈ ఏడాది నవంబరులో బ్రెజిల్‌లోని బెలెమ్‌లో జరిగే కాప్-30 సభ కర్బన ఉద్గారాల పరిహరణపై దృష్టి కేంద్రీకరించనుంది. ఆ సందర్భంగా వర్ధమాన దేశాల వాణిని భారత్, చైనాలు బలంగా వినిపించాలి.

పకడ్బందీ కార్యాచరణే కీలకం

బ్రిక్స్‌కు పెద్ద ఆశయాలున్నా, రియో సభలో అంతర్గత వైరుధ్యాలూ బయటపడ్డాయి. శిలాజ ఇంధనాల వినియోగాన్ని ఖండించకపోవడం, హరిత ఇంధనాలకు మారేవరకు కర్బన మార్కెట్లను ఉపయోగించాలని తీర్మానించడం బ్రిక్స్ చిత్తశుద్ధిని ప్రశ్నార్థకం చేసింది. పైగా శిలాజ ఇంధనాల వాడకానికి ఎప్పటినుంచి ముగింపు పలకాలనేది నిర్ణయించలేదు. వాతావరణ మార్పులకు అతలాకుతలమవుతున్న ద్వీపదేశాలకు, పేద దేశాలకు నష్టనివారణ నిధులు అందించడంపై చర్చించకపోవడం పెద్ద లోపం. హరిత ఇంధనాలను ప్రోత్సహించడానికి బాండ్లను విడుదల చేయాలని నిశ్చయించారు. కానీ, వాటి విక్రయానికి ప్రైవేటు మదుపరులపైనా, సంపన్న దేశాలపైనా ఆధారపడటం వర్ధమాన దేశాలకు ఉపకరించదు. వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి ధనిక దేశాలు భారీగా నిధులిస్తేనే కానీ వర్ధమాన దేశాలు గండం గట్టెక్కలేవు. బ్రిక్స్ సభ గంభీర ప్రకటనలు చేయడమే తప్ప పకడ్బందీ కార్యాచరణ ప్రణాళికను అమలులో పెట్టలేకపోయింది. కాబట్టి, ఈ ఏడాది నవంబరులో బెలెమ్‌లో జరిగే కాప్-30 సభలోనైనా బ్రిక్స్ నిర్దిష్ట కార్యాచరణను చేపట్టాలి. అంతర్గత విభేదాలను పరిష్కరించుకుని పాశ్చాత్య దేశాలకు ప్రత్యామ్నాయంగా నిలిచే సత్తా తమకు ఉందని ఈ కూటమి నిరూపించుకోవాలి. శిలాజ ఇంధనాలను విడనాడటానికి స్పష్టమైన గడువు ప్రకటించాలి. వర్ధమాన దేశాలకు వాతావరణ నిధులను ప్రైవేటు రుణాలు, బాండ్ల రూపంలో కాకుండా గ్రాంట్ల రూపంలో ఇవ్వాలి. వాతావరణ మార్పుల నిరోధం పట్ల జవాబుదారీతనంతో వ్యవహరించాలి. రాజకీయ దృఢ సంకల్పాన్ని ప్రదర్శిస్తూ తక్షణ కార్యాచరణకు దిగాలి.





హరికృష్ణ నిబానుపూడి
సీనియర్ యూఎన్ క్లైమేట్ ఎమర్జెన్సీ అడ్వైజర్



ఆ పని మీదే..!

'మేడమ్... మా పాప ఎంత చెప్పినా వినట్లేదు. రాత్రి పదిన్నర వరకూ టీవీ చూస్తూనే ఉంటోంది. కొంచెం భయపెట్టండి' అంటూ ఎల్‌కేజీ చదువుతున్న చిన్నారిని స్కూల్లో దింపడానికి వచ్చిన నాన్న టీచరుకు ఫిర్యాదు చేశాడు. 'మేడం... మా అబ్బాయి హోంవర్క్ సరిగా చేయట్లేదు. ఎంతసేపూ ఫోన్లో వీడియో గేమ్స్ ఆడటం మీదనే ధ్యాస ఉంటోంది. కొంచెం గట్టిగా చెప్పండి. అవసరమైతే రెండు తగిలించండి'... ఇది మూడో తరగతి చదువుతున్న హరి మీద టీచరుకు వాళ్ల అమ్మ ఇచ్చిన ఫిర్యాదు. ఈ ఫిర్యాదులు కల్పితాలు కావు. ప్రతి బడిలో సర్వసాధారణంగా వినిపించేవే. అయితే ఏంటి? 'తమ పిల్లల బాగు కోసం తల్లిదండ్రులు టీచర్లను అభ్యర్థిస్తున్నారు. అందులో తప్పేముంది?' అనుకుంటే పొరపాటే.

పిల్లల గురించి మనం చేసే ఆ ఫిర్యాదు ద్వారా... మన వ్యక్తిత్వం, జీవనశైలి, పిల్లల ఎదుగుదల పట్ల మనం ఎంత బాధ్యతతో లేదా బాధ్యతారాహిత్యంతో మెలగుతున్నాం... ఇలా అనేక విషయాలు టీచర్లకు అర్థమవుతాయి. ఉదాహరణకి, 'మా పాప అదేపనిగా టీవీ చూస్తోంది' అని ఫిర్యాదు చేసినప్పుడు... 'దీనికి నేనేం చెయ్యగలను? ఇంట్లో ఎనిమిదిన్నరకే టీవీ కట్టేసి, లైట్లు ఆర్పేసి అందరూ పడకగదిలోకి చేరితే సరిపోతుంది కదా? ఇంతోటి దానికి నేను భయపెట్టడమేంటి?' అని టీచరు మనసులో అనుకుంటారు. అలానే, 'ఫోను చూస్తూ హోంవర్క్ మీద శ్రద్ధ పెట్టడం లేదు' అని చెప్పినప్పుడు, 'ఆ ఫోను పిల్లాడి చేతికిచ్చి అలవాటుచేసింది మీరే కదా? మీరు ఫోను అందుబాటులో ఉంచుతున్నప్పుడు, నేను మందలించినా ఏం ఉపయోగం?' అని టీచరు అనుకుంటారు. అయితే, ఇవన్నీ వారు అమ్మానాన్నలకు చెప్పరు. వాళ్లు వెళ్లిపోయాక తోటి టీచర్లకు చెప్పుకొని నవ్వుకుంటారు. అమ్మానాన్నలను ఏమీ అనలేక, 'ఇంట్లో పెద్దలు మారరు కానీ. మనం భయపెట్టాలంట' అంటూ విసుక్కుంటారు. ఆ చిరాకు వెంటనే ఆయా పిల్లల మీదికి మళ్లుతుంది. 'తల్లిదండ్రులకే వీళ్లమీద శ్రద్ధలేనప్పుడు నేను మాత్రం వీళ్లకోసం ఎందుకు తాపత్రయపడాలి' అని ఆ పిల్లలను నిర్లక్ష్యం చేస్తారు. ఫలితంగా నష్టపోయేది పిల్లలే.

పిల్లల పెంపకం అన్నది ఇద్దరి బాధ్యత. ఒక చెయ్యి అమ్మానాన్నా అయితే మరో చెయ్యి ఉపాధ్యాయులు. రెండు చేతులు కలిస్తేనే పిల్లలు రత్నాల్లా వెలుగుతారు. ఇంటి దగ్గర పిల్లల అలవాట్లను సరిచేసుకోవాల్సిన బాధ్యత అమ్మానాన్నలదే. టీవీ చూస్తున్నారు, ఫోన్లో ఆడుతున్నారు అంటే... అవి లేకుండా సమయాన్ని ఎలా గడపాలో పిల్లలకి మనం తెలియజేయట్లేదనే అర్థం. మరేం చెయ్యాలి? పిల్లలతో కలిసి ఆటలు ఆడాలి, వాళ్లకి కథలు చదివి వినిపించాలి. ఫోను, టీవీల పాత్రని అమ్మానాన్నలు తమ ప్రేమతో భర్తీ చెయ్యాలి. అంతేకానీ, ఆ బాధ్యతని కూడా టీచరు చేతిలో పెడితే... అది గౌరవం అనిపించుకోదు.

– రవితేజ బొప్పూడి

జోరుగా తయారీ... అభివృద్ధి సవారీ!


ఏ దేశాభివృద్ధికైనా తయారీ రంగం అత్యంత కీలకం. భారత్ ఇప్పటికే దక్షిణ కొరియాను అధిగమించి ప్రపంచంలో అయిదో అతిపెద్ద మ్యాన్యుఫ్యాక్చరింగ్ కేంద్రంగా అవతరించింది. 560 బిలియన్ డాలర్ల పరిమాణంతో 2023లోనే చైనా, అమెరికా, జర్మనీ, జపాన్‌ల తరవాతి స్థానాన్ని ఆక్రమించింది. సమీప భవిష్యత్తులో మూడో స్థానానికి ఎగబాకాలంటే ఉత్పత్తి కార్యకలాపాలను రెట్టింపు చేయాల్సి ఉంటుంది.

అంతర్జాతీయ వాణిజ్యంలో భారత్‌కు కొన్ని రంగాలు లాభసాటిగా, మరికొన్ని ప్రతికూలంగా ఉంటున్నాయి. ఔషధాలు, వాహనాలు, తృణధాన్యాలు, వస్త్రాలు, చేపలు, ఇనుప వస్తువులు, కాఫీ, తేయాకు, సుగంధ ద్రవ్యాల విషయంలో నికర ఆదాయం అనుకూలంగా ఉంది. కానీ రత్నాలు, లోహాలు, విద్యుత్ యంత్రాలు, కంప్యూటర్లు, ప్లాస్టిక్ వస్తువులు, వైద్య పరికరాలు, ఎరువులు, రాగి, ఇనుము వంటివాటి వల్ల రాబడి అంతంత మాత్రమే. మొత్తంగా చూస్తే భారతదేశ అంతర్జాతీయ వాణిజ్య లోటు 2023లో 240 బిలియన్ డాలర్లు కాగా, నిరుడు అది 261 బిలియన్ డాలర్లకు ఎగబాకింది. ఈ లోటును అధిగమించి, వాణిజ్య మిగులు సాధించే దిశగా ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించాల్సిన అవసరముంది. దేశీయ ఎగుమతుల్లో సుమారు 63శాతం ఖనిజాలు, విద్యుత్ యంత్రాలు, కంప్యూటర్లు, రత్నాలు, లోహాలు, వాహనాలు, ఔషధాలు, తృణ ధాన్యాలు, సేంద్రియ రసాయనాలు, ఇనుప వస్తువులు వంటివే ఆక్రమిస్తున్నాయి. రాబోయే అయిదేళ్లలో వీటిని 75శాతానికి పెంచుకోవాల్సి ఉంది.

విదేశీ పెట్టుబడుల ప్రవాహం


దేశంలో ఐటీ, డిజిటల్ ఎకానమీ, ఆటోమొబైల్, మౌలిక వసతులు, స్థిరాస్తి, పునరుత్పాదక ఇంధనాలు, రిటైల్, ఈ-కామర్స్, ఆరోగ్య ఔషధ రంగాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి. రాబోయే రోజుల్లో ఏఐ, సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్, పర్యాటకం, అగ్రిటెక్, ఆహారశుద్ధి రంగాల్లోనూ ఎఫ్‌డీఐ బాగా పెరగవచ్చు. ఈ అవకాశాన్ని అనుకూలంగా మలచుకోవడానికి సరళీకృత విధివిధానాలు, మౌలిక వసతులు, నిపుణ మానవ వనరులు కీలకమని గుర్తించాలి.

జీడీపీలో తయారీ రంగం వాటాను 2025 నాటికే 25శాతానికి పెంచుకోవాలని తొలుత లక్షించినా అది నెరవేరలేదు. ప్రస్తుతమిది జీడీపీలో 17శాతం వాటాను కలిగి, 2.73 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తోంది. నిరుడు మూడో త్రైమాసికంలో మ్యాన్యుఫ్యాక్చరింగ్ సెక్టార్ సామర్థ్యం 76.8శాతానికి చేరుకుందని ఆర్‌బీఐ సర్వే చెబుతోంది. వచ్చే ఏడాదికల్లా మన తయారీ రంగం ట్రిలియన్ డాలర్ల స్థాయిని చేరుకునే అవకాశముందని అంచనా. దీన్ని సాకారం చేసుకోవడానికి పరిశోధన-అభివృద్ధి, వైజ్ఞానిక రంగాలను మరింత పటిష్ఠం చేసుకోవాలి. రవాణా వ్యవస్థనూ విస్తరించాలి. స్కిల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, మేకిన్ ఇండియా వంటి పథకాల్లోని లోటుపాట్లను అధిగమించాలి. జీడీపీలో 29శాతం వాటా కలిగిన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు(ఎంఎస్ఎంఈ) మొత్తం ఎగుమతుల్లో 40శాతానికి, ఉపాధి కల్పనలో 60శాతానికి ఆధారమవుతున్నాయి. ఆటోమొబైల్, ఔషధ రంగాల్లో ప్రస్తుతం ఇవి కీలకంగా ఉన్నాయి. విలువ జోడించిన వ్యవసాయ ఉత్పత్తుల విషయంలోనూ ఎంఎస్ఎంఈలు ముఖ్య పాత్ర పోషించగలవు.



అగ్రస్థానానికి చేరుకోవాలంటే...

దేశీయ తయారీ రంగాన్ని జోరెత్తించాలంటే ఎంఎస్ఎంఈలకు తగిన తోడ్పాటును అందించాలి. రాజకీయాలకు అతీతంగా, పారదర్శకంగా, జాతీయ దృక్పథంతో కేంద్రం, రాష్ట్రాలు చర్చించి- రాబోయే రెండు దశాబ్దాలలో తయారీ రంగంలో భారత్ అగ్రగామిగా ఎదగడానికి ఊతమిచ్చే పది కీలక రంగాలను ఎంపిక చేయాలి. వాటి వికాసానికి సరళీకృత విధివిధానాలను రూపొందించాలి. దేశీయ ఆటోమొబైల్, ఔషధ తయారీ రంగాలు ఏ విధంగా ముందుకెళ్లి అంతర్జాతీయ గుర్తింపు పొందాయన్నది కూలంకషంగా అధ్యయనం చేయాలి. తదనుగుణంగా గుర్తించిన పది రంగాల్లో కొత్త విధానాల అమలుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి. రాష్ట్రాలు తమ పారిశ్రామిక విధానాల్లో భాగంగా భారీ పరిశ్రమలు, బడా కార్పొరేట్ సంస్థలతో పాటు ఎంఎస్ఎంఈల అభివృద్ధిపైనా ప్రత్యేకంగా దృష్టి సారించాలి. ఎలక్ట్రానిక్స్ రంగంలో స్వయంసమృద్ధి సాధించేందుకు కేంద్రం ఈసారి ఆత్మనిర్భర్ భారత్ కింద రూ.22,919 కోట్లు, తయారీ రంగంలో ఉపాధి అనుసంధాన ప్రోత్సాహక పథకానికి మరో రూ.99,446 కోట్లు ప్రత్యేకించింది. తయారీలో భారత్ ముందడుగు వేయడానికి అవసరమైన సామర్థ్యం, వనరులు పుష్కలంగా ఉన్నాయి. కానీ అందుకు కావాల్సిందల్లా- పటిష్ఠమైన దీర్ఘకాలిక వ్యూహం, దాన్ని సమర్థంగా అమలు చేయడానికి అనువైన సమీకృత విధానమే. అమెరికా సుంకాల పెంపు నేపథ్యంలో మన ఎగుమతులపై పడే ప్రభావాన్ని సరిగ్గా అంచనా వేస్తూ, దానికి అనుగుణంగా తయారీ రంగ విధానాల్లో మార్పుచేర్పులు చేసుకోవడమూ కీలకమే.



డాక్టర్ బి.యన్.వి.పార్థసారథి
మాజీ వైస్ ప్రెసిడెంట్, బ్యాంక్ ఆఫ్ బహ్రెయిన్ అండ్ కువైట్

ప్రజల కోసం ఎంత?


ఆరోగ్యంతో కూడిన, విద్యావంతులైన మానవ వనరులను రూపొందించడం ప్రభుత్వాల బాధ్యత. సమాజంలో అసమానతలను తొలగించడానికి, మౌలిక వసతుల కల్పనకు, ప్రజల క్షేమానికి భరోసా ఇవ్వడానికి, ముఖ్యంగా ఆర్థిక వృద్ధికి పాలకులు తగినంతగా ఖర్చుపెట్టాలి. పలు రకాల సంక్షేమ, అభివృద్ధి పథకాలు, రాయితీలు, నష్టపరిహారాలు తదితరాల రూపంలో ప్రభుత్వాలు ప్రజలపై వ్యయం చేస్తుంటాయి. నిరుడు ఆయా దేశాల్లో సగటు తలసరి ప్రభుత్వ వ్యయం ఎంతంటే... (డాలర్లలో)

నార్వే	51,293
ఆస్ట్రియా	39,157
స్వీడన్	34,364
జర్మనీ	34,318
ఫ్రాన్స్	34,011
అమెరికా	32,173 (2023)
కెనడా	29,586
యూకే	27,636
పోలాండ్	23,575
జపాన్	20,283 (2023)

(ఆధారం: ఓఈసీడీ నివేదిక-2025)

అల్లరి ఎలుగు..!

అంబాపురం అడవిలో రకరకాల జంతువులు ఉండేవి. ఒకసారి ఒక చెట్టు కింద కోతి, జింక, కుందేలు.. సరదాగా కబుర్లు చెప్పుకొంటూ ఉన్నాయి. అప్పుడే అక్కడికి ఒక ఎలుగుబంటి పిల్ల ఏడుస్తూ వచ్చింది. వెంటనే దాని దగ్గరికి వెళ్లి.. 'ఏమైంది? ఎందుకలా ఏడుస్తున్నావు?' అని అడిగాయవి. 'మా అమ్మ కనిపించట్లేదు' అంటూ ఇంకా గట్టిగా ఏడవసాగిందా ఎలుగు పిల్ల. 'మీ అమ్మ నీకోసం తేనె తీసుకురావడానికి వెళ్లి ఉంటుంది. వచ్చేస్తుందిలే' అని సముదాయించింది జింక. అయినా సరే అది ఏడుపు ఆపట్లేదు. దాంతో.. 'నేను వెళ్లి వెతుకుతాను' అంటూ తేనెతుట్టెలు ఉన్న వైపు పరుగులు తీసింది జింక. దాని వెనకాలే కోతి కూడా వెళ్లింది. కొన్ని గంటల తరవాత అవి తిరిగొచ్చాయి. 'చాలా చోట్ల వెతికాం. కానీ మీ అమ్మ ఎక్కడా కనిపించలేదు. రేపు ఉదయం వరకు చూద్దాం.. రాకపోతే మళ్లీ వెతుకుదాం' అన్నాయి. ఎలుగు పిల్ల.. ఇంకోసారి అమ్మా..! అంటూ ఏడుపు మొదలుపెట్టింది.



దాంతో కుందేలు.. ఎందుకైనా మంచిదని ఒకసారి ఎలుగుబంటి గుహ దగ్గరికి వెళ్లి చూసింది. లోపలే హాయిగా గురక పెట్టి నిద్ర పోతోందా ఎలుగు. కుందేలు తిరిగి వచ్చి.. 'మీ అమ్మ గుహలోనే ఉంది కదా!' అంది. 'అవునా? అయితే నన్ను మా గుహ దగ్గరికి తీసుకెళ్లవా?' అని అమాయకంగా అంది పిల్ల ఎలుగు. 'అంటే నువ్వు.. మీ అమ్మకు చెప్పకుండా గుహ వదిలిపెట్టి బయటకు వెళ్లావు. దారి మర్చిపోయి ఇప్పుడు అమ్మ కనిపించట్లేదని ఏడుస్తున్నావా?' అన్నాయి కోతి, జింక, కుందేలు. ఇంకెప్పుడూ ఇలా చేయొద్దని చెప్పి.. తరవాత దాన్ని తీసుకెళ్లి.. గుహ దగ్గర వదిలిపెట్టాయి.

– ఎం.లక్ష్మి

హాయ్! బుజ్జీ!!

గడుల్లో గప్‌చుప్!

ఇక్కడ ప్రతి చతురస్రంలో ఒక్క అక్షరం తప్ప మిగతావి రెండుసార్లు ఉంటాయి. ఆ ఏకాకి అక్షరాలను ఓచోట చేరిస్తే అర్థవంతమైన పదం వస్తుంది. ఓసారి ప్రయత్నించండి.

1 (పై ఎడమ), 3 (పై కుడి), 2 (కింద ఎడమ), 4 (కింద కుడి)

న	నే	ను	ధై	ధీ	ధూ
ను	ని	నీ	ధ	ధే	ధీ
నీ	న	నే	ధూ	ధై	ధే
బీ	బు	బ	నృ	నీ	న
బృ	బీ	బం	ని	నృ	నౌ
బ	బు	బృ	నీ	నౌ	ని

(c) eenadu



స్టాల్‌ను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి

మదినిండా.. మనజెండా..

విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం నిర్వహించిన ఇంటింటా మువ్వన్నెల జెండా కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మువ్వన్నెల రంగులతో తయారు చేసిన ఉత్పత్తుల స్టాల్‌ను ఆసక్తిగా తిలకించారు. జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్యకు ఘన నివాళులు అర్పించారు.

– ఈనాడు, అమరావతి



సభా వేదికపై సీఎం చంద్రబాబు, మంత్రులు కందుల దుర్గేష్, సత్యకుమార్, ఎమ్మెల్యే బొండా ఉమా, నెట్టెం రఘురాం తదితరులు



విచ్చేసిన ప్రముఖులు

తొలి అడుగు.. తడబడకు

ఈనాడు, అమరావతి

అంతర్జాతీయ యువజన దినోత్సవం నేడు

'ఇంటర్, ఇంజినీరింగ్, వైద్య సహా అన్ని కళాశాలలు మొదలయ్యాయి. డిగ్రీ కళాశాలలు త్వరలో ఆరంభం కానున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఏటా ఇంటర్ నుంచి ఇంజినీరింగ్, డిగ్రీ, విశ్వవిద్యాలయాల వరకు కనీసం 80,000- లక్ష మంది విద్యార్థులు కొత్తగా చేరుతున్నారు. వీరంతా కళాశాలల్లోకి అడుగుపెట్టిన దగ్గర నుంచి అప్రమత్తం కావాల్సిన సమయమిది. ప్రధానంగా గంజాయి మత్తు, బెట్టింగ్, రుణ యాప్‌లు, అనారోగ్య జీవనశైలి.. ఈ నాలుగు విద్యార్థులను చుట్టుముట్టి.. వారి జీవితాలను కబళిస్తున్నాయి."



సరదాగా మత్తులోకి...



రెండు జిల్లాల్లో విద్యాసంస్థల్లో గంజాయి వినియోగం ఎక్కువైంది. పటమట, గుణదలలో రౌడీషీటర్ల దగ్గర 20 కిలోల చొప్పున గంజాయి పట్టుకున్నారు. బందరు.. చిలకలపూడి వద్ద ఇటీవల ఆరు కిలోలు, ఉయ్యూరులో రెండు కిలోల గంజాయి పట్టుకున్నారు. ఎక్కువ శాతం గంజాయిని.. విద్యా సంస్థలు, విద్యార్థులు కేంద్రంగానే విక్రయిస్తున్నారు. ఎఫిడ్రిన్, ఎండీఎం, కొకైన్‌కు సైతం యువత బానిసలుగా మారుతున్నారు.

అప్రమత్తమిలా ఆరంభంలో సరదాగా స్నేహితులతో కలిసి మొదలెట్టి.. ఏడాది తిరిగేసరికి మత్తుకు బానిసలు అవుతున్నారు. ఆరంభంలో ఉచితంగా ఇచ్చి.. మత్తు అలవాటు చేస్తున్నారు. అందుకే ఆరంభం నుంచే మత్తుకు దూరంగా విద్యార్థులుండేలా అవగాహన పెంచాలి.


రుణ యాప్‌లతో కొంపకొల్లేరు



బెట్టింగ్, మత్తుకు అలవడిన వారిని రుణ యాప్‌లు ఆకర్షించి.. మరింత ఆపదలోకి నెట్టేస్తున్నాయి. రూ.వెయ్యికి రోజుకు రూ.10 అంత కంటే ఎక్కువ వడ్డీ బాదేస్తూ రుణాలు ఇస్తున్నారు. విద్యార్థులకు ఎలాంటి ష్యూరిటీ లేకుండా.. వెంటనే డబ్బులు ఇచ్చేసి.. ఆ తర్వాత వాటిని వడ్డీ, చక్రవడ్డీలు వేసుకుంటూ.. భారీగా వసూలు చేస్తున్నారు. ఇందుకు కుటుంబాలనూ నడిరోడ్డుపైకి లాగుతున్నారు.

అధిగమిద్దాం.. విద్యార్థులు అప్పుల కోసం ఎట్టిపరిస్థితుల్లోనూ రుణ యాప్‌లను ఆశ్రయించవద్దనే విషయం వారికి స్పష్టంగా చెప్పాలి. తల్లిదండ్రులకు చెబితేనే.. ఈ గండం నుంచి వాళ్లు బయటపడే వీలుందనే భరోసా కల్పించాలి.

బెట్టింగ్ దెబ్బకు తేరుకోలేక..



విజయవాడ శివారులో ఓ కళాశాలలో ఇంజినీరింగ్ విద్యార్థి ఫీజు కట్టమని ఇచ్చిన రూ.50 వేలను బెట్టింగ్‌లో పోగొట్టుకున్నాడు. తల్లిదండ్రులు ఏమంటారో అనే భయంతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థుల జీవితాలతో ఈ బెట్టింగ్ చెలగాటం ఆడుతోంది. స్థానిక విద్యార్థుల కంటే ఇతర ప్రాంతాల నుంచి వచ్చి చదివే వారే ఇక్కడ అధికం. వసతి గృహాల్లో ఉండడంతో.. అందరికీ విస్తరిస్తోంది. రూ.10-20 లక్షలు పోగొట్టుకుంటున్న వాళ్లున్నారు.

తరిమేద్దాం.. విద్యార్థితోపాటు అతని కుటుంబం కూడా ఈ దెబ్బతో పూర్తిగా అప్పులపాలు అవుతోంది. బెట్టింగ్‌లో పోగొట్టిన డబ్బులను బెదిరించి మరీ వసూలు చేస్తున్నారు. కళాశాలలో అడుగుపెట్టిన రోజు నుంచే విద్యార్థికి అవగాహన కల్పించాలి.

ఆరోగ్యం ముఖ్యం.. కానీ పట్టదు..



ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులు సరైన ఆహారం, సమయానికి నిద్ర లేక తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. సమయానికి తినకపోవడం, అర్ధరాత్రి వేళ బిర్యానీలు, ఫాస్ట్‌ఫుడ్‌లు లాగించేయడం, సరిపడా నీళ్లు తాగకపోవడం.. ఇవన్నీ కలిసి మూత్రపిండాలు, కాలేయం వ్యాధుల బారినపడేలా చేస్తోంది. చిన్న వయసులోనే జీవితాలను పూర్తిగా అంధకారం చేసుకుంటున్నారు.

గెలిచేద్దాం.. ఆహారం, రోజూ తప్పనిసరిగా కనీసం రెండున్నర లీటర్ల నీటిని తాగడం.. విధిగా పాటించేలా చేయాలి. వీటితో కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించాలి. అన్నింటి కంటే ఆరోగ్యం ముఖ్యమనే విషయం నేటి యువతరం అసలు గుర్తించడం లేదు.

రెండు జిల్లాల్లో కళాశాలలు, నూతన విద్యార్థుల చేరిక ఇలా..

డిగ్రీ కళాశాలలు: 105	25,000
ఇంజినీరింగ్: 30	16,000
వైద్య, నర్సింగ్	1,000
ఇంటర్	55,000
విశ్వవిద్యాలయాలు: 2	2,000

కదులుతున్న లెక్కల డొంకలు!


అద్విక కుంభకోణంపై ఏజెంట్లు, డిపాజిటర్ల విచారణ

ఈనాడు, అమరావతి: అద్విక ట్రేడింగ్ కంపెనీ కుంభకోణంలో లెక్కల డొంకలు కదులుతున్నాయి. ఈ కేసుపై విచారణ కోసం ఏర్పాటు చేసిన సిట్ విచారణ ప్రారంభించింది. సిట్‌లోని బృందాలు గత రెండు రోజులుగా ఏజెంట్లు, డిపాజిటర్లను పిలిపించి వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేస్తున్నాయి. ఇప్పటికే సేకరించిన బ్యాంకు లావాదేవీలను దగ్గర పెట్టుకుని వాటి ఆధారంగా ప్రశ్నిస్తున్నారు. ఎంత నగదు ఎవరి నుంచి ఎవరి ఖాతాకు మళ్లింది అనేది ప్రధానంగా పరిశీలిస్తున్నారు. ట్రేడింగ్ పేరుతో డిపాజిట్లు వసూలు చేసినా.. చాలా తక్కువ మొత్తానికే చేసి, మిగిలిన సొమ్మును వడ్డీ, ప్రోత్సాహకాలను ఇచ్చేందుకే రొటేషన్ చేసినట్లు దర్యాప్తులో వెలుగుచూసింది.

✶ మొత్తం 1,700 మంది నుంచి డిపాజిట్లు వసూలు చేసిన ప్రధానంగా ఫారెక్స్ ట్రేడింగ్ కోసం ఖజానా, మల్టీ బ్యాంకుల్లో 400 మంది పేరిట ఖాతాలు తెరిచారు. మిగిలిన వారి డిపాజిట్ సొమ్మును దారి మళ్లించారు. ఇప్పటి వరకు అటాచ్ చేసిన ఆస్తులకు సంబంధించి పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేసి.. వాటిని లిక్విడేషన్ ప్రక్రియకు అనుమతి తీసుకోనున్నారు. దీంతో స్వల్పమైనా డిపాజిటర్లకు పంపకం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే 150 ఆస్తులను సీఐడీ అటాచ్ చేసింది. ప్రస్తుత ప్రక్రియలో వెలుగుచూస్తున్న అక్రమాలకు సంబంధం ఉన్న వారి ఆస్తులను గుర్తించే ప్రక్రియ సమాంతరంగా సాగుతోంది. వారితో పాటు కుటుంబ సభ్యుల వివరాలను కూడా తీసుకుని త్వరలో రిజిస్ట్రేషన్ల శాఖకు ఆస్తుల కోసం లేఖ రాయనున్నట్లు తెలిసింది.

కృష్ణా నదికి వరద ఉద్ధృతి

సముద్రంలోకి 1.28 లక్షల క్యూసెక్కులు



బ్యారేజీ వద్ద కృష్ణమ్మ పరవళ్లు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కృష్ణా నది దిగువన ప్రకాశం బ్యారేజీ వద్ద సోమవారం వరద ఉద్ధృతి పెరిగింది. మొత్తం 70 గేట్లను ఎత్తి.. వచ్చిన నీరు వచ్చినట్లే సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ఉదయం 10.30 గంటలకు ఎగువ నుంచి 70,738 క్యూసెక్కులు రాగా, 10 గేట్లను రెండు అడుగులు, 55 గేట్లను ఒక అడుగు చొప్పున 65 గేట్లు ఎత్తారు. సముద్రంలోకి 53,875 క్యూసెక్కులు విడుదల చేశారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఎగువ నుంచి 1.08 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. 60 గేట్లను రెండు అడుగులు, మిగతా 10 గేట్లను ఒక అడుగు మేర మొత్తం 70 గేట్లను ఎత్తారు. సముద్రంలోకి 91,250 క్యూసెక్కులు వదిలారు. సాయంత్రం 5.30 గంటల వరకు నిలకడగా ఉండి, ఆ తర్వాత క్రమేపీ పెరిగింది. సాయంత్రం 6 గంటలకు ఎగువ నుంచి 1,28,482 క్యూసెక్కులు రాగా, 20 గేట్లను మూడు అడుగులు, మిగతా 50 గేట్లను రెండు అడుగుల మేర ఎత్తారు. సముద్రంలోకి 1,11,500 క్యూసెక్కులు విడుదల చేశారు. రాత్రి 7 గంటలకు మరింత పెరిగింది. ఎగువ నుంచి 1,45,357 క్యూసెక్కులు రాగా, 45 గేట్లను మూడు అడుగులు, మిగతా 25 గేట్లను రెండు అడుగుల మేర ఎత్తారు. సముద్రంలోకి 1,28,375 క్యూసెక్కులు విడుదల చేశారు. రాత్రి 9 గంటలకు ఎగువ నుంచి 1,44,856 క్యూసెక్కులు రాగా. సముద్రంలోకి 1,28,375 క్యూసెక్కులు వదిలారు.

❖ కృష్ణా డెల్టాలోని పంట కాలువలకు 16,481 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువకు 9,874, కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు 6,407, గుంటూరు ఛానల్‌కు 200 క్యూసెక్కుల చొప్పున ఇస్తున్నారు.

లాభాల ఎర.. రూ.60 లక్షల టోకరా



విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ముక్కూమొహం తెలియని వ్యక్తులు మిమ్ములను గుర్తు తెలియని వాట్సాప్ గ్రూప్‌లో చేర్చితే.. అనుమానించండి. పెట్టుబడులు పెడితే అతి తక్కువ రోజుల్లో రెండింతలు, మూడింతలు లాభం వస్తుందంటే.. అసలు నమ్మకండి. ఇలా ఎవరైనా ఇన్వెస్ట్‌మెంట్ అంటే వారు తప్పకుండా సైబర్ నేరగాళ్లే అవుతారు. మిమ్మల్ని నిలువునా ముంచేందుకు ఆరంభంలో లాభాలు చూపిస్తారు. ఇలా నగరానికి చెందిన ఓ వ్యక్తి సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మి మోసపోయారు.

కళ్లు చెదిరే లాభాలని.. మొగల్రాజపురానికి చెందిన ఒక వ్యక్తి (52) చరవాణి నంబరును గత నెల 15న 'అంకిత ఘోష్, కిరణ్ మెహతా' అనే ఇద్దరు వ్యక్తులు '83 బాబ్ క్యాప్స్ గ్రూప్'లో చేర్చారు. ఆన్‌లైన్ స్టాక్ ట్రేడింగ్ చేస్తే.. కళ్లు చెదిరే లాభాలు వస్తాయని నమ్మించారు. వారి మాటలు నమ్మిన సదరు వ్యక్తి.. బాబ్ క్యాప్స్‌లో పేరు రిజిస్టర్ చేసుకున్నారు. అది పూర్తికాగానే ఆయనకు కన్ఫర్మేషన్ మెయిల్ వచ్చింది. కొన్ని బ్యాంకు ఖాతాల నంబర్లు పంపారు. వ్యాపార నిమిత్తం దానిలో లావాదేవీలు నిర్వహించాలని చెప్పడంతో.. వారి మాటలు నమ్మి 9 రోజుల్లో విడతల వారీగా రూ.60లక్షలు ఆయా నంబర్లకు పంపించారు. ఈ డబ్బులు రాగానే సైబర్ నేరగాళ్లు బోర్డు తిప్పేశారు. బాధితుడు మోసపోయినట్లు గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. ఆ నగదు మూడు వేర్వేరు బ్యాంకుల ఖాతాలకు వెళ్లినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. విశాఖపట్నం జిల్లా యలమంచిలిలోని ఒక జాతీయ బ్యాంకు ఖాతా, హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేట్ బ్యాంకు ఖాతాకు, పశ్చిమ్‌బంగ, రాయ్‌గంజ్‌లో ప్రభుత్వ రంగ సంస్థ బ్యాంకుకు ఈ డబ్బులు బదిలీ అయినట్లు తేలింది. ఆయా బ్యాంకు ఖాతాల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

త్వరలో ఈఎస్‌ఐ వైద్యశాలల్లో 500 ఖాళీల భర్తీ



అంబులెన్స్ నమూనా తాళం కార్మిక శాఖ మంత్రి సుభాష్‌కు అందజేత

గుణదల (పటమట): త్వరలో ఈఎస్‌ఐ వైద్యశాలల్లో 500 ఖాళీలు భర్తీ చేయనున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. సోమవారం విజయవాడ గుణదలలోని ఈఎస్‌ఐ ఆసుపత్రి ప్రాంగణంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఎస్‌ఆర్ నిధులతో అందజేసిన రెండు అంబులెన్స్‌లను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల భద్రత, సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. వైద్య పరికరాల కొనుగోలుకు అనుమతులు వచ్చాయని చెప్పారు. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ తప్పిదాల వల్లే గతేడాది కర్మాగారాల్లో వరుస ప్రమాదాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. కార్మికులకు 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఎస్‌బీఐ సహకారంతో అంబులెన్సులు అందుబాటులోకి తీసుకువచ్చామని, కొన్ని రోజుల కిందట యూనియన్ బ్యాంకు సహకారంతో రూ.43 లక్షల విలువైన అంబులెన్స్ ఈఎస్‌ఐ వైద్యశాలకు అందించినట్లు తెలిపారు.

జేఎన్‌టీయూకేతో ఒప్పందం: రసాయన కర్మాగారాలు, పరిశ్రమల్లో రికార్డుల మూల్యాంకనం, విద్యార్థులు ఇంటర్న్‌షిప్ చేయడానికి, పరిశ్రమల భద్రతకు సంబంధించి విశ్వవిద్యాలయం నుంచి సాంకేతిక సహకారం తీసుకునేందుకు జేఎన్‌టీయూ కాకినాడతో కార్మిక శాఖ ఎంఓయూ కుదుర్చుకుంది. ఈ నెల 4న శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ, జేఎన్‌టీయూ అనంతపురం, ఏపీ ప్రొడక్టవిటీ కౌన్సిల్‌తో కూడా ఒప్పందాలు చేసుకున్నట్లు మంత్రి తెలిపారు. కార్మిక శాఖ కార్యదర్శి శేషగిరిబాబు, డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ మోహన్‌రావు, జేఎన్‌టీయూ కాకినాడ రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు, ఎస్‌బీఐ డిప్యూటీ జీఎం సీతాక్షి సింగ్ తదితరులు పాల్గొన్నారు.

దారుల్లో మృత్యుగీతం!

ద్విచక్ర వాహన చోదకుల మరణాలే అధికం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే



శిరస్త్రాణం ధరించని వాహనదారులు

ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదవుతున్న రోడ్డు ప్రమాద మరణాలు రవాణా రంగ నిపుణులను భయపెడుతున్నాయి. ట్రాఫికర్‌కు పేరొందిన విజయవాడలో ఎప్పుడు ఎక్కడ ఏం జరుగుతుందో చెప్పలేని పరిస్థితి. ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాలతో నిండిపోయే రహదారుల్లో... ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. వీటిలో అత్యధికంగా ద్విచక్రవాహన చోదకులే ప్రాణాలు కోల్పోవడం ఆందోళన కలిగిస్తోంది. గత మూడు సంవత్సరాల గణాంకాలను పరిశీలిస్తే.. ఇదే తేటతెల్లమవుతోంది. ఆ తర్వాత పాదచారులు ఎక్కువ మంది మృత్యువాత పడుతున్నారు. గాయపడిన వారి సంఖ్య మూడు రెట్లు ఉంటోంది.

గత మూడేళ్లలో నమోదైన మరణాలు

వాహనం	2023	2024	2025 (జూన్ వరకు)
ద్విచక్రవాహన చోదకులు	227	245	121
ఆటోలు	7	22	15
కార్లు	27	25	7
హెవీ వాహనాలు	12	17	4
పాదచారులు	96	115	52

కారణాలివే... రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్ర వాహన చోదకులే అత్యధికంగా మృతిచెందడానికి ప్రధాన కారణం శిరస్త్రాణం ధరించకపోవడం. చిన్న చిన్న ప్రమాదాల్లోనూ కింద పడి తలకు గాయాలతో ఆసుపత్రుల్లో చేరుతున్నారు. జారిపడిపోయినా.. వాహన వేగానికి తల నేలకు కొట్టుకుని బలమైన గాయమవుతోంది. దీనివల్ల కోమాలోకి చేరుతున్నారు. ఒక్కోసారి తల పగిలి మరణిస్తున్నారు. మరో వైపు మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ కింద పడి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. శిరస్త్రాణం ధరించి ఉంటే ఈ తరహా ప్రమాదాల్లో కనీసం 70 శాతం మరణాలను అరికట్టవచ్చని పోలీసు అధికారులు అంటున్నారు. అందుకే ద్విచక్రవాహన చోదకులు శిరస్త్రాణం ధరించాలని స్పష్టం చేస్తున్నారు.

ఇలా చేస్తే మేలు

☛ ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలి. ☛ మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు అవసరం. ☛ ఎక్కడ పడితే అక్కడ రోడ్లను దాటకుండా బారికేడింగ్ ఏర్పాటు చేయాలి. ☛ రాత్రి వేళల్లో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు జిగ్‌జాగ్ బారికేడింగ్ అమలు చేయాలి.

ఎక్కడ పడితే అక్కడ రోడ్డు దాటుతూ..

నగరంలో పాదచారులు కూడా ప్రమాదాల బారిన పడుతున్నారు. కాలిబాట మార్గం లేకపోవడం ప్రధాన లోపం. రోడ్డు అంచుల్లో నడుస్తున్నా. వాహనాలు ఢీకొట్టి చనిపోతున్నారు. జీబ్రా గీతల పైనే రోడ్డు దాటాలని నిబంధన ఉన్నా.. ఎక్కడ పడితే అక్కడ రోడ్డు దాటేస్తున్నారు. దీనివల్ల వాహనాలు ఢీకొని ప్రాణాలు కోల్పోతున్నారు.

దసరా ఉత్సవాల నాటికి అభివృద్ధి పనులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల నాటికి అభివృద్ధి పనులు పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని దుర్గగుడి ఈవో శీనానాయక్ అధికారులకు సూచించారు. దేవాదాయ శాఖ ఎస్‌ఈ సుబ్రహ్మణ్యంతో కలిసి ఈవో దేవస్థానం చేపట్టి అభివృద్ధి పనుల పురోగతిని క్షేత్ర స్థాయిలో సోమవారం పరిశీలించారు. ఈవో మాట్లాడుతూ గతానుభవాలను దృష్టిలో పెట్టుకొని నిర్మాణ సిబ్బందిని పెంచి పనులు పూర్తి చేయాలని గుత్తేదారులకు సూచించారు. ప్రసాదాల పోటు, అన్నదాన భవనాలను ఉత్సవాల్లో పాక్షికంగా వినియోగించుకునే విధంగా తీర్చిదిద్దాలను కోరారు. దసరాను దృష్టిలో ఉంచుకొని అన్నప్రసాద తయారీ కేంద్రంలో చేయిల్సిన మార్పులను ఏసీ రంగారావుతో చర్చించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్నప్రసాదం, లడ్డు, పులిహోర ప్రసాదాలను అందించాలని ఆదేశించారు. ఈఈ కోటేశ్వరరావు, రాంబాబు, డీఈలు రవీంద్ర, అశోక్ పాల్గొన్నారు.

అక్రమాలకు ముకుతాడు

ఉపాధిహామీలో తప్పుడు కొలతలకు ఏఐతో చెక్

ఈనాడు, అమరావతి



తప్పుడు మస్తర్లతో మాయ.. బినామీ, బోగస్ కూలీలతో దోపిడీ. .పని చేయకుండా చేసినట్లు బిల్లులు.. కొలతల్లో వ్యత్యాసాలు ఇలా కాదేది అక్రమాలకు అనర్హం అన్నట్లు ఉపాధి హామీ పథకంలో ఇష్టారాజ్యంగా దోచుకున్నారు. ఈ అడ్డగోలు వ్యవహారాలకు ప్రభుత్వం ఏఐతో ముకుతాడు వేస్తోంది. హాజరు నుంచి పని కొలతల వరకు ఎక్కడా అక్రమాలకు తావు లేకుండా కట్టుదిట్టం చేస్తోంది.

ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఉపాధి అక్రమాలపై జరుగుతున్న సామాజిక తనిఖీల్లో అత్యధికంగా అవకతవకలు కొలతల్లోనే జరిగినట్లు వెల్లడైంది. ఒక క్షేత్ర సహాయకుడు చేసిన పనికి ఇద్దరు ముగ్గురు క్షేత్ర సహాయకులు బిల్లులు పెట్టుకోవడం.. నిర్దేశిత పనికి, చేసిన పనికి భారీగా వ్యత్యాసాలు ఉండడం.. గతేడాది చేసిన పనికి బిల్లులు చేసుకోవడం.. ఇలా కొలతల మాయతో రూ.కోట్లు కొట్టేశారు. తాజాగా జి.కొండూరు, గంపలగూడెం మండలాల్లో గతేడాది జరిగిన అవకతవకల్లో దాదాపు రూ.5కోట్ల వరకు కొలతల వ్యత్యాసాల్లోనే జరిగాయి. ఈ తరహా మోసాలకు ఏఐతో అడ్డుకట్టు వేస్తున్నారు. ఇస్రో వారి భువన్ యాప్ ద్వారా ఏ రోజు చేయాల్సిన పని ఆ రోజే జీవో ఫెన్సింగ్ చేస్తారు. ఇది చేసిన తర్వాతే కొత్త పని చేసేందుకు అవకాశం ఉంటుంది. ముందు చేసిన పనికి బిల్లులు చేసేందుకు అవకాశం ఉండదు. చేసిన పని మళ్లీ వచ్చే ఏడాది చేయడానికి అవకాశం ఉండదు. దీంతో తప్పుడు బిల్లుల వ్యవహారానికి కళ్లెం వేయడానికి అవకాశం ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో జాబ్ కార్డులు:	4.33లక్షలు
ఉపాధి శ్రామికుల సంఖ్య:	6.21లక్షలు
రోజువారీ వేతనం:	రూ.294.14

తప్పుడు మస్తర్లకు అడ్డుకట్ట

ఇప్పటివరకు ఎన్ఎంఎంఎస్‌లో ఫొటోల అప్‌లోడ్ చేసే విధానం ఉంది. దీనిలో రోజూ పని చేసిన వారి ఫొటోలు అప్‌లోడ్ చేయాలి. బినామీ, బోగస్ శ్రామికుల ఫొటోలు పెట్టినా గుర్తించే సాంకేతికత లేదు. పైగా ఒకసారి అప్‌లోడ్ చేసిన ఫొటో 15 రోజుల తర్వాత యాప్‌లో కనిపించదు. దీంతో అడ్డగోలుగా వ్యవహరించారు. ముఖ గుర్తింపు హాజరుతో ఈ అక్రమాలకు చెక్ పెట్టనున్నారు. శ్రామికుల ఫొటోలను జాతీయ మొబైల్ పర్యవేక్షణ వ్యవస్థ(ఎన్ఎంఎంఎస్) యాప్‌లో ముందుగా అప్‌లోడ్ చేస్తారు. పని ప్రదేశంలో రెండుపూటలా శ్రామికుల ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తారు. ఒకరి తరఫున మరొకరు హాజరైతే యాప్ అనుమతించదు. ఉదయం ఫొటో దిగితే ఒక పూట వేతనం మాత్రమే వస్తుంది. ఈ హాజరును పంచాయతీ కార్యదర్శులు పరిశీలిస్తారు.

☛ ఆగస్టు 10 నుంచి కొత్త విధానం అమలు చేస్తున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు మాస్టర్ ట్రైనీల ద్వారా ఉమ్మడి జిల్లాలో క్షేత్ర సహాయకులకు శిక్షణ ఇస్తున్నారు.

'వైకాపా అరాచకాలన్నీ తాడేపల్లి వైపే'

గన్నవరం గ్రామీణం: 'గత ఐదేళ్ల వైకాపా పాలనలో జరిగిన అక్రమాలన్నీ తాడేపల్లి వైపే చూస్తున్నాయి.. మద్యం, ఇసుక, ప్రాజెక్టుల్లోనూ అవినీతి జరిగింది.. మద్యం అక్రమాల్లో పేదల శ్రమను ఏరకంగా గత ప్రభుత్వంలోని పెద్దలు దోపిడీ చేశారో కళ్లముందే సాక్ష్యాలు కనిపిస్తున్నాయని' రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఉంగుటూరు మండలం పొట్టిపాడులో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. కర్ణాటక, ఏపీలో మద్యం సీసాకు మధ్య రూ.వంద వరకు వ్యత్యాసం ఉందని.. ఆ సొమ్ము ఎక్కడికి వెళ్లిందో సాక్ష్యాలను ప్రజలంతా చూస్తున్నారని చెప్పారు. దోపిడీ మూలంగా గత ప్రభుత్వం అవినీతి కేసులను ఎదుర్కోలేక అక్రమ కేసులు అంటున్నారని.. ఏ విధంగా అక్రమమో ప్రజలకు చెప్పాలని పయ్యావుల కేశవ్ కోరారు. టన్నుల కొలదీ బంగారం కొనుగోలు చేయడం, అలాగే రూ.కోట్ల నోట్ల కట్టలతో వైకాపా నేత వెంకటేశ్‌నాయుడు దొరకడం వంటివి అక్రమం కాదా? అని మంత్రి ప్రశ్నించారు. పేదోడు రూ.వెయ్యి సంపాదించాలంటే కష్టంగా మారిన నేడు.. రూ.కోట్లు కట్టలు కట్టలుగా ప్యాలెస్‌లకు తరలించారంటే ఏమిటనేది ప్రజలు అర్థం చేసుకుంటున్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రజలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా మెరుగైన పాలన అందిస్తోందన్నారు.

నగర శివార్లలో ట్రాఫిక్ రద్దీ తగ్గింపుపై సీఆర్డీఏ ప్రణాళిక

ఈనాడు, అమరావతి



విజయవాడ నగర శివారు ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు సీఆర్డీఏ ప్రణాళికలను సిద్ధం చేసింది. కీలకమైన ప్రత్యామ్నాయ మార్గాలను వీలైనంత మేర విస్తరించనున్నారు. తద్వారా ఎన్‌హెచ్-16, ఎన్‌హెచ్- 65 రహదారులకు ఏ ఇబ్బందీ లేకుండా అనుసంధానించే మార్గం సుగమం అవుతుంది. ఇందుకు సీఆర్డీఏ రూ.100 కోట్లను వెచ్చించనుంది. రాష్ట్ర విభజన తర్వాత పాలన మొత్తం ఇక్కడే కేంద్రీకృతం కావడంతో అవసరాలకు తగ్గట్లుగా నగర రోడ్లు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలకు రోడ్ల విస్తరణతో సీఆర్డీఏ చెక్ పెట్టనుంది.

ఆరు ప్రత్యామ్నాయ మార్గాలు సిద్ధం...

ఎనికేపాడు, రామవరప్పాడు, పోరంకి, తదితర నగర శివారు ప్రాంతాలపై నగర ట్రాఫిక్ ప్రభావం అధికంగా ఉంటోంది. ఈ ప్రాంతాల్లో రద్దీ వేళల్లో వాహనాలు బారులు తీరుతున్నాయి. కొద్ది దూరానికే ఎక్కువ సమయం పడుతోంది. ఈ రద్దీలో వీఐపీల వాహనాలూ చిక్కుకుంటున్నాయి. ఆటోనగర్‌కు నిత్యం వచ్చే భారీ వాహనాలతో ఈ సమస్య రెట్టింపు అవుతోంది. ప్రస్తుతం భారీ వాహనాలను రాత్రుళ్లే అనుమతిస్తున్నారు. త్వరలో మెట్రో రైలు పనులు మొదలవనున్నాయి. దీంతో ట్రాఫిక్ కష్టాలు మరింత పెరిగే వీలుంది.

❖ బల్లెం వారి వీధి రోడ్డును విస్తరించడంతోపాటు నిడమానూరు-పోరంకి మార్గాన్ని కూడా భారీ వాహనాలు తిరిగేలా విస్తరించనున్నారు. ఇవే కాకుండా ఎనికేపాడు, ప్రసాదంపాడును కనెక్ట్ చేసేలా హైటెన్షన్ రోడ్డు నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశారు. దీంతో ఆటోనగర్‌కు భారీ వాహనాలు నిరంతరం రాకపోకలు సాగించేందుకు వీలు కలుగుతుంది. నగరానికి జీవనాడి అయిన జవహర్ ఆటోనగర్‌కు ఇప్పటి వరకు భారీ వాహనాలు రాకపోకలు సాగించేందుకు సరైన రోడ్డు సదుపాయం లేక సమస్యగా మారింది. కొత్త రోడ్ల నిర్మాణం, విస్తరణతో భారీ వాహనాలు నగరంలోకి ప్రవేశించకుండా ఇతర మార్గాల్లో ఆటోనగర్‌కు వెళ్లే అవకాశాలు ఉన్నాయి.

గురువులు వచ్చేస్తున్నారోచ్..

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : డీఎస్సీ పరీక్షా ఫలితాలు సోమవారం రాత్రి విడుదల అయ్యాయి. అభ్యర్థుల స్కోర్ కార్డులు వారి లాగిన్‌లోకి వచ్చాయి. అత్యధిక మార్కులు సాధించిన అభ్యర్థులు ఉపాధ్యాయ కొలువు సాధించామనే ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో మొత్తం 1208 ఉపాధ్యాయ ఖాళీలున్నాయి. ప్రభుత్వ జిల్లా పరిషత్, ఎంపీపీ, మున్సిపల్ పాఠశాలలన్నింటిలో కలిపి స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) 663, సెకెండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్‌జీటీ) 545 పోస్టులున్నాయి. ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ఐదు ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీలో భర్తీ చేయనున్నారు. ఆయా పోస్టులకు ఉమ్మడి కృష్ణా జిల్లాలో 67,470 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. ఎవరికి ఎక్కువ మార్కులు వచ్చాయి. ఎవరికి పోస్టు వస్తుంది తదితర వివరాలపై మంగళవారం స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



❖ ఎస్‌జీటీలో విజయవాడ కృష్ణలంకకు చెందిన **కె.వి.డి భవాని** 94.39 మార్కులు సాధించారు. ఉపాధ్యాయ వృత్తి అంటే తనకు ఆసక్తి అని, రైల్వే ఉద్యోగం వచ్చినా వెళ్లలేదని ఆమె చెబుతున్నారు. ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదవడమే విజయానికి కారణమని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు.



❖ విజయవాడ గుణదలకు చెందిన **వై.నాగ సాయి వైదేహి** ఎస్‌జీటీలో 91.31 మార్కులు సాధించారు. ప్రత్యేక శిక్షణ తీసుకోవడం, సాధన చేయడం వల్ల కొలువు సాధనకు మార్గం సుగమమైందని వైదేహి తెలిపారు.

డాక్యుమెంట్స్ పోయినవి

కృష్ణా జిల్లా, తిరువూరు సబ్ రిజిస్ట్రార్ పరిధిలో చేర్చి ఉన్న ఎ.కొండూరు మండలంలోని కంభంపాడు గ్రామం నందు మాకు ఉన్న స్థిరాస్తి తాలూకు ఒరిజినల్ డాక్యుమెంట్ నెం: 2085/1999, మార్చి నెల 7 మరియు 8వ తేదీలలో కంభంపాడు గ్రామ సచివాలయము ప్రాంతమున పన్ను విధించుటకు అప్లికేషన్ ఇచ్చుటకు కంభంపాడులోని మా నివాసం నుండి గ్రామ సచివాలయంకు వెళ్ళు మార్గంలో పోయినవి. దొరికిన వారు సంప్రదించండి. వారికి తగిన పారితోషికం ఇవ్వబడును.

✆ 98853 72555

(c) eenadu

సరదా కారాదు.... విషాదం



ప్రకాశం బ్యారేజీ దిగువకు విడుదల అవుతున్న వరదనీటికి ఎదురెళ్లి ఈతకొడుతూ..



ప్రమాదమని తెలియక ఈత కోసం నదిలోకి దిగిన చిన్నారులు

చిన్నపాటి ఈత సరదా జీవితాన్ని బలికోరుకుంటే కుటుంబం మొత్తం శోక సంద్రంలో మునిగిపోవాలి. వరదనీరు పోటెత్తుతుండడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద గేట్లు అన్నీ ఎత్తి నీటిని దిగువకు వదిలేస్తున్నారు. బ్యారేజీ దిగువన కృష్ణానది మధ్యలో ఇసుక తిన్నెల వద్ద కొంత మంది ప్రమాదమని తెలిసి కూడా వెళ్లి స్నానాలు చేస్తున్నారు. బ్యారేజీ నుంచి దిగువకు ప్రవహిస్తున్న నీటి ప్రవాహానికి ఎదురెళ్లి ఈత కొడుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. అక్రమంగా కొందరు నదిలో ఇసుక తవ్వేయడంతో భారీగా గోతులు ఏర్పడ్డాయి. ఇప్పుడు ఆ గోతులన్నీ వరద నీటితో నిండిపోవడంతో ఎక్కడ ప్రమాదం పొంచి ఉందో ఊహించలేని పరిస్థితి. **-ఈనాడు, అమరావతి**

పేదలకు మార్గదర్శకులు కావాలి

పొట్టిపాడు(గన్నవరం గ్రామీణం), న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు తలపెట్టిన పీ4లో సంపన్నులు భాగస్వాములై పేదలకు మార్గదర్శకులు కావాలని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పిలుపునిచ్చారు. ఉంగుటూరు మండలం పొట్టిపాడులో ఎటువంటి లాభాపేక్ష లేకుండా సమాజం కోసం వన్ వే మిషన్, స్టార్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్మించిన 'పొట్టిపాడు ఫంక్షన్ హాలు'ను స్టార్ హాస్పిటల్స్ ఎండీ గూడపాటి రమేష్, స్థల దాత వన్ వే మిషన్ నిర్వాహకులు జోయల్ కొడాలి, పంచాయతీరాజ్ శాఖ విశ్రాంత చీఫ్ ఇంజినీర్ గూడపాటి సీతారామస్వామి, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావులతో కలిసి మంత్రి సోమవారం ప్రారంభించారు. పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ రాష్ట్రం రూ.లక్షల కోట్ల అప్పుల్లో ఉన్నప్పటికీ తల్లి కుటుంబాన్ని నడిపినట్లు ప్రభుత్వాన్ని నడుపుతున్నామన్నారు. పేదలను ఆర్థికంగా ప్రోత్సహించేందుకు తమవంతు కృషి చేయాలని సూచించారు. నియోజకవర్గ అభివృద్ధికి యార్లగడ్డకు సహకరించాలని తెలిపారు. స్థలదాత వన్ వే మిషన్ అందించిన 9.5 సెంట్లలో రూ.70 లక్షల స్టార్ హాస్పిటల్స్ హైదరాబాద్ నిధులు, గ్రామానికి చెందిన దాతలు అందించిన రూ.25 లక్షలతో ఫంక్షన్ హాలు నిర్మించారు. గూడపాటి రమేష్, జోయల్ కొడాలి బృందాన్ని ఆర్థికమంత్రి అభినందించారు. దాతలను ఘనంగా సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ఫంక్షన్ హాలును ప్రారంభిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్, పక్కన ఎమ్మెల్యే యార్లగడ్డ, స్టార్ హాస్పిటల్స్ ఎండీ రమేష్, స్థల దాత జోయల్ కొడాలి, విశ్రాంత చీఫ్ ఇంజినీర్ సీతారామస్వామి

క్లిష్టతర వైద్యానికి డాక్ బాక్స్ పరిజ్ఞానం దోహదం

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: ఆయుష్మాన్ భారత్ లక్ష్యంలో భాగంగా కృత్రిమ మేధ సాంకేతికతను క్లిష్టతర వైద్య విధానంలో అందించడానికి డాక్ బాక్స్ పరిజ్ఞానం దోహదపడుతుందని ఆయుష్ హాస్పిటల్స్ ఛైర్మన్ వై.రమేష్ బాబు అన్నారు. రాష్ట్రంలోనే ప్రప్రథమంగా అమెరికా కేర్ ఫ్యూయెన్స్ సహకారంతో 'డాక్ బాక్స్' పరిజ్ఞానాన్ని ఆస్పత్రిలో సోమవారం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రిలోని ప్రతి విభాగంలో సంక్లిష్ట రోగులకు డాక్ బాక్స్ అమర్చితే ఆరోగ్య పర్యవేక్షణ, భద్రత పెరుగుతుందని చెప్పారు. ఎప్పటికప్పుడు రోగిని ఎక్కడి నుంచైనా పరిశీలించవచ్చని తెలిపారు. తొలుత ఆస్పత్రిలో 5 విభాగాల్లో 5 డాక్ బాక్స్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆస్పత్రిలోని మొత్తం పడకల్లో 70 శాతం క్రిటికల్ కేర్ రోగుల భద్రతకు అందుబాటులో ఉంచుతున్నట్లు వెల్లడించారు. డాక్ బాక్స్ వ్యవస్థాపకుడు లాయిడ్ విలియమ్స్ మాట్లాడుతూ.. కృత్రిమ మేధ సాయంతో పని చేసే ఆధునిక సాంకేతికతను ఆయుష్ ఆస్పత్రి అందిపుచ్చుకోవడం అభినందనీయమని అన్నారు. ఈ పరికరం ద్వారా వైద్యులు క్షణాల్లో నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని చెప్పారు. రోగుల అత్యవసర డేటా ఒకే చోట నిక్షిప్తం కావడంతో వైద్యులు వెంటనే చికిత్స అందించే వీలుంటుందని తెలిపారు. దీని ద్వారా మరణాల రేటు తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఆస్పత్రి నిర్వహణ కమిటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ పీఎస్ఎస్ చౌదరి మాట్లాడుతూ.. వెంటిలేటర్‌పై ఉన్న రోగులకు డాక్ బాక్స్ మానటరింగ్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఆస్పత్రి పరిపాలన అధికారి మేడా జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



యంత్రం వద్ద రమేష్ బాబు, లాయిడ్ విలియమ్స్ తదితరులు

రైల్వే శాఖ నుంచి నిధుల మంజూరుకు వినతి

పటమట, న్యూస్‌టుడే: పార్లమెంట్‌లోని ప్రధాని కార్యాలయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని సోమవారం సహచర ఎంపీలతో కలిసి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులకు అవసరమైన రూ.850 కోట్ల నిధులు నీతి ఆయోగ్ ఆమోదం పొందేలా చేసినందుకు మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నీతి ఆయోగ్ ఆమోదం తెలిపిన నిధులు రైల్వే శాఖ నుంచి త్వరితగతిన మంజూరు చేయించాలని కోరారు.

16న దసరా ఉత్సవాల నిర్వహణపై సమీక్ష సమావేశం

ఇంద్రకీలాద్రి: శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహించే దసరా ఉత్సవాలపై ఈ నెల 16న ఇంద్రకీలాద్రిపై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఉత్సవాల నిర్వహణపై అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ లక్ష్మీశ స్వయంగా దుర్గగుడిని సందర్శించి అధికారులు చేపడుతున్న ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 16న నిర్వహించే సమావేశంలో మంత్రితో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీ కూడా పాల్గొనే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

పీజీ డెంటల్ మాప్‌అప్ రౌండ్‌కు ఐచ్ఛికాలు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని దంత వైద్య కళాశాలల్లో పీజీ డెంటల్ (డిగ్రీ/డిప్లొమా) సీట్ల భర్తీకి (రెండో విడత కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన కన్వీనర్/యాజమాన్య కోటా సీట్లు) మాప్‌అప్ రౌండ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 11వ తేదీ సోమవారం రాత్రి 7 గంటల నుంచి 13వ తేదీ రాత్రి 7 గంటలలోగా ఐచ్ఛికాలు పెట్టుకోవాలని సూచించారు. ఎండీఎస్ కన్వీనర్ కోటాలో 38 సీట్లు, యాజమాన్య కోటాలో 104 సీట్లు మాప్‌అప్ రౌండుకు అందుబాటులో ఉంచామని ఆమె తెలిపారు.

పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

విజయవాడ సిటీ: ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం ప్రకారం 2025-26 విద్యా సంవత్సరంలో జిల్లాలోని ప్రైవేట్, అన్ ఎయిడెడ్, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం ప్రవేశాలు పొందేందుకు ప్రభుత్వం మరోసారి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించిందని డీఈవో యు.వి.సుబ్బారావు సోమవారం తెలిపారు. అర్హులైన పేద విద్యార్థులు ఒకటో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 20వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం ఈ నెల 25న లాటరీ ఫలితాలు విడుదల చేసి, ఈ నెల 31న పాఠశాలల ద్వారా ప్రవేశాల నిర్ధారణ ఉంటుందని తెలిపారు.

ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా రెపరెపలాడాలి

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : దేశభక్తిని చాటి చెప్పేలా జాతీయ జెండా ప్రతి ఇంటిపై రెపరెపలాడాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని సోమవారం పాత ప్రభుత్వ ఆస్పత్రి నుంచి జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. దేశ సరిహద్దుల్లో సైనికుల త్యాగాలు చిరస్మరణీయమని, ఆపరేషన్ సిందూర్ దేశ సత్తాను చాటిచెప్పిందన్నారు. దేశ సమగ్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం చేపట్టిన ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. అమరవీరుల బలిదానం, నేటి స్వేచ్ఛాభారతం, త్రివర్ణ పతాకం, ఐకమత్యానికి సంకేత నినాదాలతో ర్యాలీ ఉత్సాహంగా సాగింది. మనం అనుభవిస్తున్న ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఎందరో మహనీయుల త్యాగ ఫలితమని సీపీ రాజశేఖరబాబు అన్నారు. మహనీయులను స్మరిస్తూ ముందుకు సాగాలని మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. రెవెన్యూ, పోలీస్, యువజన సంక్షేమం, వైద్య, ఆరోగ్యం తదితర శాఖల అధికారులు, సిబ్బందితో పాటు వాకర్స్ క్లబ్, వివిధ అసోసియేషన్లు, కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా ప్రదర్శనలో ముందుకుసాగారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు, ఆర్డీవో కావూరి చైతన్య, జిల్లా యువజన సంక్షేమాధికారి యు.శ్రీనివాసరావు, అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, ఏఎన్వీ నాంచారయ్య, డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని, జిల్లా క్రీడల అభివృద్ధి ఎస్.ఎ.అజీజ్, కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనలో కలెక్టర్ లక్ష్మీశ, కమిషనర్ ధ్యానచంద్ర తదితరులు

చవితి పందిళ్లకు సింగిల్ విండో పద్ధతిలో అనుమతి ఇవ్వండి

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : రాబోయే వినాయక ఉత్సవాలకు నిబంధనలు విధించకుండా గణేష్ మండపం నిర్వాహకులు ఇచ్చే విజ్ఞాపన పత్రాల ఆధారంగా ఎలాంటి రుసుము తీసుకోకుండా సింగిల్ విండో పద్ధతిలో అన్ని అనుమతులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు రమణకుమార్, ప్రధాన కార్యదర్శి పాకాల త్రినాథ్, కార్యదర్శి వి.దుర్గాప్రసాద్ రాజు, ప్రభుత్వ విభాగాల సమన్వయ ఇన్‌ఛార్జి గొట్టిపాటి రామకృష్ణప్రసాద్ కోరారు. సోమవారం సచివాలయంలో రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను కలిసి వినతి పత్రాలు అందజేశారు. మండపాలకు ఉచిత విద్యుత్తు ఇవ్వాలని, నిమజ్జన శోభాయాత్ర రోజున ప్రత్యేక అలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, డీజేకి అనుమతి ఇవ్వాలని, నిమజ్జన స్థలంలో క్రేను, భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు.



మంత్రి అనితకు వినతి పత్రం అందజేస్తున్న గంగరాజు, ఆంజనేయులు, రామకృష్ణ ప్రసాద్ తదితరులు

17న బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నగరంలోని కేంద్రీయ విద్యాలయ నం:1 మైదానంలో ఈ నెల 17వ తేదీన ఉమ్మడి కృష్ణా జిల్లా సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికలు, సీనియర్ (స్త్రీ, పురుషుల) బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి పి.బాలాజీ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 94401 35193, 70137 54776 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని చెప్పారు.

జిల్లాలో పలు మండలాల్లో వర్షం

ఎన్టీఆర్ కలెక్టరేట్: జిల్లాలోని పలు మండలాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు నమోదైన వివరాలు ఇలా ఉన్నాయి. జగ్గయ్యపేట 78.8 మి.మీ., ఇబ్రహీంపట్నం 63.6, వత్సవాయి 23.6, పెనుగంచిప్రోలు 22.8, తిరువూరు 22.6, గంపలగూడెం 21, కంచికచర్ల 10, వీరులపాడు 3.2, నందిగామ 2.4, చందర్లపాడులో 2.2 మిల్లీ మీటర్ల మేర వర్షం పడింది.

రెవెన్యూ అంశాల వినతులే ఎక్కువ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా నేతృత్వంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 126 వినతి పత్రాలు స్వీకరించారు. వీటిలో అధికంగా రెవెన్యూ శాఖకు 36 అర్జీలు అందినట్లు జేసీ పేర్కొన్నారు. పోలీస్ 20, డీఈవో 16, వీఎంసీ 9, సర్వే 7, ఏపీ సీపీ డీసీఎల్ 5, రిజిస్ట్రేషన్ శాఖకు నాలుగు చొప్పున వచ్చాయి. విభిన్న ప్రతిభావంతులు, డీఎంహెచ్‌వో, డీఆర్డీఏలకు మూడేసి, పౌరసరఫరాలు, ఎంపీడీవోలకు, ఆర్ఐవో (ఇంటర్)లకు రెండేసి అందాయి. డీసీహెచ్ఎస్, డీసీవో, జలవనరులు, గృహాలు, పరిశ్రమలు, మైనార్టీ, ఆర్అండ్‌బీ, సాంఘిక సంక్షేమ తదితర శాఖలకు ఒక్కొక్కటి చొప్పున వినతి పత్రాలు వచ్చాయి. వీటిని గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను జేసీ ఆదేశించారు. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, గ్రామ/వార్డు సచివాలయాల జిల్లా అధికారిణి జి.జ్యోతి, కేఆర్సీ డిప్యూటీ కలెక్టర్ కె.పోసిబాబు, ఏసీపీ కె.వెంకటేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జేసీ ఇలక్కియా

ఏపీటీడీసీ హోటళ్ల ప్రైవేటీకరణ వద్దు



ఆటోనగర్‌లోని రాష్ట్ర కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులు

భవానీపురం, న్యూస్‌టుడే: ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ)కి చెందిన హోటళ్లను ప్రైవేటీకరణ చేయవద్దని ఆ శాఖ ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులు విజయవాడ ఆటోనగర్‌లోని ఏపీటీడీసీ రాష్ట్ర కార్యాలయం వద్ద సోమవారం సాయంత్రం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా సంస్థనే నమ్ముకుని ఉన్నామని, ప్రస్తుతం ప్రైవేటీకరణ చేస్తే అందరూ రోడ్డున పడతారని వాపోయారు. ప్రైవేటీకరణ చేయడం వల్ల సంస్థకు ఆర్థికంగా నష్టంగా మారే అవకాశం ఉందన్నారు. ఇటీవల ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 23ను ఉపసంహరించుకోవాలని కోరారు. ప్రైవేటు సంస్థలకు కట్టబెడితే ఉద్యోగులకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రైవేటు సంస్థల చేతుల్లో ఉన్న హోటల్స్ నుంచి అద్దెల రూపేణా రూ.కోట్లు రావాల్సి ఉందని తెలిపారు. తిరిగి ప్రస్తుతం ఉన్న హోటల్స్‌నే ప్రైవేటు సంస్థలకు కట్టబెడితే వారు అద్దెలు ఇచ్చే అవకాశం లేదని వెల్లడించారు. రూ.కోట్లు విలువైన సంస్థ ఆస్తులను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టడం తగదని పేర్కొన్నారు. ఉద్యోగులు కార్యాలయం వద్ద బైఠాయించి ప్లకార్డులతో నిరసన తెలిపారు. ☛ అంతకుముందు భవానీపురంలోని హరిత బరంపార్కు సమావేశ మందిరంలో ఏపీటీడీసీ ఛైర్మన్ నూకసాని బాలాజీ, డైరెక్టర్లతో ఉద్యోగులు సమావేశమయ్యారు. ప్రైవేటు పరం చేయాలనే ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లుగా తెలిపారు. దీనిపై ఛైర్మన్ బాలాజీ స్పందిస్తూ ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని పేర్కొన్నారు.

ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వైరా, కట్టలేరు



కూడలి వద్ద చప్టా మీదుగా ప్రవహిస్తున్న వరద

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని దాములూరు శివారు కూడలి వద్ద సోమవారం వైరా, కట్టలేరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. కూడలి-పల్లంపల్లి గ్రామాల మధ్య లో లెవెల్ కాజ్‌వే (చప్టా) మీదుగా వరద ప్రవాహం పెరగడంతో నందిగామ - వీరులపాడు మండలాల్లోని 40 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ద్విచక్ర వాహన చోదకులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఎగువున తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు వైరా ఏటికి భారీగా వరద వస్తోంది. వర్షాకాలం తరచూ చప్టా మీదుగా వరద ప్రవహించడంతో ఏటి ఒడ్డు పొలాలకు వెళ్లడానికి వీలు పడక దాములూరు రైతులు ఇబ్బంది పడుతున్నారు. కూడలి వద్ద ఇటీవల వరద ప్రవాహంలో ద్విచక్ర వాహనచోదకుడు కొట్టుకుపోయి ప్రాణాలతో బయటపడ్డారు. వరద నీటిలోకి ఎవరూ వెళ్లకుండా రెవెన్యూ, పోలీసు అధికారులు భద్రతా చర్యలు పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తనపై విచారణ

చందర్లపాడు, న్యూస్‌టుడే: చందర్లపాడు ఉన్నత పాఠశాలలో బాలికల పట్ల ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తించినట్లు వచ్చిన ఆరోపణలపై నందిగామ డీవైఈవో సాంబశివరావు సోమవారం విచారణ చేశారు. గత ఏడాది పాఠశాలలో పని చేసి ఇటీవల అదే గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు దురుసుగా, అసభ్యకరంగా ప్రవర్తించినట్లు తొమ్మిదో తరగతి విద్యార్థినులు పాఠశాలలో సోషల్ ఆడిట్ చేయడానికి వచ్చిన సభ్యులకు ఫిర్యాదు చేశారు. విషయాన్ని నాటి ప్రధానోపాధ్యాయిని దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిసింది. ఇటీవల విజయవాడలో సోషల్ ఆడిట్ రిపోర్టుపై ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఆ సమయంలో విషయం ప్రస్తావించగా ఘటన వెలుగులోకి వచ్చింది. దీనిపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించడంతో డీవైఈవో పాఠశాలకు వచ్చారు. ఉపాధ్యాయులు, బాలికలు, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుడు, గతంలో పనిచేసిన ప్రధానోపాధ్యాయినితో వేర్వేరుగా మాట్లాడి వివరాలు సేకరించారు. లిఖితపూర్వక స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. తుది నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. ఎంఈవో శ్యాంబాబు, సీనియర్ అసిస్టెంట్ హరినాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుడి వద్ద వివరాలు సేకరిస్తున్న డీవైఈవో

వంశీ బెయిల్ షరతుల సడలింపు కేసు 14కు వాయిదా

విజయవాడ (సూర్యారావుపేట), న్యూస్‌టుడే : సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో నిందితుడైన మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ బెయిల్ షరతుల సడలింపుపై విజయవాడ అనిశా న్యాయస్థానం సోమవారం విచారణ చేపట్టింది. ఈ కేసులో అనిశా న్యాయస్థానం కొన్ని షరతులు విధిస్తూ వంశీకి బెయిల్ ఇచ్చింది. ప్రతి శనివారం పటమట పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేయాలని.. ఇలా పలు షరతులు పెట్టి బెయిల్ మంజూరు చేసింది. అలాగే వంశీపై మరికొన్ని పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల్లోనూ బెయిల్ వచ్చింది. అయితే ప్రతి రోజూ ఏదో ఒక స్టేషన్‌కు వెళ్లి సంతకాలు చేయాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నానని, ఆరోగ్యం కూడా సరిగా ఉండడం లేదని.. బెయిల్ షరతుల్లో సడలింపు ఇవ్వాలని కోరుతూ ఆయన పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ సోమవారం విచారణకు వచ్చింది. అనంతరం ఈ కేసును ఈ నెల 14తేదీకి వాయిదా వేస్తూ న్యాయాధికారి ఉత్తర్వులు జారీ చేశారు.

ఏటీఎం కార్డు మార్చి.. రూ.50 వేలు స్వాహా

విజయవాడ బస్టేషన్, న్యూస్‌టుడే: ఏటీఎంలో నగదు తీసుకుంటున్న మహిళ నుంచి గుర్తుతెలియని వ్యక్తి కార్డు మార్చి సొమ్ము విత్‌డ్రా చేసి ఉడాయించిన ఘటన విజయవాడ పండిట్ నెహ్రూ బస్టేషన్‌లోని డిపార్చర్ బ్లాక్‌లో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం వద్ద సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. అవుట్‌పోస్ట్ పోలీసు సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం సాకించర్లకు చెందిన కాకు సుశీలమ్మ, సుబ్బారావు(విశ్రాంత బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి)లు దంపతులు కాగా.. కుటుంబ సమస్యలు నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిసేందుకు మంగళగిరి జనసేన కేంద్ర కార్యాలయానికి వచ్చారు. ఆయన అందుబాటులో లేరని అక్కడి సిబ్బంది చెప్పడంతో తిరిగి తమ స్వగ్రామానికి వెళ్లేందుకు విజయవాడ బస్టేషన్‌కు వచ్చి అక్కడ ఏటీఎంలో రూ.5 వేలు విత్‌డ్రా చేశారు. ఈ క్రమంలో ఆమెను అనుసరించిన గుర్తుతెలియని వ్యక్తి.. ఆమె వెనుకే ఉండి పిన్ నంబరు గమనించాడు. సుశీలమ్మ నగదు విత్‌డ్రా చేసిన అనంతరం వెంటనే బ్యాలెన్స్ చెక్ చేసి ఆమె కార్డును తీసుకున్నాడు. తన కార్డు ఎందుకు తీసుకుంటున్నావు? అని ప్రశ్నించడంతో వెంటనే తన వద్ద ఉన్న జయభారతి పేరుతో ఉన్న మరో కార్డు ఆమెకు ఇచ్చాడు. అనంతరం కొంత సేపటికి బ్యాంకు ఖాతా నుంచి రూ.50 వేల నగదు విత్‌డ్రా అయినట్లు చరవాణికి సంక్షిప్త సందేశం రావడంతో అవాక్కయిన బాధిత మహిళ బస్టేషన్‌లోని అవుట్‌పోస్ట్ పోలీసుకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాలను పరిశీలించగా నిందితుడు ఆమెను అనుసరించి వెళుతున్నట్లు గమనించారు.

ధర వరలు



వంకాయలు-18, టమాటా-48, బెండ-18, పచ్చిమిర్చి-44, కాకర-24, బీర-24/26, క్యాబేజి-22, క్యారెట్-34/46, దొండ-20, బంగాళదుంప-28, ఉల్లిపాయలు-25, గోరు చిక్కుళ్లు-26, దోస-18, సొర-10/12, పొట్ల-20, అరటికాయ-8/7, చామదుంప-28, అల్లం-85, మునగ-5/4, ఆకు కూరలు (కట్ట)-3/8, కంద-38, బీట్ రూట్-30, కీరదోస-38, బీన్స్-74, క్యాప్సికమ్-72, నిమ్మ (డజను)-18/24, కొత్తిమీర-8/15, పుదీనా-5/14, ముల్లంగి-10, పచ్చిమామిడి-13/15 (నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి.
- ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ

బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.ల్లో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -109 రిటైల్ ధర 131 చికెన్ విత్ స్కిన్ - 190, చికెన్ స్కిన్‌లెస్ - 216. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 117, 125, 196 చికెన్ విత్ స్కిన్ - 222 చికెన్ స్కిన్‌లెస్ - 232.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 520 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.99/-.

బస్సు ఢీకొని ఏఈ దుర్మరణం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నుంచి ముక్త్యాల వెళ్లే మార్గంలో అలకనంద ఘాట్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో జెన్‌కో ఏఈ శ్రీకటి శివరాజు(25) మృతి చెందారు. చిల్లకల్లు ఎస్ఐ సూర్యశ్రీనివాస్ కథనం ప్రకారం.. నారాయణపేట జిల్లా ఊటుకూర్ మండలం బిజ్‌వార్ గ్రామానికి చెందిన శివరాజు టీఎస్ జెన్‌కోలో ఏఈగా పని చేస్తూ.. జగ్గయ్యపేటలో నివాసం ఉంటున్నారు. శివరాజు సోమవారం ఉదయం పులిచింతల ప్రాజెక్టులోని టీఎస్ జెన్‌కోకు వెళ్తుండగా ఒక ప్రైవేట్ కర్మాగార బస్సు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే పోలీసులు అతడిని జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

తిరంగా జెండా పండగలో మేము సైతం...

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం: విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం అనుబంధ వైద్య, దంత, ఆయుర్వేద, హోమియో, నర్సింగ్, పారా మెడికల్ కళాశాలల్లో 'హర్ ఘర్ తిరంగా-2025' కార్యక్రమాన్ని నిర్వహించాలని ఉప కులపతి డాక్టర్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్‌కు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఎన్ఎస్ఎస్ యూనిట్లు జెండా పండగలో భాగస్వామ్యులు కావాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 500 కళాశాలలు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా పని చేస్తున్నాయి. విశ్వవిద్యాలయంలోని ఉద్యోగులకు క్యాడర్ల వారీగా ఆగస్టు 15న అభినందన పత్రాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు వీసీ తెలిపారు.

91.9 FM Vijayawada

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. సంప్ర: 81422 92071.

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). సంప్ర: ✆ 87907 41166.

BUILDING CONSTRUCTION

AP LRS - 2025 ద్వారా నాన్ లేఅవుట్ స్థలాలు ఓపెన్ స్పేస్‌పై 50% మరియు వచ్చిన మొత్తంపై అదనంగా 10% తగ్గింపుతో క్రమబద్ధీకరించేందుకు ఇదే సువర్ణావకాశం. Arciscon Infra Tech Architects & Engineers (AP & TG). Ph: +91 94917 55456.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EDUCATION

Prabhas Colleges, VJA: Regular/ Dist/ Online: MBA, MCA, MA, M.Com, M.Sc, BCA, BBA, B.Sc, BA, ADMS. L.D: 10-08-2025. Ph: 99634 72800, 99634 72819, 94935 32525.

విజయవాడలో ICAR సిలబస్‌తో B.Sc., అగ్రికల్చర్ - 4 సం|| మంచి ఉద్యోగాలు గల B.Sc.; Forensic Science; B.Sc. Cyber Forensics: BBA - Aviation Management - 3 సం|| కోర్సులు కలవు. ఇంటర్ మార్క్స్‌తో డైరెక్ట్ అడ్మిషన్లు సంప్ర: 99121 78237, 79891 00323.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్ (AP No: 1) VJA వృద్ధులకు, పేషెంట్ల సేవకు, ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 95420 36677, 95420 85588.

స్వామి వివేకానంద గ్రూప్. (AP No:1) VJA. వృద్ధులకు, పేషంట్ల సేవకు ఇంటి / వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 96767 01122, 97047 21122.

శ్రీనివాస గ్రూప్ (AP No:1) VJA. వృద్ధులకు, పేషంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 96401 76677, 95539 09955.

REAL ESTATE

FLAT FOR SALE

విజయవాడ, పడమట సెంటర్ నల్లూరివారి వీధిలో, రాధాకృష్ణ టవర్స్ అపార్ట్‌మెంట్‌లో B బ్లాక్, F5, 3BHK Flat అమ్మబడును. Ph: 9642114333 చలసాని శివ.

JOBS

(MS) ఆఫీస్‌లో అనుభవం కలిగిన (ఫిమేల్) టెలికాలర్స్ కావలెను. ICICI, IDFC, Kotak బ్యాంక్స్ కలెక్షన్ ఏజెన్సీలో పనిచేయుటకు జీతం - 15000 & ఇన్సెంటివ్. Ph: 98855 96666.

ప్రముఖ బ్యాంక్స్ కలెక్షన్ ఏజెన్సీలో పనిచేయుటకు ఎగ్జిక్యూటివ్స్ & టీం లీడర్స్ & మేనేజర్స్ కావలెను. అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత. Cell: 98855 96666.

Excellent opportunity for Freshers B.Tech ECE, EEE, Mech, IT, C.Sc. Walk -in - interview 11,12,13,14, August Sunanda Projects Pvt.Ltd. Hyderabad. 82475 35017, 9649 70707, 95057 84569.

స్వామి వివేకానంద గ్రూపు VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు 10th చదివిన వర్కర్లు కావలెను. భో.వ+జీతం: 18-20 వేలు. ఏజెంట్లకు 5,000/- కమీషన్. ✆ 96528 31122, 99590 21122.

రామకృష్ణ గ్రూపు VJA, Hyd, న్యూఢిల్లీ కొరకు టెలీకాలర్స్, కస్టమర్ కేర్ మరియు అన్నిరకాల ఆఫీస్ స్టాఫ్ స్త్రీ/పు కావలెను. భో.వ+మంచి జీతం. ఇంటర్వ్యూ VJA. ✆ 96769 01122, 99490 21122.

రామకృష్ణ గ్రూపు VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు కావలెను. భో.వ+జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5,000/- కమీషన్ కలదు. ✆ 99590 31122, 99635 21122.

Wanted 2 Nos ITI Civil 0-1 Year Experience for a Property Inspection Company in Vijayawada. Salary 15,000/- Per Month and Incentive. Resume/ CV to be sent to 80951 39555 or dinesh@checkthruinspections.com

Wanted Male Receptionist for Night Shift at Hotel in Enikepadu. Food and Accommodation Available. Ph: ✆ 96421 13443.

కావలెను: Vicks & Tide Company నందు పనిచేయుటకు 1) గోడౌన్ ఇన్‌ఛార్జి, 2) సేల్స్ ఎగ్జిక్యూటివ్, 3) ప్రమోటర్స్ 4) డెలివరీ బాయ్స్. లొకేషన్: విజయవాడ, ముస్తాబాద్. Age: 18 to 45 Yrs. ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటివ్స్. ✆ 82973 12348, 95812 34411.

MEDICAL

కొత్తగా ప్రారంభించబడు హెర్బల్ క్లినిక్‌కు హెర్బల్ డాక్టర్ & హెర్బల్ స్టాఫ్ వెంటనే కావలెను. ఆకర్షణీయమైన జీతము, ఇన్సెంటివ్స్ మరియు వసతి సౌకర్యము కూడా కలదు. డా. M.N. రావు, హిమాయత్ నగర్, హైదరాబాద్. ✆ 9849746252.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹ 1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మారేమండలో సుపరిపాలనలో తొలి అడుగు



కరపత్రాలు అందజేస్తున్న తెదేపా శ్రేణులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: మండలంలోని మారేమండలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం తెదేపా మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి సంక్షేమం, అభివృద్ధిపై అవగాహన కల్పించారు. చాట్ల బాబురావు, రాజారావు, ముత్తంశెట్టి వంశీరాం పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? ర.భ.కార్యాలయ పక్క రోడ్డులోని మురుగు కాలువల్లో నీరు నిలుస్తోంది, పందులు సంచరిస్తున్నాయి. **- శ్రీకాంత్, మైలవరం.** ✔ కాలువల్లో పూడిక తీసి, మురుగు పారేలా చర్యలు తీసుకుంటాం. **- ఉమామహేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్.** –న్యూస్‌టుడే, మైలవరం

? కొత్తరెడ్డిగూడెం శివారులో తారురోడ్డు మార్జిన్‌లో చెత్త, వ్యర్థాలు పారబోస్తున్నారు. **-స్థానికుడు, గోపి**
✔ పరిశీలించి పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. **-రామారావు, పంచాయతీ కార్యదర్శి.** –న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

ఉచిత యోగా తరగతులు

కొండపల్లి, న్యూస్‌టుడే: శాంతివన్ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొండపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఈ నెల 15 నుంచి సెప్టెంబర్ 7 వరకు ఉదయం, సాయంత్రం ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని యోగా గురువు జనార్దన్ తెలిపారు. ఇందులో సూక్ష్మ వ్యాయామాలు, సూర్యనమస్కారాలు, యోగాసనాలు ఉంటాయన్నారు. శిక్షణ కోరే వారు మరిన్ని వివరాలకు 63014 54859ను సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

మైలవరం, న్యూస్‌టుడే: కేఎల్ విశ్వవిద్యాలయం స్మార్ట్ విలేజ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని చంద్రాల ప్రభుత్వ పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రదర్శన, వ్యాసరచన, క్విజ్ పోటీలు పెట్టి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఇందిర, కల్పన, మెంటార్లు టి.శివ కృష్ణ, బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో వైద్య శిబిరం

విస్సన్నపేట, న్యూస్‌టుడే: తెల్లదేవరపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యుడు డా.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ ఎం.బి.డి శ్యామల పర్యవేక్షణలో నరసాపురంలోని డా.బీఆర్ అంబేడ్కర్ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు, జ్వరాలు రాకుండా విద్యార్థులకు ముందస్తుగా రక్త పరీక్షలు చేసి పలు ఆరోగ్య సూచనలు చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ ఐ.తబిత, హెల్త్ సూపర్‌వైజర్ సునీత, ఏఎన్ఎంలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అవకాశం ఇవ్వొద్దు.. అప్రమత్తత మరవద్దు

సైబర్ నేరాల నివారణపై అవగాహన సదస్సులో సీఐ చంద్రశేఖర్ సూచన

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో సైబర్ నేరాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి.. వాటి పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఇబ్రహీంపట్నం సీఐ చంద్రశేఖర్ సూచించారు. ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం జూపూడిలోని నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం 'ఈనాడు ఈటీవీ' ఆధ్వర్యంలో సైబర్ నేరాల నివారణపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్ని పలు సూచనలు చేశారు. సైబర్ నేరాల తీరుపై అవగాహన పెంచుకుంటూ నేరగాళ్ల వలలో పడకుండా ఉండాలన్నారు. మన అవసరాలు మనలోని అతి ఉత్సాహం సైబర్ నేరగాళ్లకు నేరం చేయడానికి అవకాశం కలిపిస్తాయని వివరించారు. బ్యాంకులు కంటే ఆన్‌లైన్ ద్వారానే ఆర్థిక కార్యకలాపాలు సాగించేవారినే లక్ష్యంగా చేసుకొని మోసాలు చేస్తున్నారని.. అపరిచిత వ్యక్తులు చరవాణులకు పంపే ఏపీకే ఫైళ్ల లింకులను ఎట్టిపరిస్థితుల్లోనూ తెరవొద్దన్నారు. ఓటీపీ, ఆధార్, పాన్ కార్డు, బ్యాంక్ ఖాతా, ఏటీఎం కార్డులు నవీకరణ చేయాలనే సంక్షిప్త సందేశాలకు స్పందిస్తే నేరగాళ్ల వలలో చిక్కుకున్నట్లేనన్నారు.



మాట్లాడుతున్న సీఐ చంద్రశేఖర్

డిజిటల్ అరెస్టే లేదు..

డిజిటల్ అరెస్టుల పేరుతో డబ్బు చెల్లించాలని బ్లాక్‌మెయిల్ చేస్తుంటారని.. అలాంటి అరెస్టు అనేది లేదన్నారు. ఏ అరెస్టు అయినా స్థానిక పోలీసుల ద్వారానే జరుగుతుందని అవగాహన కల్పించారు. ఏదైనా బ్యాంకు నుంచి ఫోను చేస్తున్నామని కాల్ వస్తే. వివరాలు చెప్పకుండా నేరుగా బ్యాంకుకు వెళ్లి విషయం తెలుసుకోవాలని సూచించారు. కుటుంబ సభ్యులకు కూడా ఇలాంటి నేరాలపై అవగాహన కల్పించాలని కోరారు. లోన్ యాప్స్, హనీట్రాప్, న్యూడ్ కాల్స్, సోషల్ మీడియాలోని డేటాతో పూర్తి అవగాహన కల్పించుకుని తెలివిగా మసులుకోవాలని వివరించారు. కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ అక్బర్ ఖాన్, ఎన్ఎస్ఎస్ విభాగం నిర్వాహకులు వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

ఎంతో అవగాహన వచ్చింది : సానియా, తృతీయ సంవత్సరం



సైబర్ నేరాలపై అవగాహన కలిగింది. వాటి గురించి తెలుసుకుని మరింత జాగ్రత్తగా ఉంటాం. కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు కూడా తెలియజేసి సైబర్ వలలో చిక్కుకోకుండా జాగ్రత్తపడతాం. సంబంధం లేని సమయంలో ఓటీపీలు వస్తే వాటిని ఆలోచించకుండా డిలీట్ చేయాలన్న విషయం ఈ రోజే తెలిసింది.

సామాజిక మాధ్యమాలతో జాగ్రత్త : సూర్య, ద్వితీయ సంవత్సరం



మేమంతా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ యాప్‌లు వినియోగిస్తున్నాం. వాటి వల్ల జాగ్రత్తగా ఉండాలనే విషయం ఈ అవగాహన సదస్సు ద్వారా తెలిసింది. ముఖ్యంగా అనవసరమైన లింక్‌లు పోస్టింగ్‌లను క్లిక్ చేయకూడదని తెలుసుకున్నాం. ఇకపై బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉంటాం.

13న అన్నదాత సుఖీభవ విజయోత్సవ ప్రదర్శన

తిరువూరు, న్యూస్‌టుడే: అన్నదాత సుఖీభవ విజయోత్సవ ప్రదర్శన పట్టణంలో బుధవారం సాయంత్రం 4 గంటలకు బైపాస్ రోడ్డులో అయ్యప్పస్వామి గుడి నుంచి రాజుపేట అష్టలక్ష్మి ఆలయం వరకు నిర్వహిస్తామని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి 200 ట్రాక్టర్లతో రైతులు ప్రదర్శనలో పాల్గొంటారని చెప్పారు. కూటమి నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కంప్యూటర్ బల్లలు.. ప్రింటర్ వితరణ

జి.కొండూరు, న్యూస్‌టుడే: కవులూరు గ్రామంలోని భోగినేని రాజగోపాలరావు పుష్పావతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దాతలు సోమవారం కంప్యూటర్ బల్లలు, ప్రింటర్ వితరణగావించారు. గ్రామానికి చెందిన బొర్రా హనుమంతరావు కుమార్తె గౌతమి రూ.25 వేలతో కంప్యూటర్ బల్ల, ప్రింటర్ సమకూర్చగా, పాఠశాల మాజీ హెచ్ఎం బీ విష్ణువర్ధన్‌రావు మరో కంప్యూటర్ బల్లను ప్రధానోపాధ్యాయుడు జీవీ రామకృష్ణకు అందజేశారు. పాఠశాల యాజమాన్యం దాతలకు కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో పాఠశాల స్టాఫ్ సెక్రటరీ సయ్యద్ అక్బర్‌పాషా, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

మైలవరం, న్యూస్‌టుడే: సహకార సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సూచించారు. మైలవరం పీఏసీఎస్ ఛైర్మన్‌గా కరెడ్ల వెంకట నారాయణ, ఇద్దరు సభ్యులు ఒరుగు వెంకటేశ్వరరావు, భూక్యా కుమారిల ప్రమాణ స్వీకారం కార్యక్రమం సోమవారం సొసైటీ కార్యాలయంలో నిర్వహించారు. ఇందుకు ఆయన హాజరై వారిని అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కుమార్‌రెడ్డి, లీలాప్రసాద్, సీతారామయ్య, చిట్టిబాబు, నరసింహారావు, శోభన్‌బాబు పాల్గొన్నారు.



మైలవరం పీఏసీఎస్ పాలకవర్గంతో ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

జి.కొండూరు: కవులూరు సొసైటీ ఆవరణలో సోమవారం నిర్వహించిన త్రిసభ్య కమిటీ సభ్యుల బాధ్యతల స్వీకారానికి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ హాజరై సొసైటీ అధ్యక్షుడు చెరుకూరి గంగాధర్‌రావు, సభ్యులు నూతక్కి భారతి, బసవబోయిన సాంబశివరావులను అభినందించారు. జంపాల సీతారామయ్య, ఉయ్యూరు వెంకటనరసింహారావు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

కొండపల్లి, న్యూస్‌టుడే: దేశ ఐక్యత చాటేలా ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా రెపరెపలాడాలని భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుకర్‌జీ అన్నారు. హర్ ఘర్ తిరంగా రన్ కార్యక్రమాన్ని కొండపల్లిలో సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంద్రాగస్టు వేడుకల్లో భాగంగా దేశవ్యాప్తంగా హర్ ఘర్ తిరంగాను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా స్థానిక బ్యాంకు కూడలి నుంచి బి.కాలనీ వరకు జాతీయ జెండా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో అడ్డూరి శ్రీరామ్, బాలకోటేశ్వరరావు, రామునాథ రెడ్డి, మాధురి, యుగంధర్, గంగాధర్ పురపాలిక వైస్‌ఛైర్మన్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



హర్‌ఘర్ తిరంగా ప్రదర్శనలో భాజపా, తెదేపా నాయకులు

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలనులో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంపై విద్యార్థులు జాతీయ పతాకాలతో సోమవారం ప్రదర్శన నిర్వహించారు. జాతీయ సమైక్యతను చాటి చెప్పేందుకు ఆగస్టు 15న ప్రతి ఇంటిపైన త్రివర్ణ పతాకం ఎగరవేయాలని ప్రజలకు అవగాహన కల్పించారు. శిర్డీసాయి బాబా సేవా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పెనుగొలనులో జాతీయ పతాకాలతో విద్యార్థులు

పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీల నియామకం



వెంకటేశ్వరరావు (గుళ్లపూడి) | రాజేశ్వరరావు (ఊటుకూరు) | అప్పిరెడ్డి (కనుమూరు) | అజయ్‌బాబు (తునికిపాడు) | శేషగిరిరావు (చినకొమిర) | సత్యనారాయణరావు (గంపలగూడెం) | మురళి (పెనుగొలను)

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని 11 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొణిజెర్ల సంఘానికి ఉత్తర్వులు వెలువడలేదు. ప్రతి పీఏసీఎస్‌కు ఛైర్‌పర్సన్, ఇద్దరు సభ్యులను నియమించారు. ఆరు నెలల కాల పరిమితి లేదా ఎన్నికల నిర్వహించే వరకు ఈ కమిటీలు బాధ్యతలు నిర్వహిస్తాయి.

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఏడు పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎం.హరిబాబు (ఎ.కొండూరు), బి.శంకరరావు (చీమలపాడు) బి.కృష్ణ (గొల్లమందల) సీహెచ్.కృష్ణ (కంభంపాడు) టి.శ్రీనివాసరెడ్డి (పోలిశెట్టిపాడు)లు ఛైర్‌పర్సన్లుగా నియమితులయ్యారు.

తిరువూరు, న్యూస్‌టుడే: మండలంలో 8 పీఏసీఎస్‌లు ఉండగా 7 సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీల నియామకం జరిగింది. ఛైర్‌పర్సన్లగా ఎన్.ప్రమీళ (లక్ష్మీపురం), వి.వెంకటనర్సిరెడ్డి (మునుకుళ్ల), గద్దె అనిల్ (ముష్టికుంట్ల), కె.రఘుప్రవీణ్ (నడిం తిరువూరు) సీహెచ్.పట్టాభిరామన్న (వావిలాల), సీహెచ్.వెంకటేశ్వరరావు (చింతలపాడు)లు నియమితులయ్యారు. మల్లేల సంఘానికి నియమించాల్సి ఉంది.

సామాజిక తనిఖీ గ్రామ సభలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 18వ విడత సామాజిక తనిఖీ గ్రామ సభలు రుద్రవరం, కుదప, అన్నేరావుపేట, నాగులూరు గ్రామాల్లో సోమవారం జరిగినట్లు ఉపాధిహామీ పథకం ఏపీవో వెంకటేశ్వరరావు తెలిపారు. డీఆర్‌పీలు గ్రామాల్లో జరిగిన పనులు వివరాలు, సామాజిక తనిఖీ బృందం పరిశీలించిన పనులను వివరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు వీఎస్ఏలు, మేట్‌లు, ఉపాధిహామీ క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు. మద్దులపర్వ, రెడ్డిగూడెం గ్రామ పంచాయతీల్లో మంగళవారం సామాజిక తనిఖీ గ్రామ సభలు జరుగుతాయని తెలియజేశారు.

శిక్షణతో మంచి బోధన

మైలవరం, న్యూస్‌టుడే: అధ్యాపకులకు శిక్షణ ద్వారా మెరుగైన బోధనకు అవకాశం ఉంటుందని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కె.అప్పారావు పేర్కొన్నారు. కళాశాలలో ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఐదు రోజుల అధ్యాపకుల శిక్షణ కార్యక్రమాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు అంశాలను ఐఐటీ హైదరాబాదు ప్రొఫెసర్ అలోక్‌కుమార్ పాన్ వివరించారు.

దేవస్థానం హుండీల ఆదాయం లెక్కింపు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: వేదాద్రి కృష్ణానదీ తీరంలో వేంచేసియున్న శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని హుండీల ఆదాయం నందిగామ డివిజన్ తనిఖీదారు జి.పవన్‌కల్యాణ్ పర్యవేక్షణలో సోమవారం లెక్కించారు. దేవస్థానంలోని 9 హుండీల ద్వారా రూ.25,85,914, అన్నదాన సత్రం-1 హుండీ ద్వారా రూ.16,398 కలిపి మొత్తం రూ.26,02,312 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో సురేష్‌బాబు తెలిపారు. ❑ శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో తులసిమాలలు, పూలు అమ్మకం, కొబ్బరి చిప్పలు పోగు చేసుకోవడానికి ఏడాది కాలపరిమితికి సోమవారం బహిరంగ వేలం నిర్వహించారు. వేదాద్రికి చెందిన పోతుమర్రి నరేంద్ర రూ.6.32 లక్షలకు పాడి తులసిమాలలు, పూలు అమ్మకానికి, పోలోజు గోపి రూ.4 లక్షలకు పాడి కొబ్బరి చిప్పలు పోగుచేసుకునే లైసెన్సులు కైవసం చేసుకున్నట్లు కానూరి సురేష్‌బాబు తెలిపారు.

గోతుల తిప్పలు తీరేదెప్పుడో..?



మండలంలోని వెల్వడం ప్రధాన రహదారిపై తిప్పలు తప్పడంలేదు. గడిచిన నాలుగైదు నెలలుగా ప్రధాన రహదారిపై ప్రయాణం ప్రాణాంతకంగా మారినా పనుల్లో కదలిక లేదు. దాంతో ఎక్కడికక్కడే గోతులతో నిండిపోగా, ఇటీవల వర్షాలకు అవి కాస్తా చెరువులను తలపిస్తున్నాయి. శని, ఆదివారాల్లో కురిసిన వర్షాలకు ఆయా గోతుల నిండా నీరు చేరడంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రహదారిపైకి రావాలంటేనే కలవరపడుతూ, తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్డెక్కుతున్నామని వాపోతున్నారు. **-న్యూస్‌టుడే, మైలవరం**

గంటపాటు.. కుండపోత



మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం గంటపాటు కుండపోతగా వర్షం కురిసింది. దీంతో రహదారులపై మోకాలి లోతులో వరద నీరు ప్రవహించింది. డ్రెయినేజీల్లో మురుగు నీరు, వరద నీటితో కలిసి రహదారులపై ప్రవహించింది. ద్విచక్ర వాహనదారులు అసౌకర్యానికి గురయ్యారు. వర్షం పడినప్పుడల్లా ఇవే ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు అసహనానికి గురవుతున్నారు. **-న్యూస్‌టుడే, గంపలగూడెం**

మెదడు వ్యాధి బాధితుడికి చేయూత

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మండలంలోని కొర్లమండ గ్రామానికి చెందిన గొల్లపల్లి రాజారావు మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న చనుబండ హైస్కూల్ 1996 బ్యాచ్ పూర్వ విద్యార్థులు తక్షణ సాయంగా రూ.50 వేల ఆర్థిక సాయం, నూతన వస్త్రాలు బాధితుడి ఇంటికి వెళ్లి అందజేశారు. చెన్నారావు, నరసింహారావు, నాగేంద్రకుమార్, రఘు, లక్ష్మణ బాబు, రహీం, పార్థసారధి రెడ్డి, శ్రీనివాసరావు దాతృత్వం చాటుకున్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో కార్యవర్గ సభ్యులు

కొండపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో సాఫ్ట్ స్కిల్స్ పెంచడానికి విజయవాడ కేంద్రంగా ప్రభుత్వం పలు కార్యక్రమాలను నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ(భారత విద్యార్థి ఫెడరేషన్) జిల్లా అధ్యక్షులు కుమారస్వామి అన్నారు. కొండపల్లి క్రాంతి పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జిల్లాలో కొత్త యూనివర్సిటీ ఏర్పాటు అవసరమని చెప్పారు. సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులను ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికను నిర్వహించారు. అధ్యక్షకార్యదర్శులుగా కుమారస్వామి, వెంకటేశ్వరరావులు ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులుగా మరో 21 మందిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రణయ్, కుమార్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయానికి రుద్ర మండపం వితరణ

పెనుగొలను(గంపలగూడెం): మండలంలోని పెనుగొలను రామలింగేశ్వరస్వామి గుడికి బెంగళూరుకు చెందిన చేడే విజయ్‌కుమార్, భాగ్యలక్ష్మి దంపతులు సోమవారం రూ.లక్ష విలువైన ఇత్తడి రుద్ర మండపం వితరణగా అందించారు. ఆలయ అర్చకులు దామూలూరి రామలింగేశ్వరశర్మ, సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో రుద్ర మండపం దాతలతో శివలింగానికి విశేష పూజలు నిర్వహించారు. దాత విజయ్‌కుమార్‌కు అర్చకులు కృతజ్ఞతలు తెలిపారు.



దాతలతో అర్చకులు

ఉమాపతికి పంచామృతాభిషేకాలు

కొత్తపల్లి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని కొత్తపల్లి సమీప కట్లేరులోని గోపాలస్వామి మడుగు ఒడ్డున ఉన్న ఉమాగౌరీశంకరుని ఆలయంలో అర్చకులు కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. శివలింగానికి పంచామృతాభిషేకాలు, అర్చనలు, పుష్పాలతో అలంకరణ చేయగా భక్తులు దర్శించుకున్నారు.



హక్కుల సాధనకు పోరాటమే మార్గం

విస్సన్నపేట, న్యూస్‌టుడే: హక్కుల సాధనకు పోరాటమే మార్గమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. విస్సన్నపేట సీఐటీయూ మహాసభ స్థానిక బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆఫీసులో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. హక్కుల కోసం పోరాడుతున్న వారిపై కేసులు పెట్టడం తగదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, సీఐటీయూ జిల్లా నాయకుడు బలగాని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

10 వేల మందికి నులిపురుగు మాత్రలు వేయించాలి

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ నులిపురుగు దినోత్సవం సందర్భంగా ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని పది వేల మంది విద్యార్థులు, చిన్నారులకు నులిపురుగుల మాత్రలు మింగించాలనేదే లక్ష్యంగా ఎంచుకున్నట్లు ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి పర్వీన్ తెలిపారు. ఆమె రాష్ట్ర పరిశీలకులతో కలిసి ముందస్తు ఏర్పాట్లను పరిశీలించే భాగంగా సోమవారం మూలపాడు, జూపూడి, గుంటుపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల పరిధిలోని 31 అంగన్‌వాడీ కేంద్రాలు, 39 పాఠశాలలో అవసరమైన మాత్రలను పంపిణీ చేసినట్లు వివరించారు. పాఠశాలల్లో మంగళవారం మధ్యాహ్నం భోజనం తర్వాత నులిపురుగుల మాత్రలు మింగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు, డాక్టర్లు కోటేశ్వరి, దుర్గాప్రసాద్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నారాయణరావు, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



జూపూడి పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

మహాసభల విజయవంతానికి తీర్మానం

తిరువూరు, న్యూస్‌టుడే: భారత కమ్యూనిస్టు పార్టీ 28వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు తీర్మానించారు. ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు ఒంగోలులో జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర మహాసభల గోడపత్రికలను ఆవిష్కరించారు. జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు టి.కృష్ణయ్య, సీహెచ్.వెంకటేశ్వరరావు, ఎస్‌కే.నాగుల్‌మీరా, ఎం.ఉదయ్, సుభాని తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలుడి ఆచూకీ లభ్యం

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: తిరువూరు పట్టణంలో అదృశ్యమైన ఓ బాలుడి ఆచూకీని గంటల వ్యవధిలో పోలీసులు ఛేదించారు. వారి వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం తాళ్లపెంట గ్రామానికి చెందిన పసుపులేటి నాగ శ్రీనివాసరావు కుమారుడు రుద్ర సాయితేజ(10) తిరువూరులోని ఓ ప్రైవేటు కోచింగ్ సెంటర్‌లో నవోదయ ప్రవేశ పరీక్షకు శిక్షణ తీసుకుంటున్నాడు. రోజులానే ఆటోలో తిరువూరు వస్తుండగా సోమవారం తరగతులకు హాజరు కాకపోవడంతో సెంటర్ యాజమాన్యం బాలుడి తల్లిదండ్రులకు సమాచారం అందించింది. దీంతో వారు తిరువూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సెక్టారు -1 ఎస్సై సత్యనారాయణ బృందాలతో వెతికించారు. ఈ క్రమంలో బాలుడిని గుడివాడలోని బంధువుల ఇంట్లో గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

నులిమేస్తేనే ఆరోగ్యం

జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం నేడు

గంపలగూడెం, న్యూస్‌టుడే: చిన్న పురుగే అని నిర్లక్ష్యం చేస్తే చిన్నా పెద్ద తేడా లేకుండా ప్రాణానికి చేటు తెస్తుందీ నులిపురుగు. పరిశుభ్రత పాటించకపోతే ఆహారంతో కడుపులోకి చేరి శరీరాన్ని నిస్సత్తువకు గురిచేస్తుంది. 1 నుంచి 18 ఏళ్ల మధ్య వయసున్న బాలబాలికల్లో నులిపురుగు సమస్య తీవ్రంగా ఉంటోంది. దానిని కడుపులో నులిమేస్తేనే శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. ప్రభుత్వం కూడా ఏటా రెండు సార్లు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలబాలికలతో నులిపురుగు నిర్మూలనకు ఆల్బెండాజోల్ బిళ్లలు మింగిస్తోంది. ఈ నెల 12న జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా చిన్నారులు, విద్యార్థులతో బిళ్లలు మింగించేందుకు ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే ఆరోగ్య కేంద్రాల నుంచి బడులకు బిళ్లలు సరఫరా చేశారు.

ఈ ఇబ్బందులే వస్తాయ్ : కడుపులో ఈ పురుగు వృద్ధి చెందితే చిన్నారుల్లో రక్తహీనత, పోషకాహారలోపం, ఆకలి లేకపోవడం, బలహీనత, ఆందోళన, కడుపునొప్పి, వికారం, వాంతులు, అతిసారం, మలంలో రక్తం వంటి రుగ్మతలతో బాధపడతారు. జిల్లాలో 939 ప్రభుత్వ పాఠశాలల్లో 1.02లక్షల మంది విద్యార్థులకు బిళ్లలు వేయనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు 1475 వరకు ఉండగా 1 నుంచి 6 ఏళ్లలోపు చిన్నారులు 55 వేల మంది వరకు ఉన్నారు. 2 ఏళ్ల లోపు చిన్నారులకు అర బిళ్ల మాత్రమే.



వైద్యసిబ్బంది పర్యవేక్షణలోనే: కడుపులో నులిపురుగులు ఉంటే అనారోగ్యానికి దారితీస్తాయి. బడులు, అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలబాలికలకు వైద్య సిబ్బంది పర్యవేక్షణలోనే మధ్యాహ్న భోజనానంతరం బిళ్లలు మింగిస్తాం. ఇప్పటికే బడులకు బిళ్లలు సరఫరా చేశాం. **- అంబటి కనకదుర్గాభవాని, చౌటపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి**

మధిర శాఖ కాల్వకు సాగర్‌జలాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కప్పలబంధం 72వ కి.మీ నియంత్రిక నుంచి సోమవారం ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు సాగర్‌జలాలు 874 క్యూసెక్కులు విడుదలైనట్లు ఏఈ కె.మహేష్‌బాబు తెలిపారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 411 క్యూసెక్కులు చేరాయి.

ముడి బంగారం అపహరణ కేసులో పురోగతి

మేడికొండూరు, న్యూస్‌టుడే: కారులో పోలీసులు దుస్తుల్లో వచ్చి ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లికి చెందిన మాణి జగదీష్, అతడి స్నేహితుడని ఈడీ అధికారులమంటూ బెదిరించి రూ.70 లక్షలు నగదు, ముడి బంగారం (మట్టి) ఎత్తుకెళ్లిన కేసు దర్యాప్తు ముమ్మరంగా జరుగుతుంది. దుండగులు మొత్తం 9 మంది ఉన్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. వారిలో ఇద్దరు అనుమానితులను ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు దుండగులు ఉపయోగించిన ఒక కారు పోలీసులు స్వాధీనం చేసుకుని మేడికొండూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో పాటు వారి వద్ద కొంత సొమ్ము కూడా తిరిగి రాబట్టారని తెలుస్తుంది. దుండగులు ముంబాయి, గోవా ప్రాంతానికి చెందిన వ్యక్తులుగా గుర్తించారు. వారు అందరూ పరిచయస్థులని తేల్చారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన రాజమహేంద్రవరానికి చెందిన రంజిత్‌మారుతీ పెట్ ఇంకా పోలీసులకు చిక్కలేదు.



దుండగులు ఉపయోగించిన కారు

రేపు మండల సర్వసభ్య సాధారణ సమావేశం

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేట మండల ప్రజా పరిషత్తు సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి అధ్యక్షతన స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నామని ఇన్‌ఛార్జి ఎంపీడీవో సీహెచ్ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రతినిధులు, పలు శాఖల అధికారులు, సభ్యులు పాల్గొనాలని కోరారు.

గౌరవ మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ మరియు మూడవ అదనపు జిల్లా జడ్జి కోర్టు, రాజంపేట
M.V.O.P.No. 10/2024
భాష ఆన్నయ్య, తండ్రి లేట్ భాష వెంకట సుబ్బయ్య, హిందూ, ఏ.పి.యస్.ఆర్.టి.సి.డ్రైవర్, రాజంపేట డిపో, నివాసము : డోర్ నంబరు 5/71-ఎ, భాషావాండ్లపల్లి గ్రామం, పుల్లంపేట మం॥, అన్నమయ్య జిల్లా. ... పిటీషనర్
V/s
ముప్పరాజు వేణు, తండ్రి పార్వతీశ్వర రావు, నివాసము : డోర్ నంబరు 2/16, శివాలయం వీధి, ఇబ్రహీంపట్నము, కొండపల్లి (యు.పి), యన్.టి.ఆర్, ఏ.పి. - 521228. ... రెస్పాండెంట్ నెం. 1
పై కోర్టు నందు పై పిటీషనర్ మీపై నష్టపరిహారము కోసం కేసు వేసినారు. మీరు విచారణ నిమిత్తం **22-08-2025**వ తేదీన ఉదయం 10.30 గం॥లకి పై కోర్టులో మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరు కావలెయును. లేనంతట కోర్టు వారు మీపై పరోక్షముగా తీర్మానించెదరు.
// By order of the Court //
నలికిరి రెడ్డయ్య, న్యాయవాది.

(c) eenadu

ఓట్ల చోరీపై పోరు

(మొదటి పేజీ తరువాయి)

తృణమూల్ నుంచి డెరెక్ ఓబ్రియాన్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ, ఆమ్ ఆద్మీ పార్టీ నేత సంజయ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. మరో వైపు అనుమతి లేదంటూ ర్యాలీని అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. పార్లమెంటు వీధిలోని పీటీఐ భవనం సమీపంలో రోడ్డుపై బారికేడ్లను ఏర్పాటు చేశారు. ముందుకు రావొద్దని, 30 మంది ప్రతినిధులను ఈసీ కార్యాలయంలోకి అనుమతిస్తామని మైకులో ప్రకటించారు. అయినా పట్టించుకోని విపక్ష ఎంపీలు ముందుకు సాగారు. ర్యాలీ సందర్భంగా మాట్లాడిన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్.. ఎన్నికల సంఘం.. చోరీ సంఘం కాకూడదని విమర్శించారు.

బారికేడ్లు ఎక్కిన మహిళా ఎంపీలు

పోలీసులు అడ్డుకోవడంతో తృణమూల్ ఎంపీలు మహువా మొయిత్రా, సాగరికా ఘోష్, సుస్మితా దేవ్, కాంగ్రెస్ ఎంపీలు సంజనా జాతవ్, జోతిమణి.. పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను ఎక్కి ఈసీకి వ్యతిరేకంగా నినదించారు. వారిలో కొందరు చీరలు ధరించి ఉండీ బారికేడ్లపైకి లంఘించడం గమనార్హం. అఖిలేశ్ యాదవ్ కూడా బారికేడ్లను ఎక్కారు. మరికొంత మంది ఎంపీలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఆందోళన చేస్తున్న ఎంపీలను పోలీసులు వ్యాన్లలో పార్లమెంటు వీధి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆ తరువాత వారిని విడుదల చేశారు. ఆందోళన సందర్భంగా సొమ్మసిల్లిన ఎంపీలు మొయిత్రా, మితాలీ బాగ్‌లకు రాహుల్ గాంధీ సపర్యలు చేశారు.



స్పృహ కోల్పోయిన ఎంపీ మహువా మొయిత్రాకు సపర్యలు చేస్తున్న రాహుల్‌గాంధీ, ఇతర ఎంపీలు

■ ఆందోళన మధ్యే ముగ్గురు తృణమూల్ ఎంపీలు.. డోలా సేన్, ప్రతిమ మండల్, మమత ఠాకుర్‌లు ఈసీ కార్యాలయానికి చేరుకున్నారు. వారిని ఈసీ వర్గాలు లోపలికి అనుమతించలేదు. దీంతో కొన్ని గంటలపాటు వారు అక్కడే వేచి చూశారు.

నేతలేమన్నారంటే..

“ఇది రాజకీయ పోరాటం కాదు. రాజ్యాంగాన్ని రక్షించే యుద్ధం. ఒక వ్యక్తికి ఒక ఓటు కోసం పోరాటం. మాకు క్లీన్‌గా, స్వచ్ఛంగా ఉండే ఓటరు జాబితా కావాలి. వారు (ఈసీ) దేశం ఎదుట నిజం మాట్లాడటం లేదు. ఓట్ల చోరీకి సంబంధించిన ఆధారాలను ఈసీ వెబ్‌సైట్ నుంచే తీసుకున్నాం. ఓట్ల చోరీ ఒక్క బెంగళూరులోనే కాదు. దేశంలోని అనేక నియోజకవర్గాల్లో చోటుచేసుకుంది. ఈసీకి ఈ విషయం తెలుసు. భుజం భుజం కలిపి ఆందోళనలో పాల్గొన్న ఇండియా కూటమి ఎంపీలకు కృతజ్ఞతలు. ఓట్ల చోరీపై భారీ ప్రజా ఉద్యమం ప్రారంభమైంది. గడచిన 24 గంటల్లో 15 లక్షల మంది మద్దతుగా ధ్రువీకరణ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకున్నారు. 10 లక్షల మిస్డ్ కాల్స్ వచ్చాయి. ఇదీ ప్రస్తుతం భారత ప్రజాస్వామ్యం తీరు. మా ప్రచారం ద్వారా అణచివేయబడిన గొంతుకలు తమ గళాన్ని వినిపిస్తున్నాయి.

– రాహుల్ గాంధీ

“ప్రజల హక్కులను కాపాడటానికే ఎస్ఐఆర్, ఓట్ల చోరీపై నిరసనకు దిగాం. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు పోరాడుతున్నాం. భాజపా కుట్రలను ఇండియా కూటమి బయటపెడుతుంది. – ఖర్గే

“రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలకు ఈసీ సమాధానం ఇవ్వాలి. అలాకాకుండా ఆయనపై ఎదురుదాడికి దిగుతోంది. మాకు సమాధానాలు కావాలి. దాడులొద్దు. – శశి థరూర్, కాంగ్రెస్ ఎంపీ



పార్లమెంటు వద్ద నిర్వహించిన ఆందోళనలో స్పృహ కోల్పోయిన టీఎంసీ ఎంపీ మితాలీ బాగ్‌ను తరలిస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ, ఇతర ఎంపీలు



పార్లమెంటు ప్రాంగణం నుంచి ఈసీ కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న క్రమంలో పోలీసులు అడ్డుగా పెట్టిన బారికేడ్లను ఎక్కిన ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్

నేతలకు ఖర్గే విందు

ఓట్ల చోరీ ఆందోళనలో పాల్గొన్న నేతలకు సోమవారం రాత్రి తాజ్ ప్యాలెస్ హోటల్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విందు ఇచ్చారు. ఈ విందుకు శరద్ పవార్, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ నేతలు అఖిలేశ్ యాదవ్, డింపుల్ యాదవ్, జయా బచ్చన్, డీఎంకే ఎంపీలు కనిమొళి, టీఆర్ బాలు, ఆర్జేడీ నేత మీసా భారతి, శివసేన (ఉద్ధవ్) ఎంపీలు సంజయ్ రౌత్, ప్రియాంక చతుర్వేది తదితరులు హాజరయ్యారు.

దేశాన్ని అస్థిరపరచడానికి విపక్షాల కుట్ర: భాజపా ధ్వజం

దిల్లీ: విపక్షాల ర్యాలీపై భాజపా విరుచుకుపడింది. దేశంలో అరాచకత్వానికి, అస్థిరతకు ఆ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని ధ్వజమెత్తింది. వేరే అంశాలు లేక ఓట్ల చోరీని రాహుల్ గాంధీ ప్రస్తావిస్తున్నారని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యానించారు. జాతి వ్యతిరేక శక్తుల ఒత్తిడికి తలొగ్గి రాహుల్ గాంధీ పని చేస్తున్నారని మరో మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ విమర్శించారు. ఆయనతోపాటు ఇండియా కూటమి నేతలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

ఈ ఏడాది నుంచే నంది పురస్కారాలు

(మొదటి పేజీ తరువాయి)

సూచనలు చేశారని వెల్లడించారు. తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ తరఫున నిర్మాతలు బీవీఎస్ఎన్ ప్రసాద్, రవిశంకర్ యలమంచిలి, టీజీ విశ్వప్రసాద్, నాగవంశీ, డీవీవీ దానయ్య, బన్నీ వాసు, కేఎల్ నారాయణలు సోమవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రితో భేటీ అయ్యారు. చిత్ర పరిశ్రమ అభివృద్ధి కోసం ప్రభుత్వం చేస్తున్న కృషి, అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.

స్టూడియోల నిర్మాణానికి సహకరిస్తాం..

టాలీవుడ్‌లో నెలకొన్న తాజా పరిస్థితులు, ఏపీలో చిత్రీకరణలు, మౌలిక వసతుల కల్పన, కొత్త సినిమాల విడుదల, టికెట్ల ధరలు తదితర అంశాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఏపీలో సినీరంగం అభివృద్ధిపై చర్చించేందుకు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లతో సమావేశం ఏర్పాటు చేయించాలని నిర్మాతలు విజ్ఞప్తి చేయగా, సెప్టెంబరు మొదటి లేదా రెండో వారంలో ఏర్పాటు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. నంది అవార్డుల ఎంపిక ప్రక్రియను తెలంగాణ ప్రభుత్వంతో కలిసి చేయాలా? విడిగా చేయాలా? అనే అంశంపై నిర్మాతలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ అంశాన్ని సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి తీసుకెళతానని మంత్రి వారికి చెప్పారు. ‘రెండు రాష్ట్రాలకూ తెలుగు సినీ పరిశ్రమ ఒక్కటే. రాష్ట్రంలో స్టూడియోలు, డబ్బింగ్, రీరికార్డింగ్ థియేటర్లు నిర్మిస్తే ప్రభుత్వం తరఫున సహకారం అందిస్తాం. ఈ సమావేశానికి ప్రత్యేక ఎజెండా ఏమీ లేదు. తాజా పరిణామాల్ని వివరిస్తామని నిర్మాతలు కోరితే రమ్మన్నాం’ అని మంత్రి దుర్గేష్ తెలిపారు.

పవన్ కల్యాణ్ ఉన్నారనే ధైర్యంతోనే వెంటనే రాలేదు..

‘కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది అవుతున్నా.. తెలుగు సినీ సంఘాల ప్రతినిధులు సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారా’ అంటూ గతంలో పవన్ కల్యాణ్ చేసిన విమర్శల్ని విలేకరులు ప్రస్తావించగా.. ‘మా ఇండస్ట్రీ నుంచి ఒకరు డిప్యూటీ సీఎం అయ్యారు. మా సమస్యలన్నీ ఆయనకు తెలుసు. ఆయనున్నారనే ధైర్యంతోనే మేము వెంటనే రాలేదు. ముందు పవన్ కల్యాణ్‌ను కలిశాం. ఇప్పుడు ముఖ్యమంత్రిని కలిసి అన్ని సమస్యలూ వివరిస్తాం’ అని నిర్మాత నాగవంశీ పేర్కొన్నారు. రెండు నెలల క్రితమే ఈ సమావేశం జరగాల్సి ఉండగా.. వివిధ కారణాలతో వాయిదా పడిందని మరో నిర్మాత విశ్వప్రసాద్ తెలిపారు. హైదరాబాద్‌లో జరుగుతున్న సినీ కార్మికుల సమ్మెకు ఈ భేటీకి సంబంధం లేదని వారు స్పష్టం చేశారు.

ఓట్ల చోరీ ఆరోపణలు అవాస్తవం: ఈసీ

దిల్లీ: కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆరోపించిన ఓట్ల చోరీ అవాస్తవమని ఎన్నికల సంఘం (ఈసీ) స్పష్టం చేసింది. సోమవారం విపక్ష కూటమి ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీ సందర్భంగా ఆయన ఆరోపణలపై ఫ్యాక్ట్‌చెక్ చేశామని, అవాస్తవమని తేలిందని పేర్కొంది. బిహార్‌లో జరిగిన ప్రత్యేక సమగ్ర సవరణలో (ఎస్ఐఆర్) పారదర్శకంగా వ్యవహరించామని పేర్కొంటూ సంబంధిత పత్రాలను విడుదల చేసింది. ఆర్జేడీ, కాంగ్రెస్, సీపీఐ ప్రతినిధుల ధ్రువీకరణ పత్రాలను అందులో ఉంచింది.

రాబోయే 5 రోజుల్లో భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు వైఎస్సార్ కడప, కర్నూలు, నంద్యాల, శ్రీసత్యసాయి, చిత్తూరు, ఎన్టీఆర్, తిరుపతి జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ వానలు పడ్డాయి. సోమవారం పల్నాడు, తూర్పుగోదావరి, గుంటూరు, అనకాపల్లి, కాకినాడ, ప్రకాశం, అల్లూరి సీతారామరాజు, కృష్ణా, బాపట్ల తదితర జిల్లాల్లో వర్షాలు కురిశాయి.

కొత్త వైద్య కళాశాలలకు రూ.352.48 కోట్లు మంజూరు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో కొత్త వైద్య కళాశాలల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.352.48 కోట్లు మంజూరు చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల వాటా కింద ఈ నిధులు కేటాయించింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో నిర్మాణంలో ఉన్న పాడేరు, మచిలీపట్నం, పిడుగురాళ్ల వైద్య కళాశాలలకు, వాటికి అవసరమైన వైద్య పరికరాల కొనుగోలుకు ఈ నిధులు వెచ్చిస్తారు.

సుంకాలు మన దేశాన్ని ఆపలేవు

(మొదటి పేజీ తరువాయి)

విశ్వగురువుగా అవతరిస్తున్న భారతదేశం’ అని స్పష్టం చేశారు. ‘హర్ ఘర్ తిరంగా’ లాంటి కార్యక్రమాలతో మనమంతా ఏకతాటిపై ఉన్నామనే బలమైన సందేశాన్ని ప్రపంచానికి ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రతి ఇంటిపై, కార్యాలయంపై, ప్రతి ఒక్కరి చేతిలో జాతీయజెండాను రెపరెపలాడించాలని, త్యాగధనుల్ని స్మరించుకుంటూ జాతి కోసం పునరంకితం కావాలని ఆయన పిలుపునిచ్చారు. విజయవాడలో నిర్వహించిన ‘హర్ ఘర్ తిరంగా’ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ‘ప్రధాని మోదీ బలమైన నాయకత్వంలో భారత్ శక్తిమంతమైన దేశంగా అవతరిస్తోంది. మన ఆర్థికవ్యవస్థ 11వ స్థానం నుంచి నాలుగో స్థానానికి వచ్చింది. 2028 నాటికి మూడోస్థానానికి చేరుతుంది. మనది డెడ్ ఎకానమీ అని ట్రంప్ మాట్లాడుతున్నారు. కాదు.. వేగంగా దూసుకుపోతున్న ఏకైక ఆర్థికవ్యవస్థ మనది. ఎవరిది డెడ్ ఎకానమీనో భవిష్యత్తే తేలుస్తుంది’ అని స్పష్టం చేశారు.

దేశాన్ని ఏకం చేసేలా హర్ ఘర్ తిరంగా

‘హర్ ఘర్ తిరంగా అంటే ఒకే జెండా కింద దేశం మొత్తం ఏకమయ్యే కార్యక్రమం. కేవలం ఇంటిపై జెండా ఎగురవేయడమే కాదు. ఇది దేశభక్తిని పెంచే ఒక సంకల్పం. ప్రతి ఒక్కరిలో నేషన్ ఫస్ట్ భావనను పెంపొందించేందుకే ప్రధాని మోదీ ‘హర్ ఘర్ తిరంగా’ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రానురాను స్వాతంత్ర్యం ఎలా వచ్చిందో మరచిపోయే పరిస్థితికి యువత వచ్చారు. అందరిలో స్ఫూర్తినిచ్చేలా.. దేశం కోసం పోరాటపటిమ పెంచేలా ఈ కార్యక్రమాన్ని తీసుకెళ్లగలిగితే మంచి ఫలితాలు వస్తాయి’ అని పేర్కొన్నారు.



జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య విగ్రహానికి నివాళి అర్పిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రులు సత్యకుమార్, కందుల దుర్గేష్, ఎమ్మెల్యే బొండా ఉమా, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ తదితరులు

తూటాలు పేలిస్తే... క్షిపణులతో బదులిచ్చాం

‘పహల్గాం ఘటనలో అన్యాయంగా అమాయకుల ప్రాణాలు తీస్తే, ఆపరేషన్ సిందూర్‌తో కేవలం 25 నిమిషాల్లో ప్రపంచమంతా నివ్వెరపోయేలా బదులిచ్చాం. అది భారత సైనిక దళాల సత్తా. వాళ్లు తూటాలు పేలిస్తే మనం క్షిపణులతో బదులిస్తామని చాటిచెప్పాం. మనల్ని కాపాడే సైనికులకు ఎప్పటికప్పుడు సెల్యూట్ చేయాలి. అందుకే జై జవాన్ అనేది మన నినాదం కావాలి’ అని పిలుపునిచ్చారు. 2047లో వందేళ్ల స్వాతంత్ర్య వేడుకలు జరిపేనాటికి మనం నంబర్ 1 కావాలని వికసిత్ భారత్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, అదే సమయానికి దేశంలో ఆంధ్రప్రదేశ్ నంబర్ 1 కావాలని సంకల్పం తీసుకున్నామని తెలిపారు.

త్యాగధనుల కలల్ని సాకారం చేసే దిశగా..

త్యాగధనుల కలలను సాకారం చేసే దిశగా దేశనిర్మాణం జరుగుతోందని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. దేశ ప్రజలందరూ ఒక్కటే అనే భావనను మన మనసుల్లో పాదుగొల్పేది జాతీయ జెండా అని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. సాంస్కృతిక అకాడమీ ఛైర్మన్ తేజస్విని, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, నాటక అకాడమీ ఛైర్మన్ గోపాలకృష్ణ, భాషా సాంస్కృతికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

సమరయోధుల కుటుంబ సభ్యులకు సత్కారం

ఈ సందర్భంగా మహిళలు ఏర్పాటుచేసిన స్టాళ్లను చంద్రబాబు పరిశీలించారు. జాతీయపతాక రూపశిల్పి పింగళి వెంకయ్య చిత్రపటానికి నివాళి అర్పించారు. ఆయన జీవితంపై రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. పలువురు స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబసభ్యులను సత్కరించారు. గద్దె సత్యనారాయణ సతీమణి గద్దె సుశీల, రాంపిల్ల నరసాయమ్మ కుమారుడు రాంపిల్ల జయప్రకాశ్, వీరజవాను సదరబోయిన నాగరాజు సతీమణి మంగాదేవిని సత్కరించారు. అంతర్జాతీయ, జాతీయస్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరిచిన సూర్య చరిష్మ, చెరుకూరి డాలీ, నాగసాయి, భావన, దుర్గసాయి శశాంక్, శిరీష, ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లులను సత్కరించారు.

జాతీయ జెండా అంటే చిహ్నమో, వస్త్రమో కాదు

‘జాతీయజెండా అంటే చిహ్నమో, వస్త్రమో అనుకుంటే పొరపాటు. అది దేశ గౌరవం, ఐక్యత, త్యాగం, స్వాతంత్ర్యానికి ప్రతీక. అలాంటి గొప్ప జెండాను దేశానికి అందించిన పింగళి వెంకయ్యను అందరూ స్మరించుకోవాలి. ఆయన తెలుగుబిడ్డ కావడం మనందరికీ గర్వకారణం. అల్లూరి సీతారామరాజు, టంగుటూరి ప్రకాశం పంతులు, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, సర్దార్ గౌతు లచ్చన్న, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య వంటి సమరయోధులు తెలుగుగడ్డపై పుట్టడం మనందరి అదృష్టం. వారందరి స్ఫూర్తి తీసుకుని దేశభక్తితో ముందుకు సాగాలి’ అని సూచించారు.

అమెరికాలో ధరల మోత

(మొదటి పేజీ తరువాయి)

చూడండి’ అని ఆమె పేర్కొన్నారు.

భయంతో ముందే షాపింగ్

రాబోయే రోజుల్లో ధరలు మరింత పెరుగుతాయనే భయంతో అవసరమైన వస్తువుల్ని వినియోగదారులు ముందే కొనేస్తున్నారు. ఏఐ టూల్స్ ఉపయోగించి ఏ ఉత్పత్తుల ధరలు పెరుగుతాయో తెలుసుకుని వాటిని కొనుగోలు చేస్తున్నారు. పెద్దమొత్తంలో షాపింగ్‌కు కొందరు బై నౌ, పే లేటర్ విధానాలు ఎంచుకుంటున్నారు. స్కూల్ యూనిఫాం, బూట్లు, సాక్స్, కాఫీ, బీర్, ప్యాక్ చేసిన సముద్ర ఉత్పత్తులు, బేకరీ వస్తువులు, చైనా నుంచి దిగుమతి అయ్యే చిన్న పిల్లల ఆట వస్తువులు, గడియారాలు, వంటింటి సామగ్రి ధరలు కూడా గణనీయంగా పెరుగుతాయనే అంచనాలున్నాయి. టూత్‌పేస్టు, డిటర్జెంట్ ధరలపైనా ప్రభావం ఉండనుంది. సగటు బాదుడు 35% ఉంటుందని అంచనా. సుంకాల పెరుగుదల తర్వాత అమెజాన్, వాల్‌మార్ట్ తదితర సంస్థలు దిగుమతుల్ని నిలిపేశాయి. ప్రస్తుతానికి సరకు పంపవద్దని ఎగుమతి సంస్థలకు సూచిస్తున్నాయి.

మహిళా కండక్టర్లకు బాడీ వోర్న్ కెమెరాలు

(మొదటి పేజీ తరువాయి)

మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లు ఉచితంగా ప్రయాణించవచ్చు. ఇందుకు సరైన గుర్తింపు కార్డు చూపాలి. టిక్కెట్ ఛార్జీ ఎంతో పేర్కొని, దానికి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేకుండా జీరో ఫేర్ టిక్కెట్ జారీచేస్తారు.

■ రాష్ట్రమంతటా పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లు, విజయవాడ, విశాఖపట్నం నగరాల పరిధిలో తిరిగే సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్‌ల్లో ఈ పథకం వర్తిస్తుంది.

■ ప్రస్తుతం సంస్థలో ఉన్న బస్సులన్నీ నడపాలి. ప్రయాణికుల రద్దీని బట్టి కొత్త బస్సులు తీసుకోవాలి.

■ నాన్-స్టాప్, అంతర్రాష్ట్ర బస్సుల్లో ఈ పథకం వర్తించదు. కాంట్రాక్ట్ క్యారేజ్ కింద, టూర్ ప్యాకేజీల కింద బస్సులు బుక్ చేసుకున్నప్పుడు కూడా వాటిలో మహిళలకు ఉచిత ప్రయాణం ఉండదు.

■ దూరప్రాంత సర్వీసులైన అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ, స్టార్‌లైనర్, అన్ని ఏసీ బస్సులతోపాటు, తిరుపతి-తిరుమల ఘాట్‌లో తిరిగే సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌ల్లో స్త్రీశక్తి పథకం వర్తించదు.

■ కొన్ని రూట్లు.. ఏపీ పరిధిలో మొదలై పొరుగు రాష్ట్రంలో కొన్ని గ్రామాల మీదుగా ప్రయాణించి మళ్లీ ఏపీలోని గమ్యస్థానానికి చేరుతుంటాయి. రాయలసీమ జిల్లాల్లో ఇటువంటి రూట్లు (ఎన్‌క్లేవ్ రూట్లు) ఉన్నాయి. అటువంటి రూట్లలో అయిదు రకాల బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు.

■ అన్ని బస్టాండ్లలో ఫ్యాన్లు, కుర్చీలు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు మరింత పెంచాలి.

■ సంస్థ విద్యుత్తు బస్సులు కొనుగోలు చేస్తుండగా.. వాటిలో ఈ పథకం వర్తింపుపై మంత్రివర్గ నిర్ణయం ఆధారంగా చర్యలు తీసుకోవాలి.

■ ఈ టిక్కెట్లకు చెందిన మొత్తాన్ని ఏపీఎస్‌ఆర్టీసీకి.. ప్రభుత్వం చెల్లిస్తుంది.

అణు బెదిరింపులకు భయపడం

(మొదటి పేజీ తరువాయి)

సమాజం అర్థం చేసుకోవాలని భారత విదేశీ వ్యవహారాల శాఖ పేర్కొంది. ‘పాక్ అణ్వాయుధాలు ఉగ్రవాదుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉంది. అదే జరిగితే ఈ ప్రాంతంతో పాటు ప్రపంచం మొత్తానికి ప్రమాదం ఎదురైనట్లే’ అని భారత ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అసీం మునీర్ అణు బెదిరింపులను విపక్ష కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. ఇలాంటి వ్యక్తికి అమెరికా ప్రభుత్వం పదే పదే తమ దేశానికి ఆహ్వానించి ఎందుకు ఆతిథ్యం ఇస్తోందని ప్రశ్నించింది.

మా ప్రాదేశిక సమగ్రతకు విఘాతాన్ని సహించం: పాకిస్థాన్.. తమ సైన్యాధిపతి అసీం మునీర్ వ్యాఖ్యలను భారత ప్రభుత్వం వక్రీకరించిందంటూ పాకిస్థాన్ విమర్శించింది. సందర్భరహితంగా ఆయన మాటలను ఆపాదిస్తూ అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని ఆరోపించింది. బలప్రయోగం ద్వారా బెదిరింపులకు పాల్పడడాన్ని తమ దేశం ఎన్నడూ సమర్థించదని పాకిస్థాన్ విదేశాంగ శాఖ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. తమ దేశ సార్వభౌమత్వానికి, ప్రాదేశిక సమగ్రతకు విఘాతం కలిగిస్తే తక్షణమే తగువిధంగా స్పందిస్తామని హెచ్చరించింది.

‘భారత్ మెర్సిడెస్.. పాక్ కంకర లారీ’..

- అసీం మునీర్ వ్యాఖ్యలపై నెటిజన్ల ట్రోలింగ్

ఇంటర్నెట్ డెస్క్: అమెరికా పర్యటనలో భారత్‌పై నోరుపారేసుకున్న పాకిస్థాన్ సైన్యాధిపతి ఫీల్డ్ మార్షల్ అసీం మునీర్ నెట్టింట అభాసుపాలయ్యారు. తెలియకుండానే ఆయన భారత్‌ను పాకిస్థాన్ కంటే మెరుగైనదిగా పేర్కొన్నారంటూ నెటిజన్లు సామాజిక మాధ్యమాల వేదికగా ట్రోలింగ్ చేస్తున్నారు. ‘భారత్ హైవేపై వస్తున్న ఒక మెర్సిడెస్ కారులాంటిది. పాకిస్థాన్ మాత్రం కంకరతో నిండిన ఓ డంప్ లారీ వంటిది. ఒకవేళ కారు వచ్చి లారీని ఢీకొంటే ఎవరికి నష్టం?’ అని మునీర్ తన ప్రసంగంలో పేర్కొన్నట్లు మీడియాలో కథనాలు వచ్చాయి. అయితే.. పోలికలోనూ సొంత దేశం పరువు తీస్తున్నారంటూ నెటిజన్లు చురకలు వేస్తున్నారు.

నెటిజన్ల వ్యాఖ్యలివీ... “మునీర్ ప్రసంగంలో ‘భారత్ మెర్సిడెస్ కారు.. పాకిస్థాన్ డంప్ లారీ’ అన్నది మాత్రమే నిజం. మిగతాదంతా ఉత్త కథే. అణ్వాయుధాలంటూ బెదిరించి అమెరికా, చైనా వెనుక దాక్కోగలనని ఆయన భావిస్తున్నారు. అయితే, పాకిస్థాన్ సైనిక సామర్థ్యాలూ అంతంతే. ఒకవేళ భారత్‌లోని ఆనకట్టలను ధ్వంసం చేయాలని యత్నిస్తే.. పాకిస్థాన్ చరిత్ర చెత్తబుట్టలోకి వెళ్లిపోతుంది”.

■ “తాము కేవలం డంప్ లారీ తప్ప మరేదీ కాదనే వాస్తవం అసీం మునీర్‌కు తెలుసు. తాము దుర్బలంగా ఉన్నామనే విషయాన్ని ‘ఫెయిల్డ్’ మార్షల్ అంగీకరించారు”.

■ “భారత్ క్షిపణులు లోడ్ చేసిన మెర్సిడెస్. అది ప్రాణాంతకం కావొచ్చు. మిమ్మల్ని నాశనం చేస్తుంది”.

మద్యం కుంభకోణం: సూత్రధారి జగనే!

(మొదటి పేజీ తరువాయి)

ఆ సమావేశంలోనే బేవరేజస్ కార్పొరేషన్ ద్వారా 3,500 రిటైల్ దుకాణాలు నిర్వహించేందుకు అవసరమైన మార్గదర్శకాల రూపకల్పన జరిగింది.

■ నాటి బేవరేజస్ కార్పొరేషన్ ఎండీ 2019 జులై 30న నోట్ ఫైలు ప్రత్యేక ప్రధానకార్యదర్శి ద్వారా ప్రభుత్వానికి సమర్పించగా అదే ఏడాది ఆగస్టు 16న నాటి సీఎం జగన్ ఆమోదం తెలియజేశారు.

■ ఏ2గా ఉన్న వాసుదేవరెడ్డిని బేవరేజస్ కార్పొరేషన్ ఎండీగా నియమించుకున్నారు. ప్రభుత్వంలోని కొందరు కీలక అధికారులు ఈ అంశాన్ని ప్రభావితం చేశారు. అప్పటి సీఎం ముఖ్య సలహాదారు అజేయ కల్లం వాసుదేవరెడ్డిని ఆంధ్రప్రదేశ్‌కు డిప్యుటేషన్‌పై తీసుకురావాలంటూ నాటి సీఎంకు ప్రతిపాదనలు పంపారు. రైల్వే మంత్రిత్వశాఖతో మాట్లాడాలని సూచించారు. స్క్రీనింగ్ కమిటీ వాసుదేవరెడ్డి నియామకానికి సిఫార్సు చేసింది. తగిన పోస్టులో నియమించాలని పేర్కొంది. ఆ నోట్‌ఫైల్‌ను అప్పటి సీఎం జగన్ ఆమోదించారు.

■ రాష్ట్రానికి డిప్యుటేషన్‌పై వచ్చిన వాసుదేవరెడ్డిని(ఏ2) బేవరేజస్ కార్పొరేషన్ ఎండీగా లేదా-తాగునీటి సరఫరా కార్పొరేషన్ ఎండీగానైనా నియమించాలంటూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సిసోదియా నాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్ వి సుబ్రహ్మణ్యం, ముఖ్యమంత్రి జగన్‌లకు ఫైలు పంపారు. వాసుదేవరెడ్డిని రక్షిత నీటి సరఫరా కార్పొరేషన్ ఎండీగా నియమించాలని అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్ వి సుబ్రహ్మణ్యం సిఫార్సు చేశారు. అప్పటికే ఉత్తర్వులు జారీ చేసే శామని నాటి ముఖ్యమంత్రి జగన్ ఒక నోట్ ద్వారా 2019 సెప్టెంబరు 16న తెలియజేశారు. బేవరేజస్ కార్పొరేషన్ ఎండీగా వాసుదేవరెడ్డిని నియమిస్తూ జగన్ నిర్ణయం తీసుకున్నారు.



మద్యం కేసులో అనుబంధ అభియోగ పత్రాలను విజయవాడ కోర్టుకు తీసుకెళ్తున్న సిట్ అధికారులు, పోలీసులు

■ ఆయనను బేవరేజస్ కార్పొరేషన్ ఎండీగా డిప్యుటేషన్‌పై నియమిస్తూ 2019 సెప్టెంబరు 13న ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన సెప్టెంబరు 16న బాధ్యతలు తీసుకున్నారు. క్యాడర్ పోస్టులోకి ఆయనను ఎందుకు తీసుకున్నారో కారణాలు ఎక్కడా ప్రస్తావించలేదు. ఆ తర్వాత నాటి సీఎం ముఖ్య సలహాదారు అజేయ కల్లం సిఫార్సుల మేరకు ఆయను డిస్టలరీలు, బ్రేవరీస్ కమిషనర్‌గాను, బేవరేజస్ కార్పొరేషన్ ఎండీగాను నియమించారు.

■ అనంతరం డి.సత్యప్రసాద్(ఏ3)ని బేవరేజస్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారిగా నియమించారు. అజేయకల్లం రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి లేఖ రాసి సిఫార్సు మేరకు ఈ నియామకం చేపట్టారు.

■ నాడు బేవరేజస్ కార్పొరేషన్‌లో అనేక అక్రమాలు చోటు చేసుకున్నా.. ఉన్నతాధికారులకు తెలిసినా చర్యలూ తీసుకోలేదు. ప్రధానంగా మద్యం సరఫరా ఉత్తర్వుల విషయంలో అనేక అవకతవకలు చోటు చేసుకున్నాయి. కమిటీ సిఫార్సు చేసిన ఫార్ములా ప్రకారమే ఈ ఉత్తర్వులు ఇవ్వాలని బేవరేజస్ కార్పొరేషన్ ఎండీ ప్రత్యేకాధికారికి లేఖలు రాశారు. ఆ ఫైళ్లు ఏపీ ఎండీకి పంపకుండానే ప్రత్యేకాధికారి తన ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకున్నారు. ఈ అంశాలు ప్రస్తావిస్తూ నాడు ఎండీ రాసిన లేఖ ఎక్సైజ్ కమిషనర్‌కు వెళ్లినా ఆయన చర్యలూ తీసుకోలేదు. అవకతవకలు జరిగినట్లు 2020లోనే గుర్తించినా ఎలాంటి చర్యలూ తీసుకోలేదని రికార్డులు తెలియజేస్తున్నాయి.

■ బేవరేజస్ కార్పొరేషన్‌లో అక్రమాలు జరుగుతున్నట్లు గుర్తించినా వాసుదేవరెడ్డి (ఏ2), సత్యప్రసాద్ (ఏ3)లపై ఎలాంటి చర్యలూ తీసుకోవద్దని నాటి ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు ధనుంజయరెడ్డి (ఏ31), కృష్ణమోహన్‌రెడ్డి (ఏ 32) ఒత్తిడి చేసినట్లు నాటి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజిత్ భార్గవ్ సిట్ విచారణలో వెల్లడించారు.

■ ఈ అక్రమాలపై ఎండీ వాసుదేవరెడ్డికి, ప్రత్యేకాధికారి సత్యప్రసాద్‌కు మెమోలు వరుసగా జారీ చేసినా వారు స్పందించలేదు. ఎలాంటి జవాబు ఇవ్వలేదని రజత్‌భార్గవ వాంగ్మూలం ఇచ్చారు. ఈ విషయాన్ని నాటి ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి ధనుంజయరెడ్డికి కూడా తెలియజేసినట్లు రజిత్ భార్గవ వెల్లడించారు. వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్‌లను వ్యక్తిగతంగా వచ్చి వివరణ ఇమ్మని కోరినా ఇవ్వకపోగా వారు చేసిన పనులను ర్యాటిఫై చేస్తూ పాత తేదీలతో ఉత్తర్వులు ఇవ్వాలని తనను ఒత్తిడి చేసినట్లు సిట్‌కు తెలియజేశారు.

■ ఇన్ని అక్రమాలు జరుగుతున్నట్లు ఉన్నతాధికారులకు 2022 నాటికే తెలిసినా చర్యలూ తీసుకోలేదు. పైగా ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలు బేవరేజస్ కార్పొరేషన్ అక్రమాలపై ఎలాంటి మెమోలు ఇవ్వొద్దని ఆదేశించిన అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఈ కుంభకోణంలో వారు పూర్తి స్థాయిలో భాగస్వామ్యులయ్యారన్న విషయమూ తెలుతోంది.

భారీ భవనాలకు సింగిల్ విండో విధానంలో ఎన్‌వోసీలు

ఈనాడు, అమరావతి: బహుళ అంతస్తుల భవనాలకు సింగిల్ విండో విధానంలో నిరభ్యంతర ధ్రువీకరణ పత్రాలు (ఎన్‌వోసీలు) జారీ చేసేందుకు అగ్నిమాపకశాఖ నిర్ణయం తీసుకుంది. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలోని ఏపీడీపీఎంఎస్ పోర్టల్ ద్వారా ఎన్‌వోసీలను ఇవ్వనుంది. సచివాలయంలో సోమవారం మంత్రులు నారాయణ, వంగలపూడి అనిత ఆధ్వర్యంలో పురపాలక, అగ్నిమాపక శాఖల సమన్వయ సమావేశం నిర్వహించారు. బహుళ అంతస్తుల భవన నిర్మాణాలకు ఎన్‌వోసీలు జారీ చేసే విషయంపై ఈ సందర్భంగా చర్చ జరిగింది. భవన నిర్మాణాలకు అనుమతులు సులభతరం చేసిన విషయాన్ని మంత్రి నారాయణ ప్రస్తావించారు. అగ్నిమాపక శాఖ నుంచి ఎన్‌వోసీల జారీలో జాప్యం లేకుండా చూడాలని సూచించారు. దీనిపై మంత్రి అనిత అగ్నిమాపక శాఖ అధికారులతో చర్చించారు.

రూ.11 కోట్ల జమపై.. కోర్టుకు నివేదిక అందజేసిన ఎస్‌బీఐ

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం వ్యవహారంలో హైదరాబాద్‌లో స్వాధీనం చేసుకున్న రూ.11 కోట్ల వివరాల నివేదికను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు సోమవారం. ఏసీబీ కోర్టులో అందజేశారు. సిట్ సీజ్ చేసిన సొమ్మును విజయవాడ మాచవరం ఎస్‌బీఐ శాఖలో జమ చేసిన సంగతి తెలిసిందే. ఆ నోట్ల సీరియల్ నంబర్లను నమోదు చేయాలనీ, వీడియో తీసేలా ఆదేశించాలని నిందితుడు రాజ్ కెసిరెడ్డి కోర్టులో పిటిషన్ వేశారు. నగదు జమ చేసే సమయంలో వీడియోలు, సీసీ కెమెరాల్లోని దృశ్యాలను అందజేయాలని గత వారం అనిశా కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. దీనిపై బ్యాంకు అధికారులు నగదు జమ తాలూకా కౌంటర్‌ఫాయిల్స్, కరెన్సీ చెస్టుకు తరలించినప్పటి దృశ్యాలు, బ్యాంకు లెడ్జర్ పుస్తకాన్ని సీల్డ్ కవర్‌లో న్యాయాధికారికి అందజేశారు.

(c) eenadu

వసుంధర

vasundhara@eenadu.in

చిన్న దెబ్బ చాలు...



అప్పటి వరకూ కంటికి రెప్పలా కాచుకున్న పసిపిల్లలకు ఎదిగేకొద్దీ కాస్త స్వేచ్ఛనిస్తాం. అప్పుడే కదా వాళ్లూ అన్నీ నేర్చుకునేది. ఈ క్రమంలో వాళ్ల ఉరుకులు, పరుగులు అన్నీ ఇన్నీ కావు. దెబ్బలూ మామూలే. అయితే, మెదడుకి తగిలే గాయాల విషయంలో మాత్రం జాగ్రత్తగా ఉండాలంటున్నారు శాస్త్రవేత్తలు. ఎందుకంటే... పిల్లల మెదడుకు తగిలిన ఒక్క చిన్న గాయం కూడా వాళ్లపై ప్రతికూల ప్రభావం చూపిస్తుంది. దీనివల్ల ఉన్నత చదువులు చదువుకునే అవకాశం 15శాతం తగ్గిపోతుందని ఫిన్లాండ్‌లోని టాంపరే యూనివర్సిటీ అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ మెదడు గాయాలు దీర్ఘకాలంలో పిల్లల్లో లర్నింగ్, కాగ్నిటివ్ సామర్థ్యాలను దెబ్బతీసి చదువుల్లో వెనకబడేలా చేస్తాయి. అదే మెదడులో రక్తస్రావం జరిగిన వారిలో అయితే, ఉన్నత చదువుల్లో వెనకబడే శాతం 22గా ఉంది. అంతెందుకు... చిన్న బొప్పి కూడా దీర్ఘకాలంలో ప్రతికూల ప్రభావం చూపించే ప్రమాదం ఉంది. ఈ పరిశోధనకోసం శాస్త్రవేత్తలు లక్షమందికి పైగా 25ఏళ్లు దాటిన విద్యార్థుల సమాచారం తీసుకున్నారు. వారిలో చిన్న వయసులో మెదడు గాయాలకు చికిత్స తీసుకున్న వారినీ, తీసుకోని వారినీ పోల్చి చూశారు. చదువుల తీరును విశ్లేషించి ఈ విషయం తేల్చారు. కాబట్టి పిల్లలు ఆటలాడేటప్పుడు తలకు గాయాలవకుండా చూసుకోవటం ముఖ్యం.



టీనేజీ ప్లాన్ చేద్దాం!

ఆడపిల్ల పుట్టిందని సంతోషించేలోపే... అమ్మాయిలు చకచకా ఎదిగిపోతారు. ఇక యవ్వనంలోకి అడుగుపెట్టే ముందు అమ్మల టెన్షన్ అయితే మాటల్లో చెప్పడమూ కష్టమే. శారీరకంగా, మానసికంగా బోలెడు మార్పులు. వాటిని అర్థమయ్యేలా చెప్పలేక సముదాయించలేక తల్లులు నానా తిప్పలు పడతారు. దీన్ని ప్రణాళిక ప్రకారం చేస్తే... ఆ సమయంలోనే కాదు, వారి భవిష్యత్తుకీ మేలు చేసినవారు అవుతారు.

తోడు కావాలి...

టీనేజీ... అమ్మాయిల్లో భావోద్వేగాలు అభివృద్ధి చెందే వయసిది. అందుకే ఈ దశలోకి చేరడానికి ముందు నుంచే ఇంట్లో, స్కూల్లో వాళ్లకి ఏ పరిస్థితుల్లోనైనా మేం తోడుంటామన్న భరోసా కలిగేలా చేయాలి. అందుకోసం వాళ్లు చెప్పేది వినాలి. ఆలోచనలను గౌరవించాలి. అంతేకానీ ప్రతి చిన్నదానికీ కోప్పడకూడదు. లేదంటే అన్నీ దాయడం మొదలుపెడతారు. క్రమంగా అమ్మానాన్నలకు దూరమవుతారు. వాళ్లకీ వ్యక్తిత్వం, ఆత్మగౌరవం ఉంటాయి. వాటికి భంగం కలగకుండా చూసుకుంటేనే ముున్ముందూ ధైర్యంగా ఉండగలుగుతారు.

రహస్యం ఎందుకు?

దేశంలో చాలావరకూ అమ్మాయిలకు నెలసరి గురించి తెలిసేది స్వీయానుభవంతోనే! లేదంటే ఇంట్లో తనకంటే పెద్దమ్మాయిలు ఉన్నప్పుడు పరిచయమవుతుంది. అప్పటివరకూ రహస్యమే. కానీ తొలిసారి తనలోని మార్పు అర్థం కాక ఆ చిన్నారి ఎంత భయపడుతుందో తెలుసా? అందుకే దానిగురించి కొద్దికొద్దిగా పరిచయం చేయాలి. అప్పుడే ఆరోజు వచ్చాక భయం ఉండదు. పీరియడ్ గురించిన సందేహాలు అడిగినా ఇబ్బందిపడకుండా చెప్పండి. ఈ చనువు ఉండేదీ అమ్మ దగ్గరే. మనమే దాస్తే... దాని తాలూకు ఇబ్బంది ఏదొచ్చినా వాళ్లూ దాయడం మొదలుపెడతారు. ఇది అంత మంచిది కాదు. నెలసరి శుభ్రత, ప్యాడ్ మార్చుకోవడం, ఆరోజుల్లో ఉండే ఇబ్బందులకు చిట్కాలు, భావోద్వేగాల్లో మార్పులు... వీటన్నింటి గురించీ అమ్మాయితో మాట్లాడాల్సిందే.

ఆరోగ్యంగా తినిపించండి

నెలసరి మొదలవ్వగానే ఆరోగ్యం అంటూ సంప్రదాయ వంటకాలన్నీ అలవాటు చేస్తాం. నిజమే అవి ఆరోగ్యానికి మంచిదే. కానీ ఒకేసారి మార్పుని పిల్లలు తట్టుకోలేరు. నెమ్మదిగా ముందు నుంచే అలవాటు చేయాలి. టీనేజీలోకి అడుగుపెడుతోంటే పోషకాహారంపై మరింత దృష్టిపెట్టాలి. నిజానికి చదువుల పేరుతో వాళ్లూ, మనం ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తాం. కానీ ఎక్కువ ప్రొటీన్, తక్కువ ఫ్యాట్, కార్బోహైడ్రేట్లు, అధిక మొత్తంలో విటమిన్లు, మినరళ్లు అందేలా చూసుకోవాలి. అవసరమైతే ఒకరోజు ముందుగానే ఏం పెట్టాలో ప్లాన్ చేసుకోవాలి. ఇలా చేస్తే ఆరోగ్యంగా ఎదుగుతారు. త్వరగానూ అలసిపోరు. నీళ్ల విషయంలోనూ జాగ్రత్త. సరిగ్గా తాగకపోతే డీహైడ్రేషన్‌తోపాటు ఇన్‌ఫెక్షన్ల బారిన పడే ప్రమాదం ఉంది. కాబట్టి, కనీసం 10 గ్లాసులు తాగేలా చూసుకోవాలి. టీ, కాఫీలు, కూల్‌డ్రింక్, ఫ్లేవర్డ్, ఆర్టిఫిషియల్ స్వీటెన్డ్ డ్రింకులకు వీలైనంత దూరంగా ఉంచండి. పండ్లరసాలు, జావలు వంటివి ఇచ్చినా చక్కెర లేకుండా చూసుకోవాలి.

మార్పులకు తగ్గట్టుగా...

యవ్వనంలోకి అడుగుపెట్టడం ఆలస్యం యాక్నే, శరీరంలో మార్పులు అంటూ బోలెడు ఇబ్బందులు పలకరిస్తాయి. 'అందరికీ వచ్చేవే' అని చెప్పడం మనకు సులువే. అంతే తేలికగా వాళ్లు తీసుకోలేరు. అందంపై అనవసర శ్రద్ధ పెడుతున్నారని విసుక్కోక సాయం చేయండి. చర్మాన్ని శుభ్రంగా ఉంచుకోవడం, మొటిమలు గిల్లకుండా ఉండటం, తగిన ఫేస్ వాష్, క్రీములు వాడేలా చూడటం, ఇంటి చిట్కాలు పాటించడం... ఇవన్నీ వాళ్ల ఇబ్బందిని తగ్గించేవే. అవాంఛిత రోమాలు, జననేంద్రియాల శుభ్రత వంటివీ పరిచయం చేయాలి. అలాగే శరీరంలో వచ్చే మార్పులను సానుకూలంగా తీసుకోమనాలి. తగిన లోదుస్తులనీ అందించాలి. ఈ సమయంలో తోటివారితో పోలికలు మొదలవుతాయి. వారితో ఏమాత్రం భిన్నంగా ఉన్నా ఆత్మన్యూనతకీ లోనవుతారు. ఎవరికి వారే ప్రత్యేకం. ఈ విషయం అమ్మాయికి అర్థమయ్యేలా చెప్పాల్సిందీ అమ్మే.

విశ్రాంతికీ సమయం

30 దాటాయో లేదో అనారోగ్యాలంటూ బాధ పడుతున్న రోజులివి. మీ అమ్మాయికి ఆ పరిస్థితి వద్దంటే రోజూ అరగంటైనా వ్యాయామం చేసేలా చూడండి. భవిష్యత్తులో జీవనశైలికి సంబంధించిన అనారోగ్యాల నుంచి తప్పించుకుంటుంది. అలాగే అరగంట యోగా, ధ్యానం, కథల పుస్తకాలు చదవడం, బొమ్మలు గీయడం వంటి వాటికి కేటాయించేలా చూసుకోండి. ఇవి మనసుపై సానుకూల ముద్ర వేస్తాయి. ఎలాంటి పరిస్థితుల్లోనైనా బ్యాలెన్స్‌డ్‌గా ఉండేలానూ చూస్తాయి. నిద్రనీ అశ్రద్ధ చేయనీయొద్దు. ముఖ్యంగా పరీక్షల సమయాల్లో ఒత్తిడికి లోనవుతూ నిద్రను నిర్లక్ష్యం చేస్తుంటారు. సిస్టమాటిక్‌గా చదవడం అలవాటు చేయండి. అప్పుడు ఆఖరి క్షణంలో ఈ ఒత్తిడి ఉండదు. త్వరగా పడుకుని లేవడం నేర్పండి. దానికి తగ్గ వాతావరణం, దుస్తులు వగైరా అమరిస్తే ఆరోగ్యానికి ఆరోగ్యం, మనసుకీ హాయి.

చివరగా... వద్దు అన్న వాటి గురించే ఎక్కువ తెలుసుకోవాలి అనుకుంటారు ఈ వయసు వాళ్లు. అందులో లైంగిక విషయాలూ ఒకటి. దాని గురించి అవసరమైన మేరకు చెప్పండి. ఇది వారి అనుమానాలను తొలగించడమే కాదు, ఎవరైనా తప్పుగా ప్రవర్తిస్తే పెద్దవాళ్లకు చెప్పే ధైర్యాన్నీ ఇస్తుంది. ఇదీ సానుకూలాంశమే... ఆలోచించండి. టీనేజీని ప్లాన్ చేయండి.

చదవండి... తీసుకోండి!



రీల్స్, షార్ట్స్ అంటూ యువత గంటలకొద్దీ ఫోన్‌తో కాలక్షేపం చేస్తున్న రోజులివి. విజ్ఞాన భాండాగారాలైన గ్రంథాలయాలవైపు వాళ్లను తీసుకొచ్చేందుకు వినూత్న ప్రయోగాలు చేపడుతున్నారు విజయవాడ సర్వోత్తమ గ్రంథాలయ నిర్వాహకురాలు రావి శారద.

గ్రంథాలయ ఉద్యమ నాయకుడు పాతూరి నాగభూషణం రెండో కుమార్తె శారద. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ప్రధాన కార్యదర్శిగానూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. విజయవాడలో 1987లో సర్వోత్తమ గ్రంథాలయం ఏర్పాటైనప్పట్నుంచీ కార్యదర్శిగా పనిచేస్తున్నారీమె. పటమటలోని గుత్తికొండ అచ్చయ్య గ్రంథాలయానికి కార్యదర్శిగా ఉన్నారు శారద. తెలుగు రాష్ట్రాల్లోని రెండు వేల ప్రభుత్వ పాఠశాలల్లో లైబ్రరీల ఏర్పాటుకు కృషిచేశారు. 'బేసిక్ రీసెర్చ్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్‌మెంట్' పథకం కింద వీటిని నిర్వహిస్తుండగా... ఈ ప్రాజెక్టుకి డైరెక్టర్ హోదాలో ఉన్నారు శారద. 'గ్రంథాలయ సర్వస్వం' మాసపత్రికకు ఎడిటర్‌గానూ వ్యవహరిస్తున్నారు. శత వసంత సాహితీ మంజీరాలు, బాల సాహితీ సూచి పుస్తకాలకు సంపాదకత్వం వహించారు.

2.5లక్షల పుస్తకాల పంపిణీ

మూడు అంతస్తుల్లో విస్తరించి ఉండే సర్వోత్తమ గ్రంథాలయంలో 65 వేల పుస్తకాలు, 1.30 లక్షల ఈ-బుక్స్ అందుబాటులో ఉన్నాయి. సుమారు వెయ్యికి పైగా పునర్ముద్రణకు నోచుకోని పుస్తకాలను పీడీఎఫ్ రూపంలో భద్రపరిచారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువత ఇక్కడికి ఎక్కువగా వస్తుంటారు. తమ ఇళ్లలోని పుస్తకాలను ఈ గ్రంథాలయానికి అప్పగించేవారు ఎక్కువయ్యారు. వాటికి మరికొన్నింటిని జతచేసి తొలిసారిగా 2015లో ఉచితంగా పంపిణీ చేశారు. ఆపై పుస్తక సేకరణకు ప్రత్యేకంగా గ్రంథాలయ ప్రాంగణంలో హుండీ ఏర్పాటుచేశారు. ఇలా సేకరించిన వాటిని ఏటా ప్రపంచ పుస్తక దినోత్సవం(ఏప్రిల్ 23) సందర్భంగా ఉచితంగా అందిస్తున్నారు. ఇప్పటివరకు 2.5 లక్షలకు పైగా పుస్తకాలు పంపిణీ చేశారు. చిన్నారులకు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలనే ఉద్దేశంతో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. అబ్దుల్ కలామ్ పేరుతో పిల్లల విభాగాన్నీ ప్రారంభించారు. ఈ ఏడాది చిన్నారుల కోసం టాయ్ లైబ్రరీ ఏర్పాటుచేసి పుస్తకాలతోపాటు ఆట వస్తువులనూ అందుబాటులో ఉంచారు. అలా చిన్నారులకు పుస్తకాలు చదవడం అలవాటు చేస్తున్నారు. గ్రంథాలయాలకు పూర్వ వైభవం తేవడమే లక్ష్యంగా పెట్టుకున్నారు శారద.

– పామర్తి మహేష్, విజయవాడ

స్క్రోలింగ్ ఆపి... పుస్తకం పట్టుకోండి!



'ఇంకొక్క అయిదు నిమిషాలు... వచ్చేస్తున్నా'... అమ్మ ఎందుకో పిలుస్తుంటుంది. అటునుంచి వచ్చే సమాధానమేమో ఇది. ఈ మాట వినీ వినీ విసిగిపోయిన ఆ తల్లి 'ఇప్పటికి ఎన్నిసార్లు పిలిచానో. ఇదే చెబుతున్నావ్. అంత అర్జెంటు పని ఏం చేస్తున్నావ్?' అనడిగితే... చేతిలో పుస్తకం చూపించి 'వచ్చేస్తున్నా. ఇంకొంచెమే! మధ్యలో ఉంది, పూర్తిచేసి వచ్చేస్తా' అంటూ ఒప్పించడం. ఒకప్పుడు ఈ సీన్ దాదాపు అన్ని ఇళ్లల్లోనూ కనిపించేది. ఇప్పటికీ ఈ మాటలు సాధారణంగా వినపడతాయి కాకపోతే పుస్తకం స్థానంలో మొబైల్ వచ్చి చేరిందంతే! కానీ ఒకప్పుడు పుస్తకమే ప్రపంచం. దాన్ని చేతిలోకి తీసుకొని స్పృశిస్తూ... తిప్పే పేజీలనుంచి వచ్చే సువాసనలు ఆస్వాదిస్తోంటే ఆ అనుభూతే వేరు. తిండి, వేడుకలు మాని మరీ ఆ లోకంలో గడిపేసేవాళ్లం. పదాల వెంట కళ్లు పరుగెడుతోంటే ముఖంలో సంతోషం, దుఃఖం, కోపం వంటి ఎన్నెన్నో భావాలు... గమనించకుండానే ఏర్పడేవి. నవల, కథల్లోని... పాత్రలు మనతో మాట్లాడేవి. బోలెడు విషయాలు నేర్పేవి. ఎన్నో దశాబ్దాలు, శతాబ్దాల అనుబంధం. కొన్నేళ్లలోనే ఆ చోటుని భర్తీ చేసింది మొబైల్. సోషల్ మీడియా, రీల్స్ రూపంలో ఆక్రమించేసింది. అలాగని చదవడం లేదా అంటే చదువుతున్నారు. కాకపోతే తెరలమీదే! కానీ గమనించారా? ఒకప్పుడు పుస్తకం చదువుతున్న కొద్దీ తెలియని ఉత్సాహం. కానీ మరిప్పుడు? రీల్స్, తెరమీది కథలూ కట్టిపడేసేవే. కానీ కళ్ల అలసట, మనసు, మెదడుపై చూపే ప్రభావమూ తక్కువేమీ కాదు. కాబట్టి, ఓసారి పుస్తకాల దగ్గరకు వెళ్లండి. మనసారా చేతిలోకి తీసుకోండి. ఓ కప్పు టీ లేదా కాఫీ, వెచ్చగా దుప్పటి సాయం తీసుకుని చదవడాన్ని ఆస్వాదించి చూడండి. మనసు తేలికపడటం అనే అనుభూతిని తిరిగి పొందుతారు. ఒంటరిగా కష్టమైతే రీడింగ్ క్లబ్‌లు, లైబ్రరీలనూ ఆశ్రయించొచ్చు. ఇది డిజిటల్ డీటాక్స్‌లా పనిచేయడమే కాదు... పరిజ్ఞానాన్ని పంచుతుంది, మిమ్మల్ని మీకు కొత్తగా పరిచయం చేస్తుంది. కాబట్టి, స్క్రోలింగ్ ఆపి... మళ్లీ పుస్తకం పట్టి చూద్దామా మరి.

గ్రామస్వరాజ్యమే లక్ష్యంగా..!

కట్టుబాట్ల పేరుతో వంటింటికి పరిమితమైన మహిళలకి స్వేచ్ఛనివ్వాలనుకుందామె. చదువే వాళ్ల పరిస్థితుల్లో మార్పు తీసుకువస్తుందని నమ్మింది. అందుకు అనుగుణంగా ప్రణాళికలు తయారుచేసుకుంది. గ్రామంలో లైబ్రరీ కట్టించింది శేషన్‌దీప్ కౌర్ సిద్ధూ.



శేషన్‌దీప్‌ది పంజాబ్‌లోని బఠిండా జిల్లాలో మనక్ ఖానా గ్రామం. ఆ ఊళ్లో ఆడవాళ్లు బయటికి రావడమే గగనం. చుట్టూ ఉన్న సమాజంలో ఎన్ని మార్పులు వచ్చినా... 'మేం ఇంతే, మా కట్టుబాట్లు మార్చుకోం' అనేవాళ్లే ఎక్కువ. అలాంటి గ్రామంలో పుట్టి పెరిగింది శేషన్‌దీప్. అక్కడ ఈమె కుటుంబంలోనే కాస్తో కూస్తో చదువుకున్న వాళ్లు ఉన్నారు. దాంతో ఈమె చదువుకుంటా అంటే ప్రోత్సహించారు. ఐఏఎస్ అయ్యి, ప్రజలకు సేవ చేయాలి, ఉత్తరాదిలో సంప్రదాయాల పేరిట పాతుకుపోయిన అనాగరిక కట్టుబాట్లని నివారించాలని కలలు కంది శేషన్‌దీప్. 2018లో దిల్లీలో శిక్షణ కూడా తీసుకుంది... కానీ విఫలమైంది. సెలవులకు ఊరికి వచ్చిన ఆమెకు... అనుకోకుండా సర్పంచ్ అయ్యే అవకాశం వచ్చింది. ఇంకెవరైనా అయితే మా వల్ల కాదని చేతులెత్తేసే వారే. కానీ ఈమె మాత్రం అలా అనలేదు... దీన్నో మంచి అవకాశంగా భావించింది. అలా తన గ్రామానికి తొలి మహిళా సర్పంచ్‌గా బాధ్యతలు తీసుకుంది.

మహిళల పేర్లతో బోర్డులు...

'సర్పంచ్ విధి విధానాలు, ఏం చేయాలి, ఎక్కణ్నుంచి ప్రారంభించాలి... ఇవేవీ నాకు తెలియదు. తొలినాళ్లలో చాలా గందరగోళంగా అనిపించేది. దిల్లీలో మహిళా సాధికారతను చూసిన తర్వాత, అదే పరివర్తన నా గ్రామంలోనూ రావాలని మాత్రం కోరుకున్నాను. మహిళలకి ఆర్థికంగా, సామాజికంగా గుర్తింపును ఇవ్వాలనుకున్నా. 'అమ్మాయి గ్రామాన్ని నడిపించడమా, ఇప్పుడు ఆమె చెబితే మేం వినాలా' లాంటి మాటలు చాలానే ఎదురయ్యాయి. వాటన్నింటినీ అధిగమించడానికి నేనో సైన్యాన్ని తయారుచేసుకున్నా. అనుభవజ్ఞులు, ఇంతకు ముందు పనిచేసిన సర్పంచుల సహాయాన్ని కోరాను. వాళ్ల సలహాలు, సూచనలతో అడుగులు వేయడం మొదలుపెట్టా. అలా నేను చేసిన మొదటి పని లైబ్రరీల నిర్మాణం... 'మన గ్రామానికి ఇప్పుడు గ్రంథాలయం ఎందుకు? ఈమె పిచ్చి కాకపోతే' అని నా ఆలోచనని కొట్టి పారేసిన వారే ఎక్కువ. కానీ కొన్ని వందల పుస్తకాలతో ఏర్పాటైన ఈ లైబ్రరీ... అన్ని వయసుల వారికీ ముఖ్యంగా మహిళలకు ఇది చాలా ఉపయోగపడింది' అనే శేషన్‌దీప్... పార్కులు కట్టించింది. ఇంటి పనులకు మాత్రమే పరిమితమైన మహిళలు వారానికోసారైనా అక్కడికి వచ్చేలా ప్రణాళికలు వేసింది. గ్రామసభల్లో మహిళల్ని భాగం చేసింది. అలా ఆమె తీసుకొచ్చిన మరో సంస్కరణ... గృహిణుల పేరుతో నేమ్‌బోర్డ్స్. ఇంటిని నిర్వహించే మహిళల కష్టాన్ని మనం కాకపోతే ఇంకెవరు గుర్తించేది అంటూ నేమ్‌బోర్డులను తయారుచేయించింది. వాటిని ఇంటిముందు ఉంచే విధంగా అందరినీ ఒప్పించింది. తన పదవీ కాలం పూర్తైనా 'రీడ్ ఇండియా' ప్రాజెక్టు ద్వారా గ్రామంలోని మహిళలకు కుట్టు, కంప్యూటర్, చేతిపనుల్లో శిక్షణ ఇప్పిస్తోంది. కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌కు మార్గనిర్దేశం చేస్తూ... పదవీ కాలం పూర్తైనా గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న శేషన్‌దీప్ ప్రయాణం స్ఫూర్తిదాయకం కదూ!



శేషన్‌దీప్



మహిళలు తమ మనసు మాట వినాలి. అవసరమైనప్పుడు మనసులోని మాటని నిర్భయంగా బయటకు చెప్పాలి. మహిళలు చాలా శక్తిమంతులు... తమ శక్తిసామర్థ్యాలను వినియోగించడంలో సందేహ పడకుండా ముందడుగు వేయాలి.

- విజీ వెంకటేష్, క్యాన్సర్ చికిత్స నిపుణురాలు

బకాయిలు చెల్లిస్తేనే... రిజిస్ట్రేషన్ అవుతుందా!

మా తల్లిదండ్రులకు నేనొక్కదాన్నే కూతుర్ని. అమ్మ చనిపోయాక నాన్న... నాకూ, నా బిడ్డలకూ ఆస్తిని పంచుతూ వీలునామా రాశారు. అయితే, ఆ ఆస్తిమీద బ్యాంకులో లోను ఉంది. ఇప్పుడు మా పేర్ల మీదకు మార్చుకోవాలంటే ముందు బ్యాంకుకి బకాయిలు చెల్లించాలా? నాన్న వయసు మీద పడటంతో స్థిరత్వం లేక... రకరకాలుగా మాట్లాడుతున్నారు. ఇప్పుడు మేమేం చేయాలో చెప్పగలరు? – ఓ సోదరి

మీరు చెప్పినదాని ప్రకారం మీ నాన్నగారు మీకూ, మీ పిల్లలకూ చెందేటట్లు వీలునామా రాసినట్లుగా తెలుస్తోంది. విల్లు అనేది ఎప్పుడూ... రాసిన వారి తదనంతరమే చెల్లుబాటు అవుతుంది. అంతేకాదు, మీ అమ్మగారి పేరు మీద ఉన్న పొలానికి... మీ నాన్నగారు వీలునామా రాస్తే చెల్లదు. ఆవిడ తన పేరున ఉన్న పొలాన్ని భర్త పేరు మీదకు ఏమైనా మార్పించారా అన్నది తెలియాలి. ఇక, మీ అమ్మగారి ఆస్తికి వారసులుగా నిరూపించుకోవడానికి మీరూ, మీ నాన్నగారు డిక్లరేషన్ ఆఫ్ లీగల్ హెయిర్స్ సూట్ వేయాలి. అప్పుడు ఆవిడ ఆస్తిని రెండు భాగాలు చేస్తే ఒకటి మీకూ, మరొకటి మీ తండ్రికీ వస్తుంది. అంతేకాదు, మీ నాన్నగారు రాసిన వీలునామా ఆయన చనిపోయిన తర్వాతే అమల్లోకి వస్తుంది. ఆ ఆస్తిమీద ఏమైనా తనఖాలుంటే అవి తీరిన తరవాతనే మీ పేరు మీదకు మారుతుంది. ఆ వీలునామాతో ఆస్తిని మీ పేరు మీదకు రిజిస్ట్రేషన్ చేసుకోవడం కుదరదు. మీ నాన్న బతికే ఉన్నారు కదా! ఒకవేళ మీరు ఇప్పుడే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి అనుకుంటే... గిఫ్ట్ డీడ్ రాయమనండి. ఆయన తన పేరున ఉన్న ఆస్తికి మాత్రమే వీలునామా రాయగలరు. ముందు మీరొక లాయర్‌ని కలిసి... మీ నాన్న ఆస్తి వరకూ వీలునామా రాయించుకుని రిజిస్ట్రేషన్ చేయించుకోండి.



డియర్ వసుంధర

జి. వరలక్ష్మి, న్యాయవాది

నా బిడ్డకు ఆస్తి దక్కాలంటే..?

మా మామగారికి ఇద్దరు కొడుకులు, ముగ్గురు కూతుళ్లు. ఆయనకు పొలాలు, అద్దె వచ్చే షాపులు ఉన్నాయి. నా భర్త అందరిలో కెల్లా చిన్న. ఆయన 2016లో కరెంట్‌షాక్‌తో చనిపోయారు. అప్పటికే మాకో కొడుకు. అప్పటి నుంచి నేను కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నా. మా బావలు... మా పిల్లాడికి ఆస్తి ఇవ్వనివ్వడం లేదు. దాన్ని అతడికి చెందేలా చేయాలంటే నేనేం చేయాలి? – ఓ సోదరి

మీ మామగారి ఆస్తి ఆయన స్వార్జితమా? పిత్రార్జితమా తెలియలేదు. ఆయన స్వార్జితం అయితే ఎవరికైనా ఇవ్వొచ్చు. పిత్రార్జితం అయితే హిందూ వారసత్వ చట్టంలోని సెక్షన్-8 ప్రకారం క్లాస్-1 వారసులకు చెందుతుంది. అందులో కొడుకులు, కూతురు, భార్య, తల్లి, చనిపోయిన కొడుకు పిల్లలు, చనిపోయిన కూతురి పిల్లలు అందరూ వస్తారు. ముందుగా మీ మామగారి పేరు మీద ఉన్న ఆస్తి ఆయనకు ఎలా వచ్చిందో తెలుసుకోండి. దానికి సంబంధించిన కాగితాలు సంపాదించండి. అది ఆయనకు పిత్రార్జితం అయితే, అందులో మీ అబ్బాయి వాటా కోరుతూ భాగస్వామ్య దావా వేయండి. ఒక వేళ అది స్వార్జితపు ఆస్తి అయితే మాత్రం ఆయన ఎటువంటి వీలునామా రాయకుండా చనిపోతే అప్పుడు మాత్రమే మీ అబ్బాయికి అది పిత్రార్జితపు ఆస్తి అవుతుంది. హిందూ అడాప్షన్ అండ్ మెయింటెనెన్స్ యాక్ట్ ప్రకారం మీ మామగారి మీద మెయింటెనెన్స్ కోరుతూ దావా వేయవచ్చు. లేదా గృహహింస చట్టం కింద మీ పిల్లలను నిర్లక్ష్యం చేస్తూ ఆస్తి ఇవ్వకుండా, పోషించకుండా హింసిస్తున్నారని కూడా పిటిషన్ దాఖలు చేయవచ్చు. వాళ్లు అనుభవిస్తున్న ఆస్తిలో నుంచి మెయింటెనెన్స్, మీ పెళ్లప్పుడు ఇచ్చిన కట్నకానుకలు... అన్నీ శాశ్వత పరిహారం లేదా నెలవారీ నిర్వహణ ఖర్చులు కోరవచ్చు.

బంగారం - వెండి

11న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,02,950	94,150	1,16,919
విజయవాడ	1,00,400	93,750	1,17,500
ప్రొద్దుటూరు	1,00,700	92,640	1,17,100
రాజమహేంద్రవరం	1,02,280	93,750	1,27,000
విశాఖపట్నం	1,01,900	93,750	1,25,000
తమిళనాడు	-----	93,750	1,27,000

మీకు తెలుసా?

నవజాత శిశువుల పుర్రెభాగంలోని ఎముకలు పూర్తిగా అభివృద్ధి చెంది ఉండవట. స్కల్‌లో ఉండే ఫాంటనెల్లెస్ అనే మెత్తని స్పాట్‌లు, సహజ ప్రసవంలో శిశువు తల తేలిగ్గా బయటకు వచ్చేందుకు తోడ్పతాయట. ఈ ఫ్లెక్సిబిలిటీ వల్లే నవజాత శిశువుల తల ఆకారం... వాజినల్ కెనాల్ ఆకృతిలో ఉంటుందట.



ఆహ్వానం

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

మనసు దోచే ముత్యాల నగలు!



పాల మీగడ రంగులో మెరిసిపోయే ముత్యాలను మెచ్చని మగువలుంటారా? అందుకే, తరాలు మారినా, కాలాలు కరిగిపోయినా వాటిది వన్నె తరగని హవా. దాంతో, ఎప్పటికప్పుడు వీటిని సరికొత్తగా మార్చి మార్కెట్లోకి తెస్తుంటారు నగల డిజైనర్లు. వరుసల్లో గుచ్చిన ముత్యాలూ, పగడాలతో చేసినవీ, పెండెంట్లతో డిజైన్ చేసినవీ, గుత్తపూసలతో ఉన్నవీ... ఇలా ఎన్నెన్నో రకాలు నిన్నమొన్నటి వరకూ సందడి చేశాయి. ఇప్పుడు ట్రెండు మారింది. ఆభరణాలు ఆధునికంగానే కాదు. సంప్రదాయాన్నీ ప్రతిబింబించాలని కోరుకుంటున్నారు. పెళ్లి నగల్లోనూ వీటికి చోటిస్తున్నారు. ఇందుకోసం భిన్న సైజులూ విభిన్న పరిమాణాల్లో ఉండే ముత్యాలను ఒకే నగలో ఉండేలా ఎంతో ఆకర్షణీయంగా చేస్తున్నారు. వీటిని మెడలో వేసుకుంటే ముత్యాల మెరుపూ దానితో రెట్టింపయ్యే సొగసుతో ఆకట్టుకోవచ్చు. బాగున్నాయి కదూ!











భార్య మృతదేహాన్ని బైక్‌కు కట్టుకొని



నాగ్‌పుర్: రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన భార్య మృతదేహాన్ని ఓ వ్యక్తి పుట్టెడు దుఃఖంతో ద్విచక్ర వాహనానికి కట్టి తీసుకువెళ్లిన హృదయ విదారక ఘటన మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లో చోటుచేసుకుంది. మధ్యప్రదేశ్‌లోని సియోని జిల్లాకు చెందిన అమిత్ అనే వ్యక్తి తన భార్య(35)తో కలిసి ఆదివారం లోనార్ ప్రాంతం నుంచి నాగ్‌పుర్-జబల్‌పుర్ జాతీయ రహదారి మీదుగా కరణ్‌పుర్‌కు వెళ్తుండగా వేగంగా వచ్చిన ట్రక్కు వారిని ఢీకొట్టింది. దీంతో వాహనం పైనుంచి పడిన మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. తన భార్యను ఆస్పత్రికి తరలించడానికి సహాయం చేయాలని అక్కడున్న వారిని వేడుకున్నప్పటికీ ఎవరూ ముందుకు రాకపోవడంతో చివరికి ఆమె ప్రాణాలు కోల్పోయింది. దీంతో మృతదేహాన్ని ద్విచక్ర వాహనానికి కట్టుకొని తమ గ్రామానికి బయలుదేరాడు. సమాచారం అందుకున్న పోలీసులు అతడిని ఆపి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

స్లీప్ అప్నియాపై 'సమర శంఖం'!



దిల్లీ: శంఖం ఊదడం ద్వారా స్లీప్ అప్నియా బాధితులు ఉపశమనం పొందొచ్చని పరిశోధకులు తేల్చారు. ఇలాంటివారికి శ్వాస వ్యాయామాల కన్నా ఇదే ఎక్కువ ప్రయోజనం కలిగిస్తుందని పేర్కొన్నారు. రాజస్థాన్‌లోని జైపుర్‌కు చెందిన ఎటర్నల్ హార్ట్ కేర్ సెంటర్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ నిపుణులు ఈ పరిశోధన చేశారు. అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా అనే ఈ రుగ్మత కారణంగా.. నిద్రపోతున్నప్పుడు గొంతులోని కండరాలు కుంచించుకుపోతాయి. ఫలితంగా శ్వాస ఇబ్బంది కలుగుతుంది. రక్తంలో ఆక్సిజన్ స్థాయి పైనా ప్రభావం పడుతుంది. దీనివల్ల నిద్ర నాణ్యత దెబ్బతింటుంది. ఫలితంగా రోజంతా అలసట, నిద్రమత్తు ఆవహిస్తుంది. తాజాగా జైపుర్ పరిశోధకులు.. ఈ రుగ్మత ఒక మోస్తరు స్థాయిలో ఉన్న 30 మందిని ఎంపిక చేశారు. ఈ వాలంటీర్లలో సగం మందికి రోజుకు 15 నిమిషాల పాటు శంఖం ఊదేలా శిక్షణ ఇచ్చారు. ఆరు నెలల విరామం తర్వాత వాలంటీర్లను పరిశీలించగా శంఖం ఊదినవారికి [illegible] తేలింది. వీరిలో పగటిపూట నిద్రమత్తు 34 శాతం తగ్గినట్లు వెల్లడైంది. అలాగే నిద్ర సమయంలో వారి రక్తంలో ఆక్సిజన్ స్థాయి కూడా మెరుగుపడినట్లు పరిశోధకులు గుర్తించారు.

చిన్నారిని నేలపై పడేసి.. పదే పదే కొట్టి..



నొయిడా: ఉద్యోగాలు చేసే దంపతుల్లో చాలా మంది తమ పిల్లలను డే కేర్ సెంటర్లలో వదిలి విధులకు వెళ్తుంటారు. అక్కడైతే తమ చిన్నారులను కంటికి రెప్పలా సంరక్షిస్తారని వారు విశ్వసిస్తుంటారు. అయితే వారి నమ్మకాన్ని వమ్ము చేసేలా ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఓ డే కేర్ సిబ్బంది పసిపాప పట్ల దారుణంగా వ్యవహరించారు. నొయిడాకు చెందిన జంట ఇటీవల తమ 15 నెలల పాపకు దుస్తులు మారుస్తున్నప్పుడు తొడలపై కొరికిన గుర్తులు ఉన్నట్లు గుర్తించారు. డే కేర్ సెంటర్‌కు వెళ్లి సీసీటీవీ ఫుటేజీ పరిశీలించగా.. అక్కడ ఆయాగా పని చేసే యువతి చిన్నారి గుక్కపెట్టి ఏడుస్తుండటంతో సహనం కోల్పోయి నేలపై పడేసి పదే పదే కొడుతున్న దృశ్యాలు చూసి వారు దిగ్భ్రాంతికి గురయ్యారు. దీనిపై అక్కడి యాజమాన్యాన్ని ప్రశ్నించగా తమను దుర్భాషలాడారంటూ ఆ దంపతులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఆయాను అదుపులోకి తీసుకున్నారు.



రికార్డుల విత్తన బంతులు

తిరువనంతపురం: కేరళ రాజధాని తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టిన విత్తన బంతుల ప్రాజెక్టు.. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులకెక్కింది. విద్యార్థులతో కలిసి తాను చేపట్టిన ఈ ప్రాజెక్టును లండన్ కేంద్రంగా పని చేసే సంస్థ గుర్తించిందని మేయర్ ఆర్య ఎస్ రాజేంద్రన్ సోమవారం వెల్లడించారు. ఇందులో 6 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారని వివరించారు. ఈ నెల 9న 3 గంటల్లో తిరువనంతపురంలోని పుథరీకందం మైదానంలో 4 లక్షల విత్తన బంతులను విసిరామని తెలిపారు.

రెండు బిల్లులు.. మూడు నిమిషాలు



లోక్‌సభలో విపక్ష సభ్యుల ఆందోళన

- ఆదాయపు పన్ను చట్టంలో మార్పులకు లోక్‌సభ ఆమోదం

దిల్లీ: కొనసాగుతున్న నిరసనల నేపథ్యంలోనే లోక్‌సభ సోమవారం రెండు బిల్లుల్ని ఆమోదించగలిగింది. 1961 ఆదాయపు పన్ను చట్టం స్థానంలో ప్రవేశపెట్టిన 'ఇన్‌కంటాక్స్ (నంబరు 2) బిల్లు 2025'ని మూడే మూడు నిమిషాల్లో మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. మొదటి ముసాయిదాను ఉపసంహరించుకుని, కొన్నింటిని సరిచేసి నంబరు 2 పేరుతో బిల్లును ప్రవేశపెట్టారు. దీంతోపాటు 'పన్ను చట్టాల (సవరణ) బిల్లు'కు సభ్యులు సమ్మతి తెలిపారు. ఏకీకృత పింఛన్ పథకం చందాదారులకు పన్ను మినహాయింపులు ఇచ్చేందుకు, సకాలంలో ఐటీ రిటర్నులు దాఖలుచేయని వ్యక్తులు కూడా రిఫండును కోరేందుకు ఇది వీలు కల్పిస్తుంది. బిల్లుల్ని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సభలో ప్రవేశపెట్టారు. ఎస్‌ఐఆర్‌పై విపక్షాల ఆందోళనతో చర్చకు తావులేకుండా పోయింది.



కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

ఆరు దశాబ్దాలుగా అమల్లో ఉన్న ఆదాయపు పన్ను చట్టం-1961 స్థానంలో ఈ ఏడాది ఫిబ్రవరిలోనే కేంద్రం కొత్త బిల్లును ప్రవేశపెట్టింది. విపక్షాల అభ్యంతరాలతో దాన్ని సెలెక్ట్ కమిటీకి పంపించింది. దాదాపుగా ఆ కమిటీ సిఫార్సులన్నింటినీ ఆమోదించినట్లు మంత్రి వెల్లడించారు. మొత్తం 8 బిల్లుల్ని లోక్‌సభ ఆమోదించింది. ఎస్‌ఐఆర్‌పై నిరసనలతో మంగళవారానికి వాయిదాపడింది. అంతరాయం కలిగించడాన్ని విపక్షాలు మానుకోకపోతే వాటి భాగస్వామ్యం లేకుండానే బిల్లుల విషయంలో ముందుకు వెళ్లాల్సి ఉంటుందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పష్టంచేశారు.

★ మణిపుర్ ద్రవ్య వినిమయ బిల్లు-2025, మణిపుర్ జీఎస్టీ సవరణ బిల్లు-2025లను రాజ్యసభ చర్చించి లోక్‌సభకు తిప్పిపంపింది. ఎస్‌ఐఆర్‌పై నిరసనలు కొనసాగాయి. మర్చంట్ షిప్పింగ్ బిల్లును ఆమోదించాక సభ వాయిదాపడింది.

శాంతికి సహకరిస్తాం

- ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి కట్టుబడి ఉన్నాం
- జెలెన్‌స్కీతో మోదీ



దిల్లీ: రష్యా-ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న వివాదం శాంతియుత, సత్వర పరిష్కారానికి సాధ్యమైన సహకారాన్ని అందించేందుకు భారత్ కట్టుబడి ఉందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఈ మేరకు ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీకి తెలిపారు. ఆయనతో మోదీ సోమవారం ఫోనులో మాట్లాడారు. ఆ విషయాలను ఇద్దరు నేతలూ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌తో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు భారత్ కట్టుబడి ఉందని జెలెన్‌స్కీతో మోదీ తెలిపారు. శాంతి యత్నాలకు మోదీ మద్దతు పలకడాన్ని జెలెన్‌స్కీ ప్రశంసించారు. "ఉక్రెయిన్ పౌరులకు మద్దతుగా మాట్లాడిన మోదీకి కృతజ్ఞతలు. మా నగరాలు, గ్రామాలే లక్ష్యంగా రష్యా చేపడుతున్న దాడుల గురించి ఆయనకు వివరించాను. ఉక్రెయిన్ శాంతి ప్రయత్నాలకు మద్దతు ఇవ్వడంతోపాటు యుద్ధం ముగింపు వ్యవహారంలో మా భాగస్వామ్యం ఉండాలన్న వైఖరికి భారత్ సానుకూలంగా ఉండటం సంతోషకరం" అని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. మరోవైపు రష్యా ముడి చమురును భారత్ కొనుగోలు చేయడాన్ని ఆయన ప్రస్తావించారు. యుద్ధాన్ని కొనసాగించే రష్యా ఆర్థిక శక్తిని బలహీన పరిచేందుకు ఆ దేశ ఇంధన.. ముఖ్యంగా చమురు ఎగుమతులను పరిమితం చేయాలని జెలెన్‌స్కీ కోరారు. ఈ నెల 15న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధినేత పుతిన్ మధ్య అలస్కాలో భేటీ జరగనున్న క్రమంలో జెలెన్‌స్కీతో మోదీ ఫోన్ సంభాషణ ప్రాధాన్యం సంతరించుకుంది.

వాటిని మీరు రక్షించుకోవాలి



మీ జీవితంలో ఆత్మవిశ్వాసం, ప్రశాంతత, సంతోషం, సానుకూల ఆలోచనాధోరణి ఉండాలని కోరుకుంటున్నారా..? అయితే వాటిని మీరే రక్షించుకోవాలి. అందుకోసం కొందరికి దూరంగా ఉండటం, కొన్ని ఫోన్ నంబర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టడం, కొన్ని ప్రాంతాలకు వెళ్లకపోవడం వంటి పనులు చేయాల్సి వస్తుంది. అందుకు ఎంతమాత్రమూ వెనకాడకండి.

– జూలీ గుర్నర్, పర్ఫార్మెన్స్ కోచ్

యూపీలో మరో ప్రార్థనాస్థలిపై వివాదం

కాన్పుర్: మతపరమైన మరో వివాదం ఉత్తర్‌ప్రదేశ్‌లో తెరపైకి వచ్చింది. ఫతేపుర్ జిల్లా సదర్ తహశీల్‌లోని అబూనగర్‌లో పురాతన ప్రార్థన స్థలం కొన్ని శతాబ్దాల క్రితం ఒక వర్గానికి చెందినదని, అక్కడ ప్రార్థనలు నిర్వహించడానికి అనుమతి ఇవ్వాలని ఒక పార్టీ నాయకుడు, మరో సంస్థ కార్యకర్తలు జిల్లా యంత్రాంగానికి దరఖాస్తు సమర్పించారు. వివాదం రేకెత్తడంతో అక్కడ బారికేడ్లు నిర్మించినా కొంతమంది ఆ ప్రాంగణంలోకి ప్రవేశించి పాక్షికంగా ధ్వంసం చేశారు. దీనిపై విచారణ చేపడుతున్నామని ఎస్పీ అనూప్ కుమార్ సింగ్ వెల్లడించారు. ఇది వెయ్యేళ్లనాటి తమ ప్రార్థన స్థలమని ఒక మతానికి చెందినవారు, శతాబ్దాల క్రితం దీనిని వేరే మతానికి చెందినదిగా మార్చారని మరికొందరు ఆరోపిస్తున్నారు.



ఎంపీల నూతన నివాసాలకు కృష్ణా, గోదావరి నదుల పేర్లు

దిల్లీ: పార్లమెంటు సభ్యుల కోసం దేశ రాజధానిలోని బాబా ఖడక్ సింగ్ మార్గ్‌లో 184 ఫ్లాట్లతో నిర్మించిన నాలుగు టవర్లను ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ప్రారంభించారు. నదులను స్మరించుకుంటూ ఈ టవర్లకు కృష్ణా, గోదావరి, హుగ్లీ, కోసి అనే పేర్లను పెట్టారు. ఈ సందర్భంగా మోదీ ఈ ప్రాంగణంలో సిందూర్ మొక్క నాటారు. అనంతరం భవన నిర్మాణంలో పాలుపంచుకున్న కూలీలతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, పలువురు కేంద్ర మంత్రులు పాల్గొన్నారు.

అమెరికా కర్మాగారంలో పేలుడు

ఒకరి మృతి, పలువురికి గాయాలు

క్లయిర్టన్: అమెరికాలోని పెన్సిల్వేనియా రాష్ట్రం పిట్స్‌బర్గ్ నగర సమీపంలో ఉన్న క్లయిర్టన్ కోక్ వర్క్స్ కర్మాగారంలో సోమవారం పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా పదుల సంఖ్యలో కార్మికులు గాయపడ్డారు. మరికొందరు శిథిలాల కింద చిక్కుకుపోయారు. వారిని రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పేలుడు కారణంగా భారీ ఎత్తున నల్లటి దట్టమైన పొగ వ్యాపించింది. పేలుడుకు కారణాలు తెలియాల్సి ఉంది. పెన్సిల్వేనియాలోని నాలుగు అతిపెద్ద కోక్ కర్మాగారాల్లో ఒకటైన ఈ పరిశ్రమలో వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు.

దిల్లీలో వీధికుక్కలు కనిపించకూడదు

- శునకాల బెడదపై మండిపడ్డ సుప్రీం



దిల్లీ: దేశ రాజధానిలో పెరుగుతున్న కుక్కకాటు ఉదంతాలపై సుప్రీంకోర్టు మండిపడింది. దేశ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లోని వీధి కుక్కలన్నిటినీ షెల్టర్లకు తరలించాలని సోమవారం ఆదేశాలు జారీచేసింది. తగినంత మంది సిబ్బందితో పాటు సీసీటీవీ కెమెరాలు, కుక్కల పునరుత్పత్తిని నిర్మూలించే శస్త్ర చికిత్సలకు ఏర్పాట్లు వీటిలో ఉండాలని పేర్కొంది. కనీసం ఐదువేల కుక్కలకు వసతి కల్పించగల షెల్టర్లను 6-8 వారాల్లోగా ఏర్పాటు చేయాలని ఆదేశించింది. వీధి కుక్కల్ని వెనకేసుకొచ్చే సంస్థలు.. రేబిస్ బారినపడి మరణిస్తున్న పసిపిల్లల్ని తిరిగి తేగలవా అని ప్రశ్నించింది. వీధికుక్కలకు అనుకూలంగా సమర్పించే ఎలాంటి దరఖాస్తునూ అనుమతించేది లేదని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్‌ల ధర్మాసనం స్పష్టంచేసింది. దిల్లీలో ఎక్కడా వీధి కుక్కలు కనబడటానికి వీల్లేదని స్పష్టంచేసింది. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదావేసింది.

తీర్పుపై జంతు హక్కుల సంస్థలు ఆక్షేపణ తెలిపాయి. కేంద్ర మాజీమంత్రి, జంతు హక్కుల కార్యకర్త మేనకా గాంధీ అభ్యంతరం తెలిపారు. తీర్పు ఆచరణ సాధ్యం కాదన్నారు. "దిల్లీలో 3 లక్షల వీధికుక్కలు ఉన్నాయి. వీటి కోసం 3 వేల షెల్టర్లు కావాలి. వీటి ఏర్పాటుకు రూ.15 వేల కోట్లు ఖర్చు చేసే పరిస్థితిలో దిల్లీ ప్రభుత్వం ఉందా?'' అని ప్రశ్నించారు.

ఆర్మీలో పురుషులకు పోస్టులు రిజర్వ్ చేయడమా?

- నియామకాల తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం

దిల్లీ: భారత సైన్యంలోని జడ్జి అడ్వొకేట్ జనరల్ (లీగల్) బ్రాంచి పోస్టుల్లో నియామకాల కోసం అనుసరిస్తున్న 2:1 రిజర్వేషన్ నిష్పత్తి విధానం సరికాదని సుప్రీంకోర్టు తెలిపింది. దాన్ని అమలు చేయకూడదని తేల్చి చెప్పింది. మహిళలపై పరిమితి పెట్టి ఖాళీ పోస్టులను పురుషులకు రిజర్వ్ చేయకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సైన్యంలోని జడ్జి అడ్వొకేట్ జనరల్ (లీగల్) పోస్టుల కోసం జరిగిన పరీక్షల్లో అర్షూర్ కౌర్, ఆస్థ త్యాగీ అనే మహిళా అధికారులు వరుసగా 4, 5వ ర్యాంకులు సాధించారు. అయినప్పటికీ వీరిని విధుల్లోకి తీసుకోకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పురుష అభ్యర్థులకన్నా తమకు మెరిట్ ఎక్కువగా ఉన్నప్పటికీ.. మహిళల కోటాల్లో ఖాళీలు లేవంటూ తమను ఎంపిక చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి పిటిషన్‌పై గతంలో విచారణ జరిపిన న్యాయస్థానం అప్పుడు తీర్పును రిజర్వ్ చేసింది.

తాజాగా ఈ అంశంపై తీర్పు వెలువరించిన సుప్రీం ధర్మాసనం.. ఆర్మీ ఉన్నతాధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేసింది. "ఈ విభాగంలో పురుషులకు 6.. మహిళలకు 3 పోస్టులు కేటాయించాలని నిష్పత్తి పెట్టడం ఏకపక్ష నిర్ణయం. లింగ తటస్థతకు నిజమైన అర్థం. స్త్రీ, పురుష భేదం లేకుండా అత్యంత ప్రతిభావంతులైన అభ్యర్థులను ఎంపిక చేయడమే. అంతేగానీ, మహిళలకు సీట్లను పరిమితం చేయడం సమానత్వ హక్కును ఉల్లంఘించడమే అవుతుంది. మహిళలపై పరిమితి పెట్టి.. ఖాళీ పోస్టులను పురుషులకు రిజర్వ్ చేయడం సమంజసం కాదు'' అని సుప్రీంకోర్టు ధర్మాసనం వెల్లడించింది. ఇకపై సమానత్వ పద్ధతిలోనే నియామకాలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎంపిక ప్రక్రియలో భాగంగా స్త్రీ, పురుష అభ్యర్థుల మెరిట్ జాబితాను బహిర్గతం చేయాలని సూచించింది.

స్తోమత ప్రాతిపదికన బడుగుల కోటాకు పిల్

- విచారణకు స్వీకరించిన సుప్రీం



దిల్లీ: ప్రభుత్వోద్యోగాల్లో బలహీనవర్గాలకు అందించే రిజర్వేషన్లకు ఆర్థిక స్తోమతను ప్రాతిపదిక చేస్తూ ప్రాధాన్యతా క్రమం నిర్ణయించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని(పిల్) సుప్రీంకోర్టు సోమవారం విచారణకు స్వీకరించింది. రమాశంకర్ ప్రజాపతి, యమునా ప్రసాద్ దాఖలు చేసిన ఈ వ్యాజ్యంపై అక్టోబరు 10 లోగా సమాధానం ఇవ్వాల్సిందిగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడుకున్న ధర్మాసనం కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. ఈ వ్యాజ్యం విస్తృత పర్యవసానాలకు దారితీసే అవకాశమున్న దరిమిలా పిటిషనర్ తరఫు న్యాయవాది తీవ్ర విమర్శలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని ధర్మాసనం వ్యాఖ్యానించింది. దశాబ్దాలుగా రిజర్వేషన్ విధానం అమలులో ఉన్నప్పటికీ ఆర్థికంగా అధోగతిలో ఉన్నవారు వాటి ప్రయోజనాలను పొందలేకపోతున్నారని, స్తోమత కలిగిన వారికే లబ్ధి చేకూరుతోందని పిటిషనర్లు పేర్కొన్నారు. రిజర్వేషన్లకు ఆర్థిక స్తోమత ప్రాతిపదికన ప్రాధాన్యత నిర్ణయిస్తే అత్యధికంగా అవసరం ఉన్న వారికి ప్రయోజనం లభించేలా చేయవచ్చని వారు అభిప్రాయపడ్డారు. "పిటిషనర్లలో ఒకరు షెడ్యూల్డు కులానికి చెందినవారు కాగా మరొకరు ఓబీసీ వర్గానికి చెందిన వారు. ఆయా వర్గాల్లో నెలకొన్న ఆర్థిక అసమానతలు రిజర్వేషన్‌ల ప్రయోజనం పొందే అవకాశాలను ఏ విధంగా కొందరికే పరిమితం చేస్తున్నాయో బహిర్గతం చేసేందుకు ఈ పిటిషన్ దాఖలు చేస్తున్నారు'' అని వారు తమ వ్యాజ్యంలో పేర్కొన్నారు.

యుద్ధమేదైనా పాక్‌కు చెమటలు పట్టించాం!

- వాయుసేన వీడియో



ఇంటర్నెట్ డెస్క్: బాంబు పేలుళ్లు, ఉగ్రదాడులతో భారత్‌ను అస్థిరపర్చేందుకు ప్రయత్నిస్తోన్న పాకిస్థాన్‌కు మన సైన్యం ఎప్పటికప్పుడు గట్టిగానే బుద్ధిచెబుతోంది. నాటి కార్గిల్ నుంచి నేటి 'ఆపరేషన్ సిందూర్' వరకు భారత్ చూపిన పరాక్రమం శత్రుదేశానికి చెమటలు పట్టించింది. ఆ యుద్ధాల సమయంలో దాయాది ఆట కట్టించిన తీరును భారత వాయుసేన వీడియో రూపంలో వివరించింది. దాదాపు 6 నిమిషాల నిడివి ఉన్న ఈ వీడియోలో 1971 యుద్ధం, కార్గిల్ యుద్ధం, 2019లో పుల్వామా దాడికి ప్రతీకారంగా జరిపిన మెరుపు దాడులు, ఆపరేషన్ సిందూర్ దృశ్యాలను చూపించారు. "ఆకాశంలో చీకటి కమ్మినప్పుడు.. భూమి/సముద్రం నుంచి ముప్పు ఎదురైనప్పుడు ఒక శక్తి బయటకు వస్తుంది. నిర్భయంగా ప్రతిఘటిస్తుంది. అదే భారత వాయుసేన" అని వాయిస్ ఓవర్‌లో వినిపించారు.

ఈ వీడియోలో ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం దాడికి సంబంధించిన వార్త కథనాలు, ప్రధాని మోదీ అత్యున్నత సమావేశాలను చూపించారు. ఆ తర్వాత ఆపరేషన్ సిందూర్ జరిగిన తీరును ప్రస్తావించారు. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉగ్ర శిబిరాలపై మన యుద్ధ విమానాలు విరుచుకుపడిన దృశ్యాలు ఇందులో ఉన్నాయి. పహల్గాం దాడికి ప్రతీకారంగా మే 7న భారత్ ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టిన సంగతి తెలిసిందే. పాక్, పీవోకేలోని ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేసింది. ఈ దాడుల్లో 100 మందికి పైగా ఉగ్రవాదులు హతమైనట్లు సమాచారం. పాక్‌కు చెందిన ఐదు ఫైటర్ జెట్‌లు, ఒక పెద్ద విమానాన్ని కూడా కూల్చేసినట్లు ఇటీవల ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ వెల్లడించారు.

ధన్‌ఖడ్ ఆచూకీ తెలియజేయండి

అమిత్ షాకు సంజయ్ రౌత్ లేఖ

దిల్లీ: మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఆచూకీ తెలియజేయాలని కోరుతూ శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్ కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. ధన్‌ఖడ్‌ను సంప్రదించడానికి తాము చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయని, అందుకే ఈ లేఖ రాస్తున్నామని ఆయన పేర్కొన్నారు. గతనెల 21న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు మొదలైన రోజే, జగదీప్ ధన్‌ఖడ్ ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. "మన మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఎక్కడున్నారన్న దానిపై ఎలాంటి సమాచారం లేదు. ఆయన ఆరోగ్యం ఎలా ఉందన్న దానిపై స్పష్టత రావట్లేదు. ధన్‌ఖడ్‌తో మాట్లాడేందుకు కొంతమంది రాజ్యసభ సభ్యులు ప్రయత్నించినా ఎలాంటి ఫలితం లేకపోయింది. ధన్‌ఖడ్‌కు ఏం జరిగింది? ఆయన క్షేమంగా, ఆరోగ్యంగానే ఉన్నారా? ఈ ప్రశ్నలపై దేశ ప్రజలకు సమాధానం కావాలి" అని అమిత్ షాకు రాసిన లేఖను సంజయ్ సోమవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ధన్‌ఖడ్ ఎక్కడున్నారో తెలుసుకునేందుకు సుప్రీంకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేయాలనుకుంటున్నట్లు ఎంపీ సంజయ్ రౌత్ వెల్లడించారు.

మహారాష్ట్రలో అదుపుతప్పి లోయలో పడిన వాహనం

- 10 మంది మహిళల మృతి



బోల్తాపడిన వాహనం

పుణె: మహారాష్ట్రలోని పుణె జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. 30 మందికి పైగా ప్రయాణిస్తున్న ఓ వాహనం ఖేడ్ గ్రామ సమీపంలోని కొండ ప్రాంతం వద్ద అదుపుతప్పి లోయలో పడింది. దీంతో వాహనంలోని 10 మంది మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు. 30 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే అప్రమత్తమైన స్థానికులు పోలీసులకు సమాచారమందించి క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించారు. పాపల్వాడీ గ్రామానికి చెందిన మహిళలు, చిన్నారులు శ్రావణమాసం సందర్భంగా ఖేడ్ తెహ్సీల్‌లోని శ్రీ క్షేత్ర మహాదేవ్ కుండేశ్వర్ ఆలయానికి వెళుతున్నట్లు ప్రాథమిక సమాచారం. ఈ దుర్ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం దేవేంద్ర ఫడణవీస్, ప్రాణాలు కోల్పోయిన వారికి రూ.4 లక్షల చొప్పున నష్ట పరిహారం ప్రకటించారు.

మధ్యప్రదేశ్‌లో ఓ జీపు, ద్విచక్ర వాహనం ఢీకొని ఐదుగురి మృతి

మధ్యప్రదేశ్‌లోని అనూప్పుర్ జిల్లాలో డ్రైవర్ నిర్లక్ష్యంతో జీపు అదుపుతప్పి ఓ మోటారు సైకిల్‌ని ఢీకొట్టి బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో జీపులో ఉన్న ఇద్దరు వ్యక్తులతో సహా ద్విచక్ర వాహనంపై ఉన్న ముగ్గురూ మృత్యువాతపడ్డారు. మరో ఐదుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆసుపత్రికి తరలించారు.

ట్రంప్, జెలెన్‌స్కీ, నాటో వర్చువల్‌గా భేటీ కావాలి

జర్మనీ ఛాన్సలర్ పిలుపు

బ్రసెల్స్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, నాటో ప్రధాన కార్యదర్శి, పలువురు ఐరోపా నేతలు బుధవారం వర్చువల్‌గా భేటీ కావాలంటూ జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడ్రిచ్ మెర్జ్ పిలుపునిచ్చారు. రష్యా అధ్యక్షుడితో శుక్రవారం ట్రంప్ సమావేశం నేపథ్యంలో మెర్జ్ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఉక్రెయిన్‌లో తాజా పరిస్థితిపై ఆ సమావేశం చర్చించనున్నట్టు మెర్జ్ సోమవారం ఓ ప్రకటనలో వివరించారు. మరోవైపు ట్రంప్-పుతిన్ చర్చలు భూభాగాల మార్పిడిని నిర్ణయించలేవని ఐరోపాలోని ఉక్రెయిన్ మద్దతుదారులు అభిప్రాయపడుతున్నారు.

ఉక్రెయిన్ డ్రోన్ దాడిలో ఒకరి మృతి

కీవ్: రష్యాలోని నిజ్నీ నొవ్గొరొడ్‌పై ఉక్రెయిన్ జరిపిన డ్రోన్ దాడిలో ఓ వ్యక్తి మరణించాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. స్థానిక గవర్నర్ గ్లెబ్ నికిటిన్ సోమవారం ఈ విషయాన్ని వెల్లడించారు. రెండు పారిశ్రామిక జోన్లు లక్ష్యంగా డ్రోన్ల దాడులు జరిగాయని వివరించారు. అయితే వాటికి జరిగిన నష్టంపై వివరాలు తెలియరాలేదు. తాము రష్యాపై ప్రయోగించిన సుమారు నాలుగు డ్రోన్లు క్షిపణులకు అవసరమైన పరికరాలను ఉత్పత్తి చేసే అర్జామస్ నగరంలోని కర్మాగారాన్ని ధ్వంసం చేశాయని ఉక్రెయిన్ అధికారులు వివరించారు. మరోవైపు తమ దేశంపైకి ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం దూసుకొచ్చిన మొత్తం 39 ఉక్రెయిన్ డ్రోన్లను నేలకూల్చామని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది.

దేశంలో ప్రజాస్వామ్య ఖూనీని ప్రపంచం చూస్తోంది: ఉద్ధవ్

ముంబయి: దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడాన్ని ప్రపంచం మొత్తం చూస్తోందని శివసేన (ఉద్ధవ్) అధినేత ఉద్ధవ్ ఠాక్రే వ్యాఖ్యానించారు. ఓట్ల చోరీపై ఆందోళన చేస్తున్న విపక్ష నేతలను అరెస్టు చేయడం ద్వారా భాజపా నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి మసిపూసి మారేడుకాయ చేస్తోందని విమర్శించారు. ప్రతిపక్ష నేతలను అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ సోమవారం ముంబయిలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. 'ప్రజాస్వామ్యం కోసం చేస్తున్న పోరాటాన్ని మీ ప్రభుత్వం (భాజపానుద్దేశించి) అణచివేస్తోంది. పట్టపగలే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడాన్ని ప్రపంచమంతా చూస్తోంది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇద్దరు ముగ్గురు నేతలు నన్ను కలిశారు. మహాయుతి కూటమి గెలవబోతోందని, తమతో కలవాలని కోరారు. అయితే దానిని నేను సీరియస్‌గా తీసుకోలేదు. అలా గెలవాలని మేం కోరుకోలేదు' అని ఠాక్రే పేర్కొన్నారు.

పదే పదే వాయిదాలు కోరడం సమంజసం కాదు

- లాలూ కేసులో దిల్లీ కోర్టు ఆగ్రహం

దిల్లీ: 'ఉద్యోగాలకు భూమి' కుంభకోణానికి సంబంధించిన కేసులో నిందితుడు, కేంద్ర మాజీ మంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ తరఫున న్యాయవాదులు తరచూ వాయిదాలు కోరడాన్ని దిల్లీ ప్రత్యేక కోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. నిందితుడు లాలూ 2022, జూన్ 27న విచారణాధికారికి రాసిన లేఖను నేరాంగీకార పత్రంగా పరిగణించాలన్న అభ్యర్థనను ప్రత్యేక జడ్జి విశాల్ గోగ్నే ఈనెల 8న తిరస్కరించారు. ఈ తిరస్కార ఆదేశాలను సవాలు చేస్తూ లాలూ దిల్లీ హైకోర్టులో అభ్యర్థన దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో కేసును వాయిదా వేయాలని లాలూ తరఫు న్యాయవాది అభ్యర్థించారు. తరచూ వాయిదాలు కోరడం ద్వారా ఉద్దేశపూర్వకంగా కేసుకు సంబంధించిన కొన్ని అంశాలవైపే విచారణను తీసుకెళ్తున్నారని న్యాయమూర్తి అన్నారు. న్యాయం కోసం ఏ వేదికనైనా ఎంచుకునేందుకు కక్షిదారునికి పూర్తి హక్కుందని, నిందితుని తరఫు న్యాయవాది తరచూ వాయిదాలు కోరుతూ అసలు ఆరోపణలపై వాదనల్ని కొనసాగించేందుకు తిరస్కరించడం తగదని పేర్కొన్నారు.

ఉత్తరకాశీలో ఎడతెరపిలేని వానలు



బురదలోనే ఉత్తరాఖండ్‌లోని ధరాలీ గ్రామం

మరోసారి నిలిచిపోయిన సహాయక చర్యలు

ఉత్తరకాశీ: మేఘ విస్ఫోటనంతో వరదల్లో చిక్కుకొని ఇప్పుడిప్పుడే కోలుకుంటోన్న ఉత్తరకాశీలో ప్రతికూల పరిస్థితుల కారణంగా సహాయక చర్యలకు మరోసారి ఆటంకం ఏర్పడింది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ధరాలీ, హర్సిల్ ప్రాంతాల్లో సహాయక చర్యలు నిలిచిపోయాయి. సోమవారం ధరాలీకి చెందిన ఓ యువకుడి మృతదేహాన్ని వెలికితీసినట్లు అధికారులు తెలిపారు. 9 మంది సైనికులతో సహా ధరాలీ సమీప ప్రాంతాల్లోని 42 మంది ఆచూకీ తెలియడం లేదు. గల్లంతైన 29 మంది నేపాలీ కార్మికుల్లోని ఐదుగురి ఆచూకీ లభించిందని తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లోని బాధితులను మొత్తం 1,278 మందిని సహాయక శిబిరాలకు తరలించారు.

(c) eenadu

అందోర్ సాయ్ మిందీరా



అడవి బిడ్డలకు ఆత్మబంధువుగా మారాలన్న తపనే ఆ ఐఏఎస్ అధికారిని కోయ భాష నేర్చుకొనేలా చేసింది. కవితలు రాసే స్థాయికి చేర్చింది. భద్రాచలం ఐటీడీఏ పీఓగా రాహుల్.. గత ఏడాది జూన్ 25న విధుల్లో చేరినప్పటి నుంచి కోయ భాష నిపుణుడి వద్ద పదాలు తెలుసుకొని తెలుగులో రాసుకుని కొద్ది రోజుల్లోనే ఔపోసన పట్టారు. జొంజోర్ (నమస్తే), అందోర్ సాయ్ మిందీరా(అందరూ బాగున్నారా), 'బేలా మిందీర్ (ఎలా ఉన్నారు).. వంటి మాటలతో కోయ భాషా చైతన్యాన్ని పలు వేదికలపై చాటుతుండటంతో 'పీఓ మావాడే' అన్న భావన ఆదివాసీల్లో కనిపిస్తోంది. ప్రపంచ ఆదివాసీ దినోత్సవ ఆహ్వాన పత్రికలను కోయ భాషలో ముద్రించడమే కాకుండా ఆ సభలో దాదాపు 10 నిమిషాలు ఐటీడీఏ ప్రగతిని కోయ భాషలో వివరించడంతో ఆదివాసీలు ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఈయన్ని స్ఫూర్తిగా తీసుకున్న ఆదివాసీలు పెళ్లి పత్రికలను తమ మాతృభాషలో ముద్రిస్తుండటం విశేషం. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుమారు 5 లక్షల మంది కోయ సామాజికవర్గం వారున్నారు.

– న్యూస్‌టుడే, భద్రాచలం

సంకల్ప లక్ష్మి!

తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న ఈ విద్యార్థిని పేరు ఆకుల లావణ్య లక్ష్మి. తాళ్లపూడి మండలం అన్నదేవరపేటకు చెందిన దివ్యాంగురాలు. కనీసం నడవలేదు, కూర్చోలేదు. చదువుకోవడమంటే చాలా ఆసక్తి. కష్టపడి చదివి పదో తరగతి పాసవ్వాలని సంకల్పం తీసుకుని ఓపెన్ స్కూల్‌కి దరఖాస్తు చేసింది. 500కు 345 మార్కులు సాధించి ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణురాలయింది. ఈ విజయం సాధించిన లావణ్యను సోమవారం రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో కలెక్టర్ ప్రశాంతి కలుసుకుని అభినందించారు. పదో తరగతి ఉత్తీర్ణత ధ్రువపత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం ఈ విద్యార్థినికి ప్రతి నెలా రూ.15 వేల పింఛను వస్తోందని, పీ-4 కార్యక్రమం ద్వారా ఇటువంటి వారికి సహకారం అందించాల్సి ఉందని కలెక్టర్ అన్నారు.

– న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం



మేఘాలలో... కూలిపోవద్దు!

ఇది తిరిగిరాని వయసని... ఫ్రెండ్స్‌తో అడ్డగోలుగా తిరిగేస్తాం... మస్తుంటే ఎలా మామా... అంటూ అలవోకగా అలవాట్లు చేసుకుంటాం... ఒంట్లో శక్తి ఉంది కదా అని... విచ్చలవిడిగా ప్రవర్తిస్తాం...

అయితే... ఇప్పుడు ఎక్సర్‌సైజ్‌లు చేయకుంటే... తర్వాత ఒళ్లు సైజు తప్పుతుంది ఇప్పుడు చెడు అలవాట్లు చేసుకుంటే... తర్వాత ఇబ్బందులన్నీ కమ్ముకుంటాయ్. ఇప్పుడు అడ్డమైన ఆహారం తింటూ ఉంటే... నడి వయసు దాటకముందే ఆరోగ్యం అడ్డం తిరుగుతుంది.


యువజనమంటే... మేఘాలలో తేలిపొమ్మన్నది... తుపానుల రేగిపొమ్మన్నది అనుకుంటూ... ఝుమ్మని ఎంజాయ్ చేసే వయసు మాత్రమే కాదు! అందమైన జీవితానికి గట్టి పునాది వేసుకోవాల్సిన తరుణం కూడా! భవిష్యత్తు పేకమేడ కాకుండా... జాగ్రత్త పడాల్సిన సమయం కూడా!




వృద్ధాప్యం త్వరగా రావొద్దంటే...!

జీవితమంతా చక్కటి ఫిట్‌నెస్‌కు వ్యాయామమే ఆధారం. రోజూ కనీసం అరగంటైనా ఒళ్లు వంచితే ఆరోగ్యకరమైన భవిష్యత్తు సొంతమవుతుంది. మరి రోజులో కాసేపైనా కండరాలకు పని కల్పిస్తున్నారా? జిమ్‌లాంటివేమైనా చేస్తున్నారా?





మంచి ఆహారంతోనే శరీరం ఆరోగ్యంగా మారుతుంది. జంక్‌ఫుడ్‌కు ఎంత దూరంగా ఉంటే అంత ఆరోగ్యంగా ఉంటాం. సమతుల ఆహారం వల్ల రోగనిరోధకశక్తి పెరుగుతుంది. వృద్ధాప్యం త్వరగా దరిచేరదు.



మద్యం, సిగరెట్లు, మత్తుపదార్థాలు, నిద్రలేమి... ఇవన్నీ టీనేజర్ల ప్రధాన శత్రువులు. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు, స్థూలకాయం, హృద్రోగాలు, మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలకు ఇవే మూలం!

అదే శ్రీరామ రక్ష...



- యుక్తవయసు నుంచే సరైన ఆర్థిక ప్రణాళికతో నడుచుకునేవారికి, పొదుపు చేసేవారికి ఆర్థిక స్వాతంత్ర్యం తొందరగా వచ్చేస్తుంది. సరైనదారిలో ఖర్చు చేయటం కూడా సంపాదించటమే!
- చిన్న వయసులో పెట్టుబడులు పెట్టడం ప్రారంభిస్తే... మీ ఖర్చులు, అలవాట్లలో గణనీయమైన మార్పు కనిపిస్తుంది. ఏది అవసరం, ఏది వాయిదా వేయొచ్చు... అనే ఆలోచన పెరుగుతుంది.





నేడు అంతర్జాతీయ యువజన దినోత్సవం

తాత్కాలిక ఆనందాల కోసం దీర్ఘకాలిక లక్ష్యాల్ని పక్కన పెట్టేస్తే... జీవితం సంక్లిష్టమవుతుంది. తస్మాత్ జాగ్రత్త!

చాలా మందిలో వయసు మళ్లక బయటపడే రోగాలకు మూలాలు యుక్త వయసులోని అలవాట్లు, జీవన విధానంలో దాగి ఉన్నాయని పరిశోధనలు చెబుతున్నాయి.

బీజం ఇక్కడే...

మంచి పుస్తకాలు చదివే అలవాటు ఉందా?.. చక్కటి సంగీతం వింటారా?... ఏదైనా సంగీతవాయిద్యం నేర్చుకోవడం, యోగా, ధ్యానం, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం వంటివి చేస్తున్నారా? ఇవన్నీ మానసిక ఆరోగ్యానికి సోపానాలు. ఇలాంటి అలవాట్లు మన వెంట వదలకుండా నడిచేలా చేస్తాయి.



డిమెన్షియా వంటి సమస్యలకు యుక్త వయసులోని అలవాట్లే బీజం పడుతుందని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాస్త్రవేత్తలు వెల్లడించారు. అందుకే యవ్వనంలో చేసుకునే మంచి అలవాట్లు 60ల్లోనూ 20ల్లా ఉంచుతాయి. లేదంటే నడివయసులోనే జావగారి పోతారు.

అర్ధరాత్రి అపరాత్రి అన్న తేడా లేకుండా సోషల్ మీడియాలో మునిగి తేలుతూ, ఇతరులతో మనల్ని పోల్చుకుని నైరాశ్యంలో కూరుకుపోవడం, భావోద్వేగాలు నియంత్రించుకోలేకపోవడం, మానసిక ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల దుర్బలంగా మారతాం.



తడి ఆరనివ్వకండి...

కృత్రిమ మేధ అన్నింటా మనకు పోటీ వస్తోంది. మేధస్సులో మనల్ని మించొచ్చు కూడా! కానీ హృదయ స్పందనలో మాత్రం మనమే రారాజులం! నలుగురితో సఖ్యత, మనమంటే నమ్మకం పెంపొందించడం, మంచి మాట, సహానుభూతి వంటివి జీవితంలో విజేతలుగా నిలబెడతాయి. కెరీర్‌లో దూసుకెళ్లేందుకు సోపానాలుగా నిలుస్తాయి. అందుకే గుండెల్లో తడి ఆరనీకండి! ఇన్‌స్టాలో వేల మంది ఫాలోయింగ్ ఎలా ఉన్నా... కుటుంబ సభ్యులు, బంధుత్వాలను కూడా ఫాలో కావడం చాలా ముఖ్యమని గుర్తుంచుకోండి.

- ఈనాడు, అమరావతి

ఏ జీవికి ఆపదొచ్చినా.. పెంటయ్య ఉన్నారుగా..



చికిత్స అనంతరం చక్రాల బండి సాయంతో నడుస్తున్న పిల్లి



ఉడతకు వైద్యం చేస్తున్న పెంటయ్య

సాధారణంగా గ్రామాల్లో పశు వైద్యులు అనగానే మేకలు, గొర్రెలు, గేదెలు, ఆవులకు మాత్రమే వైద్యం చేస్తారు. సూర్యాపేట జిల్లాలోని కోదాడ ప్రాంతీయ వైద్యశాల వైద్యుడు పెంటయ్య పిల్లి, కుక్క, కోతి, కోళ్లు, ఉడత, కుందేలు, తదితర జీవులకూ చికిత్స చేస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో కోదాడ పట్టణంలోని ఓ ఆహారశాలలో పిల్లి మీద వస్తువులు పడడంతో దాని నడుము విరిగింది. నిర్వాహకుడు ప్రాంతీయ వైద్యశాలకు తీసుకురావడంతో పెంటయ్య ఆపరేషన్ చేసి, దానికి చక్రాల బండిని అమర్చారు. బండి సాయంతో పిల్లి నడవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. గేదెకు పళ్లు విరగడంతో వాటిని ఇనుప తీగతో బిగించి ఆపరేషన్ చేశారు. కుందేలు కాలుకు గాయం కావడంతో చికిత్స చేశారు. పందెం కోడికి కాళ్లు విరిగిపోవడంతో రాడ్ వేసి ఆపరేషన్ చేశారు. ఓ ఇంటి ఆవరణలో కోతికి గాయాలై నడవలేని పరిస్థితిలో ఉంటే.. వైద్యం చేశారు. కుక్క కన్నుకు గాయం కావడంతో కంటి ఆపరేషన్ చేశారు. ఉడత కాలికి దెబ్బ తగలడంతో చికిత్స చేశారు. దాతల సాయంతో ఆస్పత్రి ఆవరణలో పశు ఔషధ బ్యాంకుకు ఆయన శ్రీకారం చుట్టి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, కోదాడ



ప్లాస్టిక్‌పై యుద్ధం.. విద్యార్థులే సైన్యం

పచ్చదనం పెంపొందిస్తూ ప్లాస్టిక్ భూతాన్ని అంతం చేసేందుకు గుంటూరు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో యుద్ధం ప్రకటించారు. విద్యార్థులనే సైనికులుగా ఎంచుకున్నారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర కోశాధికారి పి.రామచంద్ర రాజు ఆధ్వర్యంలో కొంతకాలం క్రితం భారతీయ విద్యాభవన్ విద్యార్థులకు కాటన్ సంచులు ఇచ్చి.. వారి ఇంట్లో, పరిసరాల్లో వృథాగా పడేసిన సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను సేకరించేలా అవగాహన కల్పించారు. ఇలా తీసుకొచ్చిన ప్లాస్టిక్‌ను పాఠశాలలో తూకం వేసి పాయింట్లు కేటాయిస్తున్నారు. పది, ఇరవై కేజీలు అయ్యాక.. విద్యార్థుల ఆసక్తి మేరకు మొక్కలు, పుస్తకాలు, క్రీడా వస్తువులను బహుమతులుగా ఇస్తున్నారు. విద్యార్థులు నాటిన మొక్కలను జియోట్యాగింగ్ ద్వారా పర్యవేక్షిస్తున్నారు. దీనికోసం ఓ యాప్‌ను రూపొందించి ఉపాధ్యాయుల సెల్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేశారు. ఏ విద్యార్థి ఎంత ప్లాస్టిక్ తీసుకొచ్చారు? ఏ మొక్కలు నాటి పెంచుతున్నారు వంటి వివరాలు యాప్‌లో కనిపిస్తుంటాయి. ఇది విజయవంతం కావడంతో గుంటూరు శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ అధికారికంగా ఈ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు.

– ఈనాడు, గుంటూరు, న్యూస్‌టుడే, గుంటూరు సాంస్కృతికం

పని ప్రదేశాన్ని ఆ ఒక్క కోణంలోనే చూడొద్దు



సగటు మనిషి తన జీవితకాలంలో 80 వేల గంటలకుపైగా పనిచేస్తాడు. భార్య/భర్త, పిల్లలు, తల్లిదండ్రులతో గడిపే సమయం కంటే మనం పని కోసం కేటాయించే సమయమే ఎక్కువ. జీవితంలో ఎక్కువ సమయం పని ప్రదేశంలోనే ఉంటాం కాబట్టి.. దాన్ని కేవలం డబ్బు ఆర్జన కోణంలో చూడకండి. అక్కడ మెరుగైన మానవ సంబంధాలు కూడా కలిగి ఉండండి.

– బెలిన్ జాన్ సిమండ్స్, డిజిటల్ క్రియేటర్

..అలా భక్తి పారవశ్యంలో తేలుతారు!



దేవుడికి భక్తితో ఏం సమర్పించినా స్వీకరిస్తాడని భక్తుల విశ్వాసం. అందరూ పూలమాలలు, ఆభరణాలతో ముస్తాబు చేసి పూజలు చేస్తుంటారు. కర్నూలు జిల్లాలోని కోడుమూరు ఏడో కొండపై వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి(కొండ్రాయిడి)కి భక్తులు తేళ్లను మాలగా వేసి పూజిస్తారు. శ్రావణ మాసం మూడో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు కొండపైకి చేరుకొని స్వామిని దర్శించుకున్నారు. రాళ్ల కింద ఉండే తేళ్లను దారంతో మాలగా చేసి స్వామికి సమర్పిస్తే కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. స్వామి మహిమ కారణంగా తేళ్లు తమను ఏమీ చేయవంటూ కొందరు భక్తులు తలపై, చేతులపై, ముఖంపై వాటిని వేసుకున్నారు.

– న్యూస్‌టుడే, కోడుమూరు గ్రామీణం

హై..హై.. టుర్ర్..



గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు పాతికేళ్ల క్రితం సవారు కచ్చులం(ఎడ్ల బండి) ఇంటికొకటి ఉండేది. బస్సులు, ఇతరత్రా రవాణా సౌకర్యాలు లేని రోజుల్లో నలుగురైదుగురు ఇందులో సుమారు 80 నుంచి 100 కిలోమీటర్ల మేర ప్రయాణించేవారు. రెండు ఎద్దుల మెడలకు గజ్జెలు, తోలు బెల్టులు కట్టి ముందు కూర్చున్న వ్యక్తి హై.. హై..టుర్ర్..అంటూ వాటిని చర్నాకోలాతో కొడుతుంటే బండి వేగంగా సాగేది. కనుమరుగైన ఈ రకం ఎడ్లబండిని తిరిగి పునరుద్ధరించాలనుకున్నారు కాళేశ్వరానికి చెందిన నగునూరి శరత్. తమ ఇంట్లో విరిగిపోయి మూలకు చేరిన కచ్చులం సామగ్రిని ఒక్కొక్కటిగా చేర్చి వడ్రంగి సహాయంతో కొత్తది పునర్నిర్మించాడు. గ్రామ వీధుల్లో ఈ ఎడ్లబండితో తిరుగుతుంటే స్థానికులు నాటి ప్రయాణాలను గుర్తు చేసుకున్నారు.

– న్యూస్‌టుడే, కాళేశ్వరం



తంగేడు పూలు.. తళతళలు చూడు..

కరీంనగర్ నగరపాలక కార్యాలయ సమీపంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ఎదురుగా స్మార్ట్ సిటీ నిధులతో కూడలిని అభివృద్ధి చేశారు. నగరవాసులు ఆకట్టుకునేలా సుందరంగా జంక్షన్‌ను తీర్చిదిద్దారు. గద్దెలపై తంగేడు పూలు పూసినట్లుగా ఆకృతులను అమర్చారు. వీటిని గ్లాస్ ఫైబర్ రీఇన్‌ఫోర్స్‌డ్ కాంక్రీట్ (జీఎఫ్ఆర్‌సీ) మెటీరియల్‌తో తయారు చేశారు.

– ఈనాడు, కరీంనగర్: న్యూస్‌టుడే, కార్పొరేషన్

గాడిద లైబ్రరీ!



బిబ్లియోబూరో(గాడిద గ్రంథాలయం)... ఇదేం తమాషా అనుకోవద్దు. కొలంబియాలోని లా గ్లోరియా ప్రాంతానికి చెందిన లూయీ సోరియానో అనే వ్యక్తికి వచ్చిన అద్భుత ఆలోచన ఇది. ఈయన వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. తనెంత మంచిగా బోధిస్తున్నా ఆశించిన స్థాయిలో పిల్లలు చదువులో రాణించకపోవడం చూసి నిరాశ చెందేవాడు. కారణం తెలుసుకునేందుకు ఓసారి వాళ్లందరి ఇళ్లకే వెళ్లాడు. పేదరికం, తల్లిదండ్రులు నిరక్షరాస్యులు కావడంతో వాళ్లకి పుస్తకాలు అందుబాటులో లేవని గుర్తించాడు. దాంతో తన దగ్గరున్న బుక్స్‌ని సంచుల నిండుగా పెట్టుకుని ఇంటింటికీ వెళ్లి పంచేవాడు. అయితే ఆ ఊళ్లు కొండలమీదా లోయల్లోనూ ఉండటం, ఇళ్ల మధ్య దూరం ఎక్కువగా ఉండటంతో అంత దూరం నడవలేక... తన దగ్గరున్న రెండు గాడిదలకి జీను సంచుల్ని తగిలించి, ఒక్కో రోజు ఒక్కో గాడిద మీద ప్రయాణిస్తూ చుట్టుపక్కల ఊళ్లలోని పిల్లలకు పుస్తకాల్ని ఇచ్చేవాడు. అలా 1997లో మొదలైందీ గాడిద లైబ్రరీ. మొదట్లో అతన్ని చూసి ఊరికి సర్కస్ వచ్చిందంటూ ఎగతాళి చేసేవారు. క్రమంగా పిల్లలు వాటిని చదవడానికి అలవాటు పడటంతో నవ్విన నోళ్లే మూతబడ్డాయి. ఒక్కో గాడిద 150 పుస్తకాల వరకూ మోస్తుందట. ప్రజలు, ప్రభుత్వం, ఎన్జీవోల సహకారంతో లా గ్లోరియాలో ఓ లైబ్రరీని కట్టించడమే కాదు, ల్యాప్‌టాప్ ద్వారా డిజిటల్ పాఠాలూ నేర్పిస్తున్నారు. మొత్తమ్మీద ఈ గాడిద లైబ్రరీ ఆ చుట్టుపక్కల పల్లెల్లో ఓ పెద్ద నెట్‌వర్క్‌గా మారింది. దీనికోసం సుమారు 20 మంది ఉద్యోగులూ పనిచేస్తున్నారు.

–వసుంధర డెస్క్

ఇంతకీ ఇవి ఏ పక్షి గుడ్లు?





ఈ చిత్రంలో ఆకుపచ్చ రంగులో కనిపిస్తున్న గుడ్లు వేటివో తెలుసా? ఇవి ఆస్ట్రేలియా దేశపు జాతీయ పక్షివి.. అంతే కాదండోయ్ ఇది ప్రపంచంలోనే రెండో అతిపెద్ద పక్షి కూడా.. అవేనండీ ఈము పక్షులవి. వీటి సంతానోత్పత్తి ప్రక్రియలో భాగంగా ఆడ పక్షులు గుడ్లు పెడితే మగవి పొదుగుతాయి. శీతాకాలంలో మాత్రమే గుడ్లు పెడతాయి. ఒక్కోటి 600 నుంచి 800 గ్రాముల బరువు ఉంటుంది. 52 రోజుల్లో పిల్ల బయటికొస్తోంది. ఆ సమయంలో గుడ్లను పొదగటానికి అవసరమైన సమయాన్ని, మిగతా వివరాలను వాటిపైనే రాస్తారు. 18 నెలలు వచ్చేసరికి ఐదున్నర అడుగుల ఎత్తు, 35 నుంచి 40 కిలోల బరువు పెరుగుతాయి. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం ఈదులగూడెం గ్రామంలో ఎంఆర్ రావుప్రసాద్ వీటిని పెంచుతున్నారు.

– ఈనాడు, ఏలూరు, న్యూస్‌టుడే, ఆగిరిపల్లి

ముత్యాల కోసం ముందు చూపు!

ఆకర్షణకైనా... ఆరోగ్యానికైనా దంత సిరి కీలకం! ఉదయాన్నే అందరూ పళ్లు తోముతారు. నోటిని శుభ్రం చేసుకుంటారు. కానీ సరైన పద్ధతిలో ఎంతమంది చేస్తున్నారంటే... చెప్పలేం! మరి ముత్యాల్లాంటి పలు వరస కోసం పిల్లల నుంచి పెద్దల దాకా నేర్చుకోవాల్సిన పాఠాలివీ..!



- భారతీయుల్లో 90 శాతం మంది దంత సమస్యలతో బాధపడుతుండగా... 9 శాతం మంది మాత్రమే డెంటిస్టును సంప్రదిస్తున్నారని ఇటీవల దంత సంరక్షణపై నిర్వహించిన జాతీయ సర్వేలో తేలింది.
- మనం తినగా నోట్లో మిగిలిపోయిన ఆహారం, నోట్లో ఏర్పడ్డ బ్యాక్టీరియాల నుంచి వచ్చే టాక్సిన్ నుంచి విడుదలయ్యే యాసిడ్‌లు పళ్లను కరిగిస్తాయి. దీంతో పళ్లకు రంధ్రాలు ఏర్పడతాయి.
- ఇప్పుడు పిల్లలకు దంత సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. తీపి, జిగురు ఆహార పదార్థాలు, జంక్‌ఫుడ్ ఎక్కువగా తింటుండడం దీనికి కారణం. పిల్లల్లో దాదాపు 90 శాతం మంది ఉదయం మాత్రమే బ్రష్ చేస్తున్నారు.
- రాత్రి బ్రష్ చేయకుండా పడుకుంటే.. నోట్లో బ్యాక్టీరియా చురుగ్గా మారుతుంది. పళ్ల సమస్యలు ఎక్కువవుతాయి. రాత్రివేళ నోటి శుభ్రతతో 99 శాతం దంత సమస్యలను నివారించవచ్చు.
- బ్రష్ చేశాక పళ్ల మధ్యలో మలినాలు తొలగించడానికి ఫ్లాస్ (దంత వైద్య నిపుణులు సూచించే సన్నది దారం లాంటి వస్తువుతో పళ్లను శుభ్రపరచడం) చేయాలి.
- ప్రతి రోజూ గోరు వెచ్చని ఉప్పు నీటితో కనీసం ఒకసారైనా బాగా పుక్కిలించాలి. నీటిని అధికంగా తాగడం వల్ల కూడా దంతాలు బాగుంటాయి. దుర్గంధం రాదు.
- చికిత్స తీసుకునేటప్పుడు మధుమేహం, అధిక రక్తపోటు తదితర దీర్ఘకాలిక వ్యాధులుంటే డెంటిస్ట్‌కు తప్పనిసరిగా తెలియజేయాలి. అందుకు తగినట్లు చికిత్స విధానం ఉంటుంది.

'బాస్'లా బ్రష్ చేద్దాం...



బ్రష్ చేయడంలో 'బాస్' విధానం సరైందని చెబుతున్నారు నిపుణులు. అంటే.. మెత్తని బ్రష్‌ను పళ్లపై 45 డిగ్రీల కోణంలో పెట్టి.. పై పళ్లను పై నుంచి కిందకు, కింది పళ్లను కింది నుంచి పైకి నెమ్మదిగా రుద్దాలి. అదే విధంగా పళ్ల వెనకాల భాగంలో కూడా ఇదే పద్ధతిలో చేయాలి. ఇలా రెండు నిమిషాల్లో బ్రషింగ్ పూర్తి చేయాలి. కానీ బ్రష్‌తో ఎడాపెడా రుద్దితే పళ్లు అరిగిపోయే ప్రమాదం ఉంది. ఈ పద్ధతి పిల్లల నుంచి పెద్దల దాకా అందరికీ వర్తిస్తుంది.

- పేస్టు ఎక్కువ పెట్టకూడదు. వేరు శనగ గింజంత పరిమాణంలో బ్రష్‌పై పేస్టు పెట్టుకోవాలి.
- పళ్ల మధ్యన ఇరుక్కున్న ఆహార పదార్థాలను తొలగించేందుకు 'వాటర్ ఫ్లాసింగ్' పరికరాన్ని కూడా వాడొచ్చు.
- బ్రష్‌ను మూడు నెలలకోసారి మార్చాలి.
- బాత్రూంలలో గనక బ్రష్‌లను పెట్టాల్సి వస్తే.. బ్రష్‌పై కచ్చితంగా క్యాప్ ఉండేలా చూడాలి.
- స్నానాల గదులు, మరుగుదొడ్లలో బ్యాక్టీరియాలు ఉంటాయి కాబట్టి బ్రష్‌ను వేడి నీటితో కడగాలి.



యువతకు ఇది శాపం...

ఇటీవల యువతలో నోటి క్యాన్సర్ కేసులు అధికంగా వస్తున్నాయి. గుట్కా, తంబాకు, జర్దా, ధూమపానం లాంటి వాటి వల్ల ఓరల్ క్యాన్సర్ పెరుగుతోంది. ప్రభుత్వ దంత కళాశాలకు ప్రతి నెలా కనీసం 15 నోటి క్యాన్సర్ కేసులు వస్తున్నట్లు వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యసనాలకు దూరంగా ఉంటేనే వారి ఆరోగ్యం బాగుంటుందని గుర్తించాలి.

దుర్గంధానికి దూరంగా..

ఆహార పదార్థాలు పళ్లలో ఇరుక్కోవడంతో పాటు, చిగుళ్ల సమస్య ఉన్నవారి నోట్లో నుంచి దుర్గంధం వస్తుంది. వీటిని నివారిస్తే వాసన రాకుండా ఉంటుంది.

- వేప పుల్లతో కొన్ని ప్రయోజనాలు ఉన్నా వాడేటప్పుడు చిగుళ్లు దెబ్బతినకుండా చూసుకోవాలి.
- బొగ్గుతో ఎక్కువ రోజులుతోముకుంటే పళ్లపై నల్లరంగు పేరుకుపోయే అవకాశం ఉంది.

– డాక్టర్ దయానందం, ప్రభుత్వ దంత కళాశాల, హైదరాబాద్

- ఈనాడు, హైదరాబాద్

(c) eenadu

ఛాంపియన్


బుమ్రా

ఆసియాకప్ బరిలో బుమ్రా!

దిల్లీ

పని భార నిర్వహణలో భాగంగా ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో మూడు టెస్టులే ఆడిన భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా.. వచ్చే నెల యూఈఏలో జరిగే ఆసియాకప్ టీ20 టోర్నమెంట్లో బరిలో దిగే అవకాశాలున్నాయి. అక్టోబర్‌లో వెస్టిండీస్‌తో జరిగే టెస్టు సిరీస్‌లో తొలి టెస్టులో అతడికి విశ్రాంతినిచ్చే ఛాన్స్ ఉంది. సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ నుంచి భారత క్రికెటర్ల వైద్య నివేదికలు అందిన తర్వాత ఈనెల 19 లేదా 20న అజిత్ అగార్కర్ సారథ్యంలోని సెలక్షన్ కమిటీ సమావేశం కానుంది. టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఇప్పటికే సాధన మొదలుపెట్టాడు. అతడి ఫిట్‌నెస్‌ను కూడా సెలక్టర్లు పర్యవేక్షించనున్నారు. ఆసియాకప్‌లో పాల్గొనే జట్టులో వైస్ కెప్టెన్సీ కోసం శుభ్‌మన్ గిల్, అక్షర్ పటేల్ మధ్య పోటీ నెలకొంది. ఇటీవల ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో అటు బ్యాటర్‌గా, ఇటు సారథిగా సత్తా చాటిన శుభ్‌మన్.. టీ20ల్లో వైస్ కెప్టెన్సీ రేసులోకి వచ్చాడు. సొంతగడ్డపై ఇంగ్లాండ్‌తో సిరీస్ ఈ బాధ్యతలను అక్షర్ పటేల్ నిర్వర్తించాడు. గతేడాది శ్రీలంకతో సిరీస్‌లో తొలిసారి సూర్యకుమార్‌కు టీ20 సారథ్య బాధ్యతలు అప్పగించినప్పుడు శుభ్‌మన్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. అభిషేక్ శర్మ, సంజు శాంసన్, సూర్యకుమార్, తిలక్‌వర్మ, హార్దిక్ పాండ్యలతో కూడిన బ్యాటింగ్ లైనప్‌నే ఆసియాకప్‌లో కొనసాగించే అవకాశాలున్నాయి. "ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో అభిషేక్ నంబర్‌వన్ బ్యాటర్‌గా ఉన్నాడు. గత సీజన్లో సంజు బ్యాటర్‌గా.. కీపర్‌గా సత్తా చాటాడు. శుభమన్ అదిరే ఫామ్‌లో ఉన్నాడు. ఐపీఎల్‌లోనూ అతడు రాణించాడు. ఎక్కువ ప్రత్యామ్నాయాలు ఉండడమే ఇప్పుడు సెలక్టర్లకు తలనొప్పి" అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ప్రస్తుత భారత జట్టు కూర్పులో యశస్వి జైస్వాల్, సాయి సుదర్శన్‌లకు చోటు దొరకడం కష్టంగానే ఉంది. వన్డేల్లో ప్రధాన కీపర్ అయిన కేఎల్ రాహుల్‌కు కూడా స్థానం అనుమానమే. కీపర్‌గా శాంసన్ ఖాయం. రెండో కీపర్‌గా జితేశ్ శర్మ లేదా ధ్రువ్ జురెల్‌కు అవకాశం లభించనుంది. పేస్ ఆల్‌రౌండర్ కోటాలో ప్రధాన ప్రత్యామ్నాయంగా హార్దిక్ పాండ్య ఉన్నాడు. గాయంతో బాధపడుతున్న నితీశ్‌కుమార్ రెడ్డి పేరు పరిశీలనకు రాకపోవచ్చు. స్పిన్ ఆల్‌రౌండర్ల కోటాలో అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ జట్టులో స్థానం దక్కించుకునే అవకాశాలున్నాయి. పేస్ విభాగంలో బుమ్రాతో పాటు అర్ష్‌దీప్ సింగ్ ఆడడం దాదాపు ఖాయం. మూడో సీమర్‌గా ఐపీఎల్-18లో 25 వికెట్లు తీసిన ప్రసిద్ధ్ కృష్ణ పోటీలో ఉన్నాడు. హర్షిత్ రాణాకు అవకాశం కష్టమే.

రితికకు స్వర్ణం


రితిక

బ్యాంకాక్: ఆసియా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారిణి రితిక బంగారు పతకం కైవసం చేసుకుంది. సోమవారం జరిగిన మహిళల ప్లస్ 80 ఫైనల్లో అస్సెల్ టోక్టాసిన్ (కజకిస్థాన్)పై రితిక విజయం సాధించింది. 57 కేజీలలో యాత్రి పటేల్, 60 కిలోల విభాగంలో ప్రియ రజత పతకాలు గెలుపొందారు. పురుషుల విభాగంలో నీరజ్ (75 కేజీలు), ఇషాన్ కటారియా (90 కేజీలు) రజతాలు నెగ్గారు. ఈ టోర్నీలో భారత అండర్-22 జట్టు 13, అండర్-19 బృందం 14 పతకాలు కైవసం చేసుకున్నాయి. భారత జట్లు అండర్-22లో నాలుగు, అండర్-19లో రెండో స్థానం సాధించాయి.

స్నేహిత్‌కు కాంస్యం


స్నేహిత్

వదోదర: జాతీయ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నీలో తెలంగాణ ఆటగాడు ఎస్ఎఫ్ఆర్ స్నేహిత్ సత్తాచాటాడు. పురుషుల సింగిల్స్‌లో స్నేహిత్ కాంస్య పతకం సాధించాడు. సోమవారం జరిగిన సెమీఫైనల్లో స్నేహిత్ (ఐఏ అండ్ ఏడీ) 9-11, 12-14, 12-10, 10-12, 9-11తో రోనిత్ భాంజా (ఆర్ఎస్‌పీబీ) చేతిలో ఓడాడు. ఫైనల్లో మానుష్ షా (ఆర్‌బీఐ) 11-8, 11-5, 12-10, 11-7తో రోనిత్‌పై నెగ్గి టైటిల్ సాధించాడు.



వన్డే ప్రపంచకప్ ట్రోఫీ ఆవిష్కరణ వేడుకలో మిథాలీ రాజ్, జై షా, యువరాజ్, హర్మన్‌ప్రీత్, స్మృతి, జెమీమా

గగన్‌దీప్‌పై మూడేళ్ల నిషేధం

జాతీయ క్రీడల డిస్కస్ త్రో స్వర్ణం వెనక్కి


గగన్‌దీప్

దిల్లీ: జాతీయ క్రీడల్లో డిస్కస్ త్రో స్వర్ణం గెలిచిన గగన్‌దీప్ సింగ్.. డోపింగ్‌కు పాల్పడినందుకు మూడేళ్ల నిషేధానికి గురయ్యాడు. గగన్‌దీప్ నిషేధిత ఉత్ప్రేరకాలు వాడినట్లు జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) నిర్ధరించడంతో అతడిపై వేటు తప్పలేదు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఉత్తరాఖండ్ వేదికగా జరిగిన జాతీయ క్రీడల్లో గగన్‌దీప్ పసిడి పతకం సాధించాడు. అతను టెస్టోస్టిరాన్ మెరుగుదల కోసం నిషేధిత ఉత్ప్రేరకాలు వాడి డోపింగ్‌లో దొరికిపోయాడు. తొలిసారి డోపింగ్‌కు పాల్పడితే సాధారణంగా నాలుగేళ్ల నిషేధం పడుతుంది. అయితే తాను తప్పు చేసినట్లు గగన్‌దీప్ అంగీకరించడంతో నిషేధాన్ని ఒక ఏడాది తగ్గించారు. డోపీగా తేలడంతో గగన్‌దీప్ గెలిచిన స్వర్ణాన్ని.. రెండో స్థానంలో నిలిచిన నిర్భయ్ సింగ్‌కు ఇవ్వనున్నారు. మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన సచిన్ కుమార్, జైను కుమార్ వరుసగా రజతం, కాంస్యం అందుకోనున్నారు. గగన్‌తో పాటు జూడో క్రీడాకారిణులు మోనికా చౌదరి, నందని వత్స్.. పారా పవర్ లిఫ్టర్లు ఉమేశ్‌పాల్ సింగ్, శామ్యూల్.. వెయిట్‌లిఫ్టర్ కవిందర్, కబడ్డీ క్రీడాకారుడు శుభమ్ కుమార్, రెజ్లర్ ముగలి శర్మ.. వుషు క్రీడాకారులు అమన్, రాహుల్ తోమర్ సైతం డోపింగ్‌కు పాల్పడ్డందుకు మూడేళ్ల చొప్పున నిషేధం ఎదుర్కోనున్నారు.

నిరీక్షణకు తెరదించుతాం


భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్


హర్మన్, స్మృతి నవ్వుల్.. నవ్వుల్..

ముంబయి: వన్డే ప్రపంచకప్ నెగ్గి ఐసీసీ ట్రోఫీ కోసం నిరీక్షణకు తెరదించుతామని భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ తెలిపింది. సోమవారం ప్రపంచకప్ ట్రోఫీని ముంబయిలో ఆవిష్కరించిన సందర్భంగా హర్మన్‌ప్రీత్ ఈ వాఖ్యలు చేసింది. ఐసీసీ ఛైర్మన్ జై షా, మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్‌సింగ్, మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్‌లతో పాటు భారత మహిళల క్రికెట్ జట్టు సభ్యులు స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హర్మన్ మాట్లాడుతూ.. ప్రపంచకప్‌నకు ముందు టైటిల్ ఫేవరెట్ ఆస్ట్రేలియాతో సిరీస్ భారత జట్టు ప్రదర్శనపై స్పష్టత ఇస్తుందని చెప్పింది. భారత మహిళల జట్టు వన్డేలు, టీ20ల్లో ప్రపంచకప్ విజయానికి దగ్గరగా వెళ్లినప్పటికీ.. ఇప్పటి వరకు ఐసీసీ ట్రోఫీని గెలుచుకోలేదు. 2017లో ఇంగ్లాండ్‌లో జరిగిన ప్రపంచకప్‌లో భారత్ రన్నరప్‌గా నిలిచింది. సెప్టెంబరు 30 నుంచి నవంబరు 2 వరకు జరిగే వన్డే ప్రపంచకప్‌నకు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి. అంతకుముందు సెప్టెంబరు 14 నుంచి 20 వరకు మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం భారత్‌లో ఆసీస్ పర్యటించనుంది. "భారతీయులంతా ఎదురుచూస్తున్న ఆ అడ్డంకిని మేం బద్దలు కొట్టాలనుకుంటున్నాం. ప్రపంచకప్‌లు ఎల్లప్పుడూ ప్రత్యేకమే. యువరాజ్‌ను చూసినప్పుడల్లా నాకు చాలా ప్రేరణ లభిస్తుంది. ఆసీస్‌తో ఆడటం ఎప్పుడూ సవాల్‌తో కూడుకున్నదే. వారితో వన్డే సిరీస్ మాకెంతో ఆత్మవిశ్వాసాన్నిసుంని ఆశిస్తున్నా. శిక్షణ శిబిరాల్లో చాలా కష్టపడుతున్నాం. ఫలితాలు అందుకు నిదర్శనం. 2017 ప్రపంచకప్ సెమీస్‌లో ఆసీస్‌తో ఆడిన మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ (171) నాతో సహా మహిళల క్రికెట్‌కు ఎంతో ప్రత్యేకం. ఆ ఇన్నింగ్స్ తర్వాత చాలా విషయాలు మారిపోయాయి. ఫైనల్లో ఓడిపోయి భారత్‌కు తిరిగొచ్చినా మాకు ఘన స్వాగతం లభించింది. అభిమానులు ఎంతగానో ఉత్సాహపరిచారు" అని హర్మన్ వివరించింది.

స్థాయిని పెంచే టోర్నీ: మరో 50 రోజుల్లో ప్రారంభంకానున్న మహిళల వన్డే ప్రపంచకప్‌కు సన్నాహాలు జోరుగా సాగుతున్నాయని ఐసీసీ ఛైర్మన్ జై షా తెలిపాడు. "ఐసీసీ ప్రపంచకప్-2025 భారత్‌కు తిరిగి రావడం మహిళల క్రికెట్లో ముఖ్యమైన ఘట్టం. ప్రపంచ మహిళల క్రికెట్ స్థాయిని మరింతగా పెంచే నిజమైన టోర్నీ ఇది. మరో 50 రోజుల్లో టోర్నీ ప్రారంభంకానున్న నేపథ్యంలో సన్నాహాలు జోరుగా సాగుతున్నాయి. అన్ని వైపులా ఉత్సాహం పెరుగుతోంది. సవాల్‌కు సిద్ధమవుతున్న అన్ని జట్లకు శుభాకాంక్షలు" అని జై షా పేర్కొన్నాడు.

కార్ల్‌సన్ అప్పట్లో అలా..



ఆనంద్

చెన్నై: చెస్‌లో దశాబ్దానికి పైగా మకుటం లేని మహారాజుగా వెలుగొందాడు మాగ్నస్ కార్ల్‌సన్. ఎంతమంది ప్లేయర్లు వచ్చినా అతడి వ్యూహాలను ఛేదించలేకపోయేవాళ్లు. ఇటీవలే కార్ల్‌సన్‌పై గుకేశ్, ప్రజ్ఞానంద లాంటి కుర్రాళ్లు నెగ్గుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ నార్వే స్టార్ గురించి ఓ ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించాడు భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్. కెరీర్ తొలినాళ్లలో కార్ల్‌సన్ చెస్‌లో కొన్ని పరిమితమైన ప్రాంతాల్లోనే అధిక ప్రభావం చూపించి విజయాలు సాధించేవాడని తెలిపాడు. "కెరీర్ ఆరంభంలో కార్ల్‌సన్ తన బలాన్ని ఎక్కువగా కొన్ని ప్రాంతాలపైనే కేంద్రీకరించేవాడు. ఉదాహరణకు ఎండ్ గేమ్‌తో పాటు పరిమితమైన పొజిషన్లపైనే ఆటను నడిపించేవాడు. చాలామంది ఎండ్ గేమ్‌కు వచ్చేసరికే కాస్త తడబడతారు. ఏకాగ్రత కోల్పోతారు. సరిగ్గా ఇలాంటి స్థితిలోనే కార్ల్‌సన్ ఎదురుదాడి చేసేవాడు. పరిస్థితిని తనకు అనుకూలంగా మలుచుకుని విజృంభించేవాడు. ప్రత్యర్థి బలం క్షీణిస్తుందన్న స్థితిలోనే అతడు తన శక్తిని మరింత పెంచుకుంటాడు. ఇలాంటి ప్రత్యేక లక్షణం అతడికి మాత్రమే ఉంది. ప్రత్యర్థులు డ్రా కోసం ఆడాలని అనుకుని కాస్త తీవ్రతను తగ్గిస్తారు. దీన్ని కూడా కార్ల్‌సన్ అవకాశంగా మలుచుకుంటాడు. గొప్ప ఓపెనింగ్ కూడా కార్ల్‌సన్ బలం. చెస్‌లో అత్యుత్తమ ఓపెనింగ్ ప్లేయర్ అతడు" అని ఆనంద్ తెలిపాడు. కెరీర్ ఒడుదొడుకుల్లో ఉన్న సమయంలోనే కార్ల్‌సన్ చేతిలో ఓడి ప్రపంచ ఛాంపియన్‌షిప్ కోల్పోయానని ఆనంద్ అన్నాడు. "2010 చివర్లో నా ఆట గాడి తప్పింది. కొత్త ఒరవడికి తగ్గట్టుగా నన్ను నేను మార్చుకోలేకపోయాను. ఆ క్రమంలోనే 2013లో కార్ల్‌సన్‌తో చెన్నైలో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఓడి ప్రపంచ టైటిల్ కోల్పోయాను. 2014లో క్యాండిడేట్ టోర్నీలో గెలిచి మళ్లీ కార్ల్‌సన్‌తో తలపడినా.. మరోసారి నిరాశే ఎదురైంది. ఆ టోర్నీలో గట్టిగానే పోరాడాను. చాలా గేమ్‌లు హోరాహోరీగా సాగాయి. అయితే తీవ్ర ఒత్తిడికి గురై కీలక గేమ్‌లు చేజార్చుకున్నా. టైటిల్ సాధించలేకపోయా" అని విషీ వెల్లడించాడు.

క్రీడా బిల్లుకు లోక్‌సభ ఆమోదం

దిల్లీ: ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న జాతీయ క్రీడా బిల్లుకు మోక్షం లభించింది. బిహార్ ఓటర్ల జాబితా సవరణపై ప్రతిపక్షాల నిరసనల నడుమ సోమవారం క్రీడా బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. స్వాతంత్ర్యం తర్వాత భారత క్రీడారంగంలో ఇదే అతి పెద్ద సంస్కరణగా కేంద్ర క్రీడా మంత్రి మన్‌సుఖ్ మాండవీయ పేర్కొన్నారు. విపక్షాల నిరసనల కారణంగా తొలుత వాయిదా పడిన లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటలకు తిరిగి ప్రారంభం కాగానే జాతీయ డోపింగ్ నిరోధక (సవరణ) బిల్లుకు కూడా ఆమోదం లభించింది. "స్వాతంత్ర్యానంతరం క్రీడలలో ఇదే అతి పెద్ద సంస్కరణ. 2036 ఒలింపిక్స్‌కు భారత్ బిడ్ దాఖలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్న సమయంలో ఈ బిల్లు దేశంలో జవాబుదారీతనం, న్యాయం, క్రీడా సమాఖ్యలలో ఉత్తమ పరిపాలన కచ్చితంగా ఉండేలా చేస్తుంది. భారత క్రీడా వ్యవస్థలో ఈ బిల్లుకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఇంత ముఖ్యమైన బిల్లు, సంస్కరణలో ప్రతిపక్షాల భాగస్వామ్యం లేకపోవడం దురదృష్టకరం" అని మాండవీయ తెలిపారు.

నేషనల్ స్పోర్ట్స్ బోర్డు (ఎన్ఎస్‌బీ) ఏర్పాటు చేయడం ఈ బిల్లులో అత్యంత కీలకాంశం. జాతీయ సమాఖ్యలకు గుర్తింపు ఇవ్వడం, రద్దు చేసే విషయాల్లో ఎన్ఎస్‌బీకి విశేషాధికారాలు ఉంటాయి. క్రీడాకారుల సంక్షేమం కోసం అంతర్జాతీయ సమాఖ్యలతో కలిసి ఎన్ఎస్‌బీ కలిసి పనిచేయొచ్చు. సకాలంలో ఎన్నికలు నిర్వహించని లేదా ఎన్నికల ప్రక్రియలో అక్రమాలకు పాల్పడే సమాఖ్యలను రద్దు చేసే అధికారం ఎన్ఎస్‌బీకి ఉంటుంది. ఎన్ఎస్‌బీ గుర్తింపు పొందిన క్రీడా సమాఖ్యలకు మాత్రమే ప్రభుత్వం నుంచి నిధులు లభిస్తాయి. ప్రపంచంలోనే అత్యంత ధనిక క్రికెట్ బోర్డు బీసీసీఐ కూడా ఎన్ఎస్‌బీ పరిధిలోకి వస్తుంది. ఈ బిల్లు ప్రకారం సెలెక్షన్ నుంచి ఎలక్షన్ వరకు క్రీడలకు సంబంధించిన అన్ని కేసుల పరిష్కారం కోసం నేషనల్ స్పోర్ట్స్ ట్రైబ్యునల్ ఏర్పాటు కానుంది. ఈ ట్రైబ్యునల్ ఆదేశాలను సుప్రీంకోర్టులో మాత్రమే సవాలు చేయడానికి వీలుంటుంది. కింది కోర్టుల జోక్యం ఉండదు. క్రీడా పాలకుల వయసు, పదవీకాలాన్ని కూడా బిల్లులో పొందుపరిచారు. అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారి గరిష్ఠంగా 12 ఏళ్ల వరకు వరుసగా మూడు పర్యాయాలు పదవుల్లో కొనసాగొచ్చు. క్రీడా పాలకుల వయసును 70 నుంచి 75 ఏళ్లకు పొడిగించారు. అయితే అంతర్జాతీయ సమాఖ్య నియమావళి అనుమతిస్తేనే నామినేషన్ సమయానికి అభ్యర్థుల వయోపరిమితి 75 ఏళ్ల వరకు ఉండొచ్చు.


అశ్విన్

నాకు స్పష్టత ఇవ్వండి

దిల్లీ: 2026 ఐపీఎల్‌లో తనను ఎలా ఉపయోగించుకోవాలని అనుకుంటున్నారో స్పష్టత ఇవ్వాల్సిందిగా చెన్నై సూపర్ కింగ్స్‌ను ఆల్‌రౌండర్ రవిచంద్రన్ అశ్విన్ కోరినట్లు తెలుస్తోంది. జట్టు ప్రణాళికల్లో తాను ఇమడలేని పరిస్థితి ఉంటే విడిపోవడానికి అభ్యంతరం లేదంటూ ఫ్రాంఛైజీకి అశ్విన్ తెలియజేసినట్లు విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. నిరుడు ఆటగాళ్ల వేలంలో రూ.9.75 కోట్లకు అశ్విన్‌ను చెన్నై కొనుక్కుంది. గత సీజన్‌లో 9 మ్యాచ్‌లాడిన అశ్విన్.. ఆశించిన స్థాయిలో రాణించలేదు. 2026 ఐపీఎల్‌కు ముందు మినీ వేలం జరగనున్న నేపథ్యంలో ఆటగాళ్ల బదిలీ, విడుదల విషయంలో జోరుగా చర్చలు జరుగుతున్నాయి. రాజస్థాన్ రాయల్స్‌ను వీడేలా కనిపిస్తున్న సంజు శాంసన్ కోసం చెన్నై, కోల్‌కతా తీవ్రంగా ప్రయత్నించే అవకాశాలున్నాయి. సంజు కోసం అశ్విన్‌ను చెన్నై.. రాజస్థాన్‌కు బదిలీ చేయొచ్చని ప్రచారం జరుగుతోంది.

విండీస్‌దే రెండో వన్డే


చేజ్

టరౌబా: పాకిస్థాన్‌తో మూడు వన్డేల సిరీస్‌లో ఆతిథ్య వెస్టిండీస్ పుంజుకుంది. రెండో వన్డేలో గెలిచి సిరీస్‌ను 1-1తో సమం చేసింది. వర్షం కారణంగా 37 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో విండీస్ 5 వికెట్ల తేడాతో నెగ్గింది. మొదట పాక్ 7 వికెట్లకు 171 పరుగులు చేసింది. హసన్ నవాజ్ (36 నాటౌట్; 30 బంతుల్లో 3×6) టాప్ స్కోరర్. హుస్సేన్ తలత్ (31; 32 బంతుల్లో 4×4), సయిమ్ అయూబ్ (23; 31 బంతుల్లో 4×4, 1×6), అబ్దుల్లా షఫీక్ (26; 40 బంతుల్లో 3×4) కూడా రాణించారు. విండీస్ బౌలర్లలో జైడెన్ సీల్స్ (3/23) ప్రత్యర్థిని కట్టడి చేశాడు. బ్లేడ్స్, షమర్ జోసెఫ్, మోటీ, రోస్టన్ చేజ్ తలో వికెట్ పడగొట్టారు. ఛేదనలో విండీస్ 12.4 ఓవర్లకు 48/3తో తడబడింది. ఈ దశలో రూథర్‌ఫర్డ్ (45; 33 బంతుల్లో 4×4, 3×6), కెప్టెన్ షై హోప్ (32; 35 బంతుల్లో 2×4, 1×6) ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. వీళ్లిద్దరూ స్వల్ప వ్యవధిలో వెనుదిరిగినా.. రోస్టన్ చేజ్ (49 నాటౌట్; 4×4, 2×6), జస్టిన్ గ్రీవ్స్ (26 నాటౌట్; 31 బంతుల్లో 1×6) విండీస్‌ను విజయతీరాలకు చేర్చారు. ఈ జంట అభేద్యమైన ఆరో వికెట్‌కు 77 పరుగులు జోడించడంతో కరీబియన్ జట్టు 33.2 ఓవర్లలో 5 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన చేజ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. నిర్ణయాత్మక మూడో వన్డే మంగళవారం జరుగుతుంది.


హాకీ జట్టుకు మనోజ్ సారథ్యం

ఈనాడు, హైదరాబాద్: జాతీయ జూనియర్ హాకీ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే తెలంగాణ జట్టుకు మనోజ్ సారథ్యం వహించనున్నాడు. మంగళవారం నుంచి ఈ నెల 23 వరకు పంజాబ్‌లోని జలంధర్‌లో ఈ టోర్నీ జరగనుంది. **జట్టు:** మహ్మద్ ఉమెర్‌ఖాన్, దివాకర్, మహేందర్, గణేశ్, మనోజ్ (కెప్టెన్), భాస్కర్, నిఖిల్ చంద్, నితిన్, ప్రదీప్, సింగం మధు, సుదర్శన్, రాహుల్ చౌదరి, సందీప్, విజయ్, భరత్, హనుమంతు, కౌశిక్, మనీష్ కుమార్, **కోచ్‌లు:** కామేశ్వరరావు, సాగర్, రవీందర్

ఇరిగేశికి డ్రా

చెన్నై: తెలంగాణ కుర్రాడు అర్జున్ ఇరిగేశి.. చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్ టోర్నమెంట్లో అయిదో రౌండు అనంతరం 3 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. నాలుగో రౌండ్లో ఓటమి చవిచూసిన అర్జున్.. సోమవారం అయిదో రౌండ్లో ప్రణవ్‌తో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. జర్మనీ క్రీడాకారుడు విన్సెంట్ కీమర్ 4 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అతను అయిదో రౌండ్లో విదిత్ గుజరాతితో పాయింట్లు పంచుకున్నాడు. కార్తికేయన్ మురళి-అనీష్ గిరి (నెదర్లాండ్స్), నిహాల్ సరీన్-లియాంగ్ (అమెరికా) గేమ్‌లు డ్రా అయ్యాయి. వాన్ ఫారీస్ట్ (నెదర్లాండ్స్).. రాబ్సన్ రే (అమెరికా)పై విజయం సాధించాడు. మంగళవారం ఆరో రౌండ్లో అర్జున్.. కీమర్‌తో తలపడనున్నాడు. పదిమంది క్రీడాకారులు తలపడుతున్న చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ టోర్నీలో మొత్తం 9 రౌండ్లుంటాయి.

గుకేశ్, అర్జున్ గెలుస్తుంటే...


ప్రజ్ఞానంద

చెన్నై: సహచర ఆటగాళ్లు దొమ్మరాజు గుకేశ్, అర్జున్ ఇరిగేశి సత్తా చాటుతుంటే తాను ఒత్తిడికి గురయ్యాయని భారత చెస్ స్టార్ ప్రజ్ఞానంద తెలిపాడు. గుకేశ్ ప్రపంచ ఛాంపియన్ కావడం.. అర్జున్ వరుస విజయాలతో దూసుకెళ్లడంతో తనలో ఒకరకమైన అభద్రతాభావం చోటు చేసుకుందని అన్నాడు. "నేను చెప్పే విషయం ఇప్పటిది కాదు. ఒకానొక సమయంలో సహచరులు గుకేశ్, అర్జున్ రాణిస్తుంటే అభద్రతా భావానికి లోనయ్యా. గుకేశ్ ప్రపంచ ఛాంపియన్ అయ్యాడు.. అర్జున్ 2800 ఎలో రేటింగ్ అందుకున్నాడు. ఈ సమయంలో నాపై నేనే ఒత్తిడి పెంచుకున్నా. ఆ తర్వాత ఆలోచన మార్చుకున్నా. వాళ్లు ఎప్పుడు రాణించినా స్ఫూర్తి పొందా. వారి గేమ్‌లు చూసి నేర్చుకున్నా. ఆటను విశ్లేషించుకుని తప్పులు దిద్దుకున్నా. గతేడాది కన్నా ఈ సీజన్లో రాణించగలుగుతున్నా" అని ప్రజ్ఞానంద వెల్లడించాడు.

(c) eenadu

జగన్ సన్నిహితులకు మద్యం ముడుపులు



● ఆ డబ్బుతో భారీగా ఆస్తులు కొన్న ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్ప బాలాజీ

● అనుబంధ అభియోగపత్రంలో సమగ్రంగా వివరించిన సిట్

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణంలో కొల్లగొట్టిన ముడుపుల సొమ్ము... నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అత్యంత సన్నిహితులైన సీఎంఓ మాజీ కార్యదర్శి కె.ధనుంజయరెడ్డి (ఏ-31), ఓఎస్డీ పి.కృష్ణమోహన్‌రెడ్డి (ఏ-32), భారతి సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీకి (ఏ-33) చేరిందని సిట్ తేల్చింది. ఈ సొత్తును వెచ్చించి వారు భారీగా ఆస్తులు కొన్నట్లు గుర్తించింది. మద్యం కుంభకోణంలో వారి పాత్ర, ప్రమేయాన్ని నిగ్గుతేల్చింది. ఈ మేరకు సోమవారం ఏసీబీ న్యాయస్థానంలో దాఖలుచేసిన అనుబంధ అభియోగపత్రంలో ఈ వివరాలన్నీ పొందుపరిచింది. ప్రధానాంశాలివి.

1. పెళ్లకూరు కృష్ణమోహన్‌రెడ్డి (ఏ-32)

● మాజీ సీఎం జగన్‌కు ఓఎస్డీగా పనిచేశారు. వైకాపా కోశాధికారి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఆ పార్టీ పేరిట నిర్వహిస్తున్న ఖాతాకు కృష్ణమోహన్‌రెడ్డే ఆథరైజ్డ్ సిగ్నేటరీ. మద్యం ముడుపులు వసూలు చేసే నెట్‌వర్క్‌లో కీలక సభ్యులైన తూకేకుల ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డి (ఏ-9) కార్యాలయంలో ఆఫీస్ బాయ్‌గా పనిచేసే పుల్ల శ్రీకాంత్, షేక్ సైఫ్ అహ్మద్ (ఏ-10) స్నేహితుడైన పూపాటి శివకుమార్‌లు క్యాష్ డిపాజిట్ మిషన్‌ల (సీడీఎం) ద్వారా ఈ ముడుపుల సొమ్మును ఎప్పటికప్పుడు కృష్ణమోహన్‌రెడ్డి ఖాతాలో జమచేసేవారు. ప్రభుత్వం నుంచి వేతనం పడే ఖాతాలోనే ఈ డబ్బు వేసేవారు. ఈ ముడుపుల సొమ్ము కోసం ఆయన వసూళ్ల ముఠా సభ్యులతో నిరంతరం సంప్రదింపుల్లో ఉండేవారు. అనేక సందర్భాల్లో వారితో కలిసి.. . ఆయన ఒకేచోట ఉన్నట్లు సీడీఆర్ విశ్లేషణలో తేలింది. మద్యం కుంభకోణంలో ఆయన ప్రత్యక్ష లబ్ధిదారు. ఈ కుట్రలో ప్రధాన పాత్రధారి.

● కృష్ణమోహన్‌రెడ్డి, నాటి ఏపీఎస్‌బీసీఎల్ ఎండీ డి.వాసుదేవరెడ్డి (ఏ-2) మధ్య పెద్ద ఎత్తున ఆర్థిక లావాదేవీలు నడిచాయి. వారిద్దరు పరస్పరం ఖాతాల్లోకి భారీ మొత్తాల్లో నగదు బదిలీ చేసుకునేవారు. ఇవన్నీ అనుమానాస్పదమే. 2022 ఆగస్టు నుంచి 2024 అక్టోబరు మధ్య కృష్ణమోహన్‌రెడ్డి ఖాతాలోకి వాసుదేవరెడ్డి రూ.11.70 లక్షలు జమచేశారు. మద్యం కుంభకోణం జరుగుతున్న సమయంలో కుమ్మక్కులో భాగంగానే ఈ నగదు బదిలీలు జరిగాయి.

● మద్యం ముడుపుల సొమ్ముతో కృష్ణమోహన్‌రెడ్డి.. ఆయన కోడలు స్నిగ్ధారెడ్డి పేరుతో మహేశ్వరం, బాన్సువాడ, రామచంద్రాపురం మండలాల్లో భారీగా ఆస్తులు కొన్నారు. వీటి కొనుగోలుకు నగదు చెల్లించారు. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 269ఎస్‌టీకి ఇది విరుద్ధం. ఈ ఆస్తుల కొనుగోలుకు డబ్బులు ఎక్కడి నుంచి సమకూర్చారో చెప్పాలని కృష్ణమోహన్‌రెడ్డిని, ఆయన కుమారుడు రోహిత్‌రెడ్డిని అడగ్గా.. వారు సమాధానం చెప్పలేకపోయారు. దీన్నిబట్టి ఇదంతా ముడుపుల సొమ్మేనని స్పష్టమవుతోంది.

2. కాల్వ ధనుంజయ రెడ్డి (ఏ-31):

● జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సీఎంఓలో కార్యదర్శిగా పనిచేశారు. 2022-23 మధ్య ఆయన కుమారుడు రోహిత్‌రెడ్డి, భార్య సోదరి నాగులపాటి లక్ష్మీ నిహారిక పేర్లతో నెల్లూరు జిల్లా కోవూరు, ముత్తుకూరు మండలాల్లో ఆస్తులు కొనుగోలు చేశారు. మొత్తం నగదు వెచ్చించే ఈ ఆస్తులు కొన్నారు. ఇదంతా లెక్కల్లో చూపించని సొత్తే.

● ఈ సొత్తు ఎక్కడి నుంచి వచ్చిందో చెప్పాలని ధనుంజయరెడ్డిని కస్టడీలో ప్రశ్నించగా.. దానికి ఆయన సరైన సమాధానం చెప్పలేదు. ఇదంతా మద్యం ముడుపుల సొమ్ముతో కొనుగోలు చేసిందేనని ప్రాథమికంగా స్పష్టమవుతోంది.

3. గోవిందప్ప బాలాజీ (ఏ-33), భారతి సిమెంట్స్ డైరెక్టర్

● మద్యం ముడుపుల సొమ్ము వసూళ్ల కోసం హైదరాబాద్ జూబ్లీహిల్స్, విజయవాడ యలమంచిలి హైట్స్ అపార్ట్‌మెంట్స్‌లోని రాజ్ కెసిరెడ్డి కార్యాలయానికి గోవిందప్ప బాలాజీ తరచూ వెళ్లేవారు. గోవిందప్ప బాలాజీ వచ్చేటప్పుడు కార్యాలయాల్లో తాను తప్ప ఇంకెవరూ ఉండకుండా రాజ్ కెసిరెడ్డి జాగ్రత్తలు తీసుకునేవారు. మద్యం కుంభకోణం కుట్రలో గోవిందప్ప బాలాజీ కీలకపాత్ర పోషించారు. విధాన రూపకల్పన మొదలు.. ముడుపుల వసూళ్ల వరకూ ప్రతి దాంట్లోనూ ఆయన ప్రమేయం ఉంది.

● గోవిందప్ప బాలాజీతో పాటు కృష్ణమోహన్‌రెడ్డి, రాజ్ కెసిరెడ్డి సహా మరికొందరి ఆదేశాలకు అనుగుణంగానే... ఏపీఎస్‌బీసీఎల్ ప్రత్యేకాధికారి సత్యప్రసాద్ (ఏ-3) మద్యం సరఫరా ఆర్డర్లు జారీచేశారు. ముడుపులు చెల్లించిన కంపెనీలకే ఆర్డర్లు ఇచ్చేవారు.

● మద్యం సరఫరా కంపెనీలు, డిస్టిలరీల నుంచి రాజ్ కెసిరెడ్డి ముడుపులు వసూలు చేసి ఆ సొమ్మును గోవిందప్ప బాలాజీ, వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డికి అందజేసేవారు.

● గోవిందప్ప బాలాజీ 2021లో నిమేషా ఇన్‌ఫ్రా ఎల్‌ఎల్‌సీ పేరుతో ఓ సంస్థను నెలకొల్పారు. అందులో ఆయన భార్య ప్రియాబాలాజీకి 60%, బిల్డర్ జీవీ ప్రసాద్‌కు 40% వాటా ఉన్నాయి. హైదరాబాద్ నార్సింగిలో ఎస్.ఎస్.ల్యాండ్‌మార్క్ అపార్ట్‌మెంట్ నిర్మించారు. ఈ ప్రాజెక్టులో రూ.3 కోట్ల పెట్టుబడి పెట్టగా.. రూ.1.10 కోట్లే అధికారికంగా బదిలీచేశారు. మిగతా రూ.1.90 కోట్లు నగదు రూపంలోనే చెల్లించారు. మొత్తం 5 ఫ్లాట్లలో ప్రియాబాలాజీకి మూడు ఫ్లాట్లు రాశారు. వాటిని గోవిందప్ప బాలాజీ కుమారుడు సంజయ్ బాలాజీ, కుమార్తె నిఖితా బాలాజీ పేర్లతో రిజిస్టర్ చేశారు. ఇదంతా మద్యం ముడుపుల సొమ్మే.

● పెళ్లకూరు కృష్ణమోహన్‌రెడ్డి తన కోడలు స్నిగ్ధారెడ్డి పేరుతో.. బాన్సువాడలో సర్వే నంబరు 699/1, 2లలో 1,247.36 చ.గజాల విస్తీర్ణంతో ఉన్న మూడు ఫ్లాట్లు (ఫ్లాట్ నంబర్లు 202, 203, 402) 2022లో కొన్నారు. ఒక్కో ఫ్లాట్‌కు మార్కెట్ విలువ రూ.17 లక్షల చొప్పున మొత్తం రూ.51లక్షలు నగదుగా చెల్లించారు.

కుటుంబ సభ్యుల పేరుతో ఆస్తులు కూడబెట్టిన ధనుంజయరెడ్డి

నిందితుడు (ఏ-31) కాల్వ ధనుంజయరెడ్డి.. కుమారుడు కాల్వ రోహిత్‌రెడ్డి పేరిట, తన భార్య సోదరి నాగులపాటి లక్ష్మీనిహారిక పేరిట నెల్లూరు జిల్లాలో ఆస్తులు కొనుగోలు చేశారు.

ఎవరి పేరిట	విస్తీర్ణం	సర్వేనంబరు	రిజిస్ట్రేషన్ తేదీ	రిజిస్ట్రేషన్ విలువ
కాల్వ రోహిత్‌రెడ్డి	366.24 చ.గజాలు	12111-1-1-2, 1213-1-ఎ1, ఫ్లాట్ నంబరు 11, డీవీఆర్ గార్డెన్స్, కోవూరు	2022 ఫిబ్రవరి17	రూ.6.41 లక్షలు
కాల్వ రోహిత్‌రెడ్డి	359.36 చ.గజాలు	12111-1-1-2, 1213-1-ఎ1 ఫ్లాట్ నంబరు 10, డీవీఆర్ గార్డెన్స్, కోవూరు	2022, ఫిబ్రవరి17	రూ.6.29 లక్షలు
ఎన్.లక్ష్మీనిహారిక	266.66 చ.గజాలు	26, గాయత్రినగర్, ఫేజ్-2 లేవుట్, ఫ్లాట్ నం.26, ముత్తుకూరు, నెల్లూరు జిల్లా	2023 జనవరి 18	రూ.3.74 లక్షలు

భార్య, కుమారుడు, కుమార్తె పేరిట బాలజీ గోవిందప్ప ఆస్తుల కొనుగోలు

మద్యం కేసులో నిందితుడు (ఏ-33) గోవిందప్ప బాలాజీ.. తన భార్య ప్రియాబాలాజీ, కుమార్తె నిఖితా బాలాజీ, కుమారుడు సంజయ్ బాలాజీ పేరిట ఆస్తులు కొన్నారు.

ఎవరి పేరిట	స్వరూపం	విస్తీర్ణం	సర్వేనంబరు	ఎప్పుడు	మార్కెట్ విలువ
ప్రియాబాలాజీ	ఖాళీ ప్లాట్ నంబరు 8, 9	659.60 చ.గజాలు	158, నార్సింగి, గండిపేట	2021లో	రూ.1.10 కోట్లు
నిఖితా బాలాజీ	ఫ్లాట్ నం.591, ఎస్ఎస్ ల్యాండ్‌మార్క్	65.96 చ.గజాలు	158, నార్సింగి, గండిపేట, రంగారెడ్డి	2024లో	రూ.33 లక్షలు
సంజయ్ బాలాజీ	ఫ్లాట్ నం.201 ఎస్ఎస్ ల్యాండ్‌మార్క్	131.92 చ.గజాలు	158, నార్సింగి, గండిపేట	2024లో	రూ.66 లక్షలు

ముడుపుల సొమ్ము చేర్చింది ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డే

మనీ లాండరింగ్ ద్వారా దుబాయ్ కంపెనీలకు

ఈనాడు, అమరావతి: మద్యం డిస్టిలరీలు, వ్యాపారులు, ఏపీఎస్‌బీసీఎల్ గుత్తేదార్ల నుంచి ముడుపుల సొమ్ము వివిధ మార్గాల్లో చేరవేయడంలో ఈశ్వర్ కిరణ్‌కుమార్ రెడ్డి (ఏ9) కీలకమని సిట్ దర్యాప్తులో తేలింది. మద్యం కుంభకోణంలో అతడి ప్రమేయంపై 40 మంది సాక్షుల నుంచి సేకరించిన వాంగ్మూలాల ఆధారంగా ఈ మేరకు నిర్ధారించింది. టెక్కర్ ఎక్స్‌పోర్ట్స్ అండ్ ఇంపోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏ17), టెక్కర్ ఇన్నోవేషన్స్, డి-కార్ట్ లాజిస్టిక్స్, యూఎన్ఐ కార్పొరేట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర కంపెనీలను ఏర్పాటు చేసి అక్రమ సొమ్ము తరలించినట్లు దర్యాప్తులో తేలింది. సంస్థలకు డైరెక్టర్లుగా వివిధ వ్యక్తులు ఉన్నప్పటికీ.. ఆ కంపెనీలను కిరణ్ సొంతంగా పర్యవేక్షించేవాడని సాక్షులు వాంగ్మూలంలో పేర్కొన్నారు. మద్యం కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి (ఏ1) సూచనలకు అనుగుణంగా కిరణ్ పనిచేసినట్లు అదనపు దర్యాప్తు నివేదికలో సిట్ పేర్కొంది.

బోగస్ కంపెనీలకు మద్యం సొమ్ము బదిలీ

నకిలీ ప్రాజెక్టులు, బోగస్ కంపెనీలు ఏర్పాటు చేసి జీతాల చెల్లింపులు, బోగస్ బిల్లులు సృష్టించి సైమన్ (ఏ41), సైఫ్ (ఏ10), దిలీప్ (ఏ30), సజీల్ బెహరూన్ (ఏ47) ద్వారా కిరణ్ నగదును అక్రమ రవాణా చేసేవాడని సిట్ తేల్చింది. తొలుత దుబాయ్‌కు తరలించి.. అక్కడ పలు కంపెనీలు స్థాపించినట్లు విచారణలో తేల్చింది. అక్రమ నగదును నిల్వ చేసేందుకు ఫ్లాట్లు అద్దెకు తీసుకుని. మద్యం డిస్టిలరీల నుంచి నగదు రవాణా, మద్యం మాఫియా సమావేశాలు సమన్వయం చేసేవాడని గుర్తించింది. భారీ మొత్తంలో నగదు చేతులు మారిన ప్రాంతాలను సాక్షులు (లిస్ట్ ఆఫ్ విట్‌నెస్ 108, 137, 142, 221) చూపిన ఆధారాలతో ధ్రువీకరించింది. కార్టన్ బాక్సుల సరఫరాతో సంబంధం లేని టెక్కర్ ఎక్స్‌పోర్ట్స్ అండ్ ఇంపోర్ట్స్ ద్వారా అదాన్, లీలా, స్పై సంస్థలకు కార్టన్ బాక్సులు సరఫరా చేయడంతో పాటు అసాధారణంగా రేట్లు పెంచి ఇన్వాయిస్‌లు రూపొందించి ఇతర కంపెనీలకు ఆర్థికంగా ప్రయోజనాన్ని కల్పించినట్లు గుర్తించింది.

ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డితో సంబంధం

ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి నిర్వహించిన ఆర్థిక లావాదేవీలు, రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు, ఎన్నికలకు నిధులను సమకూర్చే వ్యవహారాల్లో కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రమేయం ఉన్నట్లు సిట్ దర్యాప్తులో తేలింది.

కుదిరితే జీతం.. లేకుంటే రుణం!

డి-కార్ట్ లాజిస్టిక్స్, టెక్కర్ ఎక్స్‌పోర్ట్ కంపెనీలు ఐదేళ్లలో భారీ టర్నోవర్‌ను నమోదు చేశాయి. టెక్కర్ ఎక్స్‌పోర్ట్ సంస్థ ద్వారా భారీగా ఆర్థిక లావాదేవీలు జరిగాయి. పలు మద్యం డిస్టిలరీ కంపెనీలతో భారీ వ్యాపార లావాదేవీలు, ఏపీఎస్‌బీసీఎల్ నుంచి టెక్కర్‌కు చెల్లింపులు జరిగినట్లు గుర్తించారు. ఆ మొత్తాలను జీతం, లోన్‌ల రూపేణా కిరణ్‌కుమార్ ఉపసంహరించేవారని సిట్ గుర్తించింది. టెక్కర్ ఎక్స్‌పోర్ట్ నుంచి రూ.1.07 కోట్లు, డి-కార్ట్ నుంచి రూ.52.66 లక్షలు జీతం, రుణాల రూపేణా కిరణ్‌కు చెల్లించినట్లు తేలింది.

● 2022 మే 5న కృష్ణమోహన్‌రెడ్డి ఖాతాకు రూ.2.5లక్షలు నేరుగా, 1.5 లక్షలు ఎకౌంట్ నుంచి, రూ.98 వేలను వేరొకరి మొబైల్ యాప్ ద్వారా కిరణ్‌కుమార్ బదిలీ చేశారు.

మద్యం సరఫరా ఆర్డర్లు మార్చేసి.. ఆధారాల ధ్వంసం

● నేరపూరిత కుట్రకు పాల్పడిన నిందితులు

● అప్పటి ఇంటెలిజెన్స్ డీజీ పీఎస్ఆర్ ఆంజనేయులుకూ పాత్ర

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణంలో కీలకమైన మద్యం సరఫరా ఆర్డర్ల (ఆర్డర్ ఫర్ సప్లై-ఓఎఫ్ఎస్) వివరాలు మార్చేయడంతో పాటు.. అవి బయటపడకుండా ఆధారాలను ధ్వంసం చేయడంలో నిందితులు పక్కా ప్రణాళికతో వ్యవహరించారని సిట్ తేల్చింది. నిందితులు నేరపూరిత కుట్రకు పాల్పడ్డారని పేర్కొంది. ఈ వ్యవహారంలో అప్పటి ఇంటెలిజెన్స్ డీజీ పీఎస్ఆర్ ఆంజనేయులు పాత్రను కూడా ఛార్జిషీటులో సిట్ ప్రస్తావించింది. పాత రికార్డులు, వాటిలో లెక్కలు ఎలా మార్చేశారు? కొత్తవాటిని ఎలా సృష్టించారు? వాటిపై అప్పట్లో కొన్నిరోజులు ఎక్సైజ్ శాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు చూస్తున్న రజత్ భార్గవ, కమిషనర్ వివేక్ యాదవ్‌ల సంతకాల కోసం ఎలా ప్రయత్నించారో వాంగ్మూలాలతో సహా బయటపెట్టింది.

■ ఎవరికి ఎంతెంత మద్యం ఆర్డర్లు ఇచ్చారనే వివరాలు తెలియజేసే ఓఎఫ్ఎస్ దస్త్రాలు, అనుబంధ పత్రాలు మార్చేయడం, అందులోని వివరాలను ధ్వంసం చేయడంపై చర్చించేందుకు 2023 నవంబరు 2న వడ్డేశ్వరంలో.. కెసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, సత్యప్రసాద్, అప్పటి ఇంటెలిజెన్స్ డీజీ పీఎస్ఆర్ ఆంజనేయులు, ఏపీబీసీఎల్ ఎండీ వాసుదేవరెడ్డి, సీఎం కార్యదర్శి ధనుంజయరెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి కలుసుకున్నారు. ఇందుకు ఎలక్ట్రానిక్, ఇతర ఆధారాలున్నాయి. మార్చిన పత్రాల చట్టబద్ధత కోసం అప్పట్లో ఎక్సైజ్‌శాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు చూసిన రజత్ భార్గవ, కమిషనర్ వివేక్ యాదవ్‌ల సంతకాలు తీసుకోవాలని కూడా అక్కడే నిర్ణయించారు.

■ సత్యప్రసాద్ ఆదేశాలకు అనుగుణంగా తాటపూడి శౌరి, జమ్ముల రవీంద్ర ఓఎఫ్ఎస్ నోట్ ఫైళ్ల సాఫ్ట్‌కాపీల్లో మార్పులు చేశారు. ఓఎఫ్ఎస్ జారీలో అక్రమాలు దాచేందుకు ఆరు కాలమ్స్‌లో 1, 2 తొలగించారు. జమ్ముల రవీంద్ర నుంచి స్వాధీనం చేసుకున్న ఫోన్‌లో 2021 నాటి అసలు నోట్‌ఫైళ్ల కాపీ దీనికి ఆధారంగా ఉంది. మార్చిన 2021 నాటి నోట్‌ఫైళ్లలోని వివరాలను 2024 సెప్టెంబరు 25న డీఎస్పీ దేవప్రసాద్ స్వాధీనం చేసుకున్న పత్రాలు వెల్లడించాయి.

■ జమ్ముల రవీంద్ర ఫోన్‌లో ఉన్న 2021 ఓఎఫ్ఎస్ నోట్‌ఫైళ్లను ఎఫ్ఎస్ఎల్ ద్వారా విశ్లేషించారు. అవి 2022 ఏప్రిల్‌లో సృష్టించినట్లు వెల్లడైంది. ఈ ఫోన్‌లోనే మరికొన్ని సాఫ్ట్‌కాపీలు ఉన్నాయి. వాటిని 2023 నవంబరు, 2024 జనవరిలో సృష్టించినట్లు గుర్తించారు. ఏపీఎస్‌బీసీఎల్ నుంచి 2024 సెప్టెంబరు 25న స్వాధీనం చేసుకున్న పత్రాల ప్రకారం.. చివరిగా మార్చిన నోట్‌ఫైళ్ల నుంచి సరఫరాదారుల అర్హతను చూపే కాలమ్ తీసేశారు. టి.శౌరి, జమ్ముల రవీంద్ర వాంగ్మూలాలు కూడా దీన్ని ధ్రువీకరిస్తున్నాయి.

■ 2023 నవంబరు 2న జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకే.. మార్పులు చేసిన నోట్‌ఫైళ్లపై రాజ్ కెసిరెడ్డితో మరింతగా చర్చించేందుకు సత్యప్రసాద్ హైదరాబాద్ వెళ్లారు. ఆయన హైదరాబాద్‌లో ఉన్నట్లు ఫోన్ సంభాషణ రికార్డులు రుజువు చేస్తున్నాయి.

■ 2024 జనవరి 22, 23, 25, 29, 30 తేదీల్లో తాడేపల్లిలో సత్యప్రసాద్, వాసుదేవరెడ్డి, ధనుంజయరెడ్డి, పీఎస్ఆర్ ఆంజనేయులు సమావేశమయ్యారు. ప్రత్యేక ఓఎఫ్ఎస్, ఓఎఫ్ఎస్ నోట్‌ఫైళ్లపైనే ఈ సమావేశాలు జరిగాయి. రజత్‌భార్గవ, వివేక్‌యాదవ్ కూడా దీనికి హాజరయ్యారు.

సంతకాలకు నిరాకరించిన రజత్‌భార్గవ

మార్చిన ఓఎఫ్ఎస్ పత్రాలపై రజత్‌భార్గవ, వివేక్ యాదవ్‌ల సంతకాల కోసం సత్యప్రసాద్, వాసుదేవరెడ్డి, నాగేశ్వరరావు (ఓఎస్డీ ఎంఐఎస్, ఏపీఎస్‌బీసీఎల్) వెలగపూడి సచివాలయానికి వెళ్లారు. అయితే వాటిపై సంతకం చేసేందుకు రజత్‌భార్గవ నిరాకరించారు. 2024 ఏప్రిల్‌లో వాసుదేవరెడ్డి ఓఎఫ్ఎస్ దస్త్రాలతో మరోసారి రజత్‌భార్గవను కలవగా.. ఆయన సంతకం పెట్టి ర్యాటిఫై చేసేందుకు అంగీకరించలేదు. రజత్‌భార్గవ వాంగ్మూలం కూడా దీన్ని రుజువు చేస్తోంది. నోట్‌ఫైళ్లు మార్చేశారని.. అక్రమాలను దాచేందుకు, సాక్ష్యాలు లేకుండా చేసేందుకు కేసులోని నిందితులు ఉద్దేశపూర్వకంగా వ్యవహరించారని ఇవన్నీ స్పష్టం చేస్తున్నాయి.

* 2021 నుంచే నోట్‌ఫైళ్లు మార్చడం మొదలైందని, అప్పటినుంచి నిరంతరం కొనసాగుతున్నాయని సత్యప్రసాద్ వద్ద ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాల ఆధారంగా సిట్ గుర్తించింది. దీని ఆధారాలను కూడా ప్రస్తావించింది.

ఫోన్ల లొకేషన్లతో కీలక సమాచారం

ఫోరెన్సిక్ విశ్లేషణతో బయటపడిన బండారం

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణంలో నిందితుల మధ్య జరిగిన సంభాషణలు, సంక్షిప్త సందేశాలతో వారిమధ్య సంబంధాలు బహిర్గతమయ్యాయి. ఫోన్ నంబర్ల ఫోరెన్సిక్ విశ్లేషణలతో నిందితులు ఎప్పుడెప్పుడు సమావేశమైందీ వెలుగుచూసింది. ఏ3 సత్యప్రసాద్ ఫోన్, ఆయన వినియోగించిన ఇతర పరికరాలను స్వాధీనం చేసుకున్న సిట్.. విశ్లేషణ కోసం ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీకి పంపింది. అక్కడి నుంచి మార్చి 18న నివేదిక వచ్చింది. ఏ3 సత్యప్రసాద్, ఏ2 వాసుదేవరెడ్డి మధ్య మద్యం ఇండెంట్ల ప్రణాళికలు సాగినట్లు బహిర్గతమైంది. ముడుపుల ఆధారంగా మద్యం ఇండెంట్లను పర్యవేక్షించినట్లు తేలింది. మద్యం వ్యాపారం విషయంలో సత్యప్రసాద్‌తో రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డి సంబంధం కలిగి ఉన్నట్లు ఫోన్ల కాల్ డేటా, సంక్షిప్త సందేశాలు రుజువుచేశాయి.

■ ఏ1గా ఉన్న రాజ్ కెసిరెడ్డి పీఏ మల్లేష్ ఫోన్‌ను ఫోరెన్సిక్ విశ్లేషణ కోసం పంపగా.. ఎస్ఓఎం డిస్టిలరీస్, బ్రూవరీస్ అధ్యక్షుడు దివాకరన్‌తో జరిపిన సంభాషణలు బయటకు వచ్చాయి.

■ బూనేటి చాణక్య, విజయసాయిరెడ్డి బెదిరింపుల కారణంగా ముడుపులు చెల్లించాల్సి వచ్చిందని ఓం సన్స్ లిమిటెడ్ డిస్టిలరీలో పనిచేసే పిల్ల జయరాం ఫోన్ సంభాషణతో బయటపడింది. ఓం సన్స్ ఉన్నత కార్యనిర్వాహకులతో పిల్ల జయరాం చేసిన వాట్సప్ చాట్‌లను పునరుద్ధరించగా.. నిందితుల ఒత్తిడి కారణంగా వారికి భారీ మొత్తంలో నగదు ఎలా అందజేశారో తేలింది.

ధనుంజయరెడ్డి కీలక పాత్ర

మాజీ ఐఏఎస్, అప్పటి సీఎం జగన్ కార్యదర్శిగా పనిచేసిన ధనుంజయరెడ్డి కుంభకోణంలో కీలకపాత్ర పోషించారు. మద్యం సరఫరా ఆర్డర్లను మాజీ ఐఏఎస్ రజత్‌భార్గవ, వాసుదేవరెడ్డి చెప్పినట్లు అమలుచేసేందుకు, కీలక సిండికేట్ నిర్వాహకులను నియమించడానికి, రజత్‌భార్గవ, వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్‌లతో కుట్ర అమలును పర్యవేక్షించడానికి క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించారు. రాజ్ కెసిరెడ్డి, అతని సహచరుల నుంచి ముడుపుల స్వీకరణ, ఆర్థిక అవకతవకలు, ముడుపులు దాచడానికి, అధికారిక మద్యం సరఫరా ఆర్డర్లను తారుమారు చేసేందుకు, నాశనం చేయడానికి వ్యూహాలపై చర్చించడానికి తాడేపల్లిలో 2024 జనవరిలో సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలకు ధనుంజయరెడ్డి హాజరైనట్లు సెల్ టవర్ డేటా, సాక్షుల వాంగ్మూలాల ద్వారా నిర్ధారించారు. ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి అధికారిక పనిలో జోక్యం చేసుకున్నారని, ఏ2, ఏ3లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవద్దని సీనియర్ అధికారులపై ఒత్తిడి తెచ్చినట్లు మాజీ ఐఏఎస్ రజత్‌భార్గవ వాగ్మూలం ఇచ్చారు.

ముడుపుల కోసం ముందస్తు కుట్ర

అప్పటి సీఎం జగన్ ఓఎస్డీగా పనిచేసిన కృష్ణమోహన్‌రెడ్డి.. ముడుపుల కోసం కుట్రను అమలుచేయాలని వాసుదేవరెడ్డి, రజత్‌భార్గవలను ఆదేశించారు. రజత్‌భార్గవ, వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్ తదితరులతో కుట్ర అమలును పర్యవేక్షించేందుకు సమీక్షా సమావేశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యారు.

ఆదాయం రూ.లక్షల్లో చూపిస్తూ... రూ.కోట్ల విలువైన ఆస్తుల కొనుగోలు

● మద్యం ముడుపులతో ఎడాపెడా భూములు కొన్న రాజ్ కెసిరెడ్డి

● మొదటి నాలుగేళ్ల ఐటీ రిటర్న్స్‌లో ప్రస్తావనే లేదు

● ప్రభుత్వం మారాక ఆ వివరాలు వెల్లడి

● అక్రమాస్తులకు చట్టబద్ధత కల్పించేందుకు ఎత్తుగడ

● సన్నిహితుల నుంచి రుణాలు తీసుకుని కొన్నట్లుగా కలరింగ్

● ముడుపుల సొమ్మును వైట్ చేసుకునేందుకు పన్నాగం

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి 2020-21 నుంచి 2023-24 మధ్య ఆదాయపన్ను శాఖకు సమర్పించిన ఐటీ రిటర్న్స్‌లో తన వార్షిక ఆదాయాన్ని రూ.లక్షల్లో చూపించారు. అదే సమయంలో ఆయన తన పేరు మీద, తల్లి సుభాషిణి పేరు మీద మద్యం ముడుపుల సొమ్ముతో హైదరాబాద్ చుట్టుపక్కల రూ.వందల కోట్లు విలువైన 30.25 ఎకరాల భూములు కొన్నారు. ఆ భూమి కొనుగోలుకు వెచ్చించిన మొత్తం ఎక్కడి నుంచి వచ్చిందన్నది ఆయన ఐటీ రిటర్న్స్‌లో ఎక్కడా వెల్లడించలేదు. కానీ అక్రమ సంపాదనతో కొన్న ఆ ఆస్తులకు చట్టబద్ధత కల్పించేందుకు... రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం మారి, కూటమి ప్రభుత్వం వచ్చాక...2024-25లో ఐటీ రిటర్న్స్‌లో మాత్రం దేశ, విదేశాల్లో తన పేరు మీద ఉన్న చర, స్థిరాస్తుల వివరాలను ఆయన ప్రకటించారు. రాజ్ కెసిరెడ్డి హైదరాబాద్ చుట్టుపక్కల ఆర్జించిన భూములన్నీ మద్యం ముడుపుల సొమ్ముతో కొనుగోలు చేసినవేనని సిట్ నిగ్గు తేల్చింది.

అక్రమ ఆస్తుల్ని సక్రమమని నమ్మించేందుకు..!

● 2020-21 నుంచి 2023-24 వరకు రాజ్ కెసిరెడ్డి సమర్పించిన ఐటీ రిటర్న్‌లలో రూ.7.25 లక్షల నుంచి రూ.26.12 లక్షల వరకు వార్షిక ఆదాయాన్ని ప్రకటించారు.

● అదే సమయంలో ఆయన మద్యం ముడుపుల సొమ్ముతో రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో అనేక భూములు కొన్నారు. రాజ్ కెసిరెడ్డి కొనుగోలు చేసిన స్థిరాస్తుల వివరాల్ని షాబాద్ జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి సిట్ సేకరించింది.

● 2021 ఆగస్టు 26 నుంచి 2021 డిసెంబరు 20 మధ్య ఒక్క షాబాద్ మండలంలోనే రాజ్ కెసిరెడ్డి తన పేరు మీద రూ.8.24 కోట్ల విలువైన 27.06 ఎకరాల భూమి కొనుగోలు చేశారు. ఇది కేవలం రిజిస్ట్రేషన్ శాఖ రికార్డుల్లోని విలువ మాత్రమే. బహిరంగ మార్కెట్‌లో ఆ భూమి విలువ రూ.వందల కోట్లు ఉంటుంది.

● రాజ్ కెసిరెడ్డి తన తల్లి సుభాషిణి పేరు మీద 2021 ఆగస్టు 26 నుంచి 2022 ఫిబ్రవరి 19 మధ్య రూ.60.61 లక్షలు విలువైన (రిజిస్ట్రేషన్ విలువ) 3.19 ఎకరాలు కొన్నారు. వాటిలో నాలుగు ఆస్తుల్ని ఒకే రోజు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

రాజ్ కెసిరెడ్డి పేరు మీద కొన్న భూముల వివరాలు

ప్రాంతం	భూమి (ఎకరాల్లో)	విలువ (రూ.కోట్లలో)	కొన్నతేదీ
రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం మాచంపల్లి గ్రామం	3.32	1.14	26-08-2021
రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం మాచంపల్లి గ్రామం	5	1.50	26-08-2021
రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం మాచంపల్లి గ్రామం	13	3.90	08-10-2021
రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం మాచంపల్లి గ్రామం	2.34	0.85	07-12-2021,
రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం మాచంపల్లి గ్రామం	2.0	0.60	20-12-2021
రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం మాచంపల్లి గ్రామం	0.20	0.25	20-12-2021
మొత్తం	27.06	8.24	

రాజ్ కెసిరెడ్డి తల్లి సుభాషిణి పేరు మీద కొన్న భూములు

ప్రాంతం	భూమి (ఎకరాల్లో)	విలువ (రూ.కోట్లలో)	కొన్నతేదీ
రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దామెర్లపల్లిలో	1.20	45	26-08-2021
రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దామెర్లపల్లిలో	0.05	1.5	19-02-2022
రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం మాచంపల్లిలో	1.16	10.49	19-02-2022
రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం మాచంపల్లిలో	0.14	2.62	19-02-2022
రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దామెర్లపల్లిలో	0.04	1.0	19-02-2022
మొత్తం	3.19	60.61	

2024-25 ఐటీ రిటర్న్స్‌లో రాజ్ కెసిరెడ్డి పేర్కొన్న ఆస్తుల వివరాలు ఇవీ..!

■ అమెరికాలోని ఒక బ్యాంక్ ఖాతాలో రూ.1,58,64,931 నగదు.

■ హైదరాబాద్ చుట్టుపక్కల పలు స్థిరాస్తులు. ముఖ్యంగా షాబాద్ మండలంలో రూ.8.24 కోట్లు, రూ.1.12 కోట్ల విలువైన ఆస్తులు.

■ జూబ్లీహిల్స్‌లో రూ.37 లక్షలు విలువైన (రిజిస్ట్రేషన్ విలువ) నివాస స్థలం

■ జూబ్లీహిల్స్‌లో రూ.76 లక్షలు విలువైన (రిజిస్ట్రేషన్ విలువ) భూమి, నివాస భవనం.

■ రూ.45.84 లక్షల బ్యాంక్ డిపాజిట్‌లు

■ రూ.90 వేలు విలువైన షేర్లు, సెక్యూరిటీలు

■ రూ.50 వేల నగదు

■ ఈడీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌లో రూ.60 వేల పెట్టుబడి

■ రూ.2.45 కోట్లు విలువైన రుణాలు

● ఆ భూమి కొనుగోలుకు వెచ్చించిన డబ్బు సన్నిహితుల నుంచి ప్రైవేటు రుణాల రూపంలో సమకూర్చుకున్నట్టు చూపించారు. లెక్కల్లో చూపని నగదు కొంత మొత్తం చెల్లించారు.

● రాజ్ కెసిరెడ్డి కొన్న భూముల రిజిస్ట్రేషన్ విలువ రూ.8.24 కోట్లు కాగా, రిజిస్ట్రేషన్లు పూర్తయ్యే నాటికి ఆయన తన బ్యాంకు ఖాతా నుంచి రూ.5.69 కోట్లు మాత్రమే భూమి అమ్మినవారి ఖాతాలకు బదలాయించారు. మిగతా డబ్బు ఆ తర్వాత ఇచ్చారు.

● 2024-25 ఆర్థిక సంవత్సరానికి సమర్పించిన ఐటీ రిటర్న్స్‌లో రాజ్ కెసిరెడ్డి... విదేశాల్లోను, స్వదేశంలోను ఉన్న అనేక ఆస్తుల వివరాల్ని ప్రకటించారు. అక్రమంగా సంపాదించిన డబ్బుతో కొన్న ఆస్తులకు చట్టబద్ధత ముసుగు వేయడమే ఆయన లక్ష్యం.

● రాజ్ కెసిరెడ్డి ఈ స్థిరాస్తులేవీ చట్టబద్ధమైన సంపాదనతో కొనలేదని రుజువైందని, ఆయన మద్యం ముడుపుల సొమ్మును 'వైట్'లోకి మార్చుకునేందుకు బినామీ రుణాలు, బహుళ అంచెల లావాదేవీలు, నగదు రూపంలో చెల్లింపుల ద్వారా ఆదాయానికి మించిన ఆస్తులు కొన్నారని సిట్ పేర్కొంది.

(c) eenadu

మొదటి భార్యతో పెళ్లికొడుకు పరార్

పోలీసులను ఆశ్రయించిన వధువు బంధువులు

దేవరపల్లి, న్యూస్‌టుడే: ఇదివరకే పెళ్లయిన విషయాన్ని దాచి రెండో వివాహానికి సిద్ధపడిన ఓ వ్యక్తి.. ముహూర్తం కాసేపట్లో ఉందనగా మొదటి భార్యతో పరారయ్యాడు. దీంతో వధువు తరఫు వారు పోలీసులను ఆశ్రయించారు. తూర్పుగోదావరి జిల్లాలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. దేవరపల్లి మండలం యాదవోలుకి చెందిన పాలి సత్యనారాయణకు గోపాలపురం మండలం భీమోలుకు చెందిన యువతితో సోమవారం తెల్లవారుజామున వివాహం జరగాల్సి ఉంది. ఆదివారం సాయంత్రం హఠాత్తుగా పెళ్లి కొడుకు కనిపించడం లేదని ఆయన బంధువులు ఫోన్లో వధువు తరఫు వారికి సమాచారం ఇచ్చారు. వారికి అనుమానం వచ్చి దేవరపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడంతో.. భర్త చనిపోయిన ఓ మహిళతో సత్యనారాయణకు ఐదేళ్ల కిందటే వివాహమైందని తెలిసింది. ఆమె కుమార్తెకు అతడే వివాహం జరిపించాడని, ఆదివారం సదరు మహిళ ఫోన్ చేసి కేసు పెడతానని హెచ్చరించడంతో ఆమెతో కలిసి పరారయ్యాడని వధువు తరఫువారు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై ఫిర్యాదు అందిందని, పెళ్లి కుమార్తెకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని సీఐ బి.నాగేశ్వర నాయక్ తెలిపారు.

ఓట్ల దోపిడీపై నోరుజారి.. పదవి కోల్పోయిన కర్ణాటక మంత్రి

ఈనాడు, బెంగళూరు: కర్ణాటక సహకారశాఖ మంత్రి కె.రాజణ్ణను మంత్రివర్గం నుంచి తొలగించారు. సోమవారం మంత్రిని తొలగించిన విషయాన్ని ధ్రువీకరిస్తూ గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి ఓ ప్రకటన చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం జాతీయ స్థాయిలో నకిలీ ఓటర్ల విషయంపై ఆందోళన చేస్తుండగా ఈ ప్రక్రియను రాజణ్ణ ప్రశ్నించారు. 'కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగానే ఓట్ల జాబితాను తయారుచేశారు. సవరించిన ఈ జాబితాను బహిరంగపరిచినా ప్రభుత్వం ఏం చేస్తోంది?' అని రాజణ్ణ ప్రశ్నించి చిక్కుల్లో పడ్డారు. 'అప్పుడు కళ్లు మూసుకుని ఇప్పుడు ఆందోళన చేయడంలో అర్థం లేదు. ఓట్ల దోపిడీతోనే నరేంద్రమోదీ మరోసారి ప్రధాని అయ్యారు. కాంగ్రెస్‌కు ఈ అక్రమాల వ్యవహారం తెలిసినా ఎందుకు నిర్లక్ష్యంగా ఉంది?' అంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రణ్‌దీప్ సింగ్ సుర్జేవాలా కర్ణాటక ఎమ్మెల్యేలతో ఇటీవల ప్రత్యేకంగా సమావేశమైన విషయాన్నీ తప్పుబట్టిన రాజణ్ణ నిజానికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు ప్రధాన మద్దతుదారు. గత విధానసభ సమావేశాల్లోనూ 'మంత్రులపై హనీట్రాప్ చేస్తున్నారు' అని ప్రకటించి కలకలం సృష్టించారు.



బృంద సభ్యులకు ఇలా ప్రేరణనివ్వండి

మీ బృంద సభ్యుల్లో ప్రేరణ నింపేందుకు ఓ చక్కటి మార్గమేంటో తెలుసా..? అందరిముందూ వారి పురోగతిని, విజయాలను గుర్తించి ప్రశంసించడం. బహిరంగంగా మెచ్చుకోవడం వల్ల వారిలో ఆత్మవిశ్వాసం మరింత పెరుగుతుంది. భవిష్యత్ లక్ష్యాలను అందుకునేందుకు ఇంకా చురుగ్గా పనిచేస్తారు.

– అమన్ సహోటా, లీడర్‌షిప్ కోచ్

పులివెందులలో తొలిసారి ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు

- పోలింగ్ కేంద్రాల ఏర్పాటుతో సీఎంకు ఏం సంబంధం?
- జగన్ వ్యాఖ్యలు ఆయన అవగాహన లోపానికి నిదర్శనం
- హోం మంత్రి వంగలపూడి అనిత

ఈనాడు, అమరావతి: పులివెందుల ప్రజలు తొలిసారి ప్రజాస్వామ్యం రుచి చూస్తున్నారని, పులివెందుల తమ అడ్డా అని జబ్బలు చరుచుకున్నవారంతా ఇప్పుడు ప్రజాస్వామ్యానికి భయపడుతున్నారని హోంమంత్రి వంగలపూడి అనిత వైకాపా నేతలపై మండిపడ్డారు. ఆమె సోమవారం విలేకర్లతో మాట్లాడారు. 'పులివెందుల, ఒంటిమిట్టలో ప్రజాస్వామ్య పద్ధతిలో జడ్పీటీసీ ఎన్నికలు జరుగుతుండటం చూసి ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, మార్పే అధికారం ముఖ్యమంత్రికి ఉంటుందా? ఈసీ నిబంధనల ప్రకారం చేపట్టిన ప్రక్రియపై జగన్ వ్యాఖ్యలు ఆయన అవగాహన లోపానికి నిదర్శనం. పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై ఎన్నికల సంఘం అభ్యంతరాలు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ ఇచ్చినప్పుడు వైకాపా నేతలు ఎక్కడున్నారు? నెలలో 20 రోజులు బెంగళూరులో ఉంటూ అప్పుడప్పుడు రాష్ట్రానికి వచ్చే జగన్‌కు వాస్తవ పరిస్థితులు ఏం తెలుసు? వైకాపా ప్రభుత్వంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లు వేయకుండా ప్రత్యర్థులపై దాడులు చేయడం, భయపెట్టడం, ఆస్తులు ధ్వంసం చేయించడం లాంటివి జగన్ మరిచిపోయారా? దాడి, దౌర్జన్యం వైకాపా డీఎన్‌ఏలోనే ఉన్నాయి. బాబాయిని



చంపించిన వ్యక్తికి, చెల్లెళ్లతో రాఖీ కట్టించుకోలేని దుస్థితిలో ఉన్న వ్యక్తికి ఓటు వేయాలా? అని పులివెందుల ప్రజలు ఆలోచిస్తున్నారు' అని మంత్రి అన్నారు.

సునీత బాధను అర్థం చేసుకోవాలి

'తండ్రిని కిరాతకంగా సొంత మనుషులే చంపారన్న సునీత బాధను పులివెందుల ప్రజలు అర్థం చేసుకోవాలి. ప్రతి ఎన్నికల్లోనూ సమస్యలు సృష్టించేవారిని ముందుగా గుర్తించి బైండోవర్ కేసులు పెడతారని వైకాపా నేతలకు తెలియదా? ఓటర్ల స్లిప్పుల పంపిణీపై అభ్యంతరం ఎందుకు? ఎన్నికలపై ఎందుకు భయపడుతున్నారు?' అని వైకాపా నేతలను అనిత ప్రశ్నించారు. 'ఎన్నికల్లో 11 సీట్లు రాగానే ఈవీఎంలను జగన్ తప్పుపట్టారు. ఇప్పుడు రాహుల్‌గాంధీ కూడా అంతే' అని మంత్రి వ్యాఖ్యానించారు.

జగన్‌పై పులివెందుల ప్రజలకు విరక్తి: మంత్రి సవిత

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: మాజీ సీఎం జగన్ పాపాలతో పులివెందుల ప్రజలు ఆయనపై విరక్తి చెందారని, జడ్పీటీసీ ఎన్నికల్లో తెదేపా విజయం ఖాయమని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత తెలిపారు. వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంట్లలో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే నాగేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, తెదేపా ప్రధానకార్యదర్శి ప్రభాకర్‌చౌదరితో కలిసి మంత్రి విలేకర్లతో సోమవారం మాట్లాడారు. జగన్, ఎంపీ అవినాష్‌రెడ్డి సేవ్ డెమోక్రసీ అంటున్నారని.. వైకాపా వారికి ఆ పదానికి అర్థమే తెలియదని విమర్శించారు. గత పాతికేళ్లలో పులివెందులలో వైఎస్సార్ కుటుంబం స్థానిక ఎన్నికలు జరపలేదన్నారు. తెదేపాలో చేరిన వారిని జగన్, భారతి, అవినాష్‌రెడ్డి ఎలా బెదిరిస్తున్నారో ప్రజలకు అర్థమవుతోందని వివరించారు. తనకు ప్రాణహాని ఉందని మాజీ ఎమ్మెల్సీ సతీష్‌రెడ్డి చెబుతున్నారని, ఆయన గతంలో తెదేపాలో పనిచేశారని.. ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి



పైనే ముందుకెళ్తారు తప్పరప్పారప్పా నరకడానికి కాదన్నారు. సొంత కుటుంబసభ్యులనే హతమార్చినవారి పక్కన మీరు ఉన్నారని.. వారితో జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు. పులివెందులలో తెదేపా అభ్యర్థి లతారెడ్డి గెలవబోతున్నారని స్పష్టం చేశారు.

రెండు జడ్పీటీసీలకు నేడు పోలింగ్

ఈనాడు, కడప: వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్టలో జడ్పీటీసీ ఉప ఎన్నికల పోలింగ్ మంగళవారం నిర్వహించనున్నారు. ఈ రెండు స్థానాల నుంచి తెదేపా, వైకాపా, కాంగ్రెస్ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు 11 మంది కలిపి మొత్తం 22 మంది పోటీ పడుతున్నారు.



ప్రధాని నరేంద్రమోదీకి 'ఇంపాక్ట్ ఏపీ' పుస్తకాన్ని అందిస్తున్న తెదేపా పార్లమెంటరీ పార్టీనేత లావు శ్రీకృష్ణదేవరాయలు. పక్కన కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, రామ్మోహన్‌నాయుడు, పార్టీ ఎంపీలు

ప్రధానికి 'ఇంపాక్ట్ ఏపీ' పుస్తకం అందజేత

కేంద్రంలోని సంయుక్త కార్యదర్శులు-ఎంపీల సమన్వయంతో వస్తున్న ఫలితాల ప్రస్తావన

ఈనాడు, దిల్లీ: కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను రాష్ట్రానికి తీసుకెళ్లడానికి కేంద్రంలోని సంయుక్త కార్యదర్శి స్థాయి అధికారులతో కలిసి ఎంపీలు చేస్తున్న కసరత్తు కారణంగా ఆంధ్రప్రదేశ్‌కు లభించిన ప్రయోజనాలను వివరిస్తూ రూపొందించిన 'ఇంపాక్ట్ ఏపీ' పుస్తకాన్ని తెదేపా పార్లమెంటరీ పార్టీ నేతలు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అందజేశారు. కేంద్ర పథకాలు, నిధులను ఆంధ్రప్రదేశ్‌కు గరిష్ఠ స్థాయిలో తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన ఆదేశాలను దృష్టిలో ఉంచుకొని మిషన్ ఓరియెంటెడ్ విధానాన్ని అనుసరించినట్లు ప్రధానికి తెలిపారు.

★ సంప్రదింపుల ప్రక్రియలో భాగంగా అన్ని కేంద్ర ప్రాయోజిత పథకాలు, వాటికి కేటాయించిన బడ్జెట్‌ను మ్యాప్ చేశారు. ఎంపీలు నేరుగా కేంద్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శులతో సమావేశమై రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలకు కావాల్సిన సాంకేతిక అంశాలు, అనుసరించాల్సిన పరిపాలనాపరమైన ప్రక్రియను తెలుసుకొని దానికి అనుగుణంగా వేగంగా చర్యలు తీసుకొనే విధానానికి శ్రీకారం చుట్టారు. ఫలితంగా 432 పథకాలకు గాను ఇప్పటివరకు 114 పథకాలను కవర్‌చేసినట్లు పుస్తకంలో వివరించారు.

★ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాల వల్ల ఆక్వా, మిర్చి తదితరాలపై పడుతున్న ప్రభావాన్ని మరో సందర్భంలో ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తిచేశారు.

పోలింగ్ కేంద్రాల మార్పులో జోక్యం చేసుకోలేం

- స్పష్టం చేసిన హైకోర్టు న్యాయమూర్తి

ఈనాడు, అమరావతి: పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల సందర్భంగా కొన్ని పోలింగ్ కేంద్రాలను మార్చడాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాల్లో జోక్యానికి హైకోర్టు నిరాకరించింది. ఓటర్ స్లిప్పుల పంపిణీ ద్వారా 97% ఓటర్లకు పోలింగ్ కేంద్రం ఎక్కడుందో సమాచారం అందిందని తెలిపింది. ఇప్పటికే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైందని గుర్తుచేసింది. వ్యాజ్యాలను కొట్టేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ సోమవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక సందర్భంగా ఎర్రబల్లి, నల్లగొండువారిపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను నల్లపురెడ్డిపల్లికి మార్చడాన్ని సవాలు చేస్తూ వైకాపా నేతలు తుమ్మల హేమంత్‌రెడ్డి, మరికొందరు హైకోర్టులో అత్యవసరంగా వ్యాజ్యాలు వేశారు.

పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది పి.వీరారెడ్డి, న్యాయవాదులు నాగిరెడ్డి, వీఆర్‌రెడ్డి కొవ్వూరి తదితరులు వాదనలు వినిపించారు. పోలింగ్ కేంద్రాల మార్పు విషయంలో రాష్ట్ర ఎన్నికల సంఘం(ఎస్ఈసీ) నిబంధనలను పాటించలేదన్నారు. పత్రికల్లో ప్రకటన ఇవ్వలేదన్నారు. ఎస్ఈసీ తరఫు న్యాయవాది, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు కూడా విన్న న్యాయమూర్తి.. పోలింగ్ కేంద్రాల వివరాలను పత్రికల్లో ప్రచురించాలనే సొంత సర్క్యులర్‌లోని నిబంధనలను ఎస్ఈసీ ఉల్లంఘించిందని తప్పుపట్టారు. అయితే, ఓటరు స్లిప్పులలో పోలింగ్ కేంద్రాన్ని ఎక్కడికి మార్చారో సమాచారం తెలియజేయడం ద్వారా ఆ లోపాన్ని అధిగమించారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వ్యాజ్యాల్లో జోక్యానికి నిరాకరించారు.

వ్యాజ్యాల ఉపసంహరణ

పులివెందుల ఉప ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ఏజెంట్లకు భద్రత కల్పించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ వైకాపా నేత హేమంత్‌రెడ్డి దాఖలుచేసిన వ్యాజ్యంలో జోక్యానికి హైకోర్టు నిరాకరించింది. ఎస్ఈసీ, పోలీసులు నిబంధనల మేరకు నడుచుకుంటున్నప్పుడు తాము ఉత్తర్వులిస్తే ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యే ప్రమాదం ఉందని తెలిపింది. దీంతో వ్యాజ్యాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు పిటిషనర్ తరఫు న్యాయవాది వీఆర్ రెడ్డి కొవ్వూరి కోర్టుకు తెలిపారు. అందుకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ అనుమతి ఇచ్చారు.

మరో 476 పార్టీల రద్దుకు ఈసీ సమాయత్తం

ఇందులో ఏపీ నుంచి 17, తెలంగాణ నుంచి 9

ఈనాడు, దిల్లీ: నిబంధనలను అనుసరించని మరో 476 పార్టీల రద్దుకు కేంద్ర ఎన్నికల సంఘం సమాయత్తమైంది. ఇందులో ఆంధ్రప్రదేశ్ నుంచి 17, తెలంగాణ నుంచి 9 పార్టీలున్నట్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. వరుసగా ఆరేళ్ల ఎన్నికల్లో పోటీచేయని పార్టీలను నమోదిత రాజకీయపార్టీల నుంచి తొలగించనున్నట్లు వెల్లడించింది. తొలి దశలో 334 పార్టీలను రద్దుచేశామని, ఇప్పుడు వివిధ రాష్ట్రాల నుంచి మరో 476 పార్టీలను గుర్తించామని పేర్కొంది. ఈ పార్టీలకు నోటీసులు జారీ చేసి వివరణ తీసుకోవాలని సంబంధిత రాష్ట్రాల సీఈఓలను ఆదేశించినట్లు కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. సీఈఓల నివేదిక ఆధారంగా ఈ పార్టీల రద్దుపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించింది. ఇందులో అత్యధికంగా యూపీ నుంచి 121, మహారాష్ట్ర నుంచి 44, తమిళనాడు నుంచి 42, దిల్లీ నుంచి 41 పార్టీలున్నాయి.

ద్వితీయ, తృతీయశ్రేణి నగరాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించాలి



జాతీయ క్రీడా బిల్లుపై చర్చలో తెదేపా ఎంపీ కేశినేని శివనాథ్

ఈనాడు, దిల్లీ: కేంద్ర ప్రభుత్వం ద్వితీయ, తృతీయశ్రేణి నగరాలపై దృష్టి సారించి ఖేలో ఇండియా పథకం కింద అక్కడున్న క్రీడాకారులను ప్రోత్సహించాలని విజయవాడ తెదేపా ఎంపీ కేశినేని శివనాథ్ కోరారు. సోమవారం లోక్‌సభలో 'జాతీయ క్రీడా పరిపాలన బిల్లు-2025'పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ఈ బిల్లు ద్వారా జాతీయ క్రీడా మండలి, జాతీయ క్రీడల ఎన్నికల ప్యానెల్, జాతీయ క్రీడా ట్రైబ్యునల్ ఏర్పాటు చేయడాన్ని స్వాగతించారు. అమరావతిలో ప్రపంచస్థాయి స్పోర్ట్స్ సిటీ, విశ్వవిద్యాలయం నిర్మించాలని ముఖ్యమంత్రి లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. దీని కింద ఏపీ ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను ఆమోదించాలని విజ్ఞప్తిచేశారు. ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాష్ట్రంలోని పాఠశాలల్లో క్రీడామైదానాలను అభివృద్ధిచేసి వార్షిక క్రీడోత్సవాలు నిర్వహించాలని భావిస్తున్నారని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం చేయూతనందించాలని కోరారు.

విధ్వంసం నుంచి వికాసం వైపు ఏపీ

భాజపా జిల్లా కార్యాలయాల్లో ప్రతి సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమం: మాధవ్

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: వైకాపా పాలనలో విధ్వంసమైన ఏపీ.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో వికాసం వైపు పయనిస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అన్నారు. చిత్తూరు జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయన సోమవారం ఉదయం ప్రజలతో చాయ్ పే చర్చా కార్యక్రమం నిర్వహించారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నగర వీధుల్లో తిరంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. "జిల్లాకు తాగునీరు అందించే గాలేరు-నగరి, హంద్రీ-నీవా ప్రాజెక్టుల పూర్తికి కట్టుబడి ఉన్నాం. కూటమి ప్రభుత్వం మిత్ర ధర్మాన్ని పాటిస్తూ భాజపాకు నామినేటెడ్ పదవులు కేటాయిస్తోంది. భాజపా జిల్లా కార్యాలయాల్లో ప్రతిసోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం (గ్రీవెన్స్ కార్యక్రమం) నిర్వహించాలి. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలి. ప్రతి కార్యకర్త నాయకుడిగా ఎదగాలి. ఏపీకి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం రూ.15 వేల కోట్లు మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్రం సస్యశ్యామలం అవుతుంది" అని అన్నారు. ఆయన వెంట పార్టీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర నాయుడు తదితరులు ఉన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాధవ్

అధ్యాపకులకు ఐఐటీఎంలో ఉచిత శిక్షణ

చెన్నై(వడపళని), న్యూస్‌టుడే: కళాశాలల్లో బోధించే ఫిజిక్స్, కెమిస్ట్రీ, గణితం, బయో టెక్నాలజీ అధ్యాపకులకు ఐఐటీ మద్రాస్ (ఐఐటీఎం) ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించనుంది. పీజీ, యూజీ సైన్స్ కోర్సులను బోధించేవారికి సబ్జెక్టుపై మరింత పట్టు వచ్చేలా మాలవీయ మిషన్ టీచర్ ట్రెయినింగ్ పథకం (ఎంఎంటీటీపీ) కింద ఈ శిక్షణ అందిస్తామని సంస్థ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొంది. https://fundaspring.com/product/capacity-building-stem-faculty-iit-madras-malaviya-mission లింకు ద్వారా ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని, 9 రోజులపాటు ఐఐటీఎంలోని 'టీచర్ లెర్నింగ్ సెంటర్(టీఎల్‌సీ)' హాల్, సెంట్రల్ లైబ్రరీలో శిక్షణ ఉంటుందని టీఎల్‌సీ ఛైర్మన్, ఆచార్యులు ఎడమన ప్రసాద్ పేర్కొన్నారు. దరఖాస్తు చేసిన తర్వాత ఎంపికయినవారికి మెయిల్ ద్వారా సమాచారం ఇస్తారు. ఆగస్టు 22 నుంచి బయోటెక్నాలజీ వారికి శిక్షణ ప్రారంభం కానుండగా తర్వాత సబ్జెక్టుల వారీగా తరగతులు కొనసాగుతాయి.

రాష్ట్రపతితో రాఖీ వేడుకల్లో రాష్ట్ర విద్యార్థినులు



రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో బాలికలు, ఉపాధ్యాయినులు

చినగంజాం, పటమట (విజయవాడ), న్యూస్‌టుడే: దిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఈ నెల 9న నిర్వహించిన రక్షా బంధన్ వేడుకల్లో రాష్ట్రానికి చెందిన 8 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఇందులో బాపట్ల జిల్లా చినగంజాం కేజీబీవీ నుంచి డి.కీర్తి, బి.ప్రజ్ఞ, బల్లికురవ కేజీబీవీ నుంచి పి.హేమ, పి.శైలజ, విజయవాడ పటమట కేబీసీ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు సీహెచ్.శ్రావణి, ఎస్.రామలక్ష్మి, భవానీపురంలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాస్ విద్యాలయ విద్యార్థులు కె.రామతులసి, జి.కృప ఉన్నారు. టీచర్లు షేక్ కరీమా, పుష్పరాగం, శాంతమ్మ వీరిని దగ్గరుండి వేడుకకు తీసుకెళ్లారు. విద్యార్థినులు రాష్ట్రపతికి రాఖీ అందించి, కాసేపు ముచ్చటించారు.



22,000+ పబ్లిక్ ఛార్జర్ల ఎదుగుతున్న నెట్‌వర్క్, ఇండియా అంతటా### | కాంప్లిమెంటరీ మరియు సత్వర హోం ఛార్జర్ ఇన్‌స్టలేషన్+++ | లభ్యమౌతోంది GeM, CSD మరియు KPKB లలో

మేము ₹50,000* వరకు మీకు ఎక్స్‌ఛేంజ్ ప్రయోజనాలు ఇస్తాము
6 నెలల ఫ్రీ ఛార్జింగ్‌తో జీరో ధరతో డ్రైవ్ చెయ్యండి**
100% ఆన్-రోడ్ ఫైనాన్స్^ మరియు జీరో డౌన్ పేమెంట్‌తో^, కొనండి ఇప్పుడు-తర్వాత చెల్లించండి
ప్రత్యేకమైన లాయల్టీ ప్రయోజనాలు ₹50,000* వరకు: TATA.ev ఓనర్లు TATA Motors కార్ ఓనర్లు (PV)
EVs గురించి అంతా తెలుసుకునేందుకు call +91 92402 92401 visit ev.tatamotors.com
మీకు దగ్గరలో ఉన్న TATA Motors డీలర్‌షిప్ కనుక్కునేందుకు, స్కాన్ చెయ్యండి
TATA.ev move with meaning

JASPER INDUSTRIES Vijayawada: 7506024539; Kanuru: 8291096098; Machilipatnam: 9167063240;
JASPER INDUSTRIES Guntur: 7506024486; Chilakaluripet, Pidugurala: 9167061571; Narasaraopet: 9619940147
JASPER INDUSTRIES Bhimavaram: 8879175169; Eluru: 8879178238; Jangareddygudem: 9619884287
SIVA SANKAR MOTORS PVT. LTD: Amalapuram,Malkipuram: 9619938258; Kakinada: 8879953846, Tuni: 9167059756
SIVA SANKAR MOTORS PVT. LTD: Rajahmundry: 8291094026 Siva Sankar Motors, Next to IOC bunk, NH - 16, Hukumpeta, Rajahmundry - 533101
SIVA SANKAR MOTORS PVT. LTD: Nellore, Kavali, Sullurpeta Naidupeta: 9154947824
VARALAKSHMI AUTOMOBILES Ongole: 7506024504; Markapur: 8879953802; Chirala: 9167059331

Images and illustrations are indicative and for information purpose only. All feature / specifications mentioned may vary from model to model and may not be available across all personas / variants. Features and specifications are subject to change without prior information. Please consult an authorized TATA Motors dealer for latest information on features / specifications before deciding to place an order. Colours may not match actual colours due to printing limitations. **Free charging is available only on TATA power chargers on Curvv.ev & Nexon.ev. Free charging offer carries fair usage policy of 1000 units (kWh) per vehicle during the 6 months offer validity. ^Offers are from multiple Financiers. Finance at sole discretion of Financier. ◆As per Bharat NCAP 2024 score. ###As per internal data provided by charging point operators. +++For terms and conditions refer to ev.tatamotors.com. +The term 'Lifetime' refers to the period of fifteen years from the first date of registration of the vehicle at the local regional transport office, in accordance with the Motor Vehicles Act, 1988, and is restricted for the period of use during the first registration only. Applicable exclusively on Curvv.ev and Nexon.ev 45. ~As per VAHAN registration data for July 2025. *All India ex-showroom price. *Offers/benefits may vary from state to state. Please contact your nearest authorised TATA Motors dealer for exact offers and Details. Terms & conditions apply.

EENADU Vol: 52, Issue: 3 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

(c) eenadu


ఉబ్బు సర్జరీ ఎవరితో?

సమస్య: నాకు 67 ఏళ్లు. సుమారు ఐదు సంవత్సరాలుగా వీపులో మెడ కింద ఉబ్బటం మొదలైంది. ఇది పక్కలకు విస్తరిస్తూ వస్తోంది. దీన్ని సర్జరీ చేసి తొలగించాలని డాక్టర్లు చెప్పారు. అయితే తల నుంచి కింది భాగాలకు మెడ నుంచే నాడులు వెళ్తుంటాయి కదా. ఉబ్బుకు శస్త్రచికిత్స చేస్తే నాడీ వ్యవస్థ దెబ్బతింటుందా? శస్త్రచికిత్స జనరల్ సర్జన్‌తో చేయించుకోవాలా? న్యూరోసర్జన్‌తోనా? – అముజూరు చిట్టిబాబు, శ్రీకాకుళం

సలహా: వీపులో మెడ వద్ద ఉబ్బు తలెత్తటానికి చాలా కారణాలు ఉండొచ్చు.



కొవ్వు ముద్ద (లైపోమా) ఏర్పడటం, లింఫ్ గ్రంథుల వాపు విస్తరించటం.. కొన్నిసార్లు కణితులూ కారణం కావొచ్చు. కాబట్టి చాలా జాగ్రత్తగా పరిశీలించాల్సి ఉంటుంది. లైపోమా పెద్దగా హానికరమైంది కాదు. చికిత్స కూడా అవసరం లేకపోవచ్చు. ఒకవేళ బాగా ఇబ్బంది పెడుతున్నా, నొప్పి పుడుతున్నా తొలగించాల్సి ఉంటుంది. అలాగే మీ మెడ వద్ద ఉబ్బు నాడుల వరకూ విస్తరించిందో, లేదో తెలుసుకోవటమూ కీలకమే. కాళ్లూ చేతుల్లో బలహీనత వంటి కొన్ని లక్షణాలను బట్టి నాడులు ప్రభావితమయ్యాయోలేదో అంచనా వేయొచ్చు. సందేహం వస్తే ఎమ్మారై పరీక్షతో నిర్ధరించొచ్చు. ఏదేమైనా మెడ చాలా సున్నితమైన భాగం. అక్కడి నుంచే కిందికి నాడులు కిందికి వెళ్తుంటాయి. కాబట్టి న్యూరోసర్జన్‌ను సంప్రదించి, శస్త్రచికిత్స చేయించుకోవటమే మంచిది.




– డా॥ పి.రంగనాథం, న్యూరోసర్జన్

మీ ఆరోగ్య సమస్యలను sukhi@eenadu.in కు పంపొచ్చు.

ఆ మందులు ఆపొద్దు!

కుంగుబాటు, ఆందోళన వంటి మానసిక సమస్యలు తగ్గటానికి డాక్టర్లు సూచించే మందులను క్రమం తప్పకుండా వాడుకోవాలి. రోజూ ఒకే సమయానికి వేసుకోవాలి. అయితే చాలామంది కాస్త ఉపశమనం కలగగానే సమస్య తగ్గిపోయిందనే భావనతో మందులు మానేస్తుంటారు. ఇలాంటి తప్పు అసలే చేయొద్దు. మందులు మధ్యలో మానేస్తే సమస్య మళ్లీ తిరగబెడుతుంది. ఒకవేళ మానాల్సి వస్తే డాక్టర్ సలహా మేరకే క్రమంగా మోతాదు తగ్గించుకుంటూ రావాలి. కేవలం మందులే కాదు.. ఆలోచనా తీరు, ప్రవర్తనలను మార్చే చికిత్స కూడా అవసరమే. అన్నీ కలిస్తేనే మంచి ఫలితం కనిపిస్తుంది.

వానాకాలం రాగానే దోమలు విజృంభిస్తుంటాయి. వీటితో పాటే జ్వరాలూ చెలరేగుతుంటాయి. వీటిల్లో డెంగీ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఎందుకంటే చాలామంది ప్లేట్‌లెట్ల గురించి తీవ్ర ఆందోళన చెందుతుంటారు. నిజానికి అంత కంగారు అవసరం లేదు. అందరికీ ప్లేట్‌లెట్లు ఎక్కించాల్సిన అవసరం రాదు. చాలావరకూ మామూలు చికిత్సతోనే జ్వరం తగ్గుతుంది. కాబట్టి డెంగీ తీరుతెన్నులు, చికిత్స, నివారణ మీద సరైన అవగాహన కలిగుండటం తప్పనిసరి.



డెంగీ కంగారొద్దు



డా॥ ఎం.వి.రావు
కన్సల్టెంట్ ఫిజీషియన్
యశోదా హాస్పిటల్
సోమాజిగూడ
హైదరాబాద్

లక్షణాలు ఇవీ..

డెంగీ వైరస్ సోకినా అందరికీ జ్వరం రాకపోవచ్చు. ఓ 10% మందిలోనే ఇన్‌ఫెక్షన్‌గా మారుతుంది. దీంతో ఉన్నట్టుండి తీవ్రమైన జ్వరం.. అతి తీవ్రంగా, తల పగిలిపోతోందేమో అన్నంత తలనొప్పి.. కళ్ల వెనక నొప్పి, వాంతి, వికారం, ఒళ్లు నొప్పులు, నడుం నొప్పి, కీళ్ల నొప్పులు, ఆకలి తగ్గటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. చాలామందికి ఒకట్రెండు లక్షణాలతోనే ఆగిపోవచ్చు కూడా. కొందరు తీవ్రదశకు చేరుకోవచ్చు.

ఒక రకంతో ఒకసారే కానీ..

ఈడిస్ జాతి దోమలు కుట్టటం ద్వారా డెంగీ వైరస్‌లు వ్యాపిస్తాయి. దోమ కుట్టిన 3-14 రోజుల్లో ఎప్పుడైనా ఇన్‌ఫెక్షన్ తలెత్తొచ్చు. ఈ వైరస్‌లలో ప్రధానంగా నాలుగు రకాలున్నాయి. ఒక రకంతో ఒకసారే ఇన్‌ఫెక్షన్ వస్తుంది. అయితే మరో రకం వైరస్‌తో రెండోసారి వస్తే తీవ్రంగా ఉంటుంది. మొదటి రకం వైరస్‌ను ఎదుర్కోవటానికి పుట్టుకొచ్చిన యాంటీబాడీలు రెండో రకం వైరస్‌ను కణాల్లోంచి నిర్మూలించ లేవు. దీంతో ఇన్‌ఫెక్షన్ చాలా తీవ్రంగా ఉంటుంది. కాబట్టే తగు జాగ్రత్త అవసరం. ఎవరికైనా నాలుగు వైరస్‌లతో నాలుగు సార్లు డెంగీ వస్తే జీవితంలో మళ్లీ ఎప్పుడూ వచ్చే అవకాశమే ఉండదని చెప్పుకోవచ్చు.

మామూలు చికిత్సతోనే

ఒక మాదిరి డెంగీ జ్వరానికి పారాసిటమాల్ మాత్రలే సరిపోతాయి. అలాగే ఓఆర్ఎస్ పొడి కలిపిన నీళ్లు తాగుతుండాలి. వాంతులవుతుంటే వీటిని తగ్గించే మందులూ అవసరం. చాలామందికి దీంతోనే డెంగీ నయమవుతుంది.

ఆసుపత్రిలో ఎప్పుడు?

మామూలు చికిత్సతో తగ్గకపోయినా, తీవ్ర డెంగీ లక్షణాలు కనిపిస్తున్నా ఆసుపత్రిలో చేర్చి, చికిత్స చేయాలి. రక్తం చిక్కబడటంతో డెంగీ తీవ్రదశ మొదలవుతుంది. ఇది సాధారణంగా 24-48 గంటల వరకూ కొనసాగుతుంది. ఆ తర్వాత దానంతటదే కుదురుకుంటుంది. కానీ కొందరికి గంటల్లోనే పరిస్థితి విషమించొచ్చు. కాబట్టి రక్తం చిక్కదనాన్ని తెలిపే హిమటోక్రిట్/ప్యాక్డ్ సెల్ వాల్యూమ్, ప్లేట్‌లెట్ల సంఖ్యను తెలిపే రక్త పరీక్షలు తరచూ చేస్తూ జాగ్రత్తగా కనిపెట్టుకోవాల్సి ఉంటుంది. ఊపిరితిత్తుల్లోకి ప్లాస్మా ద్రవం లీకై, ఆయాసం వస్తుంటే వెంటిలేటర్ అమర్చి చికిత్స చేయాల్సి ఉంటుంది.

ప్లేట్‌లెట్లు పడిపోయినా..

ప్లేట్‌లెట్లు 40 వేలకు, 30 వేలకు పడిపోయాయని అతిగా గాబరా పడొద్దు, భయపడొద్దు. ఎందుకంటే డెంగీలో ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గటం వల్ల మరణించటం చాలా అరుదు. అందరికీ వీటిని ఎక్కించాల్సిన అవసరం లేదు.


- ప్లేట్‌లెట్ల సంఖ్య లక్ష కన్నా తగ్గినప్పుడు డాక్టర్ల పర్యవేక్షణలో ఉండాలి. 50వేల కన్నా తక్కువకు పడిపోతే నిశితంగా గమనిస్తూ ఉండటం ముఖ్యం.
- 20 వేల కన్నా తగ్గిపోయి, రక్తస్రావ లక్షణాలు కూడా కనిపిస్తున్నట్టయితే ప్లేట్‌లెట్లు ఎక్కించాల్సి ఉంటుంది.
- అదే 10వేల కన్నా తగ్గితే రక్తస్రావం అయినా, కాకపోయినా ప్లేట్‌లెట్లు ఎక్కించాలి.
- ప్లేట్‌లెట్లను ఇతర రక్త పదార్థాల మాదిరిగా ఫ్రిజ్‌లో నిల్వ చేయలేం. అందువల్ల దూర ప్రాంతాల నుంచి సరఫరా చేసి, ఎక్కించే క్రమంలో కొన్నిసార్లు బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్లు తలెత్తొచ్చు. కొందరికివి రక్తంలోకి విస్తరించి, ప్రాణాపాయమూ సంభవించొచ్చు.

చేయకూడనివి

- కార్టికోస్టిరాయిడ్లు ఇవ్వద్దు. ఇవి పేగుల్లో రక్తస్రావం, గ్లూకోజు బాగా పడిపోవటం, రోగనిరోధకశక్తి తగ్గటానికి దారితీస్తాయి.
- డెంగీకి ప్రత్యేకించిన యాంటీ వైరల్ మందులేవీ లేవు. వైరల్ ఇన్‌ఫెక్షన్లకు యాంటీబయాటిక్స్ పనిచేయవు కాబట్టి వీటిని వాడొద్దు.
- ముందుజాగ్రత్తగా ప్లేట్‌లెట్లు ఎక్కిస్తే ప్రయోజనం లేదు. ఇది తీవ్ర డెంగీ ముప్పునేమీ తగ్గించదు. పైగా ద్రవాల మోతాదు పెరిగి, ఎక్కువరోజులు ఆసుపత్రిలో ఉండాల్సి వస్తుంది.
- అనవసరంగా సెలైన్ ఎక్కించొద్దు. నోటితో ద్రవాలు తీసుకోలేకపోతున్నా, రక్తంలో హిమోగ్లోబిన్ శాతం ఎక్కువున్నా, రక్తపోటు బాగా పడిపోయినా సెలైన్ అవసరం. అదీ తగినంత మోతాదులోనే ఎక్కించాలి. మూత్రం తగినంతగా వస్తున్నా, రక్తం పలుచగా అవుతున్నా సెలైన్ మోతాదు తగ్గించాలి.

ఆ సమయాల్లో..

దోమలు ఎప్పుడైనా కుట్టొచ్చు గానీ ఉదయం 6-8 గంటలు, సాయంత్రం 4-6 గంటల మధ్యలో ఎక్కువగా కుడతాయి. కాబట్టి ఈ సమయాల్లో మరింత జాగ్రత్తగా ఉండాలి.



బొప్పాయితో జాగ్రత్త

ప్లేట్‌లెట్లు పెరగటానికి కొందరు బొప్పాయి ఆకుల రసం తాగిస్తుంటారు. ఇది మంచి పద్ధతి కాదు. ఆకు రసంతో పేగుల్లో పుండ్లు పడే అవకాశముంది. అదేపనిగా బొప్పాయి, కివీ వంటి పండ్ల రసాలు తీసుకోవటమూ తగదు. ఇవి మితిమీరితే పొటాషియం మోతాదు ఎక్కువై, రక్తపోటు పడిపోవచ్చు.

హెచ్చరిక సంకేతాలు ఇవీ..

డెంగీలో జ్వరం తగ్గాకే అసలు ప్రమాదం మొదలవుతుంది. ప్లేట్‌లెట్లు తగ్గటం, రక్తనాళాల్లోంచి ద్రవం లీకవటం, రక్తంలో హిమోగ్లోబిన్ పెరగటం, రక్తం చిక్కబడటం అప్పుడే ఆరంభమవుతుంది. దీంతో మెదడు, కాలేయం, గుండె, ఊపిరితిత్తుల వంటి కీలక అవయవాలు దెబ్బతినటం, షాక్ సిండ్రోమ్ వంటి తీవ్ర అనర్థాలు తలెత్తుతాయి. కాబట్టి హమ్మయ్య జ్వరం తగ్గిందని అనుకోవద్దు. కొన్ని హెచ్చరికలను బట్టి తీవ్రదశ సంకేతాలను పసిగట్టొచ్చు. వీటిని గమనిస్తే ఏమాత్రం నిర్లక్ష్యం చేయొద్దు.



- కండరాల నొప్పి
- నిస్సత్తువ
- తల తిప్పటం
- మగత
- అస్థిమితం, చిరాకు

నివారణే ఉత్తమం

దోమలు కుట్టకుండా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. ● పూల కుండీలు, కూలర్లలో నీరు ఎప్పటికప్పుడు మారుస్తుండాలి. ● నీళ్ల ట్యాంకులు, బకెట్ల వంటి వాటిపై మూత పెట్టాలి. ● పాత టైర్లు, కొబ్బరి చిప్పల వంటి వాటిని పారెయ్యాలి. ● కిటికీలు, తలుపులకు జాలీలు బిగించుకోవాలి. ● పడుకునేటప్పుడు దోమతెరలు వాడుకోవాలి. ● బయటకు వెళ్లినప్పుడు పొడుగు చేతుల చొక్కాలు, ప్యాంట్లు ధరించాలి. ● కాళ్లకు, చేతులకు దోమలను తరిమే క్రీములు రాసుకోవాలి.


ఆరోగ్య సంగీతం




శ్రావ్యమైన పాట వింటే ఎవరైనా తలలూపాల్సిందే. సంగీతం గొప్పతనం అలాంటిది. అది మనసును మైమరిపిస్తుంది. ఆనంద సాగరంలో ఓల లాడిస్తుంది. సంగీతం మెదడులోని చాలా భాగాలను ఉత్తేజితం చేయటం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం.. భావోద్వేగాలు, ఆలోచనల మీద బలమైన ప్రభావమే చూపుతుంది.

మెదడులో అన్నిభాగాల మీదా

- సంగీతంతో హైపోథలమస్, అమిగ్డల, హిప్పోక్యాంపస్ భాగాలతో కూడిన లింబిక్ వ్యవస్థ ఉత్తేజితమైనప్పుడు భావోద్వేగాల ప్రతిస్పందన మెరుగవుతుంది. ప్రవర్తన, చురుకుదనం, జ్ఞాపకశక్తినీ ఈ వ్యవస్థే పర్యవేక్షిస్తుంది.





- మెదడులోని బూడిదరంగు పదార్థం (సెరిబ్రల్ కార్టెక్స్) ప్రేరేపితమైనప్పుడు డ్యాన్స్ చేసేలా పురికొల్పుతుంది. లయకు అనుగుణంగా శరీరం కదిలేలా చేస్తుంది.

విషయగ్రహణ లాభాలు

- జ్ఞాపకశక్తి భద్రంగా ఉంటుంది, మరింతగా మెరుగవుతుంది కూడా.
- సృజనాత్మకత పెరుగుతుంది.
- ఏకాగ్రత, జాగరూకత ఎక్కువవుతుంది.
- త్వరగా స్పందించటం అబ్బుతుంది.
- ప్రాదేశిక దృశ్యాల ఊహాత్మక శక్తి పెరుగుతుంది.
- పిల్లల్లో, పెద్దల్లో మెదడు ఎదుగుదల ఇనుమడిస్తుంది.

శారీరక ప్రయోజనాలు

● ఒత్తిడి హార్మోన్ కార్టిజోల్ మోతాదులు తగ్గుముఖం ● గుండె వేగం, రక్తపోటు తగ్గటం ● శరీరాన్ని కదిలించేలా పురికొల్పటం ● కొత్త నాడీ అనుసంధానాలు ఏర్పడటం, వీటితో మెదడు తిరిగి క్రమబద్ధీకరించుకోవటం.

భావోద్వేగ, మానసిక ప్రభావాలు

- భావోద్వేగ ప్రతిస్పందనల ప్రేరేపణ.
- ఒత్తిడి, ఆందోళన తగ్గుముఖం.
- భావోద్వేగ విశ్లేషణకు వీలు కల్పించటం.
- ఇబ్బంది కలిగించే భావోద్వేగాలను వెలిబుచ్చటానికి సహకరించటం.
- మూడ్‌ను నియంత్రించటం.

మెదడు పనితీరు చురుగ్గా

- చేతులు-కళ్ల మధ్య సమన్వయం.
- చలన నైపుణ్యాలు వృద్ధి కావటం.
- మెదడు అనుసంధానం మెరుగవటం.

ప్రతికూల ప్రభావాలుంటాయా?

అసంబద్ధమైన, చిరాకు కలిగించే సంగీతంతో కొన్ని ప్రతికూల ప్రభావాలూ పడొచ్చు. ఎక్కువ వాల్యూమ్‌తో మరీ ఉద్రిక్త సంగీతం వినటం వల్ల మెదడు మరీ అతిగా స్పందించొచ్చు. విషాదకర అనుభవాలతో ముడిపడిన పాటలు విన్నా చేదు జ్ఞాపకాలు గుర్తుకురావొచ్చు. కొన్నిసార్లు నిశ్శబ్దంగా ఉండటమే అవసరమవ్వచ్చు. ఏదేమైనా సంగీతం మనిషిలో ఉత్తేజం నింపుతుంది. జీవితాన్ని లయబద్ధం చేస్తుంది.

లేచి నిల్చున్నా మేలే

వ్యాయామం సరిగా చేయలేకపోతున్నామని చింతిస్తున్నారా? కూర్చున్నప్పుడు మధ్యమధ్యలో లేచి నిల్చోవటమైనా పెంచుకోండి. ఇది తేలికైనదే అయినా గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి బాగా తోడ్పడుతున్నట్టు తాజాగా బయటపడింది. ముఖ్యంగా మహిళలకు ఎంతో మేలు చేస్తున్నట్టు వెల్లడైంది. రోజంతా తరచూ లేచి నిల్చోవటం వల్ల రక్తపోటు ఒకింత అదుపులోకి వస్తున్నట్టు పరిశోధకులు గుర్తించారు. నిజానికి తక్కువగా కూర్చోవటమే మంచిది. ఒకవేళ ఇది కుదరకపోయినా అప్పుడప్పుడూ లేచి నిల్చోవటమూ రక్తపోటు తగ్గటానికి, గుండె



ఆరోగ్యం మెరుగు పడటానికి తోడ్పడటం గమనార్హం. ఈ అధ్యయనంలో నెలసరి నిలిచిన అధిక బరువు, ఊబకాయ స్త్రీలను ఎంచుకొని.. మూడు బృందాలుగా విభజించారు. ఒక బృందానికి తక్కువగా కూర్చోవాలని చెప్పగా.. రెండో బృందానికి కూర్చున్నప్పుడు లేచి నిల్చొనే సంఖ్యను పెంచుకోవాలని, మూడో బృందానికి మామూలుగా తమ పనులు చేసుకోవాలని సూచించారు. ఎక్కువసార్లు లేచి నిల్చొన్నవారిలో సిస్టాలిక్ రక్తపోటు (పై లేదా ముందు అంకె) 3 ఎంఎం/హెచ్‌జీ కన్నా ఎక్కువగా తగ్గగా.. డయాస్టాలిక్ రక్తపోటు (కింది లేదా తర్వాతి అంకె) 2 ఎంఎం/హెచ్‌జీ కన్నా ఎక్కువగా తగ్గినట్టు తేలింది. అంకెల పరంగా చూస్తే ఇది తక్కువే అయినా తరచూ నిల్చోవటం రక్తపోటు మీద ప్రభావం చూపుతున్నట్టు అధ్యయన ఫలితాలు సూచిస్తున్నాయని పరిశోధకులు చెబుతున్నారు.

చిన్ని గుండెలకు 'తెర' కాటు!



పిల్లలు మరీ ఎక్కువసేపు ఫోన్, ట్యాబ్లెట్లు, టీవీలకు అతుక్కుపోతున్నారా? వీటి ధ్యాసలో పడి కంటి నిండా నిద్ర పోవటం లేదా? అయితే ఆలోచించాల్సిందే. అతిగా డిజిటల్ పరికరాల వాడకంతో అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, ఇన్సులిన్ నిరోధకత తలెత్తే అవకాశాలు పెరుగుతున్నట్టు అమెరికన్ హార్ట్ అసోసియేషన్ పత్రికలో ప్రచురితమైన తాజా అధ్యయనం హెచ్చరిస్తోంది. రాత్రిపూట తక్కువసేపు నిద్రించే వారికి వీటి ముప్పు మరింత ఎక్కువగా ఉండటం గమనార్హం. డిజిటల్ తెరల వాడకం నిద్ర సమయాన్ని 'దొంగిలించటం' ద్వారా హానికరంగా పరిణమిస్తున్నట్టు అధ్యయన ఫలితాలు సూచిస్తున్నాయి. అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, ఇన్సులిన్ నిరోధకతలన్నీ గుండెకు చేటు చేసేవే. అందుకే వీటిని గుండెజీవక్రియ జబ్బులుగా పరిగణిస్తారు. ఈ అధ్యయనంలో యుక్తవయసు పిల్లలను రెండు బృందాలుగా విభజించి టెక్నాలజీ వాడకం, నిద్ర, ఆరోగ్య సమాచారాన్ని విశ్లేషించారు. వీరందరినీ పుట్టినప్పటి నుంచీ గమనిస్తూ వచ్చారు. 10, 18 ఏళ్లలో శరీర తీరుతెన్నులను పరీక్షించారు. నడుం చుట్టుకొలత, సిస్టాలిక్ రక్తపోటు, మంచి కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్లు, గ్లూకోజు మోతాదుల ఆధారంగా గుండె జీవక్రియ ముప్పు స్కోర్‌ను అంచనా వేశారు. ఫోన్, ట్యాబ్లెట్, టీవీలకు అతుక్కుపోయే ప్రతి అదనపు గంటకూ ఇది గణనీయంగా పెరుగుతున్నట్టు తేలింది. కొందరు పిల్లలు రోజుకు మూడు నుంచి ఆరు గంటల వరకూ వీటిని చూస్తుండటం ఆందోళనకరమని పరిశోధకులు చెబుతున్నారు. పిల్లల్లో తెరల వాడకాన్ని పరిమితం చేస్తే దీర్ఘకాలంలో గుండె, జీవక్రియల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచిస్తున్నారు.

ప్రవర్తన మార్పుతో నడుం నొప్పి దూరం!

దీర్ఘకాల నడుంనొప్పి కేవలం శారీరక సమస్య మాత్రమే కాదు. మానసిక భావన, ప్రవర్తనతోనూ ముడిపడి ఉంటుంది. ఆశ్చర్యంగా అనిపించినా ఇది నిజమే కావటం గమనార్హం. వ్యాయామ, మానసిక చికిత్సల కలబోతతో కూడిన కాగ్నిటివ్ ఫంక్షనల్ థెరపీ (సీఎఫ్‌టీ) దీర్ఘకాల నడుంనొప్పికి బాగా ఉపయోగపడుతున్నట్టు పరిశోధనలు చెబుతున్నాయి మరి. దీన్ని స్వల్పకాలం తీసుకున్నా ఏళ్ల కొద్దీ ఫలితం కనిపిస్తుండటం విశేషం. ఆయా వ్యక్తులకు అనుగుణమైన కదలికలు, జీవనశైలి మార్పుల ద్వారా నొప్పిని అర్థం చేసుకోవటాన్ని, నియంత్రణలో ఉంచుకోవటాన్ని నేర్పించటం కాగ్నిటివ్ ఫంక్షనల్ థెరపీ ప్రత్యేకత.



ప్రపంచవ్యాప్తంగా వైకల్యానికి దారితీస్తున్న ప్రధాన కారణాల్లో నడుం నొప్పి ఒకటి. చాలామందికి చికిత్సలతో పెద్దగా ఫలితం కనిపించదు. ఉపశమనం కలిగినా కొద్దికాలమే. నడుంనొప్పితో బాధపడేవారిలో చాలామంది శరీరాన్ని కదిలించటానికి భయపడుతుంటారు. వారి ప్రవర్తన, నమ్మకాలు, చాలాకాలంగా కదలికలకు అనుగుణంగా సర్దుకుపోయిన నాడీ వ్యవస్థ వంటివి ఇందుకు దోహదం చేస్తుంటాయి. వీటిని మార్చటానికి ఎవరో ఒకరి సహాయం అవసరం. ఇక్కడే సీఎఫ్‌టీ ప్రాధాన్యం సంతరించుకుంటోంది. ఈ నేపథ్యంలోనే యూనివర్సిటీ ఆఫ్ సదరన్ డెన్మార్క్ పరిశోధకులు 2023లో ఓ ప్రయోగ పరీక్ష చేపట్టారు. దీర్ఘకాల నడుంనొప్పితో బాధపడుతున్న 492 మందిని ఎంచుకొని కొందరికి 12 వారాల పాటు సీఎఫ్‌టీ తరగతులు నిర్వహించారు. ఆయా వ్యక్తుల భంగిమ, నొప్పి మీద వారికి గల ఆలోచనలు, భావోద్వేగాలు, జీవనశైలి అంశాలను నిశితంగా పరిశీలించారు. నొప్పిని భిన్నంగా చూడటం, వారి కదలికల తీరును మార్చుకోవటం, విశ్రాంతి తీసుకునే పద్ధతులు, ఒత్తిడిని నియంత్రణలో ఉంచుకోవటం నేర్పించారు. కేవలం 8 సార్లు ఈ చికిత్స తీసుకున్నా కనీసం ఏడాది వరకూ నొప్పి తీవ్రత, వైకల్యం స్థాయులు దాదాపు 4 రెట్లు తగ్గుముఖం పడుతున్నట్టు గుర్తించారు. దీని ప్రయోజనాలు సుమారు మూడేళ్ల తర్వాతా కొనసాగుతున్నట్టు ఇటీవల మరోసారి గుర్తించారు కూడా. నొప్పి మందులు, ఫిజియోథెరపీ, మర్దన చికిత్సతో పోలిస్తే సీఎఫ్‌టీతో మూడు రెట్లు ఎక్కువగా నొప్పి, వైకల్యం తగ్గుముఖం పట్టినట్టు తేలింది. నడుంనొప్పితో పనులేవీ చేసుకోలేక ఇబ్బంది పడుతున్నవారికిది దీర్ఘకాలం మేలు చేస్తున్నట్టు దీన్ని బట్టి తెలుస్తోందని పరిశోధకులు చెబుతున్నారు.

వ్యాయామంలోనూ శ్వాసపై ధ్యాస

వ్యాయామం అనగానే ఎలాంటివి చేస్తున్నాం? ఎంత వేగంగా చేస్తున్నాం? ఎంత ఎక్కువగా బరువులు ఎత్తుతున్నాం? అనేవే గుర్తుకొస్తాయి. కానీ శ్వాస ఎలా తీసుకుంటున్నామో పెద్దగా గమనించం. 'అ.. వ్యాయామం చేస్తున్నప్పుడు ఎలాగూ శ్వాస తీసుకుంటూనే ఉంటాం, దీని గురించి ప్రత్యేకంగా పట్టించుకోవాల్సిన అవసరమేముంది?' అని కొట్టి పారేయకండి. దీనికి చాలా ప్రాధాన్యమే ఉంది.

ఎంత ఎక్కువగా, కష్టంగా వ్యాయామం చేస్తుంటే శరీరంలో అంత ఎక్కువగా కార్బన్ డయాక్సైడ్ తయారవుతుంది. దీన్ని బయటకు వెళ్లగొట్టటానికి వేగంగా శ్వాస తీసుకొని, వదులుతుంటాం. దీంతో కార్బన్‌డయాక్సైడ్ బయటకు పోవటమే కాకుండా శరీరానికి అవసరమైన ఆక్సిజన్ మరింతగా లోనికి వెళ్తుంది. చేసే వ్యాయామాలను బట్టి శ్వాస తీసుకునే తీరు ఆధారపడి ఉంటుంది. అయితే గాఢంగా శ్వాస తీసుకోవటం వంటి కొన్ని పద్ధతులు వ్యాయామం మరింత ఎక్కువగా, సమర్థంగా చేయటానికి.. త్వరగా కోలుకోవటానికి తోడ్పడుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. గాఢంగా శ్వాస తీసుకుంటే మరింత ఆక్సిజన్ లభిస్తుంది. శ్వాస తీసుకునే తీరు వ్యాయామాలను ఎలా ప్రభావితం చేస్తుందో చూస్తే విషయమేంటో అర్థమవుతుంది.



కడుపు నిండుగా..

వ్యాయామ సామర్థ్యాన్ని కాస్త పెంచుకోవాలంటే కడుపు నిండుగా (డయాఫ్రాగ్మాటిక్) శ్వాస తీసుకోవటానికి ప్రయత్నించటం మంచిది. మన ఊపిరితిత్తుల దిగువన డయాఫ్రం అనే కండర పొర ఉంటుంది. కడుపు, ఛాతీ భాగాలను వేరు చేసే ఇది గుమ్మటం ఆకారంలో ఉంటుంది. శ్వాస తీసుకున్నప్పుడు సంకోచించి, చదునుగా అవుతుంది. దీంతో ఛాతీ కుహరం విస్తరించి, ఊపిరితిత్తుల్లోకి గాలి వెళ్లేలా చేస్తుంది. కడుపు నిండుగా శ్వాస తీసుకున్నప్పుడు ఇది బాగా చదునుగా అవుతుంది. కాబట్టి ఎక్కువ గాలి లోనికి చేరుతుంది. డయాఫ్రాగ్మాటిక్ శ్వాస పద్ధతిని సరిగా ఎలా చేయాలో తెలియకపోతే 'మొసలి శ్వాస'ను సాధన చేసి చూడొచ్చు. ముందు బోర్లా పడుకొని, చేతులను నుదురు కింద పెట్టాలి. శ్వాస తీసుకుంటున్నప్పుడు కడుపు నేలను అదుముతుంటుంది కదా. శ్వాస పూర్తిగా తీసుకోవటానికి వీలుగా వీపు, అలాగే పక్కటెముకలు విస్తరిస్తుంటాయి. కడుపునిండా గాలి తీసుకున్నప్పుడు సరిగ్గా ఇలాగే ఉంటుంది. దీన్ని రోజులో ఇతర సమయాల్లో, వ్యాయామం చేస్తున్నప్పుడు ప్రయత్నిస్తుంటే అదే అలవాటవుతుంది. దీంతో వ్యాయామ సామర్థ్యం కొద్దిగా (3-5%) మెరుగైనా అధిక రక్తపోటు, విశ్రాంతి సమయంలో గుండె వేగం తగ్గటం వంటి ఇతరత్రా ప్రయోజనాలు సైతం చేకూరుతాయి.

ఇలా మామూలు స్థితికి

వ్యాయామం అనంతరం శ్వాస త్వరగా మామూలు స్థితికి చేరుకోవటానికి లయను మార్చుకోవటం మేలు చేస్తుంది. శ్వాస వేగాన్ని నెమ్మదింపజేయటం చాలా ముఖ్యం. ఇందుకు విరామ శ్వాస (బాక్స్ బ్రీతింగ్) పద్ధతిని అనుసరించొచ్చు. దీనికి ఒక మార్గం- నాలుగు సెకండ్ల పాటు శ్వాస తీసుకొని, నాలుగు సెకండ్ల సేపు బిగపట్టాలి. తర్వాత నాలుగు సెకండ్ల సేపు శ్వాస వదలాలి. ఇది వేగం నెమ్మదించటానికి తోడ్పడుతుంది. మరో పద్ధతి- శ్వాస తీసుకునే సమయం కన్నా ఎక్కువ సేపు వదలటం. శ్వాస తీసుకుంటున్నప్పుడు గుండె వేగం పెరుగుతుంది, వదులుతున్నప్పుడు తగ్గుతుంది. శ్వాస వదలటానికి ప్రాధాన్యమిస్తూ కొన్నిసార్లు గాఢంగా తీసుకోవటానికీ ప్రయత్నించొచ్చు.

ముక్కుతోనే శ్వాసించాలా?

వ్యాయామం చేస్తున్నప్పుడు కొందరు ముక్కుతో శ్వాస తీసుకోవటం మంచిదని, దీంతో వ్యాయామ సామర్థ్యం పెరుగుతుందని భావిస్తుంటారు. ఇది ఆస్థమాతో బాధపడేవారికి కొంత ప్రయోజనం కల్పించే మాట నిజమే. ఎందుకంటే ముక్కు ద్వారా లోనికి వెళ్తున్నప్పుడు గాలి వేడెక్కుతుంది, మరింత తేమ కలిగుంటుంది. అయితే అందరికీ దీంతో వ్యాయామ సామర్థ్యం ఇనుమడిస్తుందని కచ్చితంగా చెప్పలేం. వేగంగా, బలంగా వ్యాయామాలు చేస్తున్నప్పుడు ముక్కుతో శ్వాస తీసుకోవటం కష్టం కూడా. ఛాతీ బిగపట్టినట్టు అయ్యి, గాలి కోసం ఆయాస పడాల్సి వస్తుంది. కొన్నిసార్లు.. ముఖ్యంగా పరుగెత్తుతున్నప్పుడు కదలికలకు అనుగుణంగా శరీరమే శ్వాస తీరును క్రమబద్ధం చేసుకుంటుంది. సాధారణంగా ఒక పాదం నేలకు తాకినప్పుడు శ్వాస తీసుకుంటాం, రెండో పాదం నేలకు తాకినప్పుడు వదులుతాం. ఇది కండరాల అలసటను తగ్గిస్తుంది. కాబట్టి సహజ పద్ధతిలో శ్వాస తీసుకోవటమే మంచిది. కొత్తగా వ్యాయామాలు చేసేవారికిది ఉపయుక్తం. ఏదేమైనా ఆస్వాదిస్తూ, ఆనందంగా వ్యాయామం చేయటమే అన్నింటికన్నా ముఖ్యం.

నిద్ర ఎక్కువైనా, తక్కువైనా అనర్థమే



నిద్రలేమితో గుండెజబ్బులు, అధిక రక్తపోటు, మతిమరుపు, నిరుత్సాహం, కుంగుబాటు వంటి సమస్యలు తలెత్తుతాయని తెలిసిందే. ఇది ఆయుష్షు మీదా ప్రభావం చూపుతుంది. రోజూ రాత్రిపూట 7 గంటల కన్నా తక్కువసేపు పడుకునేవారికి అకాల మరణం ముప్పు 14% ఎక్కువగా ఉంటున్నట్టు తేలింది. ఇదొక్కటే కాదు, అతి నిద్ర కూడా హానికరంగా పరిణమిస్తున్నట్టు బయటపడింది. ప్రతిరోజూ రాత్రిపూట 9 గంటల కన్నా ఎక్కువసేపు నిద్రించేవారికి అకాల మరణం ముప్పు 34% ఎక్కువగా ఉంటున్నట్టు వెల్లడైంది. గతంలో నిర్వహించిన 79 అధ్యయనాలను సమీక్షించి పరిశోధకులు ఈ విషయాన్ని గుర్తించారు.

ఎంత నిద్ర అవసరం?

ఆరోగ్యవంతుల్లో చాలామందికి రాత్రిపూట కనీసం 7 గంటల నిద్ర అవసరం. అయితే ఇది సాధారణ నియమమే గానీ కచ్చితమమేమీ కాదు. కొందరికి 7 గంటల కన్నా తక్కువ నిద్రే సరిపోవచ్చు. కొందరికి ఎక్కువగానూ అవసర పడొచ్చు. మొత్తమ్మీద పడుకొని లేచాక ఎంత హుషారుగా ఉన్నామనేదే కీలకం. నిద్ర లేచాక ఉత్సాహంగా లేకపోయినా, కునికిపాట్లు పడుతున్నా నిద్ర తగ్గిందనే అర్థం.

దగ్గు, జలుబు, గొంతులో గరగరకు తక్షణ ఉపశమనం
fizikem®
GOKOF
గోకాఫ్... "మీ గొంతుకు శ్రీరామరక్ష"
Visit us : www.fizikem.com
అన్ని రకముల మందుల షాపులలో లభ్యం

(c) eenadu

రష్యా చమురు ఆగితే..!?



- భారత్‌పై 2025-26లో 9 బి. డాలర్ల భారం
- ఆ తర్వాత ఏడాది 11.7 బి. డాలర్లు
- ప్రత్యామ్నాయాలు పరిశీలించాలి

పాశ్చాత్య దేశాల ఆంక్షలున్న రష్యా నుంచి ముడి చమురును తక్కువ ధరకు దిగుమతి చేసుకుంటున్నందుకు, పెనాల్టీ రూపంలో 25% సుంకాన్ని భారత్‌పై అమెరికా విధిస్తూ ట్రంప్ నిర్ణయించారు. ఇంతకుముందే విధించిన 25% సుంకానికి ఇది అదనం. అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదరకపోతే ఈనెల 27 నుంచి అమెరికాకు వెళ్లే భారత ఉత్పత్తులపై 50% సుంకం చెల్లించాల్సిందే. భవిష్యత్తులో మరిన్ని వడ్డనలు ఉంటాయని హెచ్చరిస్తున్నారు. రష్యా నుంచి చమురు దిగుమతుల వల్ల మన ఆర్థిక వ్యవస్థకు కలిగిన మేలు ఏమిటి, దానిని నిలిపేస్తే.. మన ఇంధన బిల్లు ఎంత పెరుగుతుందో పరిశీలిస్తే.. అమెరికా సుంకాలను ఎదుర్కోవడం మేలా, చౌకధర ఇంధనం కోసం ఆ సుంకాలు భరించడం మేలా అనేది తెలుస్తుంది.


2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై యుద్ధం ప్రారంభించిన రష్యాపై పాశ్చాత్య దేశాలు ఆంక్షలు విధించాయి. అప్పటి నుంచి అంతర్జాతీయ ధర కంటే తక్కువకే ముడిచమురును రష్యా ఆఫర్ చేయగా, మనదేశ రిఫైనరీలు కొంటూ వస్తున్నాయి. ట్రంప్ టారిఫ్‌ల నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మిగిలిన కాలంలో రష్యా నుంచి చౌక ఇంధన దిగుమతులను మనం ఆపేస్తే, మన ఇంధన బిల్లు 9 బిలియన్ డాలర్ల మేర ప్రియం అవుతుందని ఎస్‌బీఐ రీసెర్చ్ అంటోంది. 2026-27లో ఇది 11.7 బి. డాలర్లకు చేరుతుందనీ అంటోంది.

ఎందుకంత ప్రాధాన్యమంటే

మన ముడి చమురు అవసరాల్లో 80 శాతానికి పైగా దిగుమతి చేసుకుంటున్నాం. 2019-20లో మన మొత్తం చమురు దిగుమతుల్లో రష్యా వాటా 1.7 శాతమే. 2024-25 కల్లా అది 35.1 శాతానికి చేరింది. తద్వారా మనకు అతిపెద్ద చమురు సరఫరాదారుగా రష్యా మారింది. ఆ దేశ చమురు బ్యారెల్ ధర కేవలం 60 డాలర్లుగా ఉండటమే దీనికి కారణం. 2024-25లో మొత్తం 245 మిలియన్ మెట్రిక్ టన్నుల(ఎమ్ఎమ్‌టీ) చమురును మనం దిగుమతి చేసుకుంటే, అందులో 88 ఎమ్ఎమ్‌టీ రష్యాదే. ఉక్రెయిన్-రష్యా యుద్ధం ముందు మనదేశం ఇరాక్ వద్ద ఎక్కువగా చమురు కొనేది. ఆ తర్వాతి స్థానాల్లో సౌదీ అరేబియా, యూఏఈ ఉండేవి.

ప్రపంచ చమురు సరఫరాలో రష్యా 10% వాటా ఉంది. ట్రంప్ బెదిరింపుల భయం వల్ల, ఇతర దేశాలూ రష్యా చమురును కొనుగోలు చేయడం ఆపేస్తే అంతర్జాతీయంగా చమురు ధరలు ప్రస్తుతం ఉండే 10% పెరగొచ్చు.

మనదేశం ఏం చేయొచ్చంటే..చమురు దిగుమతి బిల్లు భారం పెరిగే అవకాశం ఉన్నప్పటికీ.. భారత్ తన సరఫరా నెట్‌వర్క్‌ను వైవిధ్యీకరించుకుని, ఇతర చమురు ఉత్పత్తి దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటే.. అమెరికా ఆంక్షల ప్రభావాన్ని కొంత తగ్గించుకోవచ్చని ఎస్‌బీఐ రీసెర్చ్ అంటోంది. దేశ ఇంధన భద్రత కోసం ఇప్పటికే భారత్ 40 దేశాల నుంచి చమురు దిగుమతి చేసుకుంటోంది. ఇందులో కొత్తగా గయానా, బ్రెజిల్, కెనడా వంటి దేశాలు జత చేరాయి. భారత రిఫైనరీలు సంప్రదాయ మధ్య ప్రాచ్య ఉత్పత్తిదార్లతో వార్షిక కాంట్రాక్టులను కలిగి ఉండటమూ కలిసొచ్చే అంశం.



రష్యా చమురుపై ఆదేశాల్లేవ్

– హెచ్‌పీసీఎల్ ఛైర్మన్ వికాస్ కౌశల్

రష్యా చమురు కొనుగోళ్లను కొనసాగించాలని కానీ, లేదంటే నిలిపివేయాలని కానీ ప్రభుత్వం నుంచి చమురు రిఫైనరీలకు ఎటువంటి ఆదేశాలూ రాలేదని హెచ్‌పీసీఎల్ ఛైర్మన్ వికాస్ కౌశల్ అంటున్నారు. ఆర్థిక అంశాల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడానికి, కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం స్వేచ్ఛనిచ్చిందని తెలిపారు. హెచ్‌పీసీఎల్ మొత్తం చమురు దిగుమతుల్లో రష్యా వాటా 13.2 శాతమే ఉందని, రష్యా నుంచి పూర్తిగా చమురు నిలిపేసినా పెద్ద ప్రభావం పడదని ఆయన అన్నారు. విశాఖలోని రిఫైనరీ మాత్రమే రష్యా చమురును ప్రాసెస్ చేస్తోందన్నారు. ధర అనుకూలంగా ఉంటే మళ్లీ రష్యా చమురును కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లూ తెలిపారు.

బ్యారెల్‌కు 2 డాలర్ల కంటే తక్కువ ప్రయోజనం

జులైలో భారత్ రోజుకు 5 మిలియన్ బ్యారెళ్ల చమురును దిగుమతి చేసుకుంది. ఇందులో 1.6 మిలియన్ బ్యారెళ్లు రష్యా నుంచి సరఫరా అయ్యాయి. ప్రస్తుతం రష్యా చమురు ధర అంతర్జాతీయ ధరతో పోలిస్తే, బ్యారెల్‌కు 2 డాలర్ల లోపే తక్కువ ఉంటోందని, అందువల్ల భారత రిఫైనరీలకు పెద్దగా ఆర్థిక ప్రయోజనం ఉండటం లేదని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అయితే రష్యా నుంచి చమురు దిగుమతిని భారీగా పెంచుకున్నందున.. ఒక్కసారిగా తగ్గించడం లేదా ఆపేయడం భారత్‌కు అంత సులువేమీ కాదనే అభిప్రాయమూ వ్యక్తమవుతోంది.

– ఈనాడు వాణిజ్య విభాగం

ఈనాడు బిజినెస్

ఐటీ ఫైలింగ్‌లో జియోఫైనాన్స్ యాప్ సాయం

దిల్లీ: పన్ను చెల్లింపుదార్లు తమ ఐటీ రిటర్నులను దాఖలు చేసే సమయంలో జియోఫైనాన్స్ యాప్ సాయం పొందొచ్చని జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ (జేఎఫ్ఎస్ఎల్) వెల్లడించింది. తన ప్లాట్‌ఫామ్‌పై ట్యాక్స్ ప్లానింగ్ అండ్ ఫైలింగ్ మాడ్యూల్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. పన్ను ప్రణాళిక, ఐటీఆర్ ఫైలింగ్‌ను సులభతరం, స్మార్ట్‌గా, మరింత అందుబాటు ధరలో తీసుకురావడానికి ఆన్‌లైన్ ట్యాక్స్ ఫైలింగ్, అడ్వైజరీ సర్వీసెస్ సంస్థ అయిన ట్యాక్స్‌బడ్డీ భాగస్వామ్యంతో కొత్త ఫీచర్‌ను అభివృద్ధి చేసినట్లు పేర్కొంది. సొంతంగా రిటర్నులు ఫైల్ చేసుకోవడం లేదా నిపుణుల సహాయంతో ఫైలింగ్ చేయడానికి ప్లాన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపింది. సెల్ఫ్-ఫైలింగ్ ఆప్షన్ ఎంపిక చేసుకుంటే అతి తక్కువగా రూ.24 ప్లాన్, నిపుణుల సాయంతో (అసిస్టెడ్) ఎంపికలకు రూ.999 ప్లాన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపింది.

హైదరాబాద్‌లో జెడ్ఎస్ కార్యాలయ విస్తరణ

ఈనాడు, హైదరాబాద్: అంతర్జాతీయ సంస్థలకు మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్, సాంకేతిక సేవలను అందించే జెడ్ఎస్ హైదరాబాద్‌లో తన కార్యాలయాన్ని విస్తరించింది. 50వేల చదరపు అడుగుల్లో, 500-600 మంది నిపుణులు పనిచేసేలా దీన్ని ఏర్పాటు చేసింది. తాను సేవలను అందించే సంస్థలు, జీసీసీలకు మెరుగైన సేవలను అందించేందుకు వీలుగా దీన్ని ప్రారంభించినట్లు పేర్కొంది. జీసీసీ-యాజ్ ఎ సర్వీస్ సహా, పలు ఇతర సేవలూ ఇక్కడి నుంచి లభిస్తాయని తెలిపింది. స్థానిక నైపుణ్యాలను వినియోగించుకోవడంతోపాటు, జీసీసీ వ్యవస్థకు తోడ్పాటు అందించేందుకు ఇది దోహదం చేస్తుందని జెడ్ఎస్ ప్రాంతీయ మేనేజింగ్ ప్రిన్సిపల్ మోహిత్ సూద్ అన్నారు.

దిల్లీ- వాషింగ్టన్ విమాన సర్వీసులు నిలిపివేత

ఎయిరిండియా కీలక నిర్ణయం



దిల్లీ: దిల్లీ- వాషింగ్టన్ డీసీ మధ్య నాన్ స్టాప్ విమాన సర్వీసులను నిలిపివేయనున్నట్లు విమానయాన సంస్థ ఎయిరిండియా ప్రకటించింది. సెప్టెంబర్ 1 నుంచి ఇది అమల్లోకి వస్తుందని పేర్కొంది. 26 బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానాలకు నవీకరణ చేపడుతున్నందున విమానాల కొరత ఉంటుందని, పాకిస్థాన్ గగనతలం మూసివేత ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎయిరిండియా పేర్కొంది. సెప్టెంబర్ 1 తర్వాత వాషింగ్టన్ డీసీకి లేదా అక్కడి నుంచి దిల్లీకి టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికుల్ని సంప్రదించి.. వారి వ్యక్తిగత ప్రాధాన్యతల ప్రకారం ఇతర విమానాల్లో రీబుకింగ్ లేదా పూర్తి రిఫండ్ సహా ప్రత్యామ్నాయ ప్రయాణ ఏర్పాట్లను సైతం అందిస్తామని తెలిపింది.

కనీస నిల్వ బ్యాంకుల ఇష్టమే: ఆర్‌బీఐ గవర్నర్

గొజారియా (గుజరాత్): బ్యాంకు ఖాతాల్లో కనీస నిల్వ(మినిమం బ్యాలెన్స్) ఎంత ఉండాలనే నిర్ణయాధికారం పూర్తిగా బ్యాంకులదేనని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. ఈ అంశం ఆర్‌బీఐ నియంత్రణ పరిధిలోకి రాదని సోమవారం ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన స్పష్టం చేశారు.



తాజాగా ఐసీఐసీఐ బ్యాంక్ పొదుపు ఖాతాలో కనీస నిల్వను రూ.50,000కు పెంచిన నేపథ్యంలో అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. 'పొదుపు ఖాతాలకు సంబంధించిన కనీస నిల్వ ఎంత ఉండాలి అనేది బ్యాంకులే నిర్ణయించుకుంటాయి. ఆ బాధ్యతను ఆర్‌బీఐ బ్యాంకులకు వదిలేసింది. కొన్ని బ్యాంకులు దానిని రూ.10,000 వద్ద ఉంచాయి. కొన్ని రూ.2,000 ఉండాలని అంటున్నాయి. మరికొన్ని కనీస నిల్వపై ఎలాంటి పరిమితినీ పెట్టలేదు. ఈ విషయంలో బ్యాంకులకు స్వేచ్ఛ ఉంది' అని పేర్కొన్నారు.

అందుబాటు ధర ఇళ్ల అమ్మకాలు తగ్గొచ్చు

- ఎంఎస్ఎంఈలపై అమెరికా సుంకాల ప్రభావం
- అనరాక్ అంచనా

దిల్లీ: భారత ఎగుమతులపై అమెరికా విధించిన సుంకాల కారణంగా సూక్ష్మ, చిన్న, మధ్యస్థాయి కంపెనీలు(ఎంఎస్ఎంఈ), వాటి ఉద్యోగుల ఆదాయంపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రూ.45 లక్షల లోపు ధర ఉండే అందుబాటు గృహాల విక్రయాలు దెబ్బ తినే అవకాశం ఉందని స్థిరాస్తి సేవల సంస్థ అనరాక్ తెలిపింది. ప్రధానంగా ఈ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులే ఈ ఇళ్లను కొంటారని పేర్కొంది. అమెరికా ఎగుమతుల్లో ఎంఎస్ఎంఈల వాటా గణనీయంగా ఉంటుంది. అధిక సుంకాల వల్ల వాటి ఉత్పత్తులు, ఇతర దేశాలతో పోటీపడే అవకాశం కోల్పోయే ఆస్కారం ఉంది. ఈ పరిస్థితుల్లో వాటికి ఆర్డర్లు తగ్గే ఆస్కారం కనిపిస్తోంది. ఇది ప్రధానంగా ఉద్యోగులపై



ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని అనరాక్ వెల్లడించింది.

కొవిడ్-19 మహమ్మారి తర్వాత అందుబాటు గృహాల విక్రయాలు, కొత్త ప్రాజెక్టుల ప్రారంభం తగ్గిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించింది. ఈ ఏడాది తొలి ఆరు నెలల కాలంలో దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో 1.9 లక్షల ఇళ్లు అమ్ముడైనప్పటికీ, వీటిలో కేవలం 34,565 యూనిట్లు మాత్రమే అందుబాటు ధరలవి ఉన్నాయి. ఇప్పటికే తీవ్రంగా దెబ్బతిన్న ఈ విభాగానికి సుంకాలు పెద్ద ప్రతికూలంగా మారబోతున్నాయని, మిగిలిన కొద్దిపాటి ఆశలనూ నాశనం చేసే అవకాశముందని అనరాక్ రీసెర్చ్, అడ్వైజరీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రశాంత్ ఠాకూర్ తెలిపారు. డెవలపర్లు ఇక నుంచి అందుబాటు ధరల ఇళ్ల ప్రాజెక్టులను ప్రారంభించేందుకూ సందేహిస్తారని పేర్కొన్నారు.

మహీంద్రా లాజిస్టిక్స్ అలైట్ సేవలు

ముంబయి: నగరాల్లో ప్రయాణించేందుకు వాహనాలను బుక్ చేసుకునేందుకు వీలు కల్పించే సేవలను 'అలైట్' పేరిట మహీంద్రా లాజిస్టిక్స్ అందుబాటులోకి తెచ్చింది. ముఖ్యంగా విమానాశ్రయాల నుంచి నగరాలకు వెళ్లేందుకు, నగరాల్లో ప్రయాణించేందుకు, ఇతర నగరాలకు వెళ్లేందుకూ అవసరమైన వాహనాలను బుకింగ్ చేసుకోవచ్చు. ప్రస్తుతం ఈ సేవలను దిల్లీలో ప్రారంభించింది. త్వరలోనే నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం, ముంబయి, బెంగళూరు, హైదరాబాద్ తదితర కీలక నగరాలకు విస్తరించనుంది. కచ్చితమైన రైడ్, పారదర్శకతతో కూడిన ధరలు, సున్నా రద్దు విధానంతో దీన్ని తీసుకొచ్చినట్లు మహీంద్రా లాజిస్టిక్స్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ హేమంత్ సిక్కా తెలిపారు. ఇందులో ప్రైవ్, సెలెక్ట్ అనే విభాగాలుంటాయన్నారు. ప్రైవ్‌లో ప్రీమియం ఎలక్ట్రిక్ వాహనాలుంటాయన్నారు. అలైట్ మొబైల్ యాప్‌లో రైడ్‌లను బుకింగ్ చేసుకునేందుకు వీలుందని తెలిపారు.

2024–25లో 2.17 లక్షల నకిలీ నోట్లు గుర్తించాం

ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ ఛౌద్రి

దిల్లీ: 2024-25 ఆర్థిక సంవత్సరంలో 2.17 లక్షల నకిలీ నోట్లను గుర్తించామని ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ ఛౌద్రి సోమవారం లోక్‌సభకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. 2023-24లో 2.23 లక్షల నకిలీ నోట్లతో పోలిస్తే ఇవి కాస్త తగ్గాయి. అత్యధికంగా రూ.500 నోట్లు (1,17,722) ఉన్నట్లు తెలిపారు. వీటి తర్వాతి స్థానంలో రూ.100 నోట్లు (51,069), రూ.200 నోట్లు (32,660) ఉన్నాయని మంత్రి తెలిపారు.

కోడి గుడ్లు — 12న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	480	గోదావరి	510
వరంగల్	482	విశాఖపట్నం	515
విజయవాడ	520	చిత్తూరు	543

55% భారత్ ఎగుమతులపై అమెరికా టారిఫ్‌ల ప్రభావం



దిల్లీ: మన దేశం నుంచి అమెరికాకు ఎగుమతి అవుతున్న మొత్తం ఎగుమతుల్లో 55 శాతం వాటిపై అమెరికా అదనపు సుంకాల ప్రభావం పడుతుందని ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ ఛౌద్రి లోక్‌సభకు వెల్లడించారు. రైతులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, ఎగుమతిదార్లు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థ(ఎంఎస్ఎంఈ)లను రక్షించేందుకు, వారిని ప్రోత్సహించడంతో పాటు వారి ప్రయోజనాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. దేశ ప్రయోజనాలను పరిరక్షించేందుకు అవసరమైన చర్యలు కూడా ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

2030కు 220 ఐటీసీ హోటళ్లు

దిల్లీ: 2030 నాటికి 220 నిర్వహణ హోటళ్లు, 20,000కు పైగా గదులకు చేరాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఐటీసీ హోటల్స్ ఛైర్మన్ సంజీవ్ పురి వెల్లడించారు. భారత ఆతిథ్య పరిశ్రమ బలమైన వృద్ధిని నమోదుచేయడానికి సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదైన తర్వాత ఐటీసీ హోటల్స్ మొట్టమొదటి వార్షిక సాధారణ సమావేశం(ఏజీఎం)లో ఆయన ప్రసంగించారు. అంతర్జాతీయంగా ప్రతికూల పరిస్థితులు నెలకొనడంతో ఆవిష్కరణ, టెక్నాలజీలపై పెట్టుబడులు పెట్టనున్నామని, తద్వారా బలమైన, స్వయం ఆధారిత ఆర్థిక వ్యవస్థలుగా అవతరించనున్నట్లు వెల్లడించారు.

జులైలో ఈక్విటీ ఎంఎఫ్‌ల్లోకి రూ.42,702 కోట్లు



దిల్లీ: ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్లలోకి గత నెలలో రూ.42,702 కోట్ల నికర పెట్టుబడులు తరలి వచ్చినట్లు మ్యూచువల్ ఫండ్ల సంఘం యాంఫీ వెల్లడించింది. ఈ విభాగంలోకి నెలవారీగా ఈ స్థాయిలో పెట్టుబడులు తరలి రావడం ఇదే తొలిసారి. మార్కెట్‌లో అనిశ్చితులు, యూఎస్ టారిఫ్ భయాలు ఉన్నప్పటికీ థీమ్యాటిక్, ఫ్లెక్సీ క్యాప్ ఫండ్లలోకి నిధులు భారీగా తరలి రావడం కలిసొచ్చింది. జూన్‌లో ఈ విభాగంలోకి వచ్చిన రూ.23,857 కోట్ల పెట్టుబడులతో పోలిస్తే ఇవి 81 శాతం పెరగడం గమనార్హం. అలాగే ఈ విభాగంలోకి నికర పెట్టుబడులు రావడం వరుసగా 53వ నెలకు చేరింది. యాంఫీ సోమవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం..

- క్రమానుగత పెట్టుబడి పథకం (సిప్)లోకి గత నెలలో రూ.28,464 కోట్ల పెట్టుబడులు తరలి వచ్చాయి. జూన్‌లో వచ్చిన రూ.27,269 కోట్లతో పోలిస్తే పెరిగాయి.
- ఈక్విటీ విభాగంలో రంగాల వారీగా/థీమ్యాటిక్ ఫండ్లలోకి రూ.9,426 కోట్ల పెట్టుబడులు తరలి వచ్చాయి. కొత్తగా 7 పథకాలు ప్రారంభించడంతో వీటిలోకే రూ.7,404 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఫ్లెక్సీ క్యాప్ ఫండ్లలోకి రూ.7,654 కోట్ల పెట్టుబడులు తరలి వచ్చాయి.
- స్మాల్ క్యాప్ ఫండ్లలోకి రూ.6,484 కోట్లు, మిడ్ క్యాప్ ఫండ్లలోకి రూ.5,182 కోట్లు, లార్జ్ అండ్ మిడ్ క్యాప్ ఫండ్లలోకి రూ.5,035 కోట్లు, లార్జ్ క్యాప్ ఫండ్లలోకి రూ.2,125 కోట్ల పెట్టుబడులు తరలి వచ్చాయి. ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాల్లోకి (ఈఎల్ఎస్ఎస్) నికరంగా రూ.368 కోట్ల పెట్టుబడులు వచ్చాయి.

పరిశ్రమలోకి రూ.1.8 లక్షల కోట్లు

మ్యూచువల్ ఫండ్ పరిశ్రమలోకి జులైలో మొత్తంగా రూ.1.8 లక్షల కోట్ల పెట్టుబడులు తరలి రావడం విశేషం. జూన్‌లో రూ.49,000 కోట్లు, మేలో రూ.29,000 కోట్లతో పోలిస్తే భారీగా పెరిగాయి. పరిశ్రమ నిర్వహణలోని ఆస్తులు (ఏయూఎం) తొలిసారిగా రూ.75 లక్షల కోట్ల మార్కును అధిగమించాయి. జూన్ ఆఖరుకు రూ.74.4 లక్షల కోట్లు ఉండగా, జులై చివరకు రూ.75.36 లక్షల కోట్లకు చేరాయి.

- డెట్ ఆధారిత మ్యూచువల్ ఫండ్లలోకి రూ.1.06 లక్షల కోట్ల పెట్టుబడులు తరలి వచ్చాయి. లో-డ్యూరేషన్, మనీ మార్కెట్ ఫండ్లలోకి అధికంగా నిధులు వచ్చాయి. లిక్విడ్, ఓవర్‌నైట్ ఫండ్లలో జూన్‌లో పెట్టుబడులు వెనక్కి తరలిపోగా, జులైలో మాత్రం నికరంగా తరలి వచ్చాయి.
- పసిడి ఈటీఎఫ్ (ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్)ల్లోకి నికరంగా రూ.1,256 కోట్ల పెట్టుబడులు తరలి వచ్చాయి. జూన్‌లో వచ్చిన రూ.2,081 కోట్లతో పోలిస్తే తగ్గాయి.

త్వరలో హైదరాబాద్, ఇతర నగరాల్లోకి టెస్లా



దిల్లీ: అమెరికాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా భారత్‌లో మరో షోరూమ్ తెరిచింది. దేశ రాజధాని దిల్లీలో తన రెండో షోరూమ్‌ను సోమవారం ప్రారంభించింది. సుమారు 8,200 చదరపు అడుగుల విస్తీర్ణంలో దీనిని అందుబాటులోకి తెచ్చారు. సాకేత్, నోయిడా, ఆరిజన్ తదితర ప్రాంతాల్లో ఈ సూపర్‌ఛార్జర్ల ఏర్పాటుకు ప్రణాళికలు రచిస్తోంది. ఇప్పటికే ముంబయిలో తొలి షోరూమ్‌ను ఓపెన్ చేసిన టెస్లా.. కొన్ని రోజుల క్రితమే మొదటి సూపర్ ఛార్జర్ స్టేషన్‌ను ప్రారంభించింది. హైదరాబాద్, పుణె, చెన్నై, బెంగళూరు, అహ్మదాబాద్, జయపుర వంటి ఎనిమిది నగరాల్లోనూ ఛార్జింగ్ నెట్‌వర్క్‌ను విస్తరించనుంది. ధర ఇలా: వీ4 సూపర్‌ఛార్జర్‌తో ఛార్జింగ్ చేయడానికి కిలోవాట్‌కు రూ.24 వసూలు చేస్తారు. 11 కిలోవాట్‌అవర్ స్పీడ్ ఉన్న ఏసీ ఛార్జింగ్‌కు కిలోవాట్ ధర రూ.11గా నిర్ణయించారు. ఈ వీ4 సూపర్ ఛార్జర్ ద్వారా కొత్తగా లాంచ్ చేసిన టెస్లా మోడల్ వై కారును కేవలం 15 నిమిషాల పాటు ఛార్జ్ చేసి 267 కి.మీ. ప్రయాణించొచ్చు. దేశీయ మార్కెట్‌లో దీనిని రెండు వేరియంట్లలో అందుబాటులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. ఆర్‌డబ్ల్యూడీ వేరియంట్ ప్రారంభ ధర రూ.59.89 లక్షలు, లాంగ్ రేంజ్ మోడల్ ధర రూ.67.89 లక్షలుగా కంపెనీ తెలిపింది. ఈ కారును ఒకసారి ఛార్జ్ చేస్తే 500-600 కి.మీ. వరకు ప్రయాణించవచ్చు.

అమెరికా నుంచి చైనాకు మళ్లీ శక్తిమంత చిప్‌లు

లాభాల్లో ట్రంప్ సర్కారుకు 15% వాటా



ఇంటర్నెట్ డెస్క్: అమెరికా నుంచి చైనాకు అత్యాధునిక కంప్యూటర్ చిప్‌లను ఎగుమతి చేసే విషయంలో కీలక ముందడుగు పడింది. చైనాలో విక్రయాలపై తమకు వచ్చే లాభాల్లో ట్రంప్ సర్కారుకు 15% వాటా చెల్లించేందుకు అమెరికా చిప్ కంపెనీలైన ఎన్‌విడియా, ఏఎండీ అంగీకరించాయి. దీంతో చిప్ ఎగుమతులు తిరిగి ప్రారంభం కానున్నాయి. భద్రతా కారణాలను చూపుతూ చిప్ ఎగుమతులను అమెరికా నిలిపివేయగా.. ప్రతిగా చైనా అరుదైన ఖనిజాల ఎగుమతిపై ఆంక్షలు విధించింది. ఈ నేపథ్యంలో లాభాల్లో వాటా తీసుకుని చిప్‌ల ఎగుమతికి అమెరికా ప్రభుత్వం అంగీకరించడం గమనార్హం. చైనాకు అత్యాధునిక చిప్‌లను ఎగుమతి చేయడంపై బైడెన్ హయాంలో అమెరికా ఆంక్షలు విధించింది. దీంతో చైనా మార్కెట్ కోసం ఎన్‌విడియా అత్యాధునిక హెచ్20 చిప్‌లను రూపొందించింది. ట్రంప్ అధికారంలోకి వచ్చాక వాటిపైనా ఆంక్షలు విధించడంతో ఎగుమతులు పూర్తిగా నిలిచిపోయాయి. ఫలితంగా ఎన్‌విడియా భారీగా ఆదాయం కోల్పోవాల్సి వచ్చింది. దీంతో ఎన్‌విడియా సీఈఓ జెన్‌సెన్ హువాంగ్ అటు వాషింగ్టన్‌తోనూ ఇటు బీజింగ్‌తోనూ సంప్రదింపులు జరిపారు. డొనాల్డ్ ట్రంప్‌తో గత వారం సమావేశం తర్వాత ఎన్‌విడియా చిప్‌ల ఎగుమతిపై కీలక ప్రకటన చేశారు.

సూచీలకు మళ్లీ కొనుగోళ్ల కళ

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.1,203 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.5,972 కోట్లు

సెన్సెక్స్ ▲746 80604 | **నిఫ్టీ ▲222 24585**



దిగువ స్థాయుల్లో కొనుగోళ్ల జోరుతో సోమవారం దేశీయ సూచీలు లాభాల్లో ముగిశాయి. చమురు, వాహన, బ్యాంకింగ్ షేర్లు రాణించడంతో సెన్సెక్స్ మళ్లీ 80,000 పాయింట్ల ఎగువకు చేరింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 17 పైసలు తగ్గి 87.75 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.45% నష్టంతో 66.29 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో షాంఘై, హాంకాంగ్ లాభపడగా, దక్షిణ కొరియా నష్టపోయింది. జపాన్ మార్కెట్ పనిచేయలేదు. ఐరోపా షేర్లు నష్టాల్లో ట్రేడయ్యాయి.

- బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ సోమవారం రూ.3.50 లక్షల కోట్లు పెరిగి రూ.444.13 లక్షల కోట్లు (5.20 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.
- సెన్సెక్స్ ఉదయం 27 పాయింట్ల (క్రితం ముగింపు 79,857.79) లాభంతో 79,885.36 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ఆరంభ ట్రేడింగ్‌లో 79,772.46 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ, అనంతరం బలంగా పుంజుకుంది. ఒకదశలో 778.26 పాయింట్లు పెరిగి 80,636.05 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 746.29 పాయింట్ల లాభంతో 80,604.08 వద్ద ముగిసింది. నిఫ్టీ 221.75 పాయింట్లు పెరిగి 24,585.05 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,347.45- 24,600.85 పాయింట్ల మధ్య కదలాడింది.
- సెన్సెక్స్ 30 షేర్లలో 27 లాభాలు నమోదుచేశాయి. టాటా మోటార్స్ 3.24%, ఎటెర్నల్ 2.84%, ట్రెంట్ 2.49%, ఎస్‌బీఐ 2.45%, అల్ట్రాటెక్ 1.95%, ఎల్ అండ్ టీ 1.70%, సన్‌ఫార్మా 1.63%, రిలయన్స్ 1.38%, కోటక్ బ్యాంక్ 1.33%, యాక్సిస్ బ్యాంక్ 1.27% రాణించాయి. బీఈఎల్, ఎయిర్‌టెల్, మారుతీ స్వల్పంగా నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో.. స్థిరాస్తి 1.86%, బ్యాంకింగ్ 1.13%, ఆరోగ్య సంరక్షణ 1.12%, వాహన 1.03%, ఆర్థిక సేవలు 1%, యుటిలిటీస్ 0.92%, సేవలు 0.90%, విద్యుత్ 0.85% పెరిగాయి. మన్నికైన వినిమయ వస్తువులు ఒక్కటే తగ్గింది. బీఎస్ఈలో 2237 షేర్లు లాభపడగా, 1930 స్క్రిప్‌లు నష్టపోయాయి. 170 షేర్లలో ఎటువంటి మార్పులేదు.

ఐపీఓ సమాచారం

- పటేల్ రిటెయిల్ ఐపీఓ ఈ నెల 19న ప్రారంభమై 21న ముగియనుంది. ఇందుకు ధరల శ్రేణిగా రూ.237-255 నిర్ణయించారు. గరిష్ఠ ధర వద్ద కంపెనీ రూ.242.76 కోట్లు సమీకరించనుంది. రిటెయిల్ మదుపర్లు కనీసం 58 షేర్లకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.
- శ్రీజీ షిప్పింగ్ గ్లోబల్ రూ.411 కోట్ల ఐపీఓ ఆగస్టు 19న ప్రారంభమై 21న ముగుస్తుంది. ఐపీఓ ధరల శ్రేణిగా రూ.240-252 నిర్ణయించారు. రిటెయిల్ మదుపర్లు కనీసం 58 షేర్లకు దరఖాస్తు చేసుకోవాలి.
- రీగల్ రీసోర్సెస్ ఐపీఓ 12న (నేడు) ప్రారంభమై 14న ముగియనుంది. ఇందుకు ధరల శ్రేణిగా రూ.96-102 నిర్ణయించారు. ఐపీఓ ద్వారా కంపెనీ రూ.210 కోట్లు సమీకరించనుంది. రిటెయిల్ మదుపర్లు కనీసం 144 షేర్లకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. బిహార్ ప్లాంట్‌లో రూ.430 కోట్ల పెట్టుబడితో ఉత్పత్తిని రెట్టింపు చేయనున్నట్లు కంపెనీ తెలిపింది.
- బ్లూస్టోన్ జువెలరీ అండ్ లైఫ్‌స్టైల్ ఐపీఓ మొదటి రోజు 39% స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 1,65,14,421 షేర్లను ఆఫర్ చేయగా, 63,89,570 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. రిటెయిల్ విభాగంలో 38% స్పందన దక్కింది.
- ఆల్‌టైమ్ ప్లాస్టిక్స్ ఐపీఓ చివరిరోజు 8.34 రెట్ల స్పందన వచ్చింది. ఇష్యూలో భాగంగా 1,05,46,297 షేర్లను జారీ చేయగా, 8,79,56,712 షేర్లకు బిడ్లు నమోదయ్యాయి. ఎన్ఐఐ విభాగంలో 13.47 రెట్లు, క్యూఐబీ విభాగంలో 10.15 రెట్లు, రిటెయిల్ మదుపర్ల నుంచి 5.14 రెట్ల స్పందన కనిపించింది.
- జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ ఐపీఓ చివరి రోజు 7.77 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 18,12,94,964 షేర్లను జారీ చేయగా, 1,40,91,39,588 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. క్యూఐబీ విభాగంలో 15.80 రెట్లు, ఎన్ఐఐ విభాగంలో 10.97 రెట్లు, రిటెయిల్ మదుపర్ల నుంచి 1.81 రెట్ల స్పందన దక్కింది.

- జూన్ త్రైమాసికంలో నికర లాభం 9.71% పెరగడంతో ఎస్‌బీఐ షేరు 2.45% రాణించి రూ.824.30 వద్ద ముగిసింది. సంస్థ మార్కెట్ విలువ రూ.18,230.48 కోట్లు పెరిగి రూ.7.60 లక్షల కోట్లకు చేరింది.
- త్రైమాసిక ఫలితాలు నిరాశపరచడంతో వోల్టాస్ షేరు 4.43% కుదేలై రూ.1,246 దగ్గర స్థిరపడింది.
- 6400 మెగావాట్ల సామర్థ్యంతో 8 థర్మల్ విద్యుత్ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు అదానీ పవర్ నుంచి అల్ట్రా మెగా ఆర్డరును దక్కించుకున్నట్లు ఎల్ అండ్ టీ వెల్లడించింది. ఒక్కో యూనిట్ సామర్థ్యం 800 మెగావాట్‌లని కంపెనీ తెలిపింది. రూ.15,000 కోట్లు పైబడిన వాటిని అల్ట్రా మెగా ఆర్డరుగా కంపెనీ పరిగణిస్తుంది.
- షేర్ల విభజన, బోనస్ ఇష్యూ ప్రతిపాదనలను పరిశీలించేందుకు ఈ నెల 22న వెల్‌క్యూర్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ బోర్డు సమావేశం కానుంది. ప్రతి షేరును 10 షేర్లు (1:10 నిష్పత్తి)గా విభజించాలని కంపెనీ భావిస్తోంది. ఇదే సమయంలో ప్రతి షేరుకు మరో కొత్త షేరును జారీ చేయాలని ప్రతిపాదించింది.
- ఫిలిప్పీన్స్‌లో డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థిక సేవలను అందించేందుకు నౌ కార్పొరేషన్ టెలికాం విభాగంతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు టీసీఎస్ ప్రకటించింది.

ఏప్రిల్ - జూన్ త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2025-26	2024-25	2025-26	2024-25
జేఎమ్ ఫైనాన్షియల్	454.00	171.00	1121.00	1093.00
బాటా ఇండియా	52.00	174.00	941.85	944.63
కామధేను	21.40	15.40	196.00	184.50
ఎన్‌జేవీఎన్	227.58	357.09	971.59	958.47
కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్	51.28	133.89	505.06	899.77
వెబ్‌సోల్ ఎనర్జీస్	67.18	22.88	220.93	111.83
పటేల్ ఇంజినీరింగ్	75.00	48.00	1233.00	1102.00

ఈనాడు సినిమా



రవితేజ

వైల్డ్ రైల్వే పోలీస్

ఈ వినాయక చవితికి 'మాస్ జాతర' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించనున్నారు రవితేజ. ఆయన కథానాయకుడిగా నటించిన ఈ సినిమాని భాను భోగవరపు తెరకెక్కించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 27న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేశారు. "ఇక్కడొక కానిస్టేబుల్‌ని చంపేశాడు సర్" అంటూ మురళీ శర్మ చెప్పే డైలాగ్‌తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఫన్, యాక్షన్ అంశాలతో ఆసక్తికరంగా సాగింది. రవితేజ ఇందులో రైల్వే పోలీసు పాత్రలో కనువిందు చేయనున్నారు. "ఆయన డిపార్ట్‌మెంట్ తప్ప అన్ని డిపార్ట్‌మెంట్స్‌లో వేలు పెడుతూ ఉంటాడు", 'డిస్టర్బ్ చేశారనుకోండి చాలా వైల్డ్‌గా రియాక్ట్ అవుతాడు" అంటూ ఈ ప్రచార చిత్రంలో వినిపించిన సంభాషణలతో సినిమాలో రవితేజ క్యారెక్టరైజేషన్ ఎలా ఉండనుందన్నది స్పష్టత ఇచ్చేశారు. దీంట్లో ఆయన వింటేజ్ లుక్స్‌లో కనిపించిన తీరు.. తనదైన యాక్షన్, కామెడీ టైమింగ్‌తో అలరించిన విధానం ఆకర్షణగా నిలిచాయి. "నాకంటూ ఒక హిస్టరీ ఉంది" అంటూ టీజర్‌లో రవితేజ చెప్పిన డైలాగ్ హైలైట్‌గా నిలిచింది. ఈ సినిమాకి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఛాయాగ్రహణం: విధు అయ్యన్న.

విదేశాల్లో తొలి షెడ్యూల్



ప్రభాస్

కథానాయకుడు ప్రభాస్.. దర్శకుడు సందీప్ రెడ్డి కలయికలో 'స్పిరిట్' పేరుతో ఓ బహుభాషా చిత్రం రూపొందనున్న సంగతి తెలిసిందే. ప్రణయ్ రెడ్డి వంగా, భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. త్రిప్తి దిమ్రీ కథానాయిక. ఈ సినిమా సెప్టెంబరు నెలాఖరున పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానుంది. అయితే తొలి షెడ్యూల్ మాత్రం విదేశాల్లో మొదలు కానుందని సమాచారం. దీనికోసం సందీప్ ఇప్పటికే మెక్సికో, ఇండోనేషియా, మలేషియా, బ్యాంకాక్ తదితర దేశాల్లో లొకేషన్లు రెక్కీ చేసి పెట్టుకున్నారు. సినిమాలోని కీలక షెడ్యూల్స్‌ను అక్కడే ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. ప్రభాస్ నవంబరు నాటికి సెట్లోకి అడుగు పెట్టే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఆయన ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో శక్తిమంతమైన పోలీసు పాత్రలో కనువిందు చేయనున్నారు. సంగీత దర్శకుడు హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ చిత్ర పాటల్ని ఇప్పటికే సిద్ధం చేసినట్లు తెలిసింది.



అలియా భట్

మధ్యప్రదేశ్‌లో అలియా ప్రేమయుద్ధం?

బాలీవుడ్ అందాల తార అలియా భట్, రణ్‌బీర్ కపూర్ జంటగా నటిస్తున్న చిత్రం 'లవ్ అండ్ వార్'. ప్రముఖ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వం వహిస్తున్నారు. విక్కీ కౌశల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోందీ చిత్రం. ఇందులో భాగంగానే తదుపరి షెడ్యూల్ కోసం బ్రిటిష్ కాలం నాటి ఆర్మీ కంటోన్మెంట్‌కు ప్రసిద్ధి చెందిన మధ్యప్రదేశ్‌లోని మోవ్ పట్టణానికి చిత్రబృందం పయనమైనట్లు తెలుస్తోంది. అక్కడ 15రోజుల పాటు ఈ సినిమాలోని ప్రధాన సన్నివేశాలను తీర్చిదిద్దనున్నట్లు సమాచారం. యుద్ధం, ప్రేమ, త్యాగం లాంటి అంశాల నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా ఈ ఏడాది క్రిస్మస్ కానుకగా విడుదల కానుంది.

వాడి జడల్ని ముట్టుకుంటే వాడికి సర్రుమంటది!



నాని

'దసరా' విజయం తర్వాత నాని - శ్రీకాంత్ ఓదెల కలయికలో రూపొందుతున్న కొత్త చిత్రం 'ది ప్యారడైజ్'. ఎస్ఎల్‌వీసీ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. రాఘవ్ జుయల్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ఈ సినిమా నుంచి 'స్పార్క్ ఆఫ్ ప్యారడైజ్' పేరుతో సోమవారం ఓ గ్లింప్స్‌ను విడుదల చేశారు. రామోజీ ఫిల్మ్ సిటీలో 15రోజుల పాటు చిత్రీకరించిన ఓ జైలు యాక్షన్ సీక్వెన్స్‌కు సంబంధించిన మేకింగ్‌ను దీంట్లో చూపించారు. వందల మంది ఖైదీలు కత్తులతో నానిపైకి దూసుకురావడం.. ఆయన వాళ్లను ఏ బెరుకు లేకుండా సీజ్ఫ్ కూర్చొని సవారీ చేయడం గ్లింప్స్‌లో కనిపించింది. "వాడి జడల్ని ముట్టుకుంటే వాడికి సర్రుమంటది" అంటూ ఆఖర్లో వినిపించిన డైలాగ్ ఆకర్షణగా నిలిచింది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 26న థియేటర్లలోకి రానుంది. ఈ సినిమాకి అనిరుధ్ సంగీతమందిస్తున్నారు. సీహెచ్ సాయి ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

వినోదాల సుందరకాండ



నారా రోహిత్

'సుందరకాండ'తో ప్రేక్షకుల్ని నవ్వించేందుకు సిద్ధమవుతున్నారు నారా రోహిత్. ఆయన హీరోగా నటించిన ఈ చిత్రాన్ని వెంకటేశ్ నిమ్మలపూడి తెరకెక్కించారు. సంతోశ్ చిన్నపోళ్ల, గౌతమ్ రెడ్డి, రాకేశ్ మహంకాళి నిర్మించారు. వృతి వాఘాని, శ్రీదేవి విజయ్ కుమార్ కథానాయికలు. నరేశ్, సత్య, వాసుకి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 27న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే హీరో ప్రభాస్ సోమవారం ఈ చిత్ర ర్యాప్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇది ఓ మిడిల్ ఏజ్ బ్యాచిలర్ కథతో రూపొందిన సినిమా. హీరో తనకు కాబోయే జీవిత భాగస్వామికి ఐదు లక్షణాలుండాలని కోరుకుంటాడు. ఈ ప్రయాణంలో కాలేజీలో ఓ అమ్మాయిని.. వర్తమానంలో మరో అమ్మాయిని ప్రేమిస్తాడు. ఈ రెండు ప్రేమకథల్ని ట్రైలర్‌లో వినోదాత్మకంగా చూపించారు. "అయినా నువ్వేంట్రా.. అయితే పెద్దోళ్లని లవ్ చేస్తావ్.. లేదంటే చిన్నోళ్లని లవ్ చేస్తావ్. నీ ఏజ్ వాళ్లు దొరకరా" అంటూ ట్రైలర్‌లో వినిపించిన ఓ డైలాగ్ ఆసక్తిరేకెత్తించింది.

'తుడరుమ్' దర్శకుడితో కార్తి?



కార్తి

కథానాయకుడు కార్తి ఇప్పటికే 'వా వాతియారే', 'సర్దార్ 2' చిత్రాల్ని పూర్తి చేశారు. ఇటీవలే 'మార్షల్' సినిమాని పట్టాలెక్కించారు. మరోవైపు లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో 'ఖైదీ 2'ను చేయనున్నారు. అయితే ఈలోగానే ఇప్పుడాయన వద్దకు మరో కథ వచ్చినట్లు తెలుస్తోంది. మలయాళ దర్శకుడు తరుణ్ మూర్తి దీన్ని వినిపించినట్లు సమాచారం. ఆయన ఇటీవలే మోహన్‌లాల్‌తో 'తుడరుమ్' అనే సినిమా చేశారు. దీనికి తెలుగు, తమిళ భాషల్లోనూ మంచి ఆదరణే దక్కింది. ఇప్పుడాయన తదుపరి చిత్రం కోసం కార్తితో చర్చలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే లార్క్ స్టూడియోస్ సంస్థలో ఇది పట్టాలెక్కే అవకాశముంది.

సుప్రీమ్ వారియర్స్ ప్రారంభం



మురళీ మోహన్

మురళీమోహన్ ప్రధాన పాత్రధారిగా తెరకెక్కుతున్న చిత్రం 'సుప్రీమ్ వారియర్స్'. పెదపూడి బాబూరావు కథానాయకుడిగా నటిస్తూ, ఆది అక్షర ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నిర్మిస్తున్నారు. హరిచందన్ దర్శకత్వం వహిస్తున్నారు. సోమవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైందీ చిత్రం. ధవళ సత్యం, బెల్లంకొండ సురేశ్, వీరశంకర్, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, శివరాజ్ పాటిల్ తదితర సినీ, రాజకీయ ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దర్శకుడు మాట్లాడుతూ "సైన్స్ ఫిక్షన్ అంశాలతో కూడిన ఓ యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. సైనిక కుటుంబాల్లోని భావోద్వేగాలకు పెద్దపీట వేస్తూ రూపొందిస్తున్నాం. దాదాపు 800 మంది సైనిక కుటుంబాల్ని కలిసి, రెండున్నరేళ్లపాటు కష్టపడి ఈ కథని రాసుకున్నా" అన్నారు.


పల్లె అందాల కన్యా కుమారి



గీత్, శ్రీచరణ్

గీత్ సైని, శ్రీచరణ్ రాచకొండ ప్రధాన పాత్రధారులుగా సృజన్ అట్టాడ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'కన్యా కుమారి'. నటి మధు షాలిని సమర్పిస్తోంది. ఈ సినిమా ఈ నెల 27న థియేటర్లలోకి రానుంది. ఈ విషయాన్ని సోమవారం ప్రకటించారు. "పల్లె అందాల నడుమ ఆకట్టుకునే ప్రేమకథతో రూపొందిన చిత్రమిది. ఇది పూర్తిగా శ్రీకాకుళం బ్యాక్‌డ్రాప్‌లో సాగుతుంది. ఈ సినిమా కచ్చితంగా అందరి మనసుల్ని కట్టిపడేస్తుందన్న నమ్మకముంది" అని దర్శక నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: రవి నిడమర్తి, ఛాయాగ్రహణం: శివ గాజుల, కె హరి చరణ్.

ప్రతి ప్రేమికుడు ఒక విలనే



టైగర్ ష్రాఫ్

యాక్షన్ ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్న సినిమాలలో 'బాఘీ' ఫ్రాంఛైజీ ఒకటి. అందులో భాగంగా రానున్న నాల్గవ చిత్రమే 'బాఘీ 4'. ఇందులో కథానాయకుడిగా టైగర్ ష్రాఫ్, సంజయ్ దత్ ప్రతినాయక పాత్రలో నటిస్తున్నారు. సోనమ్ బజ్వా, హర్నాజ్ సంధు కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకి ఎ.హర్ష దర్శకత్వం వహించారు. సాజిద్ నడియాడ్‌వాలా నిర్మించారు. తాజాగా చిత్రబృందం సామాజిక మాధ్యమాల వేదికగా టీజర్‌ను విడుదల చేసింది. "నేను చిన్నప్పుడు మా అమ్మ చెప్పే కథలు వినేవాడిని. ఒక హీరో ఒక విలన్. అప్పట్లో నాకు తెలియదు నా కథకు హీరో, విలన్ రెండూ నేనే అవుతానని. ప్రతి ప్రేమికుడు ఒక విలన్" లాంటి సంభాషణలతో సాగే ఈ ట్రైలర్ ఆద్యంతం మాస్ యాక్షన్ సన్నివేశాలతో థ్రిల్‌ని పంచుతోంది. ఈ సినిమా సెప్టెంబరు 5న థియేటర్లలో విడుదల కానుంది.

నిర్మాతల ఇబ్బందులపై ప్రభుత్వాలు దృష్టిపెట్టాలి!

చిత్రీకరణలకి ఇంత మందిని తీసుకోవాల్సిందే, మాకు ఇంత మొత్తంలో డబ్బు చెల్లించాల్సిందే అని డిమాండ్ చేసే హక్కు మీకు ఎక్కడిదంటూ కార్మిక సంఘాల నాయకుల్ని ప్రశ్నించారు పలువురు నిర్మాతలు. అందరూ హక్కుల గురించే మాట్లాడుతున్నారు తప్ప... బాధ్యతలు మాత్రం ఎవరికీ పట్టడం లేదని, వెంటనే కార్మిక సంఘాల నియమ నిబంధనల్ని మార్చాలని డిమాండ్ చేశారు. ఇది మన పరిశ్రమ, వీళ్లు మన నిర్మాతలు అనే భావనతో కార్మిక సంఘాలు పనిచేస్తేనే అందరం బాగుంటామన్నారు. రైజింగ్ ప్రొడ్యూసర్స్ నేతృత్వంలో సోమవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. వేతనాల పెంపు కోరుతూ కార్మికులు కొన్ని రోజులుగా చేస్తున్న ఆందోళనని ఉద్దేశిస్తూ పలువురు నిర్మాతలు మాట్లాడారు. నిర్మాత ఎస్.కె.ఎన్ మాట్లాడుతూ "చిత్ర పరిశ్రమలో ప్రస్తుతం నిర్మాతలెవ్వరూ సంతృప్తిగా లేరు. వ్యాపారమే జరగడం లేదని అందరూ బాధపడుతుంటే, 30 శాతం వేతనాల్ని పెంచాలని డిమాండ్ చేయడం సమంజసం కాదు. సినీ కార్మికుల ముసుగులో కొంతమంది తమ స్వలాభాన్ని చూసుకుంటున్నారు. అందుకే ఈ సమస్యలు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు చిన్న నిర్మాతలు పడుతున్న ఇబ్బందులపై దృష్టి పెట్టాలి. కార్మిక సంఘాలు మారకపోతే మా బడ్జెట్‌లో వచ్చేవాళ్లతో ఇకపై మేం సినిమాల్ని నిర్మించుకుంటాం. ఏ హీరో కూడా మాకు ఇంత ఇవ్వకపోతే చిత్రీకరణలు బంద్ చేస్తామని చెప్పడం లేదు, పరిస్థితిని అర్థం చేసుకుని సినిమాలు చేస్తున్నార"న్నారు. నిర్మాత రాజేశ్ దండా మాట్లాడుతూ "ఓటీటీ, డబ్బింగ్ హక్కులకు సంబంధించిన మొత్తాలేవీ మాకు సమయానికి రావడం లేదు. కానీ మేం మాత్రం రోజువారీగా డబ్బులు ఇవ్వాలంటే అయ్యే పనేనా?" అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ధీరజ్ మొగిలినేని, మధుర శ్రీధర్ రెడ్డి, చైతన్య రెడ్డి, ఛాయ్ బిస్కెట్ శరత్, అనురాగ్, మహేశ్వర్‌రెడ్డి, రాకేశ్ వర్రె, బెన్నీ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు... నిర్మాతలతో సమావేశమైన మంత్రి కోమటిరెడ్డి

- సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని సూచన
- బుధవారం నుంచి చిత్రీకరణలు ప్రారంభం అవుతాయనే ఆశాభావం

సినీ కార్మికులు సమ్మెకు దిగడం సరికాదని... చిత్రీకరణల్లో పాల్గొంటూనే సమస్యల్ని పరిష్కరించుకోవాలని కార్మిక సమాఖ్య నాయకుల్ని కోరారు తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి. అటు నిర్మాతలు... ఇటు సినీ కార్మికులు పట్టువిడుపులతో ఉండాలని, కార్మికుల వేతనాలకు సంబంధించి ప్రత్యేకమైన ఓ కమిటీని ఏర్పాటు చేసుకుని సమస్యని పరిష్కరించుకోవాలని సూచించారు. బుధవారం నుంచి చిత్రీకరణలు పునః ప్రారంభం అవుతాయనే ఆశాభావం వ్యక్తం చేశారు. తెలుగు చిత్ర పరిశ్రమలో కార్మికుల వేతనాలపై నెలకొన్న వివాదంపై మంత్రి స్పందిస్తూ సోమవారం సచివాలయంలో నిర్మాతలు, కార్మిక సంఘాలతో సమావేశం అయ్యారు. సినీ నిర్మాతలు దిల్‌రాజు, కె.ఎల్. దామోదర్ ప్రసాద్, సుప్రియ, జెమినీ కిరణ్, టి.ప్రసన్నకుమార్ తదితరులు సమావేశంలో పాల్గొని చిత్ర పరిశ్రమలో నెలకొన్న తాజా పరిణామాల్ని మంత్రికి వివరించారు. అనంతరం కార్మిక సంఘాల ప్రతినిధులతోనూ మంత్రి సమావేశమయ్యారు. మంగళవారం మరోసారి ఇరువర్గాలు సమావేశమై వేతనాల అంశంపై చర్చించుకోవాలని, కార్మికుల సమస్యలపై దృష్టి పెట్టాలని ఎఫ్.డి.సి ఛైర్మన్ దిల్‌రాజుని మంత్రి కోరారు. సినిమా కార్మికుల సమస్యలపై ప్రభుత్వం సానుభూతితో ఉందని, అదే సమయంలో ఇరు వర్గాలూ ఒకరి ఇబ్బందుల్ని మరొకరు అర్థం చేసుకోవాలన్నారు. సినిమా, వినోద రంగాల్లో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ని కాపాడటంపై ప్రభుత్వం కట్టుబడి ఉందని, చిత్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉందని ఆయన చెప్పారు. సినీ కార్మికులకు గృహవసతి, ఇతర మౌలికసదుపాయాల్ని కల్పించి వారి జీవన ప్రమాణాల్ని మెరుగు పరచాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారని మంత్రి చెప్పారు. ఎఫ్.డి.సి.ఛైర్మన్, నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ చిత్ర పరిశ్రమలో అన్ని పక్షాల మధ్య ఐక్యత అవసరమని, రాష్ట్ర ప్రభుత్వం ఆశయాలకు అనుగుణంగా హైదరాబాద్‌ని గ్లోబల్ ఫిల్మ్ హబ్‌గా తీర్చిదిద్దడంలో తామంతా సహకారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో హోం శాఖ ముఖ్య కార్యదర్శి రవిగుప్తా పాల్గొన్నారు.

వేదికేదైనా ప్రేక్షకుల్ని అలరించడమే ముఖ్యం. ఈ కోవలోనే అదిరిపోయే థ్రిల్లర్లు.. అలరించే ప్రేమకథా చిత్రాలతో ప్రతి వారం సినీప్రియులకు కొత్త కొత్త కథల్ని అందుబాటులో ఉంచుతున్నాయి ఓటీటీలు. ఇందులో భాగంగానే ఈ వారం కూడా ఆకట్టుకునే చిత్రాలు, సిరీస్‌లను సినీప్రేమికులకు పరిచయం చేయడానికి సిద్ధమయ్యాయి.

నిందితుల వేటలో కానిస్టేబుల్ కనకం..



"సింహం, చిరుత, మొసలి.. ఇలా ఎన్నో మృగాలున్న చోటుకి ఓ జింక వచ్చింది. ఎన్ని చేసినా అది కొంచెం కూడా బెదరలేదు. ఎందుకంటే అది జింక కాదు.." అంటూ ఇటీవలే విడుదలైన ట్రైలర్‌తో సినీప్రియుల దృష్టిని ఆకర్షించింది 'కానిస్టేబుల్ కనకం' సిరీస్. వర్ష బొల్లమ్మ ప్రధాన పాత్రలో ప్రశాంత్ కుమార్ తెరకెక్కించారు. రేపల్లె అనే గ్రామంలో వరుసగా అమ్మాయిలు అదృశ్యం అవుతూ ఉంటారు. ఈ కేసును పరిష్కరించడానికి రంగంలోకి దిగుతుంది కానిస్టేబుల్ కనకం. మరి ఈ నిందితుల వేటలో ఆమె ఎలాంటి సవాళ్లు ఎదుర్కొంది అనేదే ఈ సిరీస్. గురువారం ప్రముఖ ఓటీటీ వేదిక ఈటీవీ విన్‌లో విడుదల కానుందీ సిరీస్.

ఓటీటీలో ఈ వారం

ఏలియన్:ఎర్త్ (సిరీస్)	మంగళవారం	జియో హాట్‌స్టార్
సారే జహా సే అచ్ఛా(సిరీస్)	బుధవారం	నెట్‌ఫ్లిక్స్
బటర్‌ఫ్లై (సిరీస్)	బుధవారం	అమెజాన్ ప్రైమ్ వీడియో
యంగ్ మిలీనియర్స్ (సిరీస్)	బుధవారం	నెట్‌ఫ్లిక్స్
అంధేరా (సిరీస్)	గురువారం	అమెజాన్ ప్రైమ్ వీడియో
ఇన్ ది మడ్ (సిరీస్)	గురువారం	నెట్‌ఫ్లిక్స్




ఏలియన్:ఎర్త్




సారే జహా సే అచ్ఛా




బటర్‌ఫ్లై



యంగ్ మిలీనియర్స్



అంధేరా



ఇన్ ది మడ్

నాన్న కల నెరవేరుతుందా?



లీగల్ డ్రామా నేపథ్యంలో రూపొందిన వెబ్‌సిరీస్ 'కోర్ట్ కచేరి'. రుచిర్ అరుణ్ దర్శకుడు. పవన్ మల్హోత్రా, ఆశిష్ వర్మ, పునీత్ బత్రా తదితరులు కీలక పాత్రలు పోషించారు. సీనియర్ న్యాయవాదిగా పనిచేసి మంచి గుర్తింపు తెచ్చుకున్న ఓ తండ్రి.. తన కొడుకును లాయర్‌గా చూడాలని కలలు కంటుంటాడు. కొడుకుకు మాత్రం కెనడా వెళ్లాలనేది కోరిక. మరి ఆ తండ్రి కల నెరవేరుతుందా? లేదా? అనేది బుధవారం సోనీ లివ్‌లో రాబోతున్న ఈ సిరీస్ చూసి తెలుసుకోవాల్సిందే.

కుటుంబం కోసం వెనెస్సా ప్రయత్నాలు



డబ్బు సంపాదించి కుటుంబాన్ని ఆర్థిక పరిస్థితుల నుంచి గట్టెక్కించడానికి ఓ అమ్మాయి చేసే ప్రయత్నాల చుట్టూ తిరిగే కథనంతో రూపొందించిన చిత్రం 'నైట్ ఆల్వేస్ కమ్స్'. ఈ అమెరికన్ క్రైమ్ థ్రిల్లర్‌కు బెంజమిన్ కారన్ దర్శకత్వం వహించారు. వెనెస్సా కిర్బీ, జెన్నిఫర్ జాసన్‌లీ, స్టీఫెన్ జేమ్స్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇందులో కుటుంబం కోసం అన్నింటినీ పణంగా పెట్టే లైనెట్ అనే అమ్మాయి పాత్రలో కనిపించనుంది వెనెస్సా. ఈ చిత్రం శుక్రవారం నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానుంది.

(c) eenadu



'పది'లమైన కొలువులు ఇవీ!

ఇంటెలిజెన్స్ బ్యూరోలో 4987 సెక్యూరిటీ అసిస్టెంట్/ఎగ్జిక్యూటివ్‌లు

దేశంలో క్రేజ్ ఉన్న ఉద్యోగాల్లో ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ) ముఖ్యమైంది. ఇప్పుడీ సంస్థలో పదో తరగతి విద్యార్హతతోనే కొలువుదీరే అవకాశం వచ్చింది. దేశవ్యాప్తంగా 4987 సెక్యూరిటీ అసిస్టెంట్/ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి ప్రకటన వెలువడింది. పరీక్షలో ప్రతిభతో నియామకాలుంటాయి. ఎంపికైనవారికి లెవెల్-3 వేతనాలతోపాటు ప్రయోజనాలెన్నో దక్కుతాయి.

ఇటీవలే డిగ్రీ విద్యార్హతతో 3717 అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్-2 ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి ఐబీ ప్రకటన వెలువడింది. వాటికి దరఖాస్తు చేసుకున్నవారు అదే సన్నద్ధతతో ఈ పరీక్షను సులువుగా ఎదుర్కోవచ్చు. రెండు పరీక్షల స్వరూపం దాదాపు ఒకటే. ప్రశ్నల స్థాయిలోనే వ్యత్యాసం. ఇప్పటికే వివిధ పోటీ పరీక్షల సన్నద్ధతలో ఉన్నవారికి సెక్యూరిటీ అసిస్టెంట్/ఎగ్జిక్యూటివ్ పోస్టులు గొప్ప అవకాశం.

ఈ ఉద్యోగంలో చేరినవారు లెవెల్-3 మూల వేతనం రూ.21,700 పొందుతారు. అదనంగా ఇందులో 20 శాతం స్పెషల్ సెక్యూరిటీ అలవెన్స్ (ఎస్ఎస్ఏ) ఇస్తారు. డీఏ, హెచ్ఆర్ఏ, మిగిలిన అన్ని ప్రోత్సాహకాలతో మొదటి నెల నుంచే సుమారు రూ.45,000 వేతనం అందుకోవచ్చు. అనుభవం, విద్యార్హతలు, అంతర్గత పరీక్షలతో ఉన్నత స్థాయికీ చేరుకోవచ్చు.

ఎంపికవ్వాలంటే?

టైర్-1 పరీక్షలో అన్ రిజర్వ్‌డ్, ఈడబ్ల్యూఎస్ 30, ఓబీసీ 28, ఎస్సీ, ఎస్టీలు 25 మార్కులు పొందాలి. ఇలా కనీస మార్కులు పొందినవారి జాబితా నుంచి ఆ విభాగాల వారీ ఉన్న ఖాళీలకు పది రెట్ల సంఖ్యలో టైర్-2కి ఎంపిక చేస్తారు. టైర్-2లో అర్హతకు కనీసం 20 మార్కులు పొందడం తప్పనిసరి. ఈ మార్కులు తుది ఎంపికలో పరిగణనలోకి తీసుకోరు. ఇలా అర్హత పొందినవారి జాబితా నుంచి వాళ్లు టైర్-1లో సాధించిన మార్కుల మెరిట్ ప్రకారం ఖాళీలకు ఐదు రెట్ల సంఖ్యలో అభ్యర్థులను ఇంటర్వ్యూకు పిలుస్తారు. ఆ తర్వాత వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. తుది నియామకాలు టైర్-1, టైర్-3 (ఇంటర్వ్యూ)ల్లో పొందిన మొత్తం మార్కుల మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం ఉంటాయి.

పరీక్షలు ఇలా

రాత పరీక్షలో రెండు పేపర్లుంటాయి. టైర్-1 పూర్తిగా ఆబ్జెక్టివ్. టైర్-2 డిస్క్రిప్టివ్.

✦ **టైర్-1:** ఇందులో 5 విభాగాల నుంచి వంద ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకూ ఒక మార్కు. తప్పు జవాబుకు పావు మార్కు తగ్గిస్తారు. జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, న్యూమరికల్/ఎనలిటికల్/లాజికల్ ఎబిలిటీ అండ్ రీజనింగ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, జనరల్ స్టడీస్ ఒక్కో విభాగం నుంచి 20 చొప్పున ప్రశ్నలు వస్తాయి. పరీక్ష వ్యవధి ఒక గంట.

✦ **టైర్-2:** దీనికి 50 మార్కులు. వ్యవధి ఒక గంట. 500 పదాల వ్యాసాన్ని ఇంగ్లిష్ నుంచి తెలుగులోకీ, తెలుగులో ఇచ్చిన వ్యాసాన్ని ఇంగ్లిష్‌లోకీ తర్జుమా చేయాలి.

✦ **టైర్-3:** ఇంటర్వ్యూ (50 మార్కులు).

విజయానికి..

✦ సన్నద్ధతలో ముందుగా ప్రాథమికాంశాలకే ప్రాధాన్యమివ్వాలి. అందులో రాణిస్తేనే మిగిలినవి సులువుగా నేర్చుకోవడానికి వీలవుతుంది.

✦ 8,9,10 తరగతుల్లోని మ్యాథ్స్, సైన్స్, సోషల్, ఇంగ్లిష్ పాఠ్యపుస్తకాల్లోని ముఖ్యాంశాలను ఒకసారి బాగా చదువుకోవాలి.

✦ ప్రతి విభాగంలోనూ అంశాల వారీగా వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధించాలి. అనంతరం ఆ అంశంలో మాక్ టెస్టులు రాయాలి. స్కోరు మెరుగైతే, మరో అంశంలోకి వెళ్లాలి. ఇలా అన్ని విభాగాల్లోని అంశాలన్నీ బాగా సన్నద్ధం కావాలి.

✦ ఐబీ పాత ప్రశ్నపత్రాలను సునిశితంగా పరిశీలించాలి. దీంతో ప్రశ్నలు ఏ స్థాయిలో వస్తున్నాయి, వాటిని ఎదుర్కోవడానికి ఎలా సన్నద్ధం కావాలో తెలుస్తుంది.

✦ ఎస్ఎస్‌సీ- సీహెచ్ఎస్ఎల్, రైల్వే- ఎన్‌టీపీసీ, ఐబీపీఎస్- క్లరికల్- పాత, మాదిరి ప్రశ్నపత్రాలు అధ్యయనంలో ఉపయోగపడతాయి.

✦ జనరల్ అవేర్‌నెస్, జనరల్ స్టడీస్ విడిగా ఉన్నాయి. జనరల్ అవేర్‌నెస్‌లో భాగంగా దాదాపు ప్రశ్నలు వర్తమాన వ్యవహారాల నుంచే రావొచ్చు. అందువల్ల ఈ ఏడాది జనవరి నుంచి పరీక్ష తేదీ వరకు ముఖ్య సంఘటనలు, నియామకాలు, పదవులు, అవార్డులు, రక్షణ రంగంలో తాజా పరిణామాలు.. వీటిని బాగా చదవాలి. జనరల్ స్టడీస్‌లో స్టాక్ జీకే ప్రశ్నలే ఎక్కువ ఉంటాయి. సైన్స్, సోషల్ హైస్కూల్ పుస్తకాల్లోని ముఖ్యాంశాలు బాగా చదవాలి.

✦ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్ కోసం హైస్కూల్ మ్యాథ్స్ పుస్తకాల్లోని చాప్టర్లు బాగా సాధన చేయాలి.

✦ ఇంగ్లిష్‌లో మెరుగైన మార్కులకు హైస్కూల్ స్థాయిలోని వ్యాకరణాంశాలు బాగా చదవాలి.

✦ చివరలో అసలు పరీక్ష ప్రకారం కనీసం 10 మాక్ టెస్టులు రాయాలి. తప్పులు సమీక్షించుకుని, పునరావృతం కాకుండా పరీక్ష వారీగా స్కోరు మెరుగుపడేలా చూసుకోవాలి. ఉన్న వ్యవధిలో వీలైనన్ని ఎక్కువ ప్రశ్నలకు కచ్చితత్వంతో సమాధానం గుర్తించగలిగే నేర్పు విజయానికి దగ్గరచేస్తుంది.

✦ రుణాత్మక మార్కులు ఉన్నందున తెలియని ప్రశ్నలు వదిలేయాలి. అలాగే ఎక్కువ సమయం తీసుకునే వాటికీ సమయం ఉంటే, చివరలోనే ప్రయత్నించాలి.

✦ టైర్-2లో అర్హత సాధిస్తే సరిపోతుంది. ఈ విభాగంలో గట్టెక్కడానికి పదసంపదలో ప్రావీణ్యం పెంచుకోవాలి. ఇప్పటి నుంచే చిన్న వ్యాసాలు తెలుగు నుంచి ఇంగ్లిష్‌లోకీ, ఇంగ్లిష్ నుంచి తెలుగులోకీ అనువదించడం సాధన చేయాలి.

ముఖ్య సమాచారం

ఖాళీలు: 4987. (హైదరాబాద్ పరిధిలో 117, విజయవాడలో 115 ఉన్నాయి. వీటికి తెలుగులో రాయటం, చదవటం, మాట్లాడటం రావాలి) పోటీ పడుతోన్న రాష్ట్రానికి సంబంధించి నివాస ధ్రువీకరణ పత్రం ఉండాలి.

అర్హత: పదో తరగతి. దివ్యాంగులకు అవకాశం లేదు.


వయసు: 17.08.2025 నాటికి 18 నుంచి 27 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు గరిష్ఠ వయసులో సడలింపు. భర్త చనిపోయిన, విడాకులు పొంది తిరిగి పెళ్లి చేసుకోని జనరల్ మహిళలైతే 35 ఏళ్లు; ఓబీసీ 38, ఎస్సీ, ఎస్టీలైతే 40 ఏళ్ల వయసు వరకు మినహాయింపు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 17.08.2025

పరీక్ష ఫీజు: మహిళలు, ఎస్సీ, ఎస్టీ రూ.550. యూఆర్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ రూ.650.

పరీక్ష తేదీలు: ప్రకటించలేదు. సమాచారం ఈ-మెయిల్‌కు అందుతుంది.

వెబ్‌సైట్: https://www.mha.gov.in/en



విద్యార్థులకు, కెరియర్ తొలి దశలో ఉన్న యువ నిపుణులకూ జీవితంలో సరైన మార్గాన్ని చూపించే పుస్తకాల్లో ప్రమథ్ రాజ్ సిన్హా రచించిన 'లెర్న్, డోంట్ స్టడీ' ఒకటి. బట్టీ పట్టి చదవడం కంటే విషయాలను అర్థం చేసుకుని నేర్చుకోవడం ఎంత ముఖ్యమో ఈ పుస్తకం వివరిస్తుంది. ఈ మధ్య వచ్చిన సినిమా 'త్రీ బీహెచ్‌కే'లో కథానాయకుడు తానెదుర్కొన్న సమస్యలకు సమాధానపరుచుకున్న విధానం ఇదే!

నిత్య విద్యార్థిగా మీరుంటారా?

రచయిత ఐఎస్‌బీ ఫౌండింగ్ డీన్‌గా పనిచేశారు. స్వీయానుభవాలనూ, విద్యార్థుల, యువ నిపుణులను దగ్గర నుంచి చూసిన అనుభవాలనూ జోడించి ఎంతో సులభంగా వివరించారు. నేటి ప్రపంచంలో జ్ఞానం అనేది పరీక్షల్లో పాసవ్వడానికి మాత్రమే కాకుండా వ్యక్తి ఎదుగుదలకూ, సమస్యలను పరిష్కరించే, కొత్తవి నేర్చుకునే సామర్థ్యానికీ, నిర్ణయాలు తీసుకునే శక్తికీ ముడిపడి ఉంది.

ఏమిటి వ్యత్యాసం?

మనం చిన్నప్పటి నుంచి నేర్చుకునే పద్ధతి- బట్టీ పట్టి చదవడం. అంటే.. ఒక ప్రశ్నకు జవాబును యథాతథంగా గుర్తుపెట్టుకుని పరీక్షలో రాయడం. ఈ పద్ధతిలో తాత్కాలికంగా మంచి మార్కులు సాధించవచ్చు, కానీ ఆ జ్ఞానం ఎక్కువ కాలం మనతో ఉండదు. ఒకసారి ఆ పరీక్ష అయిపోతే ఆ విషయాన్ని మర్చిపోతాం. కానీ రచయిత చెప్పినట్లుగా ప్రభావవంతంగా నేర్చుకోవడం అనేది నిరంతర ప్రక్రియ. నేర్చుకోవడం అంటే ఒక విషయాన్ని దాని మూలాల నుంచి అర్థం చేసుకోవడం. ఎందుకు అలా జరుగుతుంది, దాని వల్ల ఉపయోగం ఏమిటి అని తెలుసుకోవడం. ఇలా నేర్చుకున్న జ్ఞానం జీవితాంతం మనతో ఉంటుంది. వివిధ సందర్భాల్లో మనకు ఉపయోగపడుతుంది.

ఈ పుస్తకం అందించిన కీలక సందేశాల్లో ముఖ్యమైనవి..

1 **'ఎందుకు?' అని ప్రశ్నించడం అలవాటు చేసుకోండి:** ఏదైనా ఒక విషయాన్ని నేర్చుకుంటున్నప్పుడు అది ఎందుకు అలా ఉందో, దాని వెనకున్న కారణం ఏమిటో తెలుసుకోండి. కేవలం ఒక సూత్రాన్ని గుర్తుపెట్టుకోవడం కాకుండా ఆ సూత్రం ఎలా వచ్చిందో అర్థం చేసుకుంటే, దాన్ని ఎప్పటికీ మర్చిపోలేరు. ఈ అలవాటు సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచనలను పెంచుతుంది.

2 **నైపుణ్యాలను పెంచుకోవడంపై దృష్టి పెట్టండి:** ఈ రోజుల్లో ఒక డిగ్రీ ఉంటే సరిపోదు. సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, సమస్య పరిష్కార నైపుణ్యాలు, టీమ్ వర్క్ లాంటివి చాలా ముఖ్యం. 'లెర్న్, డోంట్ స్టడీ' పుస్తకం ఈ నైపుణ్యాలను ఎలా పెంచుకోవచ్చో స్పష్టంగా వివరిస్తుంది.

3 **నిరంతరం నేర్చుకుంటూ ఉండండి:** విశ్వవిద్యాలయం నుంచి బయటకు వచ్చాక చదువు ఆగిపోయినట్లు చాలామంది భావిస్తారు. కానీ నిజానికి అప్పుడే నేర్చుకోవడం మొదలవుతుంది. టెక్నాలజీ, ఉద్యోగాలు, సమాజం చాలా వేగంగా మారుతున్నాయి. ఈ మార్పులకు తగ్గట్టుగా కొత్త విషయాలను నిరంతరం నేర్చుకుంటూ నిత్య విద్యార్థిగా ఉండాలి. ఈ పుస్తకం ఈ ఆలోచనను ప్రోత్సహిస్తుంది.

4 **వైఫల్యాల నుంచి నేర్చుకోండి:** ప్రతి ఒక్కరి జీవితంలో వైఫల్యాలు ఎదురవుతాయి. వాటికి భయపడకుండా, గుణపాఠాలు నేర్చుకుని ముందుకు సాగాలి. ఒక తప్పు చేసినప్పుడు అది ఎందుకు జరిగిందో విశ్లేషించుకుని, దాన్నెలా సరిదిద్దుకోవాలో తెలుసుకోవడం చాలా ముఖ్యం. ఇది మనల్ని మరింత బలంగా మారుస్తుంది.

5 **సంభాషణాత్మకంగా నేర్చుకోవడాన్ని ప్రోత్సహించండి:** గురువులతో, స్నేహితులతో, తోటి ఉద్యోగులతో చర్చించడం ద్వారా నేర్చుకోవడం మంచి పద్ధతి. ఒక విషయాన్ని ఇతరులతో చర్చిస్తున్నప్పుడు దానిపై అవగాహన మరింత స్పష్టమవుతుంది. ఈ పద్ధతిలో ఆలోచనా శక్తి, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం కూడా పెరుగుతాయి.

జ్ఞానాన్ని గుర్తుపెట్టుకోవడం కాకుండా దాన్నెలా ఉపయోగించాలో, జీవితంలో ఎలా రాణించాలో ఈ పుస్తకం వివరిస్తుంది. కేవలం చదువుకోవడం కాకుండా, నేర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలుపుతుంది. భవిష్యత్తును మెరుగుపరుచుకోవడానికి మార్గాన్ని చూపిస్తుంది.

– సంపత్ & రహ్మాన్

Wordwise

ఆహ్లాదకరంగా ఇంగ్లిష్ పదజాలం పెంచుకుందామా? ఇక్కడ ఇచ్చిన Wordwise ను పూర్తిచేయండి. పోటీ పరీక్షలకు ఎంతో ఉపయోగపడుతుంది!

ACROSS

1. You zip this over a shirt when it's cold.
7. Only one like it; not like others.
8. What touches the paper when you write with a fountain pen?
9. Chat greeting for 'Good Morning'.
10. What is the measure of global peace, abbr.?
12. A shallow lake by the sea is known as ______.
14. The first two-digit prime number

DOWN

1. Thick, wild forest
2. Something that eats and moves; not a plant.
3. Corporate & Investment Banking, abbr.
4. Knowledge quotient like IQ/EQ, or Kenya Airways' airline code.
5. Scrambled "Europe"
6. Symbol of the element with atomic number 52
10. Ending of many government websites
11. Small hotel by the road
13. General Electric, for short.

1	2	3	4	5	6
7					
8			■		■
9		■	10		11
12		13			
14					

- డా. వంగీపురం శ్రీనాథాచారి

ANSWERS

ACROSS
1. JACKET
7. UNIQUE
8. NIB
9. GM
10. GPI (Global Peace Index)
12. LAGOON
14. ELEVEN

DOWN
1. JUNGLE
2. ANIMAL
3. CIB
4. KQ
5. EURPOE
6. TE (Tellurium)
10. GOV
11. INN
13. GE

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

కస్టమర్ సర్వీస్/ కస్టమర్ సపోర్ట్

సంస్థ: రెన్స్‌కె టెక్నాలజీస్ ఇంక్
నైపుణ్యాలు: కంప్యూటర్ స్కిల్స్, కస్టమర్ సపోర్ట్, ఇంగ్లిష్ రాయడం, మల్టీటాస్కింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్, టైమ్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.20,000-40,000
☛ https://shorturl.at/5JZx1

సోషల్‌మీడియా మార్కెటింగ్

సంస్థ: కమ్యూనిక్రాఫ్ట్స్ ప్రై.లి.
నైపుణ్యాలు: క్రియేటివ్ రైటింగ్, డిజిటల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియా మార్కెటింగ్, డిస్‌ప్లే యాడ్స్, హిస్టరీ
స్టైపెండ్: రూ.15,000-25,000
☛ https://shorturl.at/fLOpy

వీడియో ఎడిటింగ్/ మేకింగ్

సంస్థ: స్కిల్‌జెనిక్ బై గ్రోత్ ఇగ్నైటర్ ప్రై.లి.
నైపుణ్యాలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, యానిమేషన్, కంటెంట్ ఎడిటింగ్, ఫిల్మోరా, ఫైనల్ కట్ ప్రో, మోషన్ గ్రాఫిక్స్, టైమ్ మేనేజ్‌మెంట్, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్
స్టైపెండ్: రూ.15,000-25,000
☛ https://shorturl.at/5fFWs

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: ఆగస్టు 27

లింక్డ్ఇన్ యాడ్స్ & లీడ్ జన్

సంస్థ: సూపర్‌వైజర్.ఏఐ
నైపుణ్యాలు: బీటూబీ సేల్స్, లింక్డ్ఇన్ యాడ్స్, లింక్డ్ఇన్ మార్కెటింగ్
స్టైపెండ్: రూ.15,000
☛ https://shorturl.at/Vd3i2

టెక్నికల్ స్క్రమ్ మాస్టర్

సంస్థ: రిజల్యూట్ ఏఐ సాఫ్ట్‌వేర్ ప్రై.లి.
నైపుణ్యాలు: అమెజాన్ వెబ్ సర్వీసెస్, ఏఐ, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, గూగుల్ క్లౌడ్ ప్లాట్‌ఫామ్, మైక్రోసాఫ్ట్ అజ్యూర్, స్క్రమ్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ లైఫ్ సైకిల్, స్ట్రాటజీ
స్టైపెండ్: రూ.5,000-8,000
☛ https://shorturl.at/v0WLr

ఈ రెండిటికీ దరఖాస్తు గడువు: సెప్టెంబరు 5

టెక్ రిక్రూటర్

సంస్థ: సెలెక్ట్ ప్లస్ నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, నెగోషియేషన్, రిక్రూట్‌మెంట్, రెజ్యూమె స్క్రీనింగ్
స్టైపెండ్: రూ.5,000-8,000
దరఖాస్తు గడువు: సెప్టెంబరు 6
☛ https://shorturl.at/CAeRF

పీపుల్ ఆపరేషన్స్

సంస్థ: నెక్స్ట్ జాబ్ నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, లింక్డ్ఇన్ మార్కెటింగ్, టైమ్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.2,000
దరఖాస్తు గడువు: సెప్టెంబరు 3
☛ https://shorturl.at/JPrYq

ఉద్యోగాలు

టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లో ఖాళీలు

ముంబయిలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్(TISS) సూపర్‌వైజర్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
● సూపర్ వైజర్స్(పార్ట్ టైమ్): 04
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ(సైకాలజీ)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
వేతనం: నెలకు రూ.25,000.
దరఖాస్తు: ఈ మెయిల్ ద్వారా.
దరఖాస్తు చివరి తేదీ: 16.08.2025 **ఎంపిక:** ఇంటర్వ్యూతో
వెబ్‌సైట్: https://www.tiss.ac.in/project-positions/

ఎస్ఎస్‌సీలో యంగ్ ప్రొఫెషనల్స్

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) ఒప్పంద ప్రాతిపదికన 5 యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీతో పాటు పని అనుభవం.
వయసు: 21 నుంచి 35 ఏళ్లలోపు ఉండాలి. **వేతనం:** నెలకు రూ.40,000.
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 21.08.2025
ఎంపిక: ఇంటర్వ్యూతో. **వెబ్‌సైట్:** https://ssc.gov.in/

దామోదర్ వ్యాలీలో అసోసియేట్ కన్సల్టెంట్లు

కోల్‌కతాలోని దామోదర్ వ్యాలీ కార్పొరేషన్.. ఒప్పంద ప్రాతిపదికన 3 అసోసియేట్ కన్సల్టెంట్ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: బ్యాచిలర్ డిగ్రీతో పాటు ఉద్యోగానుభవం.
వయసు: 65 ఏళ్లు మించరాదు. **ఎంపిక:** షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూలతో.
దరఖాస్తుకు చివరి తేదీ: 18.08.2025. **వెబ్‌సైట్:** https://www.dvc.gov.in/#

డిజిటల్ ఇండియా కార్పొరేషన్‌లో..

దిల్లీలోని డిజిటల్ ఇండియా కార్పొరేషన్ ఒప్పంద ప్రాతిపదికన 3 బిజినెస్ అనలిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: పోస్టులను అనుసరించి డిగ్రీ (కంప్యూటర్ సైన్స్)తో పాటు పని అనుభవం. **వయసు:** 55 ఏళ్లు.
ఆన్‌లైన్ దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ: 20.08.2025
ఎంపిక: ఇంటర్వ్యూతో.
వెబ్‌సైట్: https://dic.gov.in/

నోటీస్ బోర్డు

వాక్-ఇన్స్

ఎన్ఐటీవీఏఆర్‌లో యంగ్ ప్రొఫెషనల్స్

పుణెలోని ఐసీఎంఆర్- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాన్స్‌లేషనల్ వైరాలజీ అండ్ ఎయిడ్స్ రిసెర్చ్.. ఒప్పంద ప్రాతిపదికన 4 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
● కన్సల్టెంట్ (నాన్ మెడికల్) ఐటీ అండ్ ఇంజినీరింగ్: 01
● యంగ్ ప్రొఫెషనల్-II (లీగల్)- 01
● యంగ్ ప్రొఫెషనల్-II (నాన్ మెడికల్)- 01
● యంగ్ ప్రొఫెషనల్-II (అడ్మిన్)- 01
అర్హత: పోస్టును అనుసరించి లా డిగ్రీ, సంబంధిత విభాగాల్లో పీజీతో పాటు పని అనుభవం.
వయసు: కన్సల్టెంట్‌కు 40 నుంచి 70 ఏళ్లు; ఇతర పోస్టులకు 40 ఏళ్లు మించకూడదు.
వేతనం: నెలకు కన్సల్టెంట్ పోస్టుకు రూ.లక్ష; ఇతర పోస్టులకు రూ.42,000.
ఇంటర్వ్యూ తేదీ: 14.08.2025.
వేదిక: ఐసీఎంఆర్- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాన్స్‌లేషనల్ వైరాలజీ అండ్ ఎయిడ్స్ రిసెర్చ్, పుణె.
వెబ్‌సైట్: https://www.nari-icmr.res.in/

ఎయిమ్స్ రాయ్‌బరేలీలో జూనియర్ రెసిడెంట్ పోస్టులు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ రాయ్‌బరేలీ తాత్కాలిక ప్రాతిపదికన జూనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
● జూనియర్ రెసిడెంట్: 10
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్‌తో పాటు పని అనుభవం. **వయసు:** 37 ఏళ్లు.
ఎంపిక: ఇంటర్వ్యూతో
ఇంటర్వ్యూ: 20.08.2025
వేదిక: ఎయిమ్స్ రాయ్‌బరేలీ, మెడికల్ కాలేజీ.
వెబ్‌సైట్: https://aiimsrbl.edu.in/recruitments

హైదరాబాద్ ఐఐసీటీలో..

సీఎస్ఐఆర్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ), హైదరాబాద్ 52 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
● ప్రిన్సిపల్ ప్రాజెక్టు అసోసియేట్: 01
● సీనియర్ ప్రాజెక్టు అసోసియేట్: 02
● సీనియర్ రిసెర్చ్ ఫెలో: 01
● ప్రాజెక్ట్ అసోసియేట్-1: 32
● జూనియర్ రిసెర్చ్ ఫెలో: 10
● ప్రాజెక్ట్ అసోసియేట్-2: 04
● ప్రాజెక్ట్ అసిస్టెంట్-2: 01
● ప్రాజెక్ట్ అసిస్టెంట్-1: 01
అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, డిగ్రీ (బీఎస్సీ), బీటెక్, ఎంటెక్, ఎమ్మెస్సీతో పాటు పని అనుభవం.
వయసు: ఇంటర్వ్యూ నాటికి 35 నుంచి 40 ఏళ్లు.
స్టైపెండ్: నెలకు ప్రిన్సిపల్ ప్రాజెక్ట్ అసోసియేట్‌కు రూ.49,000, సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్‌కు రూ.42,000, ఎస్ఆర్ఎఫ్‌కు రూ.35,000, ప్రాజెక్ట్ అసోసియేట్-1కు రూ.37,000, జేఆర్ఎఫ్‌కు రూ.31,000, ప్రాజెక్ట్ అసోసియేట్-2కు రూ.28,000, ప్రాజెక్ట్ అసిస్టెంట్-2కు రూ.20,000, ప్రాజెక్ట్ అసిస్టెంట్-1కు రూ.18,000.
ఎంపిక: ఇంటర్వ్యూతో.
ఇంటర్వ్యూ తేదీలు: ఆగస్టు 21, 22.
వేదిక: సీఎస్ఐఆర్- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, హైదరాబాద్- 500007.
వెబ్‌సైట్: https://www.iict.res.in/CAREERS

అప్రెంటిస్‌షిప్

ఐఓసీఎల్‌లో 475 పోస్టులు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) తమిళనాడు, పుదుచ్చెరి, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో 475 అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఫిట్టర్, మెషినిస్ట్, ఎలక్ట్రీషియన్.
● ట్రేడ్ అప్రెంటిస్: 80
● టెక్నీషియన్ అప్రెంటిస్: 95
● గ్రాడ్యుయేట్ అప్రెంటిస్: 300
అర్హత: పదోతరగతి, సంబంధిత విభాగంలో డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ.
వయసు: 31.08.2025 నాటికి 18 నుంచి 24 ఏళ్లు ఉండాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 31.08.2025
ఎంపిక: విద్యార్హతల్లో సాధించిన మెరిట్‌తో.
వెబ్‌సైట్: https://iocl.com/apprenticeships

హెచ్‌సీఎల్‌లో ట్రేడ్ అప్రెంటిస్‌లు

హిందూస్థాన్ కాపర్ లిమిటెడ్.. బాలాఘాట్ (మధ్యప్రదేశ్)లోని మలాజ్‌ఖండ్ కాపర్ ప్రాజెక్ట్ కోసం 167 ట్రేడ్ అప్రెంటిస్ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.
● మేట్- 1 ● బ్లాస్టర్- 12
● డీజిల్ మెకానిక్- 10 ● ఫిట్టర్- 16
● టర్నర్/మెషినిస్ట్- 16
● వెల్డర్ (గ్యాస్ & ఎలక్ట్రిక్)- 16
● ఎలక్ట్రీషియన్- 36
● డ్రాట్స్‌మన్ (సివిల్)- 4
● డ్రాట్స్‌మన్ (మెకానికల్)- 3
● సీఓపీఏ - 14 ● సర్వేయర్- 8
● ఏసీ & రిఫ్రిజిరేషన్ మెషిన్- 2
● మేసన్ (బిల్డింగ్ కన్‌స్ట్రక్టర్)- 4
● కార్పెంటర్- 6 ● ప్లంబర్- 5
● హార్టికల్చర్ అసిస్టెంట్- 4
● ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్- 4
● సోలార్ టెక్నీషియన్ (ఎలక్ట్రీషియన్)- 6
అర్హత: సంబంధిత ట్రేడులో ఐటీఐ.
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక: ఐటీఐ, టెన్త్ విద్యార్హతల్లో మార్కులతో.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 27.08.2025.
వెబ్‌సైట్: https://www.hindustancopper.com/

ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్‌లో..

ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ 2025-26 సంవత్సరానికి 1123 గ్రాడ్యుయేట్, డిప్లొమా అప్రెంటిస్‌ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.
పీజీపీటీ అప్రెంటిస్‌లు:
● మైనింగ్ ఇంజినీరింగ్: 180
● సివిల్ ఇంజినీరింగ్: 25
● మెకానికల్ ఇంజినీరింగ్: 25
● కంప్యూటర్ సైన్స్ & ఇంజినీరింగ్: 25
● ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్: 25
పీజీపీటీ మొత్తం ఖాళీలు: 280
పీడీపీటీ (డిప్లొమా అప్రెంటిస్):
● మైనింగ్ ఇంజినీరింగ్: 643
● సివిల్ ఇంజినీరింగ్: 50
● మెకానికల్ ఇంజినీరింగ్: 50
● కంప్యూటర్ సైన్స్ & ఇంజినీరింగ్: 50
● ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్: 50
పీడీపీటీ మొత్తం ఖాళీలు: 843
అర్హతలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ/ ఇన్‌స్టిట్యూట్ నుంచి సంబంధిత విభాగంలో డిగ్రీ, డిప్లొమా. ఎన్ఏటీఎస్ పోర్టల్‌లో పేరు నమోదు చేసుకోవాలి.
స్టైపెండ్/ జీతం: నెలకు పీజీపీటీలకు రూ.9,000; పీడీపీటీలకు రూ.8,000.
ఎంపిక: విద్యార్హతల మెరిట్‌తో.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 11.09.2025.
వెబ్‌సైట్: https://www.easterncoal.nic.in/notices/recruitmentheader.aspx

(c) eenadu

మాదిరి ప్రశ్నలు



కరెంట్ అఫైర్స్

■ దక్షిణ కొరియా నూతన అధ్యక్షుడిగా ఇటీవల ఎవరు ఎన్నికయ్యారు? (అధ్యక్ష ఎన్నికల్లో ఈయన కిమ్ మూన్ సూ పై విజయం సాధించారు.)
జ: లీ జే - మ్యుంగ్

■ ప్రపంచ పాలదినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? (2001లో ఐక్య రాజ్య సమితికి చెందిన ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) మన దైనందిన జీవితంలో పాల ప్రాముఖ్యతను గుర్తించడానికి ఈ దినోత్సవాన్ని ప్రారంభించింది.)
జ: జూన్ 1 (లెట్ అజ్ సెలబ్రేట్ అనే థీమ్‌లో ఈ ఏడాది దినోత్సవాన్ని నిర్వహించారు.)

■ మెట్రో రైలు విస్తరణలు, ప్రాంతీయ వేగవంతమైన రవాణా వ్యవస్థలు, నగరాల్లో ప్రధాన మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) రాబోయే ఐదేళ్ల కాలానికి భారత్‌కు ఎంత మొత్తం ఆర్థిక సాయాన్ని ప్రకటించింది? (ఏడీబీ ప్రస్తుత అధ్యక్షుడు మసాటో కందా.)
జ: 10 బిలియన్ డాలర్లు

■ భారత్ తన మొదటి స్వదేశీ ధ్రువ పరిశోధన నౌక (పీఆర్‌వీ - పోలార్ రిసెర్చ్ వెసెల్)ను ఏ దేశ సహకారంతో నిర్మించేందుకు ఓ ఒప్పందం కుదుర్చుకుంది?
జ: నార్వే

■ తెలంగాణ ప్రభుత్వం ఇటీవల 7600 మందికి పైగా చిన్నారులను ఏ ఆపరేషన్ కింద రక్షించింది?
జ: ఆపరేషన్ ముస్కాన్ - XI

మరింత సమాచారం

దరఖాస్తు చేశారా?

☛ బ్యాంక్ ఆఫ్ బరోడాలో మేనేజర్ ఖాళీలు
చివరి తేదీ: 12.08.2025

☛ హిందుస్థాన్ ఉర్వరక్ రసాయన్ లిమిటెడ్‌లో ఖాళీలు
చివరి తేదీ: 12.08.2025

ఖండాల లక్షణాలతో నిండిన ద్వీపకల్పం!

జనరల్ స్టడీస్ - ఇండియన్ జాగ్రఫీ



విశాల భూభాగం, భిన్న భౌగోళిక స్వరూపాలతో ఒక ఖండానికి ఉండే లక్షణాలతో నిండిన భారత ఉపఖండం వైవిధ్యభరితంగా ఉంటుంది. అన్నిరకాల భూ సంబంధ ఆకృతులు ఇక్కడ కనిపిస్తాయి. ఉత్తరాన హిమాలయాలు, గంగా-సింధు మైదానాలు, దక్షిణ భాగంలో ద్వీపకల్ప పీఠభూమి, తీరమైదానాలు, దీవులు వేటికవే ప్రత్యేక నైసర్గిక రూపాలుగా నిలిచాయి. వివిధ పర్వతాలు, పీఠభూములు, లోయలతో నిండిన ద్వీపకల్పం, జీవవైవిధ్యానికి నెలవైన పశ్చిమ కనుమలు, తూర్పుతీరంలో సారవంతమైన డెల్టా మైదానాలు, అండమాన్, లక్షదీవులు మొదలైన ప్రధాన ద్వీప సమూహాలు, అవి ఏర్పడిన తీరు తదితర విశిష్టతల గురించి పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. తూర్పు, పశ్చిమ కనుమలు, తీర మైదానాలు విస్తరించిన రాష్ట్రాలు, ప్రాంతాల వారీగా వాటికి ఉన్న పేర్లు, ఎత్తయిన శిఖరాలను గుర్తుంచుకోవాలి.

భౌగోళిక స్వరూపాలు - ప్రత్యేకతలు

భారత్ గురించి తెలుసుకోవాలంటే ముందుగా ఉపఖండంపై అవగాహన పెంచుకోవాలి. భారత ఉపఖండం స్వల్ప మార్పులకు గురవుతోంది. ఇక్కడి శిలల ఆధారంగా ఇది 150 కోట్ల సంవత్సరాల పురాతనమైందని తెలుస్తోంది. సుమారు 10 కోట్ల ఏళ్ల వరకు ఈ పీఠభూమి దక్షిణ అమెరికా, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, అంటార్కిటికా ఖండాలతో కలిసి ఉండేది. దీనినే 'గోండ్వానా మహాఖండం' అనేవారు. కార్బొనిఫెరస్ యుగంలో (సుమారు 30 కోట్ల ఏళ్ల క్రితం) గోండ్వానా భూమి భూ అంతర్జనిత శక్తుల వల్ల అనేక బీటలు, భ్రంశాలకు గురైంది. భ్రంశీకరణ వల్ల భూప్రాంతం అక్కడక్కడా కుంగి, పగులు, లోయలు, నిమ్న, ఉన్నత ప్రాంతాలు ఏర్పడ్డాయి.

దక్షిణ ద్వీపకల్పం: ఈ భూభాగానికి తూర్పు, పడమర, దక్షిణం వైపుల్లో సముద్రం ఉండటంతో 'ద్వీపకల్పం' అంటారు. సరాసరి ఎత్తు సముద్రమట్టం నుంచి 600-900 మీటర్లు. ఇది అతి పురాతనమైంది. అగ్నిశిలలతో ఏర్పడింది, కఠినమైంది. చాలాచోట్ల రూపాంతర శిలలుగా మారింది. త్రిభుజాకారంలో ఉండి పశ్చిమం నుంచి తూర్పునకు వాలి ఉంటుంది. అందుకే గోదావరి, కృష్ణా, కావేరి లాంటి ప్రధాన నదులు తూర్పువైపు ప్రవహిస్తున్నాయి. బుందేల్‌ఖండ్, మాల్వా, బాగేల్‌ఖండ్, ఛోటానాగ్‌పుర్, హజారీబాగ్, రాంచీ తదితర అనేక చిన్న పీఠభూములతోపాటు అతిపురాతనమైన ఆరావళి పర్వతాలు, కైమూర్ - మైకాల్ శ్రేణి మొదలైనవి ఇందులో భాగాలు.




✤ ద్వీపకల్ప పీఠభూమిలో అతి పురాతనమైంది 'దక్కన్ పీఠభూమి'. ఇది అగ్నిపర్వత పీఠభూమి. దీనినే 'దక్కన్ ట్రాప్స్' అంటారు. దక్కన్ పీఠభూమిని మహారాష్ట్రలో 'మహారాష్ట్ర పీఠభూమి', తెలంగాణలో 'తెలంగాణ పీఠభూమి', కర్ణాటకలో 'మైసూరు పీఠభూమి' అని పిలుస్తారు.

✤ దేశ ఈశాన్య భాగంలో ఉన్న పీఠభూమిని 'మేఘాలయ పీఠభూమి'గా వ్యవహరిస్తారు. 'గారో', 'ఖాసీ', 'జైంతియా' కొండలు దీనిలో భాగం.

ద్వీపకల్ప పీఠభూమిలోని కొండలు:

పశ్చిమ కనుమలు: ద్వీపకల్ప పీఠభూమికి పశ్చిమాన ఉత్తర - దక్షిణ దిశలుగా విస్తరించాయి. ఉత్తరాన తపతి నది లోయ నుంచి దక్షిణాన కన్యాకుమారి అగ్రం వరకు నిరంతరంగా ఉన్నాయి. అరేబియా సముద్రానికి దగ్గరగా ఉండి, సముద్రం నుంచి చూస్తే పెద్ద కోట గోడ మాదిరి కనిపిస్తాయి. వీటిలో కొన్ని కనుమల నుంచి మాత్రమే ప్రవేశం ఉంటుంది. ఇందులో పాల్‌ఘాట్, బోర్‌ఘాట్, థాల్‌ఘాట్ ముఖ్యమైనవి. పశ్చిమ కనుమల సరాసరి ఎత్తు 1,200 మీటర్లు. ఇక్కడి ముఖ్యమైన శిఖరాలు కల్సుబాయి, సల్హేర్, మహాబలేశ్వర్, హరిశ్చంద్రగడ్, వావుల్మల. ఈ కనుమల్లోని శరావతి నదిపై గెరెప్ప/జోగ్ జలపాతం ఉంది.

ఆరావళి పర్వతాలు:
ఇవి అతి పురాతనమైనవి, ఆది మహాయుగంలో ఏర్పడ్డాయని శాస్త్రవేత్తల అభిప్రాయం. బనాస్, మహీ, లునీ నదులు ఇక్కడి నుంచే మొదలై అరేబియా సముద్రంలో కలుస్తాయి. ఇక్కడ ఎత్తయిన శిఖరం 'మౌంట్ అబూ' (1,722 మీ.).




✤ నీలగిరి కొండలు తమిళనాడు కేరళ, కర్ణాటక రాష్ట్రాల కూడలి సరిహద్దుల్లో ఉంటాయి. ఎక్కువగా తమిళనాడులో విస్తరించాయి.



ఇందులో ఎత్తయిన శిఖరం దొడబెట్ట (2,637 మీ). వేసవి విడిది కేంద్రం ఊటీ. దీనినే 'ఉదక మండలం'గా పిలుస్తారు. ఇక్కడ నివసించే గిరిజన తెగలు తోడాలు, బడగాలు, కోటాలు, ఇరులు, కురుంబలు. దేశంలో మొదటి బయోస్ఫియర్ రిజర్వ్ నీలగిరి కొండలు. ✤ అన్నామలై కొండలు పాల్‌ఘాట్ కనుమకు దక్షిణాన కేరళలో విస్తరించాయి. ఇందులోని అనైముడి శిఖరం (2,695 మీ.) మొత్తం పశ్చిమ కనుమల్లోనే ఎత్తయింది. ఈ శ్రేణి రెండుగా చీలి ఈశాన్యంగా తమిళనాడులో పళని కొండలుగా విస్తరిస్తుంది. మరో శ్రేణి కన్యాకుమారి వరకు 'యాలకుల కొండలు'గా ఉంటుంది.

తూర్పు కనుమలు: భారతదేశ తూర్పు తీరానికి సమాంతరంగా ఉత్తర ఛోటానాగ్‌పుర్ పీఠభూమి నుంచి దక్షిణాన నీలగిరి కొండల వరకు విస్తరించాయి. వీటి అంచులకు, సముద్రానికి మధ్య తీరమైదానాలు విస్తరించాయి. సరాసరి ఎత్తు 600-700 మీటర్లు. పొడవు 1,200 కిలోమీటర్లు. పశ్చిమ కనుమల మాదిరిగా నిరంతరంగా ఉండకుండా, అక్కడక్కడా కొంత క్రమరహితంగా ఖాళీలతో ఉంటాయి. ఉత్తర భాగంలో మాడుగుల కొండలు పేరుతో ఎత్తుగా ఉండి, కృష్ణా, గోదావరి నదుల మధ్య దాదాపు అదృశ్యమవుతాయి. కడప, కర్నూలు జిల్లాల్లోని నల్లమల అటవీ ప్రాంతంలో నల్లమల కొండలుగా మళ్లీ ఉద్భవించి, దక్షిణంగా పాలకొండల పేరుతో కొనసాగుతాయి. పూర్వం తూర్పు కనుమలను మహేంద్రగిరులని పిలిచేవారు. తూర్పు కనుమల్లో ఎత్తయిన శిఖరం అరకు దగ్గరలోని జిందగడ (1,690 మీ). గతంలో మహేంద్రగిరి (1,500 మీ.) శిఖరాన్ని ఎత్తయిందిగా పరిగణించేవారు. ✤ తూర్పు కనుమలు ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా విస్తరించాయి. తెలంగాణలో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, వికారాబాద్ జిల్లాల్లో ఉన్నాయి. తమిళనాడులోని షెవరాయ్ కొండలు ఈశాన్య రుతుపవనాలను అడ్డగించి ఆ రాష్ట్రానికి వర్షపాతాన్ని కలిగిస్తాయి.

వింధ్య పర్వతాలు:
నర్మదా నది లోయకు కుడివైపున ఎత్తుగా, మాళ్వా పీఠభూమికి దక్షిణంగా ఉంటాయి. తూర్పు, పడమరలుగా వ్యాపించి కైమూర్ పర్వతాలతో కలుస్తాయి. హోషంగాబాద్ సమీపంలో నర్మదా నదికి ఆనుకుని ఉంటాయి.



తూర్పుతీర మైదానాలు: దేశ తూర్పు సముద్ర తీరం, తూర్పు కనుమలకు మధ్య ఎక్కువ భూభాగంలో విశాలంగా విస్తరించాయి. మహానది, గోదావరి, కృష్ణా, కావేరి నదుల ద్వారా డెల్టా ఏర్పడటంతో వీటిని వర్గీకరించారు. ఒడిశాలో ఉత్కళ్ తీరం (400 కి.మీ. విస్తరించి ఉంటుంది), ఆంధ్రప్రదేశ్‌లో కోస్తా తీరం (సర్కార్), తమిళనాడులో కోరమాండల్ తీరం (675 కి.మీ. విస్తరించింది.) అంటారు. తమిళనాడులోని మైదానాల్లో కావేరీ డెల్టా ముఖ్యమైంది. ఉత్కళ్ తీరంలో చిలుకా సరస్సు, ఆంధ్రా కోస్తా తీరంలో పులికాట్, కొల్లేరు సరస్సులు, కోరమాండల్ తీరంలో కలివెలి, ముత్తుపేట్ లగూన్‌లు ఉన్నాయి.

సాత్పురా పర్వతాలు:
దక్కన్ పీఠభూమికి ఉత్తరాన ఉన్నాయి. వీటికి ఉత్తరాన నర్మదా, దక్షిణాన ఉన్న తపతి నదులు పడమర వైపు ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తాయి. సాత్పురా శ్రేణుల్లో పడమటి దిక్కు కొండలను రాజ్‌పిప్ల కొండలు, ఉత్తరాన చివరన మహాదేవ్ కొండలు, దక్షిణాన గావిర్‌ఘర్ కొండలు అంటారు. వీటిలో ఎత్తయిన శిఖరం దూప్‌ఘర్ (1,350 మీ.).





పశ్చిమతీర మైదానాలు: పశ్చిమ కనుమలు, అరేబియా సముద్రానికి మధ్య విస్తరించాయి. ఉత్తరాన రాణ్-ఆఫ్-కచ్ నుంచి దక్షిణాన కన్యాకుమారి వరకు సన్నగా, ఇరుకుగా ఉంటాయి. వీటిని ప్రాంతీయంగా కచ్ ద్వీపకల్పం, కథియావార్ ద్వీపకల్పంగా పిలుస్తారు. గుజరాత్‌లో ఇవి కాస్త విశాలంగా ఉంటాయి. పశ్చిమ తీరమైదానాన్ని కొంకణ్ తీరం (డామన్ నుంచి గోవా వరకు), కెనరా తీరం (గోవా నుంచి మంగళూరు వరకు), మలబార్ తీరం (మంగళూరు నుంచి కన్యాకుమారి వరకు) అని పిలుస్తారు.



దీవులు: దేశానికి మూడువైపుల ఉన్న సముద్రంలో దీవులు ఉన్నాయి. ఇందులో బంగాళాఖాతంలోని అండమాన్ - నికోబార్; అరేబియా సముద్రంలోని లక్షదీవుల సమూహాలు ప్రధానమైనవి. ✤ అండమాన్ - నికోబార్ దీవుల సమూహాన్ని 10° ఛానల్ వేరు చేస్తుంది. అండమాన్ దీవులను ఉత్తర, మధ్య, దక్షిణ భాగాలుగా విభజించారు. లిటిల్ అండమాన్ దీవులు గ్రేట్ అండమాన్‌కు కొంత దూరంలో ఉంటాయి. మధ్య అండమాన్‌లోని బారెన్ ద్వీపంలో ఉన్న అగ్నిపర్వతం దేశంలోని ఏకైక క్రియాశీల అగ్నిపర్వతం. అండమాన్ సముదాయంలో ఎత్తయిన శిఖరం ఉత్తర అండమాన్‌లోని 'సాడిల్' (737 మీ.). నికోబార్ దీవుల్లో పెద్దది 'గ్రేట్ నికోబర్'. అండమాన్ - నికోబార్ దీవులనే 'ఎమరాల్డ్ దీవులు' అంటారు. ✤ అరేబియా సముద్రంలోని 30కి పైగా దీవుల సమూహం లక్షదీవులు. వీటినే పగడపు దీవులు అంటారు. ఇక్కడ 11° అక్షాంశానికి ఉత్తరంగా ఉన్నవాటిని 'అమీన్ దీవులు', దక్షిణంగా ఉన్నవాటిని 'కన్ననోర్ దీవులు' అంటారు. లక్షదీవుల్లోని 11 దీవుల్లో మాత్రమే ప్రజలు నివసిస్తున్నారు.




రచయిత: డాక్టర్ గోపగోని ఆనంద్

కాంతి


అక్కడి నుంచి చూస్తే ఆకాశం రంగు నలుపు!

చుట్టూ ఉన్న ప్రపంచాన్ని కంటికి చూపించే శక్తి రూపమే కాంతి. మనిషి కంటికి కనిపించే విద్యుదయస్కాంత వికిరణం. కాంతి ప్రదర్శించే ధర్మాలు, ప్రసార రూపాలను తెలుసుకుంటే వివిధ శాస్త్రీయ భావనలను, రోజువారీ దృగ్విషయాలను అర్థం చేసుకోవచ్చు. కాంతి పరావర్తనం, విక్షేపణం, పరిక్షేపణం, వక్రీభవనం తదితర లక్షణాల అనువర్తనాలు, కాంతి ప్రసారం భిన్నంగా జరిగే పలు పదార్థాలు, కాంతి ప్రవాహ కొలమానాలు, తరంగదైర్ఘ్యాల ఆధారంగా రంగులు కనిపించడం, రకరకాల రంగుల స్వభావాలు, భిన్న దర్పణాల ఉపయోగాలను పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. శూన్యం ద్వారా కాంతి అనూహ్య ప్రవాహ వేగం, తద్వారా సమాచార ప్రసారం చేస్తున్న ఆప్టికల్ ఫైబర్ గురించి స్థూల అవగాహన కలిగి ఉండాలి.



జనరల్ స్టడీస్ - భౌతిక శాస్త్రం

1. కింది వాటిలో సరికానిది గుర్తించండి.
   ఎ) కాంతి అధ్యయన శాస్త్రం ఫొటోమెట్రీ
   బి) కాంతి ప్రకాశానికి అంతర్జాతీయ ప్రమాణం - లక్స్
   సి) మానవ శరీరంలో కాంతిని కొలవగలిగే అవయవం - కన్ను
   డి) కంటికి దృష్టిజ్ఞానాన్ని కోల్పోయేలా చేసేది- కాంతి
   1) ఎ 2) ఎ, డి 3) ఎ, బి, డి 4) ఎ, బి
2. కింది వాటిని జతపరచండి.
   1) స్వయంప్రకాశకం — ఎ) కిరోసిన్
   2) గౌణ ప్రకాశకం — బి) డైమండ్
   3) పాక్షిక పారదర్శకం — సి) నక్షత్రాలు
   4) పారదర్శక పదార్థం — డి) స్వచ్ఛమైన నీరు
   1) 1-డి, 2-సి, 3-బి, 4-ఎ
   2) 1-బి, 2-సి, 3-ఎ, 4-డి
   3) 1-సి, 2-బి, 3-ఎ, 4-డి
   4) 1-సి, 2-డి, 3-ఎ, 4-బి
3. కింది వాటిలో సరికానిది గుర్తించండి.
   ఎ) 1 క్యాండిలా = 100 విద్యుత్తు బల్బుల కాంతి
   బి) 1 ల్యూమెన్ = 12.56 క్యాండిలా
   సి) 1 వాట్ = 700 ల్యూమెన్
   డి) 1 ఫుట్ క్యాండిలా = 10.76 లక్స్
   1) ఎ, డి 2) ఎ 3) ఎ, సి 4) బి, డి
4. కింది వాటిలో సరైంది గుర్తించండి.
   ఎ) భూమి ఉపరితలం మీద జరిగే సగటు వికిరణం సుమారుగా ఒక చదరపు మీటరుకు 1000 వాట్లు.
   బి) దీప్త ఎండాకాలం రోజున సగటు కాలం ఫ్లక్స్ ఒక చదరపు అడుగుకు 10,000 ల్యూమెన్‌లు.
   సి) సూర్యుడి ఉపరితల వేడి కేంద్రక విచ్ఛిత్తి వల్ల జరుగుతుంది.
   డి) కాంతి తీవ్రతకు ప్రమాణం - క్యాండిలా
   1) ఎ, బి 2) ఎ, బి, సి, డి
   3) ఎ, బి, డి 4) సి, డి
5. కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
   ఎ) కాంతి ఎల్లప్పుడూ కణాల రూపంలో ప్రయాణిస్తుంది - న్యూటన్
   బి) కాంతి తరంగ రూపంలో ప్రయాణిస్తుంది. ఇది విశ్వంలో ఉండే ఈథర్ అనే యానకం ద్వారా వెళుతుంది - హైగెన్స్
   సి) కాంతి కిరణాలనేవి చిన్నచిన్న శక్తి ప్యాకెట్‌ల రూపంలో ఉంటాయి. - మాక్స్‌వెల్.
   డి) కాంతి విద్యుత్తు, అయస్కాంత క్షేత్రాలను కలిగి ఉంటుంది. అవి ఒకదానికొకటి లంబంగా ఉంటాయి. - మాక్స్‌ప్లాంక్
   1) ఎ, బి, సి, డి 2) ఎ, బి
   3) సి, డి 4) ఎ, బి, సి


న్యూటన్

6. కింది వాటిలో సరైన దానిని గుర్తించండి.
   ఎ) ప్లాంక్ స్థిరాంకం విలువ (h) = 6.625×10^{-27} ఎర్గ్. సెకను.
   బి) కాంతి పౌనఃపున్యం పెరిగితే ఆ కాంతి వికిరణాల శక్తి ప్యాకెట్‌లు (ఫోటాన్) శక్తి పెరుగుతుంది.
   సి) కాంతి వేగం ఒక సెకనుకు 3 లక్షల కి.మీ. ఉంటుంది.
   డి) కాంతి తీవ్రతకు ప్రమాణం - కాంతి సంవత్సరం
   1) ఎ, బి, సి, డి 2) ఎ, బి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి
7. కింది వాటిలో సరికానిది గుర్తించండి.
   ఎ) సౌర కుటుంబంలో గ్రహణ ఛాయలకు కారణం - సూర్యుడు.
   బి) కాంతి ప్రయాణించినప్పుడు యానకంలో తక్కువ సమయం పట్టే మార్గాన్ని ఎన్నుకుంటుంది - ఫెర్మాట్ సూత్రం.
   సి) కాంతిని, దాని సరళరేఖ మార్గాన్ని పరిశీలించడానికి పెన్‌హోల్ కెమెరా ఉపయోగపడుతుంది.
   డి) వస్తువుల నీడకు కారణం - కాంతి రుజుమార్గ ప్రసార ధర్మం.
   1) ఎ, డి 2) బి, డి
   3) ఎ మాత్రమే 4) ఎ, సి, డి
8. కాంతి ఒక యానకం నుంచి వేరొక యానకంలోకి ప్రవేశించినప్పుడు మారని భౌతిక రాశి?
   1) కాంతి వేగం 2) తరంగదైర్ఘ్యం
   3) కంపన పరిమితి 4) పౌనఃపున్యం
9. విరళ యానకం నుంచి సాంద్రతర యానకంలోకి ప్రవేశిస్తే తరంగదైర్ఘ్యం (λ), పౌనఃపున్యం (n)లు..
   1) λ, n లు రెండూ పెరుగుతాయి.
   2) λ, n లు రెండూ తగ్గుతాయి.
   3) λ తగ్గుతుంది, n పెరుగుతుంది.
   4) λ తగ్గుతుంది, n స్థిరంగా ఉంటుంది.
10. కాంతి వక్రీభవన ధర్మానికి సంబంధించి సరికానిది?
   ఎ) కిరోసిన్ వక్రీభవన గుణకం - 1.44
   బి) $\frac{\sin i}{\sin r} = \frac{n_2}{n_1} = \frac{v_1}{v_2}$ ను స్నెల్ నియమం (Snell's law) అంటారు.
   సి) వక్రీభవన గుణకానికి ప్రమాణం - m/s
   డి) శూన్యంలో కాంతి వేగం, యానకంలో కాంతి వేగాల నిష్పత్తి - వక్రీభవన గుణకం.
   1) ఎ, డి 2) ఎ, సి 3) సి, డి 4) సి
11. కింది వాటిని జతపరచండి.
   1) శూన్యంలో కాంతి వేగం — ఎ) 2×10^8 m/s
   2) గాజులో కాంతి వేగం — బి) 3×10^{10} cm/s
   3) వజ్రం వక్రీభవన గుణకం — సి) 2.42
   1) 1-ఎ; 2-బి; 3-సి 2) 1-బి; 2-ఎ; 3-సి
   3) 1-బి; 2-సి; 3-ఎ 4) 1-ఎ; 2-సి; 3-బి
12. ఎ: దూరం నుంచి చూస్తే రైలు పట్టాలు రెండూ కలిసిపోయినట్లు కనిపిస్తాయి.
   బి: కారణం కాంతి వక్రీభవన ధర్మం.
   1) ఎ కు బి సరైన వివరణ.
   2) ఎ కు బి సరైన వివరణ కాదు.
   3) ఎ, బి లు వ్యతిరేక వాక్యాలు.
   4) ఏదీకాదు
13. వాక్యం-ఎ: ఒక వస్తువు (రాయి) మెరుస్తూ కనపడింది.
   వాక్యం-బి: దాని మెరుపునకు కారణం కాంతి పరావర్తన ధర్మం.
   1) ఎ కు బి సరైన వివరణ.
   2) ఎ కు బి సరైన వివరణ కాదు.
   3) ఎ, బి లు సాధారణ వాక్యాలు. అవి సంబంధం లేనివి.
   4) ఏదీకాదు
14. ఒక కిటికీ అద్దంలో చూస్తున్న పిల్లవాడి రూపం మసకగా కనిపిస్తుంది. దీనికి కారణం?
   1) కాంతి క్రమ పరావర్తనం
   2) కాంతి క్రమరహిత పరావర్తనం
   3) కాంతి సంపూర్ణాంతర పరావర్తనం
   4) కాంతి వక్రీభవనం
15. ఒక వస్తు తలానికి లంబంగా కాంతి కిరణం పతనం చెందింది. అయితే దాని పరావర్తన కోణం?
   1) 90° 2) 0° 3) 180° 4) 45°
16. ఒక వ్యక్తి అద్దం ముందు 15 మీటర్ల దూరంలో నిలబడి ఉన్నాడు. అతడు ఆ అద్దం ముందుకు 4 మీటర్లు నడిచాడు. అయితే ఆ అద్దంలో అతడి ప్రతిబింబ స్థాన దూరం?
   1) 11 మీ. 2) 4 మీ.
   3) 7.5 మీ. 4) 15 మీ.
17. దర్పణాల ఆవర్తనం విలువలు గుర్తించండి.
   1) సమతల దర్పణం — ఎ) M < 1
   2) కుంభాకార దర్పణం — బి) M = 1
   3) పుటాకార దర్పణం — సి) M ≥ 1, M < 1
   1) 1-ఎ, 2-బి, 3-సి 2) 1-బి, 2-సి, 3-ఎ
   3) 1-బి, 2-ఎ, 3-సి 4) 1-సి, 2-బి, 3-ఎ
18. ఒక పిల్లవాడు తన ఇంటి వద్దకు ప్రాజెక్టు వర్క్‌గా డబ్బాలో దర్పణాలతో పూలతోట, కెలిడియోస్కోప్‌లు తయారుచేశాడు. ఆ పిల్లవాడు ఉపయోగించే దర్పణం?
   1) సమతల దర్పణం 2) కుంభాకార దర్పణం
   3) పుటాకార దర్పణం 4) 2, 3
19. హైపో ద్రావణానికి సల్ఫ్యూరిక్ ఆమ్లం కలిపితే మొదట అందులో కొంతసేపటికి సల్ఫర్ స్ఫటికాలు ఏర్పడతాయి. మొదట సల్ఫర్ స్ఫటికాలు నీలిరంగులో ఉండి, వాటి పరిమాణం పెరిగేకొద్దీ అవి తెలుపు రంగుకు మారడం ఏ ధర్మం వల్ల జరుగుతుంది?
   1) కాంతి పరావర్తనం 2) కాంతి విక్షేపణం
   3) కాంతి పరిక్షేపణం
   4) కాంతి సంపూర్ణాంతర పరావర్తనం
20. కింది వాటిలో సరికానిది గుర్తించండి.



   ఎ) సముద్రాలు నీలి రంగులో కనిపించడం - కాంతి పరిక్షేపణం
   బి) ఉదయం-సాయంత్రం సూర్యుడు ఎర్రగా కనిపించడం - కాంతి పరిక్షేపణం
   సి) సూర్యోదయం, సూర్యాస్తమయంలో సూర్యుడు అండాకృతిలో కనిపించడం - కాంతి పరిక్షేపణం
   డి) అంతరిక్ష యాత్రికుడికి ఆకాశం నలుపు రంగులో కనిపించడం - కాంతి పరిక్షేపణం
   1) ఎ, బి 2) సి 3) ఎ, బి, డి 4) సి, డి
21. ఇంద్రధనస్సు ఆకాశంలో ఏర్పడుతుంది. దీని పూర్తి నిర్మాణం ఏ ఆకారంలో ఉంటుంది?



   1) త్రిమితీయ శంఖువు 2) అర్ధ చంద్రాకారం
   3) వృత్తాకారం 4) అర్ధ శంఖువు
22. కింది వాటిలో సరైనవి గుర్తించండి.
   ఎ) పట్టకం తయారీకి వాడే పదార్థ వక్రీభవన గుణకం $\sqrt{2}$
   బి) కాంతి కిరణం పట్టకం నుంచి పంపిస్తే రంగులుగా విడిపోవడం కాంతి విక్షేపణం.
   సి) కాంతి విక్షేపణం అనేది ఇంద్రధనస్సులో జరుగుతుంది.
   డి) ఇంద్రధనస్సు కేవలం 40° కోణం నీటి బిందువులో చేస్తే ఏర్పడుతుంది.
   1) ఎ, బి, సి, డి 2) ఎ, బి
   3) ఎ, బి, సి 4) సి, డి
23. సముద్రాల అంతర్భాగంలో సమాచార ప్రసారానికి ఏ వ్యవస్థను ఉపయోగిస్తారు?
   1) సిస్మోగ్రాఫ్ 2) ఆప్టికల్ ఫైబర్
   3) విద్యుత్తు పైపులు 4) సోనార్ వ్యవస్థ
24. కింది వాటిని జతపరచండి.
   1) తక్కువ వక్రీభవనం — ఎ) ఊదా
   2) కంటికి ఆహ్లాదకరం — బి) పసుపు
   3) అత్యంత శక్తిమంతమైన — సి) ఎరుపు
   4) సాయంత్రం, ఉదయం కంటికి బాగా కనిపించే రంగు — డి) ఆకుపచ్చ
   1) 1-డి, 2-సి, 3-ఎ, 4-బి
   2) 1-బి, 2-సి, 3-డి, 4-ఎ
   3) 1-ఎ, 2-డి, 3-బి, 4-సి
   4) 1-సి, 2-డి, 3-ఎ, 4-బి
25. కింది వాటిలో ఏది సంపూర్ణాంతర పరావర్తనం కాదు?
   1) ఆప్టికల్ ఫైబర్లు (ల్యాప్రోస్కోపీ, ఎండోస్కోపీ పైపులు పనిచేయడం).
   2) ఆకాశంలో మధ్యాహ్నం తెలుపురంగు కనిపించడం
   3) సబ్బునీటి బుడగలు మెరవడం.
   4) సముద్రపు అలలు మెరవడం.

సమాధానాలు

1-2; 2-3; 3-2; 4-3; 5-2; 6-4; 7-3; 8-4; 9-4; 10-4; 11-2; 12-1; 13-1; 14-2; 15-2; 16-1; 17-3; 18-1, 19-3, 20-2, 21-1, 22-3, 23-2, 24-4; 25-2.

(c) eenadu

ఈనాడు ప్రతిభ

■ e-mail: pratibhadesk@eenadu.net

ఆ శక్తి కారణంగానే చిన్న రాయితో పెద్ద గాయం!

వస్తువులపై బల ప్రభావాన్ని అధ్యయనం చేసే భౌతికశాస్త్ర విభాగాన్ని యాంత్రిక శాస్త్రం అంటారు. విశ్వ గురుత్వాకర్షణ నియమం ప్రకారం ఏ రెండు వస్తువుల మధ్యనైనా పనిచేసే ఆకర్షణ బలం వాటి ద్రవ్యరాశుల లబ్ధానికి అనులోమానుపాతంలో, వాటి మధ్య దూరం వర్గానికి విలోమానుపాతంలో ఉంటుంది. భూమిపై గురుత్వాకర్షణ శక్తి ఎల్లప్పుడూ భూకేంద్రం వైపు పనిచేస్తుంది. వస్తువు మొత్తం భారం ఏ బిందువు ద్వారా పని చేస్తుందో అదే గరిమనాభి. పోటీపరీక్షార్థులు ఈ విభాగంలోని పని, సామర్థ్యం, స్థితి, గతి శక్తులు, శక్తి నిత్యత్వ నియమం తదితరాలపై అవగాహన కలిగి ఉండాలి.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఫిజిక్స్

యాంత్రిక శాస్త్రం

పని

నిశ్చల స్థితిలో ఉన్న వస్తువుపై కొంత బలాన్ని ప్రయోగించినప్పుడు అది కదలవచ్చు లేదా నిశ్చల స్థితిలోనే ఉండవచ్చు. ఒకవేళ వస్తువు కదిలితే అక్కడ కొంత పని జరిగిందని, కదలకపోతే పని జరగలేదని చెప్పవచ్చు.

ఉదా: కొంత బలంతో గోడను నెట్టినప్పుడు అది కదలదు. అంటే అక్కడ పని జరగనట్లు.

◆ ఒక వస్తువుపై పనిచేసే బలం ఆ వస్తువును బల దిశలో కదిలించినట్లయితే పని జరిగిందని అర్థం.

పని (W) = బలం (F) × స్థానభ్రంశం (s)

◆ కొంత కోణంతో (θ) బలాన్ని ప్రయోగించినట్లయితే,

పని $W = Fs\cos\theta$

ఉదా: లాన్ రోలర్‌ను కొంత కోణంలో లాగడం లేదా తోయడం వల్ల దానిపై పని జరుగుతుంది. ప్రెషర్ కుక్కర్ ఉపయోగిస్తున్నప్పుడు నీటిఆవిరి వల్ల ఏర్పడిన పీడనం పాత్రపై ఉన్న బరువును పైకి నెడుతుంది.

◆ పని ఒక అదిశ రాశి. పనికి CGS పద్ధతిలో ప్రమాణం ఎర్గ్; SI పద్ధతిలో జౌల్.

1 జౌల్ = 10^7 ఎర్గ్

సామర్థ్యం

సామర్థ్యం ఒక అదిశ రాశి. ఎయిర్ కూలర్‌లో వాడే చిన్న నీటిపంపు ఒక నిమిషంలో తోడే నీటిని, పొలంలో వాడే నీటిపంపు అదే సమయంలో తోడే నీటితో పోల్చినప్పుడు రెండో పంపు ఎక్కువ సామర్థ్యం కలిగి ఉంటుంది. కాబట్టి పని జరిగే రేటును సామర్థ్యం అని నిర్వచించవచ్చు.

సామర్థ్యం = జరిగిన పని/కాలం

◆ ఒక వస్తువుపై F అనే బలం ప్రయోగించినప్పుడు, దానిలో v అనే సమవేగం కలిగితే, సామర్థ్యం = F × v

◆ సామర్థ్యానికి SI ప్రమాణం వాట్ (W). ఇతర ప్రమాణాలు కిలో వాట్ (kW), అశ్వ సామర్థ్యం (hp) లేదా హార్స్ పవర్.

1 kW = 1000 వాట్

1hp = 746 వాట్

శక్తి

ఒక పనిని చేసేందుకు అవసరమయ్యే సామర్థ్యాన్ని శక్తి అంటారు.

ఉదా: ప్రెషర్ కుక్కర్‌లో వేడి వల్ల నీటిఆవిరి పీడనం పెరిగి మూతకు ఉన్న బరువును పైకి ఎత్తగలదు. దీని ఆధారంగా ఉష్ణం ఒక శక్తిరూపం అని గమనించవచ్చు.

◆ కొన్ని లోహాల ఉపరితలాలపై కాంతి పతనమైనప్పుడు వాటి పరమాణువుల నుంచి ఎలక్ట్రాన్లను కదిలేలా చేస్తుంది. కాబట్టి కాంతి ఒక శక్తిరూపం.



◆ వాహకాల ద్వారా ప్రవహించే విద్యుత్ అనేది యంత్రాలను కదిలించగలదు. ఇది కూడా ఒక శక్తి రూపం.

◆ పదార్థ పరమాణువులు, అణువుల్లో ఉండే శక్తి రసాయన చర్యల్లో కొంతమేర పని చేస్తుంది. కాబట్టి దీన్ని రసాయన శక్తి అంటారు.

◆ అణుధార్మిక చర్యలు జరిగేటప్పుడు విడుదలయ్యే శక్తి అణుశక్తి.

◆ ఒక లోహపు బొమ్మ కారు దగ్గర అయస్కాంతం పెడితే అది ఆ కారును కదిలిస్తుంది. దీన్ని అయస్కాంత శక్తి అంటారు.

◆ ధ్వని వల్ల యానకంలోని అణువులను కదిలేలా చేయవచ్చు. కాబట్టి ధ్వని కూడా ఒక శక్తి రూపమే. ◆ శక్తికి CGS పద్ధతిలో ఎర్గ్, SI పద్ధతిలో జౌల్ ప్రమాణాలు.

◆ ఇతర ప్రమాణాలు వాట్ అవర్, కిలో వాట్ అవర్, ఎలక్ట్రాన్ వోల్ట్, కెలోరీ.

యాంత్రిక శక్తి



వస్తువులకు వాటి స్థితి లేదా చలనం వల్ల కలిగే శక్తిని యాంత్రిక శక్తి అంటారు. దీన్ని తిరిగి స్థితిశక్తి, గతిశక్తి అని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

స్థితి శక్తి: ఒక వస్తువుకు దాని స్థానం వల్ల కలిగే శక్తిని స్థితిశక్తి అంటారు.

❒ m ద్రవ్యరాశి ఉన్న వస్తువు h ఎత్తులో ఉన్నట్లయితే, ఆ ప్రదేశంలో గురుత్వ త్వరణం g అనుకుంటే స్థితి శక్తి = mgh

❒ ఒక ప్రదేశంలో గురుత్వ త్వరణం స్థిరంగా ఉంటుంది. కాబట్టి స్థితిశక్తి వస్తువుల ద్రవ్యరాశి, వాటి ఎత్తుపై ఆధారపడి ఉంటుంది.

ఉదా: ఎత్తులో నిల్వ చేసిన నీటికి స్థితిశక్తి ఉంటుంది. ఆనకట్టల ద్వారా నిల్వ చేసిన నీటిని ఎత్తు నుంచి కిందికి పడే సమయంలో కింద ఉన్న టర్బైన్ రెక్కలను తిప్పి జలవిద్యుత్తును ఉత్పత్తి చేస్తారు.

❒ చుట్టిన స్ప్రింగ్ స్థితిశక్తిని కలిగి ఉండి బొమ్మలో కదలికలకు కారణమవుతుంది.

❒ కొంత ఎత్తు నుంచి కింద పడే రాయి చిన్నదే అయినప్పటికీ ఎక్కువ గాయం చేస్తుంది. ఆ రాయికి స్థితిశక్తి ఉండటమే ఇందుకు కారణం.

❒ విల్లులో ఎక్కుపెట్టిన బాణం స్థితిశక్తిని కలిగి ఉంటుంది.

గతిశక్తి: ఒక వస్తువుకు దాని చలనం వల్ల కలిగే శక్తిని గతిశక్తి అంటారు.

❒ m ద్రవ్యరాశి ఉన్న వస్తువు v వేగంతో కదులుతున్నట్లయితే, దాని

గతిశక్తి = $\frac{1}{2}mv^2$

ఉదా: బుల్లెట్ చిన్నదే అయినప్పటికీ తుపాకీ నుంచి బయటకు వచ్చినప్పుడు దానికి ఉన్న అధిక గతిశక్తి వల్ల ఎదుటి వ్యక్తి ప్రాణాలు తీయగలదు.

❒ ఆగి ఉన్న వాహనం వల్ల వ్యక్తికి ఎలాంటి అపాయం ఉండదు. కానీ అది వేగంగా కదులుతున్నప్పుడు దానికి ఉన్న గతిశక్తి వల్ల ప్రాణాపాయం కలగవచ్చు.

❒ విల్లు నుంచి బయటకు వచ్చిన బాణం గతిశక్తి వల్ల ఎదురుగా ఉన్న వస్తువుకు గుచ్చుకుంటుంది. ట్యాంకులో నుంచి కిందకు ప్రవహిస్తున్న నీటికి గతిశక్తి ఉంటుంది.



❒ కొంత ఎత్తులో ఎగురుతున్న విమానం లేదా పక్షికి స్థితిశక్తి, గతిశక్తి రెండు రూపాల్లోనూ శక్తి ఉంటుంది.

శక్తి నిత్యత్వ నియమం

ప్రకృతిని అర్థం చేసుకునే ప్రయత్నంలో ప్రతిపాదించిన ప్రాథమిక నియమాల్లో శక్తి నిత్యత్వ నియమం ఒకటి.

❖ ఈ నియమం ప్రకారం శక్తిని సృష్టించలేం, నాశనం చేయలేం. కానీ ఒక రూపం నుంచి మరొక రూపంలోకి మార్చవచ్చు.

❖ కొంత ఎత్తు నుంచి కిందకి పడుతున్న వస్తువు విషయంలో శక్తి నిత్యత్వ నియమాన్ని అర్థం చేసుకోవచ్చు. కిందకి పడటం మొదలు కాకముందు అది స్థితిశక్తి రూపంలో ఉంటుంది. వేగం సున్నా కాబట్టి గతిశక్తి కూడా సున్నా అవుతుంది.

❖ నేలను తాకిన తర్వాత ఎత్తు సున్నా కాబట్టి స్థితిశక్తి కూడా సున్నా అవుతుంది. కానీ నేలను తాకే క్షణంలో కొంత వేగం ఉంటుంది, కాబట్టి అప్పుడు దానికి గతిశక్తి ఉంటుంది.

❖ ఏ బిందువు వద్దనైనా స్థితిశక్తి, గతిశక్తుల మొత్తం ఎప్పుడూ స్థిరంగా ఉంటుంది. ఈ విధంగా శక్తి ఒక రూపం నుంచి మరో రూపంలోకి మారడాన్ని గమనించవచ్చు.

❖ డోలన చలనంలో ఉన్న లఘు లోలకం విషయంలోనూ శక్తిరూపం మారుతుంది.

శక్తి రూపాంతరం - ఉదాహరణలు:

❖ రెండు చేతులను ఒకదానిపై ఒకటి రుద్దినప్పుడు ఘర్షణ కారణంగా యాంత్రిక శక్తి ఉష్ణశక్తిగా మారుతుంది.

❖ వాహనానికి బ్రేకులు వేసినప్పుడు అవి చక్రాన్ని తాకే ప్రాంతంలో యాంత్రిక శక్తి ఉష్ణశక్తిగా మారుతుంది.

❖ మిక్సీ ఆన్ చేసినప్పుడు విద్యుత్ శక్తి యాంత్రిక శక్తిగా మారి బ్లేడును తిప్పుతుంది.

❖ ఆవిరి యంత్రంలో ఉష్ణశక్తి యాంత్రిక శక్తిగా మారి ఇంజిన్ పని చేస్తుంది

❖ విద్యుత్ హీటర్ లేదా గీజర్ లేదా ఓవెన్‌లో విద్యుత్ శక్తి ఉష్ణశక్తిగా మారుతుంది.

❖ విద్యుత్ జనరేటర్‌లో యాంత్రిక శక్తి విద్యుత్ శక్తిగా మారుతుంది.



రచయిత

వట్టిపల్లి కృష్ణ కిశోర్

విషయ నిపుణులు

Word of the Day

739

Unalterable

Telugu meaning: మార్చలేనటువంటి, స్థిరమైన

English meaning: The word unalterable (అన్‌ఆల్టరబుల్) is an adjective that describes something that cannot be changed, modified, or reversed.

Synonyms: Permanent, Irreversible

Antonyms: Changeable, Flexible

Usage: 1. The contract terms were unalterable and had to be accepted as they were.

2. His decision to leave the company was final and unalterable, despite everyone's efforts to convince him.

Latest Updates

Union Public Service Commission

The Union Public Service Commission (UPSC), invites online applications for the posts of Lecturer (English, Mathematics) in the School Education Department of National Fire Service College (Maharashtra), Union Territory of Ladakh. The total number of posts is 15. The application fee is Rs.25. Eligible candidates can apply online before 28 August 2025.

Indian Air Force - AgniveerVayu Posts

Indian Air Force invites online application from unmarried Indian male candidates for Recruitment Trials of Outstanding Sportsmen under Agniveervayu (Sports) Intake 01/2026 as part of the Agnipath Scheme Recruitment Trials from 08 - 10 September 2025 to join the IAF. The registration fee is Rs.100. The last date for online registration is 20 August 2025.

Did You Apply..?

Today (August 12) is the last date for the following Jobs

☛ 40 Manager Posts in Hindustan Urvarak & Rasayan Limited. ***Eligibility:*** B.Tech, CA or CMA.

☛ 41 Manager Posts in Bank of Baroda. ***Eligibility:*** BE/BTech or MCA/MSc(CS).

☛ 108 posts in Hindustan Urvak & Rasayan Limited. ***Eligibility:*** B.Tech, BE, Diploma.

☛ 79 Group-D Vacancies in Konkan Railway. ***Eligibility:*** 10th class.

For more information and other notifications - scan QR code


అంతర్జాతీయ యువజన దినోత్సవం

ఆగస్టు 12

చరిత్రలో ఈనాడు

ప్రపంచవ్యాప్తంగా యువత సామర్థ్యాలు, విజయాలను గుర్తించే లక్ష్యంతో ఏటా ఆగస్టు 12న 'అంతర్జాతీయ యువజన దినోత్సవం'గా (International Youth Day) నిర్వహిస్తారు. ఏ దేశమైనా ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే జనాభాలో 'రోజూ కష్టపడి పనిచేసే (వర్కింగ్ గ్రూప్)' వారి సంఖ్య ఎక్కువగా ఉండాలి. 15 నుంచి 59 ఏళ్ల మధ్య వయసు వారు ఈ వర్గంలోకి వస్తారు. అయితే ప్రస్తుతం అనేక దేశాల్లో యువతరం సంఖ్య తగ్గి, వృద్ధుల జనాభా పెరుగుతోంది. జనన, మరణాల రేటు తగ్గడంతోపాటు అనేక ఆర్థిక, సామాజిక అంశాలు దీనికి కారణాలుగా ఉన్నాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంది. మెరుగైన సమాజ నిర్మాణంలో యువతను భాగస్వాములను చేయాల్సిన ఆవశ్యకతను తెలియజేయడంతోపాటు వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

☛ ఐక్యరాజ్య సమితి ఇటీవల విడుదల చేసిన 'ప్రపంచ జనాభా స్థితి నివేదిక' ప్రకారం, 2024లో జపాన్‌లో శిశు జననాలు 7,20,988గా నమోదయ్యాయి. 1899 తర్వాత అక్కడ ఇంత తక్కువగా జననాలు నమోదు కావడం ఇదే తొలిసారి. ఫ్రాన్స్‌లోనూ 2023 నుంచి జననాల రేటు గణనీయంగా పడిపోవడం మొదలైంది. చైనాలో వరుసగా మూడేళ్ల జననాల రేటులో తగ్గుదల నమోదైంది.



☛ ఐరాస ప్రకారం, భారత జనాభా 146 కోట్లు. అయితే జనాభాను ఇదే స్థాయిలో కొనసాగించడానికి అవసరమైన జననాల పెరుగుదల కంటే దేశంలో జననాలు తక్కువగా ఉన్నాయని నివేదిక తెలిపింది. దేశంలో జననాల రేటు సరాసరి ప్రతి మహిళకు 1.9కి పడిపోయిందని పేర్కొంది. దేశ జనాభాలో 68 శాతం మంది పనిచేసే వయసులో ఉన్నారు. 65 సంవత్సరాలకు మించిన వయసున్న జనాభా 7%. రానున్న దశాబ్దాల్లో ఈ వయోజన జనాభా పెరగనుందని నివేదిక తెలిపింది.

చారిత్రక నేపథ్యం:

ప్రపంచవ్యాప్తంగా యువతలోని సామర్థ్యాలను పెంపొందించే లక్ష్యంతో 1998, ఆగస్టు 8 నుంచి 12 వరకు పోర్చుగల్‌లోని లిస్బన్‌లో ఐరాస ఆధ్వర్యంలో ఒక అంతర్జాతీయ సమావేశం జరిగింది. ఇందులో యువతకు ప్రాతినిధ్యం వహించే 145 దేశాలకు చెందిన మంత్రులు పాల్గొన్నారు. సమావేశం చివరి రోజైన ఆగస్టు 12న యువత కోసం ఆచరించాల్సిన విధానాలు, కార్యక్రమాలపై ఒక డిక్లరేషన్‌ను ఆమోదించారు. దీన్నే లిస్బన్ డిక్లరేషన్‌గా పేర్కొంటారు. దీనికి గుర్తుగా ఏటా ఆ తేదీన 'అంతర్జాతీయ యువజన దినోత్సవం'గా జరుపుకోవాలని ఐరాస జనరల్ అసెంబ్లీ 1999లో తీర్మానించింది. 2000 నుంచి దీన్ని ఏటా నిర్వహిస్తున్నారు.

2025 నినాదం: "Local Youth Actions for the SDGs and Beyond"

www.epratibha.net

జనరల్ స్టడీస్ - ఇండియన్ జాగ్రఫీ

ఉత్తర అమెరికా

ప్రపంచంలోని ఏడు ఖండాల్లో మూడో అతిపెద్ద ఖండం ఉత్తర అమెరికా. ఆర్థికంగా, సాంకేతికంగా, పారిశ్రామికంగా అభివృద్ధిలో ముందంజలో ఉంది. అధిక సంపన్నులను కలిగిన దేశాలు ఇక్కడే ఉన్నాయి. ఈ ఖండం ప్రపంచంలోని అనేక దేశాలకు దిశానిర్దేశం చేసే స్థాయికి ఎదిగింది. పోటీపరీక్షార్థులు ఈ ప్రాంత ఉనికి, సరిహద్దులు, భూస్వరూపాలు, శీతోష్ణస్థితి, వ్యవసాయం, రవాణా తదితరాలపై దృష్టి సారించాలి.



క్రిస్టోఫర్ కొలంబస్ ఇండియాకు సముద్రమార్గం కనుక్కోవాలనే ప్రయత్నంలో ఉత్తర అమెరికాను కనుక్కున్నాడు. ఇది భారతదేశం కంటే 8 రెట్లు పెద్దది. ఈ ప్రాంతంలోని పనామా కాలువ వాణిజ్యపరంగా కీలకపాత్ర పోషిస్తుంది. చదువు, అవకాశాల కోసం ప్రపంచంలోని అనేక మంది యునైటెడ్ స్టేట్స్, కెనడా లాంటి దేశాలకు వెళ్తున్నారు.

సరిహద్దులు

☛ ఈ ఖండానికి తూర్పున అట్లాంటిక్ మహాసముద్రం, పశ్చిమాన పసిఫిక్ మహాసముద్రం, ఉత్తరాన ఆర్కిటిక్ మహాసముద్రం, దక్షిణాన కరేబియన్ సముద్రాలు ఉన్నాయి. ఉత్తర, పశ్చిమార్ధ గోళాల్లో ఈ ఖండం ఉంది. ఇందులో మొత్తం 23 దేశాలు ఉన్నాయి.

బేరింగ్ జలసంధి

☛ ఈ జలసంధి ఉత్తర అమెరికా ఖండాన్ని ఆసియా ఖండం నుంచి వేరు చేస్తుంది.

☛ ఇది ఆర్కిటిక్, బేరింగ్ సముద్రాలను కలుపుతుంది.

వ్యవసాయం

☛ ఈ ఖండంలో విస్తృత వ్యవసాయం ప్రధానమైంది. ఇక్కడి గడ్డి భూములను ప్రయరీలు అంటారు. ప్రయరీలు గోధుమ పంటకు ప్రసిద్ధి. కాబట్టి వీటిని 'ప్రపంచ రొట్టెల బుట్ట' అంటారు.

☛ ఈ ఖండంలోని ఉత్తర ప్రాంతం ఏడాదిలో ఎక్కువ భాగం మంచుతో కప్పి ఉంటుంది. ఈ ప్రాంతం పొట్టి చెట్లతో, టండ్రా రకపు తృణజాతులను కలిగి ఉంటుంది.

ఉనికి, శీతోష్ణస్థితి, పరిశ్రమలు, రవాణా, నదీ వ్యవస్థ మొదలైన అంశాలతోపాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Current Affairs



India's Nisha (54kg) and Muskan (57kg) clinched gold, and five others won silver, at the under-19 Asian Boxing Championships 2025 in Bangkok on 10 August 2025. Of the 10 women boxers in the under-19 fray, nine will return with medals - including two golds, five silvers, and two bronzes.

On World Lion Day, the Union Government released the 16th Lion Population Estimation report released on 10 August 2025. According to this, the Asiatic lion population has risen from 674 in 2020 to 891 in 2025, a 32.2 percent increase. The number of adult females has increased from 260 to 330, up by nearly 27%.

India was positioned 67th among the world's safest countries in the latest Numbeo Safety Index mid-2025 rankings, achieving an index score of 55.8. In city-wise safety rankings, Mangalore has been ranked as the safest city in India, praised for its low crime rates and strong civic infrastructure, globally ranking 49 with a safety index score of 74.2. In Gujarat, three cities - Vadodara, Ahmedabad, and Surat - rank next with safety scores of 69.2, 68.2, and 66.6, respectively.

The annual defence production has soared to an all-time high figure of Rs.1,50,590 crore in the Financial Year (FY) 2024-25, Defence Minister Rajnath Singh said. The milestone represents a robust 18% growth over the previous fiscal's output of Rs 1.27 lakh crore, and a staggering 90% increase since FY 2019-20, when the figure was Rs.79,071 crore.

For more Current Affairs: Scan QR code

Bank Exams


Quantitative Aptitude

Data Interpretation

Directions (Qs.1 - 4): *Read the given bar graph carefully and answer the following questions.*

Three different companies producing packaged 1 L drinking water bottles production over a period of six years has been expressed in the bargraph provided below.

Production of packaged 1 L water bottles by A, B, C companies over the years (in lakh bottles)



1. The total production by company 'C' in 2020 and 2023 is what percentage of the production by company 'A' in 2020 and 2021?

A) $125\frac{7}{19}\%$ B) $126\frac{6}{19}\%$

C) $126\frac{7}{19}\%$ D) $125\frac{6}{19}\%$

E) None

2. Which company produced the average annual production maximum in the given period of six years?

A) A only B) C only

C) A and B D) B and C

E) C only

3. What is the difference between the average production by company A in 2019, 2021, 2023 and the average production by company C in 2020, 2022 and 2024 years?

A) $6\frac{2}{3}$ lakhs B) $7\frac{2}{3}$ lakhs

C) 8 lakhs D) $6\frac{1}{3}$ lakhs

E) None

4. What was the decline percentage in the production by company B in the year 2019 as compared to the production in the year 2024?

A) $28\frac{5}{7}\%$ B) $27\frac{4}{7}\%$

C) $28\frac{4}{7}\%$ D) $27\frac{5}{7}\%$

E) None

Direction (Qs. 5 - 9): *Read the following table & answer the given questions carefully.*

Following table shows the production of main crops in India. (in million tones)

Crops	2019-20	2020-21	2021-22	2022-23	2023- 24	2024-25
Rice	117.94	122.27	130.29	144.36	137.82	149.07
Wheat	107.18	109.52	106.84	151.24	113.29	117.50
Maize	29.98	31.51	33.62	30.68	37.67	42.28
Pulses	23.01	25.72	27.69	26.05	24.25	25.23
Sugarcane	358.14	399.25	411.48	468.78	453.15	450.16
Oil seeds	33.50	36.10	37.70	58.08	39.66	42.60

5. What is the difference between the average production of wheat and pulses in the given years?

A) 97.22 B) 92.27 C) 92.72

D) 92.57 E) 112.29

6. Production of oil seeds in 2023-24 was approximately what percentage of production of Rice in 2021-22?

A) 31.54% B) 34.40%

C) 34.04% D) 30.44%

E) 33.87%

7. In which of the following years, the total production of maize during the all years was equal to the 50% production of sugarcane.

A) 2021-22 B) 2024-25

C) 2020-21 D) 2020-23

E) None

8. What is the approximate decreased percentage in the production of maize in the year 2022 -23 as compared to the previous year production of maize?

A) 8.574% B) 8.754% C) 8.745%

D) 8.475% E) None

9. What is the approximate increase percentage in the production of sugarcane in the year 2024-25 as compared in the year 2019-20?

A) 25.69% B) 25.96%

C) 26.59% D) 26.95%

E) None

Scan the QR code for Key

These model questions were prepared by

Dr.Vangala Srinivas

Asst. Prof. of Mathematics.

(c) eenadu

'డిపోర్ట్ నౌ.. అపీల్ లేటర్' జాబితాలో భారత్



- మరో 22 దేశాలనూ చేర్చిన బ్రిటన్

లండన్: తమ దేశంలో నేరం చేసి శిక్ష పడ్డ విదేశీయులను స్వదేశానికి తిప్పి పంపేందుకు బ్రిటన్ అనుసరిస్తున్న 'డిపోర్ట్ నౌ, అపీల్ లేటర్' విధానంలోకి భారత్ కూడా చేరింది. ఈ విధానం ప్రకారం శిక్ష పడ్డ విదేశీ నేరస్థులను వారి అపీళ్లపై విచారణ ప్రారంభం కాకముందు స్వదేశానికి తరలిస్తారు. ఇందుకు ముందు ఈ విధానం. . ఐదు దేశాలకు బ్రిటన్ అమలు చేసింది. ఇప్పుడు ఈ సంఖ్యను 23కి పెంచింది. ఇందులో భారత్ కూడా ఉంది. గతంలో విదేశీ నేరగాళ్లకు తమ కోర్టులు శిక్షలు విధించినా, అపీళ్ల సాకుతో వారు నెలలు, ఏళ్లతరబడి బ్రిటన్‌లో ఉండిపోయేవారనీ, దానివల్ల ఎంతో ప్రజాధనం వ్యయమయ్యేదనీ, ఇక దీనికి తెరదించుతామని హోం మంత్రి యీవెట్ కూపర్ వివరించారు. విదేశీ ఖైదీల మానవ హక్కుల క్లెయిములను తమ ప్రభుత్వం నిరాకరిస్తే, వారు స్వదేశం నుంచి వీడియోగ్రఫీ ద్వారా అపీలు ప్రక్రియలో పాల్గొనవచ్చని తెలిపారు.

బ్రిటన్‌లో అక్రమంగా పనిచేస్తున్న ఐదుగురు భారతీయుల అరెస్టు

అనుమతులేవీ లేకుండా ద్విచక్ర వాహనాలపై సరుకుల అందజేత సిబ్బంది (డెలివరీ బాయ్స్)గా పనిచేస్తున్న వందలాది మందిని బ్రిటన్ అధికారులు అరెస్టు చేశారు. ఇందులో ఐదుగురు భారతీయులూ ఉన్నారు. గత నెల 20 నుంచి 27 వరకూ దేశవ్యాప్తంగా నిర్వహించిన దాడుల్లో అనుమతులు లేకుండా పనిచేస్తున్న 1,780 మందిని అడ్డుకున్నామని, అక్రమంగా పనిచేస్తున్న 280 మంది వలసదారులను, శరణార్థులను అరెస్టు చేశామని బ్రిటన్ హోం శాఖ కార్యాలయం ప్రకటించింది. ఈ దాడుల సందర్భంగా పశ్చిమ లండన్‌లోని హిల్లింగ్డన్‌లో ఏడుగురు భారతీయుల్ని అరెస్టు చేశామని, ఇందులో ఐదుగురు అనుమతులు లేకుండా పనిచేస్తున్నట్టు గుర్తించామని హోం శాఖ అధికారులు తెలిపారు. "అనుమతులు లేకుండా పనిచేసేవారి వల్ల మన దేశ సరిహద్దులకు ప్రమాదం. అందుకే అటువంటి వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటున్నాం" అని బ్రిటన్ సరిహద్దు భద్రత, శరణార్థుల మంత్రి యాంజెలా ఈగల్ అన్నారు. అక్రమ వలసల్ని కట్టడి చేసేందుకు బ్రిటన్ ప్రభుత్వం కఠినచర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా వివిధ కంపెనీలు నియమించుకునే సిబ్బంది పనిచేసేందుకు అనుమతి కలిగివున్నారా? లేదా? అన్నది పరిశీలించాలని కోరుతోంది.

ట్రంప్ చేతిలో వాషింగ్టన్ డీసీ పోలీస్ విభాగం

- నేషనల్ గార్డ్ బలగాలను మోహరిస్తానని ప్రకటన



వాషింగ్టన్: అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీ నగరంలో పోలీసు విభాగాన్ని ఇకపై తానే చేపడతానని, ఇందులో భాగంగా నగరంలో నేషనల్ గార్డ్ బలగాలను మోహరిస్తున్నానని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. నగరంలో నేరాలు తగ్గుముఖం పడుతున్నాయని మేయర్ చెబుతున్నా ట్రంప్ ఈ నిర్ణయాన్ని వెలువరించారు. వాషింగ్టన్ డీసీలో నేరాల పరిస్థితి ఇరాక్, బ్రెజిల్, కొలంబియా దేశాల రాజధానులతో పోల్చదగినట్టుగా ఉందని ట్రంప్ అన్నారు. ''ఇళ్లులేని వారు మన పార్కుల్లో తిష్టవేస్తున్నారు. వారిని తొలగించి మన పార్కుల అందాన్ని పునరుద్ధరిస్తున్నాం" అని ట్రంప్ విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. మురికివాడల్ని కూడా నిర్మూలిస్తున్నాం అని ఆయన అన్నారు. అమెరికా అటార్నీ జనరల్ పామ్ బొండి ఇకపై వాషింగ్టన్ మెట్రో పోలీస్ విభాగానికి నేతృత్వం వహిస్తారని ఆయన అన్నారు. అక్రమ చొరబాట్లపై కఠినంగా వ్యవహరించిన ట్రంప్ ఇప్పుడు చట్టాల అమలుపై పర్యవేక్షణను తన చేతుల్లోకి తీసుకోవాలన్న ఎజెండాపై పనిచేస్తున్నారు. డిస్ట్రిక్ట్ ఆఫ్ కొలంబియా హోమ్ రూల్ యాక్ట్‌లోని 740వ సెక్షన్ కింద తాను నేషనల్ గార్డ్ బలగాలను మోహరిస్తున్నట్టు ట్రంప్ వెల్లడించారు. రాజధాని నగరంలో నేషనల్ గార్డ్ బలగాలను మోహరించడానికి బదులు ట్రంప్ యంత్రాంగం ప్రాసిక్యూటర్లకు మరింతగా నిధుల కేటాయింపు జరపాలని, డీసీ సుపీరియర్ కోర్టులో ఉన్న 15 ఖాళీలను భర్తీ చేయాలని డెమొక్రటిక్ పార్టీకి చెందిన వాషింగ్టన్ నగర మేయర్ మురియల్ బౌసర్ అన్నారు. నగరంలో నేరాల పరిస్థితి యుద్ధ పీడిత నగరాలకు సమానంగా ఉందంటూ ట్రంప్ చేసిన ఆరోపణను ఆమె తోసిపుచ్చారు.

భారత్‌పై ఆంక్షలు..

రష్యాకు పెద్ద దెబ్బ: ట్రంప్

వాషింగ్టన్: భారత్‌పై తాము విధించిన టారిఫ్‌ల భారం.. రష్యాకు పెద్ద దెబ్బ అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. సోమవారం శ్వేతసౌధంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రష్యా ఆర్థిక వ్యవస్థ పెద్ద బాగోలేదని, అక్కడి నుంచి భారీగా చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై వేసిన సుంకాలు రష్యాని మరింత దెబ్బతీశాయని చెప్పారు. "రష్యా తమ దేశాన్ని తిరిగి నిర్మించుకోవాల్సి వస్తుంది. అది చాలా పెద్దదేశం. రాణించడానికి అనేక అవకాశాలున్నాయి. ప్రస్తుతం మాత్రం అది మా నిర్ణయంతో ఎంతో ప్రభావితం కానుంది. వారివద్ద నుంచి అత్యధికంగా చమురు కొనే దేశం (భారత్)పై 50% టారిఫ్ వేస్తామని నేను చెప్పాను. అది వారికి శరాఘాతం. రష్యా అధ్యక్షుడు పుతిన్ అమెరికా పర్యటనకు రానుండటం ఎంతో గౌరవప్రదంగా భావిస్తున్నా. నిర్మాణాత్మక సంప్రదింపులు జరుగుతాయని అనుకుంటున్నా. ఆ సమావేశం తర్వాత ఐరోపా నాయకులతోనూ మాట్లాడతా. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, పుతిన్ మధ్య సమావేశం జరగవచ్చు. ఆ ఇద్దరూ చర్చించుకునే వేదిక ఉండాలని నేను భావిస్తున్నాను. వారు అవసరమనుకుంటే నేను కూడా చర్చలో పాల్గొంటాను. భారత్-పాక్ ఘర్షణతో సహా ఐదు యుద్ధాలను నేను ఆపగలిగాను. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో మంచి సంబంధాలున్నాయి" అని ట్రంప్ వివరించారు.

చైనాపై సుంకాల విధింపు నిర్ణయం తీసుకోలేదు: జేడీ వాన్స్



న్యూయార్క్: రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న చైనాపై ప్రతీకార సుంకాలు విధించాలా? వద్దా? అన్న అంశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సోమవారం వెల్లడించారు. సుంకాల విషయంలో చైనా సమస్య కొంచెం సంక్లిష్టంగా ఉంటుందన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలుతో ముడి పెట్టలేని అనేక ఇతర అంశాలు అమెరికా-చైనా సంబంధాలను ప్రభావితం చేస్తాయని ఆయన తెలిపారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై ట్రంప్ అదనపు సుంకాలతో విరుచుకుపడ్డారు. చైనా కూడా రష్యా నుంచి భారీగా చమురు దిగుమతి చేసుకుంటోంది. మరి చైనాపై ప్రతీకార సుంకాలు విధిస్తారా? లేదా? అన్న ప్రశ్నకు వాన్స్ ఈ విధంగా స్పందించారు.

నేను రాహుల్, తేజస్వీలాంటివాడిని కాను

- రెండు ఓటరు కార్డులపై ఈసీకి బదులిస్తా
- బిహార్ ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హా



పట్నా: మన రాజ్యాంగం, రాజ్యాంగ వ్యవస్థలను ఎంతో గౌరవిస్తానని బిహార్ ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హా సోమవారం స్పష్టం చేశారు. ఈ క్రమంలో తనకు రెండు ఓటరు కార్డులు ఉన్న అంశంపై ఎన్నికల సంఘం జారీ చేసిన నోటీసుకు వివరణ ఇస్తానని ప్రకటించారు. తాను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఆర్జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ లాంటి వాడిని కానని తెలిపారు. మొదట్లో పట్నాలోని బాంకీపుర్ నియోజకవర్గంలో తాను ఓటు రిజిస్టర్ చేసుకున్నానని, గతేడాది లఖీసరాయ్‌లో ఓటు నమోదు చేసుకున్నానని విజయ్ కుమార్ తెలిపారు. అలాగే పట్నా పరిధిలో తన పేరును ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని కూడా అధికారులకు విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. అయితే తన వినతి పరిష్కారమవ్వలేదన్నారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్, ఆర్జేడీ విమర్శలు గుప్పించాయి. ఈ క్రమంలో ఈ నెల 14లోగా రెండు ఓటరు కార్డులను కలిగి ఉండటంపై వివరణ ఇవ్వాలంటూ విజయ్ కుమార్ సిన్హాకు ఆదివారం ఈసీ నోటీసు జారీ చేసింది.

బిహార్ ఓటరు జాబితా కోసం ఎవరూ సంప్రదించలేదు

- ఎన్నికల కమిషన్ వెల్లడి

దిల్లీ: బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ కార్యక్రమాన్ని (ఎస్ఐఆర్) నిరసిస్తూ ప్రతిపక్ష పార్టీలు ఆందోళనలు చేసిన క్రమంలో ఎన్నికల సంఘం (ఈసీ) సోమవారం కీలక ప్రకటన చేసింది. బిహార్ ఓటర్ల జాబితాలో పేర్ల చేర్పులు, తొలగింపులతో కూడిన ముసాయిదా జాబితా కోసం ఈ నెల 1 నుంచి 11 వరకూ ఏ ఒక్క పార్టీ తమను సంప్రదించలేదని (ఈసీ) వెల్లడించింది. ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు వ్యక్తం చేసేందుకు ప్రజలు, పార్టీలకు సెప్టెంబరు 1వ తేదీ వరకూ దానిని అందుబాటులో ఉంచుతున్నామని తెలిపింది.

ఓటర్ల జాబితాలపై సందేహాలను తీర్చాల్సిందే

- బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి డిమాండ్



లఖ్‌నవూ: ఓటర్ల జాబితాలు, వాటి సవరణ, ఈవీఎంలు వంటి వాటికి సంబంధించిన సందేహాలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి సోమవారం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె 'ఎక్స్'లో పేర్కొన్నారు. సోమవారం నుంచి ఉత్తర్‌ప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో ఆమె స్పందన ప్రాధాన్యం సంతరించుకుంది. మనదేశంపై అమెరికా విధించిన సుంకాల అంశంపైనా పార్లమెంటు ప్రస్తుత సమావేశాల్లో చర్చించాలని ఆమె సూచించారు.

బ్రిటన్, ఫ్రాన్స్ బాటలో ఆస్ట్రేలియా

- పాలస్తీనాను దేశంగా గుర్తిస్తామని ప్రధాని అల్బనీస్ ప్రకటన

వెల్లింగ్టన్: ఫ్రాన్స్, బ్రిటన్, కెనడా బాటలో ఆస్ట్రేలియా కూడా పాలస్తీనాను దేశంగా గుర్తించాలని నిర్ణయించింది. గాజాలో మానవతా సంక్షోభం నేపథ్యంలో పాలస్తీనాను గుర్తించాలని క్యాబినెట్‌తో పాటు.. ప్రభుత్వంలోని కీలక అధికారుల నుంచి కూడా ఒత్తిడి రావడంతో ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోని అల్బనీస్.. సెప్టెంబరులో జరిగే ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో పాలస్తీనాను దేశంగా గుర్తించాలన్న నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అయితే పాలస్తీనా ప్రభుత్వంలో హమాస్‌కు ఎలాంటి పాత్ర ఉండకూడదని అన్నారు. పశ్చిమాసియాలో ఘర్షణకు ముగింపు పలకాలంటే ద్విదేశ పరిష్కారమే మార్గమని అల్బనీస్ పేర్కొన్నారు.

ఇజ్రాయెల్ దాడిలో ఐదుగురు జర్నలిస్టుల మృతి

జెరూసలెం: గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడులు కొనసాగుతున్నాయి. అల్ జజీరా జర్నలిస్టును లక్ష్యంగా ఆదివారం ఐడీఎఫ్ నిర్వహించిన దాడిలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇందులో ఐదుగురు జర్నలిస్టులు ఉన్నారు. అల్ జజీరాకు చెందిన అనస్ అల్ షరీఫ్‌ను లక్ష్యంగా చేసుకొని దాడి చేశామని ఇజ్రాయెల్ పేర్కొంది. షరీఫ్ గతంలో హమాస్‌కు పనిచేశారని పేర్కొంది. అందుకు ఆధారాలను చూపలేదు. దాడిలో షరీఫ్‌తో పాటు మరో పాత్రికేయుడు, ముగ్గురు కెమెరా సిబ్బంది చనిపోయారు.

చిచ్చురేపిన శాంతికపోతం

- దాదర్‌లో కబూతర్‌ఖానా మరోసారి మూసివేత
- భగ్గుమంటున్న పావురాల ప్రేమికులు



ముంబయి: శాంతికి ప్రతీకగా భావించే కపోతాల చుట్టూ ముంబయిలో రగడ జరుగుతోంది. సుప్రీం కోర్టు మెట్లు ఎక్కేదాకా ఈ వివాదం ముదిరింది. ఇక్కడి దాదర్ ప్రాంతంలో కబూతర్‌ఖానా(పావురాలకు దాణా పెట్టే కేంద్రం)ను మూసివేయడానికి బృహన్ ముంబయి కార్పొరేషన్(బీఎంసీ) మరోసారి చర్యలు చేపట్టింది. ఆదివారం దాన్ని ప్లాస్టిక్ షీట్లతో కప్పివేసింది. ప్రజలెవరూ అక్కడ పావురాలకు ఆహారం పెట్టకుండా భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేసింది. దీనిపై పావురాల ప్రేమికులతో పాటు కొందరు జైన మతస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కోర్టులో సవాళ్లు

పావురాల కారణంగా స్థానికులకు శ్వాసకోశ వ్యాధులు వచ్చే ముప్పు ఉందన్న కారణంతో కబూతర్‌ఖానాను మూసివేస్తున్నట్లు బీఎంసీ అధికారులు ఇటీవల ప్రకటించారు. కబూతర్‌ఖానాపై టార్పాలిన్ కప్పారు. దీన్ని తీవ్రంగా వ్యతిరేకించిన పావురాల ప్రేమికులు ఈ నెల 6న టార్పాలిన్‌ను తొలగించారు. కబూతర్‌ఖానాల మూసివేతకు వ్యతిరేకంగా కొందరు బాంబే హైకోర్టును ఆశ్రయించగా, వారి అభ్యర్థనలను ధర్మాసనం తిరస్కరించింది. ప్రజల ఆరోగ్య సంరక్షణే పరమావధి అని స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే పావురాలకు ఆహారం అందించిన కొందరిపై పోలీసులు కేసు నమోదు చేయడం నిరసనకారులను మరింత ఆగ్రహానికి గురి చేసింది. దీన్ని అడ్డుకోవాలంటూ వారు సుప్రీంకోర్టు తలుపు తట్టగా, వారి పిటిషన్లను ధర్మాసనం సోమవారం కొట్టివేసింది. కబూతర్‌ఖానాల మూసివేతకు వ్యతిరేకంగా ఈనెల 13 నుంచి నిరాహారదీక్షలు చేపడతామని జైన సన్యాసి నీలేశ్‌చంద్ర విజయ్ హెచ్చరించారు. "పావురాలకు ఆహారం వేయడం జైన సంప్రదాయం. ఈ మత విశ్వాసానికి విఘాతం కలిగించే చర్యలను అడ్డుకొంటాం" అని ఆయన స్పష్టం చేశారు.

అమెరికాలో అగ్నిప్రమాదం


- ఆరుగురి మృతి..
- వారిలో నలుగురు చిన్నారులు

వాల్డోర్ఫ్: అమెరికాలోని మేరీల్యాండ్ చార్ల్స్ కౌంటీలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. వాల్డోర్ఫ్‌లోని ఓ ఇంట్లో పొగలు అలుముకొని భారీ మంటలు ఉవ్వెత్తున ఎగసిపడడంతో నలుగురు చిన్నారులు, మరో ఇద్దరు వ్యక్తులు మృత్యువాతపడ్డారు. ఒకరు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటన ఆదివారం ఉదయం 8:40 గంటల సమయంలో జరిగింది. సహాయక చర్యలు చేపట్టిన అగ్నిమాపక సిబ్బంది కూడా మంటలు అంటుకున్నాయి. దీంతో గాయపడిన వారిని స్థానిక ఆసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

ప్రపంచంలోనే తొలి రోబో మాల్

ఇంటర్నెట్ డెస్క్: రోబోల పరిశోధన, తయారీలో గ్లోబల్ లీడర్‌గా మారిన చైనాలో అతి పెద్ద రోబో మాల్ ఏర్పాటైంది. మ్యూజిక్‌తోపాటు ఇంటి పనులు, తదితరాలకు సహకరించే వందల రకాల రోబోలను అక్కడ అమ్మడమే కాదు వాటికి సంబంధించిన అన్ని సర్వీసులూ అందుబాటులో ఉంచారు.

తలాక్‌పై సుప్రీం తుది విచారణ నవంబరులో..



దిల్లీ: తలాక్ ఏ హసన్‌తోపాటు కోర్టుల వెలుపల ఏకపక్షంగా విడాకులు ఇచ్చే పద్ధతిని రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ దాఖలైన పలు పిటిషన్లపై నవంబరు 19, 20 తేదీలలో తుది విచారణ జరుపుతామని సుప్రీంకోర్టు సోమవారం ప్రకటించింది. నెలకు ఒకసారి చొప్పున వరుసగా మూడు నెలలు భర్త భార్యకు మూడుసార్లు తలాక్ చెబితే ఆమెకు విడాకులు ఇచ్చినట్లేనని ఇస్లామిక్ సంప్రదాయం తలాక్ ఏ హసన్ పేర్కొంటోంది. ఇది రాజ్యాంగవిరుద్ధమంటూ గాజియాబాద్‌కు చెందిన బెనజీర్ హీనా అనే మహిళ వేసిన పిటిషన్‌తోపాటు మొత్తం 9 వ్యాజ్యాలను సుప్రీం విచారిస్తోంది. లింగ, మత భేదం లేకుండా పౌరులందరికీ ఒకే విధమైన విడాకుల పద్ధతి వర్తింపజేయాలని కేంద్రాన్ని కోర్టు ఆదేశించాలని పిటిషనర్లు కోరారు. ఈ వ్యవహారంపై కేంద్రంతోపాటు జాతీయ మహిళా కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్, జాతీయ బాలల హక్కుల రక్షణ కమిషన్ అభిప్రాయాలను కూడా సుప్రీంకోర్టు కోరింది. గతంలో ముమ్మారు తలాక్ కేసులోనే కోర్టు వెలుపల ఏకపక్షంగా విడాకులిచ్చే పద్ధతులను వ్యతిరేకిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపిందని కేంద్ర న్యాయవాది అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ వివరించారు.

సమస్య చట్టంలో లేదు దుర్వినియోగంలోనే...

- ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం బఘేల్ అభ్యర్థనను తిరస్కరిస్తూ సుప్రీంకోర్టు వ్యాఖ్య

దిల్లీ: నగదు అక్రమ చలామణి నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద నమోదయ్యే కేసుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కు ఉన్న అనుబంధ అభియోగపత్రం దాఖలు అధికారాన్ని సవాల్ చేసిన ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేశ్ బఘేల్ పిటిషన్ సుప్రీంకోర్టులో తిరస్కరణకు గురయ్యింది. దయ్యం చట్టంలో లేదని, ఇబ్బంది అంతా దుర్వినియోగంతోనేనని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ ధర్మాసనం ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. పీఎంఎల్ఏ చట్టంలోని సెక్షన్ 44 రాజ్యాంగ చెల్లుబాటును పరిశీలించాలన్న బఘేల్ అభ్యర్థనను తోసిపుచ్చింది. సుప్రీంకోర్టు తీర్పు-2022లో సూచించిన విధానాలను ఈడీ అధికారులు అనుసరించడంలేదని భావిస్తే పిటిషనర్ ఛత్తీస్‌గఢ్ హైకోర్టును ఆశ్రయించవచ్చని పేర్కొంది.

పరువు నష్టం కేసులో మేధా పాట్కర్‌కు సుప్రీంలో దక్కని ఊరట

నర్మదా బచావో ఆందోళన్ ఉద్యమ నాయకురాలు మేధా పాట్కర్(70)కు సుప్రీంకోర్టులో ఊరట దక్కలేదు. పరువు నష్టం కేసులో జులై 29న దిల్లీ హైకోర్టు ఆమెను దోషిగా నిర్ధారిస్తూ ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోబోమని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. అయితే ఆమెకు విధించిన రూ.లక్ష జరిమానాను రద్దు చేసింది. ప్రస్తుత దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా 2001లో మేధాపై వేసిన పరువు నష్టం కేసులో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ నిరుడు మే నెలలో ఆమెను దోషిగా నిర్ధారిస్తూ మూడు నెలల జైలు, రూ.లక్ష జరిమానా విధించారు. ఆ తర్వాత ఈ ఏడాది ఏప్రిల్‌లో సెషన్స్ కోర్టు మేధాను దోషిగా నిర్ధారిస్తూనే జైలు శిక్షను కొట్టివేసి ప్రొబేషన్‌పై విడుదల చేయాలని ఆదేశించింది. ఈ తీర్పును దిల్లీ హైకోర్టు సమర్థించింది.

18 నిమిషాల్లో 10 కిలోల బంగారం చోరీ

ఇంటర్నెట్ డెస్క్: మధ్యప్రదేశ్‌లో భారీ చోరీ జరిగింది. ఓ బ్యాంకులోకి చొరబడిన దుండగులు.. 10 కిలోల బంగారం, రూ.5 లక్షల నగదుతో పరారయ్యారు. జబల్‌పుర్ జిల్లా ఖితోలాలోని ఈఎస్ఏఎఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులోకి సోమవారం ఐదుగురు గుర్తుతెలియని వ్యక్తులు హెల్మెట్లు ధరించి ప్రవేశించారు. అక్కడున్న సిబ్బందిని బెదిరించి.. దాదాపు రూ.10 కోట్ల విలువ చేసే 10 కిలోల బంగారం, రూ.5 లక్షల నగదుతో ఉడాయించారు.

షేర్ల వ్యాపారి ఇళ్లలో ఈడీ సోదాలు.. లగ్జరీ కార్లు, రూ 1.5 కోట్ల వాచీలు స్వాధీనం

దిల్లీ: తండ్రీ కుమారులిద్దరు నిందితులుగా ఉన్న ఒక విదేశీ మారక కేసుకు సంబంధించి ముంబయి, అహ్మదాబాద్‌లలో నిర్వహించిన తాజా సోదాల పర్యవసానంగా నాలుగు లగ్జరీ కార్లు, రూ 1.5 కోట్లు విలువ చేసే ఇంపోర్టెడ్ వాచీలు, రూ 15 లక్షలు నగదు జప్తు చేసినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోమవారం వెల్లడించింది. మహేంద్ర షా, ఆయన కుమారుడు మేఘ్ షాల నివాసాలపై గత గురు, శుక్రవారాల్లో నిర్వహించిన దాడుల్లో ఈ వస్తువులు స్వాధీనం చేసుకున్నట్టు ఈడీ ఒక ప్రకటనలో పేర్కొంది. మహేంద్ర షా ముంబయికి చెందిన షేర్ల వ్యాపారి. ఇటీవల నిందితుల నుంచి సుమారు 88 కేజీల విదేశీ బంగారం పట్టుబడిన నేపథ్యంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ), గుజరాత్ యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్‌లు వారిపై కేసు నమోదు చేశాయి. ఆ కేసును పరిగణనలోకి తీసుకుంటూ ఈడీ వారిపై విదేశీ మారక నిర్వహణ చట్టం (ఫెమా) కింద కేసు నమోదు చేసింది.

కాల్పుల్లో గాయపడిన కొలంబియా అధ్యక్ష అభ్యర్థి మృతి

ఇంటర్నెట్ డెస్క్: కొలంబియా సెనేటర్, అధ్యక్ష అభ్యర్థి మిగ్యుల్ ఉరిబ్ టర్బే (39) మరణించినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన సోమవారం తుదిశ్వాస విడిచారు. జూన్‌లో మిగ్యుల్ ప్రచార కార్యక్రమంలో ప్రసంగిస్తుండగా.. ఓ దుండగుడు ఆయన వెనక నుంచి తలపై కాల్పులు జరిపాడు. అధికారులు ఆయనను ఆస్పత్రికి తరలించారు. ఈ కేసులో 15 ఏళ్ల నిందితుడు సహా ఐదుగురు అనుమానితులను కొలంబియా పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనను మిగ్యుల్ పార్టీ కన్జర్వేటివ్ డెమోక్రటిక్ తీవ్రంగా ఖండించింది. వచ్చే ఏడాది కొలంబియాలో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ప్రతిపక్ష కన్జర్వేటివ్ డెమోక్రటిక్ పార్టీ నుంచి మిగ్యుల్ పోటీకి దిగారు.

బీఎస్ఎఫ్ కాల్పుల్లో పాక్ చొరబాటుదారుడి హతం

జమ్ము: జమ్మూకశ్మీర్‌లోని కటువా జిల్లాలో అంతర్జాతీయ సరిహద్దు దాటి భారత్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించిన ఓ పాకిస్థాన్ చొరబాటుదారుడిని భద్రతా దళాలు సోమవారం హతమార్చాయి. హరినగర్ సెక్టార్‌లో కొంత మంది వ్యక్తులు భారత్‌లోకి అడుగుపెట్టేందుకు ప్రయత్నించారు. దీంతో బీఎస్ఎఫ్ సిబ్బంది హెచ్చరికలు జారీ చేశారు. అయినా ఖాతరు చేయకుండా చొరబడటానికి వారు ప్రయత్నించడంతో కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఒకరికి గాయాలయ్యాయి. ఆ వ్యక్తిని అరెస్టు చేసి ఆసుపత్రిలో చేర్చారు. కానీ గాయాలతో చనిపోయాడు.

మట్టిచరియలు విరిగిపడి పీవోకేలో 9 మంది మృతి

- కాలువను పునరుద్ధరిస్తుండగా విషాదం

పెషావర్: పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)లో విషాదం చోటుచేసుకుంది. గిల్గిత్ ప్రాంతంలోని డానియర్ నుల్లాలో వరదలకు దెబ్బతిన్న నీటి కాలువను పునరుద్ధరిస్తుండగా.. మట్టిచరియలు విరిగిపడి 9 మంది సిబ్బంది మృతి చెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకున్నట్లు అధికారులు సోమవారం తెలిపారు. మట్టిదిబ్బల కింద మరికొందరు చిక్కుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. మరోవైపు గత శుక్రవారం పాక్ ఆక్రమిత కశ్మీర్ పరిధిలోని మంచు సరస్సు కరిగి ఆకస్మిక వరదలు వచ్చాయి. దాంతో పాకిస్థాన్‌ను చైనాతో కలిపే కారకోరం రహదారి కొంతమేర కొట్టుకుపోయింది. ఆ ప్రాంతంలో ఉండే సాగు, తాగునీటి కాలువలు, రక్షణ గోడలు, పంట పొలాలు దెబ్బతినడంతో పాటు 50కు పైగా నివాసాలు ప్రమాదంలో పడ్డాయి.

ఇద్దరిపై చర్యతో సరిపుచ్చిన మమత సర్కారు

- ఐదుగురిపై చర్య కోరిన ఈసీ

కోల్‌కతా: ఓటరు జాబితాల తయారీలో అక్రమాలకు పాల్పడుతున్నట్టుగా గుర్తించిన ఐదుగురు అధికారుల్లో ఇద్దరిని ఎన్నికల బాధ్యతల నుంచి తప్పించామని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఎన్నికల సంఘాని(ఈసీ)కి తెలియజేసింది. అయితే వారిని ఎన్నికల సంఘం కోరినట్టుగా ఉద్యోగం నుంచి సస్పెండ్ చేయలేదని వెల్లడించింది. నిత్యం ప్రతిభ, నిజాయితీ కనబరిచే రాష్ట్ర ప్రభుత్వ అధికారులపై క్రమశిక్షణ చర్యలు చేపట్టడం సరికాదని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ పంత్ ఈసీకి రాసిన లేఖలో తెలిపారు. అయితే అక్రమాలకు పాల్పడినట్టుగా ఎన్నికల సంఘం గుర్తించిన మిగతా ముగ్గురి గురించి ఆ లేఖలో ప్రస్తావించలేదు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఈసీ పట్ల ధిక్కార ధోరణి ప్రదర్శిస్తోందని భాజపా ఆరోపించింది.

పిల్లికి నివాస ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు

ఇంటర్నెట్ డెస్క్: బిహార్ రోహ్‌తాస్‌లో వింత ఘటన జరిగింది. ఓ పిల్లి పేరిట నివాస ధ్రువీకరణ పత్రం కావాలంటూ చేసిన దరఖాస్తు వెలుగులోకి వచ్చింది. క్యాట్ కుమార్ పేరిట దరఖాస్తు చేయగా. . తండ్రి పేరు కటీ బాస్, తల్లి పేరు కటియా దేవిగా నమోదు చేశారు. ఓ పిల్లి ఫొటో దరఖాస్తులో అప్‌లోడ్ చేశారు. అయితే ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన రోహ్‌తాస్ జిల్లా కలెక్టర్ ఉదితా సింగ్ కఠిన చర్యలకు ఆదేశించారు. దీనిపై ఇప్పటికే కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నస్రిగంజ్ ఆర్టీపీఎస్ కార్యాలయానికి పిల్లి పేరిట ఈ దరఖాస్తు వచ్చింది. అయితే ఇందులో పేరుతో పాటు చిరునామా తప్పుగానే ఇచ్చారని అధికారులు చెబుతున్నారు. కేవలం ప్రభుత్వ సంస్థలను అప్రతిష్ఠ పాలుచేయడానికే ఇలాంటి చర్యలకు కొందరు పాల్పడుతున్నారని అధికారులు అంటున్నారు.

పిట్టలు రాలిపోతున్నాయ్!

- ఉష్ణప్రాంత పక్షులకు వాతావరణ మార్పుల దెబ్బ

దిల్లీ: వాతావరణ మార్పుల వల్ల చోటుచేసుకుంటున్న తీవ్ర ఉష్ణోగ్రతల వల్ల పక్షులపై పెను ప్రభావం పడుతోందని తాజా అధ్యయనం తేల్చింది. ఫలితంగా 1950 నుంచి ఉష్ణప్రాంత పక్షుల సంఖ్య సరాసరిన 25-38 శాతం మేర తగ్గినట్లు పేర్కొంది. భూ వినియోగంలో మార్పు వంటి మానవ ప్రత్యక్ష చర్యల ప్రమేయం లేకున్నా ఇలా జరిగినట్లు పరిశోధకులు తెలిపారు. ఉష్ణమండల ప్రాంతాల్లో జీవవైవిధ్యం ఎక్కువ. భూమి మీదున్న పక్షి జాతుల్లో దాదాపు సగం మేర అక్కడే ఉంటాయి. అయితే వీటిలో అనేక జాతులు.. అవి భరించలేని స్థాయి ఉష్ణోగ్రతలకు చేరువలో ఉన్న వాతావరణ పరిస్థితుల్లో నివసిస్తున్నాయి. 1950 నుంచి 2020 మధ్యకాలంలో 3వేలకుపైగా పక్షిజాతుల సంఖ్యను పరిశీలించిన స్పెయిన్ పరిశోధకులు.. విహంగాలకు జరిగిన నష్టాన్ని గుర్తించారు.

మోదీ ప్రశంసించిన వారిని 'ఎట్ హోమ్'కు పిలవండి

- రాష్ట్రాలకు కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు

దిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లు రాజ్‌భవన్‌లో నిర్వహించే 'ఎట్ హోమ్' కార్యక్రమానికి 'మన్ కీ బాత్‌'లో ప్రధాని మోదీ ప్రశంసించిన దివ్యాంగులు, పర్యావరణ యోధులను ఆహ్వానించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర/కేంద్రపాలిత ప్రభుత్వాలకు కేంద్ర హోంశాఖ నుంచి ఉత్తర్వులు వెళ్లాయి. దివ్యాంగులు, అమరుల కుటుంబసభ్యులు, ముఖ్యమైన క్రీడా టోర్నీల్లో విజేతలు, అద్భుతమైన విద్యావేత్తలు, ఆరోగ్యసిబ్బంది తదితరులను కూడా ఈ కార్యక్రమానికి ఆహ్వానించాల్సిందిగా ఉత్తర్వుల్లో హోంశాఖ పేర్కొంది. రాష్ట్రపతి కూడా ఇలాంటి కార్యక్రమాన్ని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహిస్తారు. ఇందులో ప్రధాని, కేంద్ర మంత్రులు, దౌత్యవేత్తలు, సీనియర్ సైన్యాధికారులు, ఇతర ప్రముఖులు పాల్గొంటారు.



ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా పార్లమెంటు ఆవరణలో నిర్వహించిన ఆందోళనలో పాల్గొన్న కాంగ్రెస్ ముఖ్య నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ, ఇండియా కూటమి ఎంపీలు

భారత సరిహద్దుకు సమీపంలో చైనా రైల్వే లైను

బీజింగ్: జిన్‌జియాంగ్ రాష్ట్రాన్ని టిబెట్‌తో కలిపే రైల్వే అనుసంధాన ప్రాజెక్టుకు చైనా శ్రీకారం చుట్టనుంది. ఈ రైల్వేలైను భారత సరిహద్దు వెంబడి వాస్తవాధీన రేఖకు అతి సమీపంలో నిర్మించనున్నారని చైనా మీడియా వెల్లడించింది. ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠాత్మక రైల్వే నిర్మాణాల్లో ఒకటైన ఈ ప్రాజెక్టు పనులు ఈ సంవత్సరం ప్రారంభమయ్యే అవకాశం ఉందని 'సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్' పత్రిక వెల్లడించింది. చైనా ప్రభుత్వ రైల్వే సంస్థకు అనుబంధంగా ఏర్పాటైన జిన్‌జియాంగ్ - టిబెట్ రైల్వే కంపెనీ ప్రాజెక్టు పనులు చేపట్టనుంది. ఈ ప్రాజెక్టు కింద టిబెట్ రాజధాని లాసా చుట్టూ 2035 నాటికి 5 వేల కిలోమీటర్ల రైల్ ఫ్రేమ్‌వర్క్ నిర్మించనున్నారు. ఈ పనుల్లో కొంత భాగం భారత చైనాల మధ్య ఏర్పాటైన వాస్తవాధీన రేఖకు అతి సమీపంలో జరగనున్నాయి అని పత్రిక తెలియజేసింది.

(c) eenadu

ర్యాగింగ్ వ్యతిరేక కార్యక్రమాలతో వైద్య విద్యార్థుల్లో చైతన్యం



మంత్రి సత్యకుమార్ యాదవ్

ఈనాడు, అమరావతి: వైద్య కళాశాలల్లో ర్యాగింగ్ కట్టడి దిశగా విద్యార్థుల్లో చైతన్యం తేవాలని వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. ఎన్ఎంసీ మార్గదర్శకాల ప్రకారం మంగళవారం నుంచి ఈ నెల 18 వరకు ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని వైద్యకళాశాలల్లో యాంటీ ర్యాగింగ్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ర్యాగింగ్ సంస్కృతి తప్పు అని చెప్పేలా నినాదాలు, వ్యాసరచన, ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించాలన్నారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేయాలని సూచించారు. సహచర విద్యార్థులతో అనుచితంగా ప్రవర్తించి ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విదేశీ విద్యా నిధి పథకానికి రూ.8.75 కోట్లు

ఈనాడు, అమరావతి: అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం బకాయిల చెల్లింపునకు ప్రభుత్వం రూ.8.75 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

పులిచింతల నిర్వహణ పనులకు రూ.2.76 కోట్లు

ఈనాడు, అమరావతి: పులిచింతల ప్రాజెక్టు నిర్వహణ పనులకు రూ.2.76 కోట్లు ఖర్చు చేసేందుకు పాలనామోదం ఇస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కుడిగట్టు స్పిల్‌వే గ్యాలరీలో అవసరమైన పనులతో పాటు, సీపేజీ నీటిని బయటకు పంపేందుకు పైపులు, గేట్లు ఎత్తేచోట ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయనున్నారు.

పరిశ్రమల్లో పార్కింగ్ స్థలం 10 శాతానికి తగ్గింపు

ఈనాడు, అమరావతి: పరిశ్రమల్లో పార్కింగ్ కోసం విడిచిపెట్టాల్సిన 20% స్థలాన్ని 10% తగ్గిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏపీఐఐసీ లేఅవుట్లలోనూ తగ్గించిన 10% స్థలాన్ని అందులోని పరిశ్రమల వారందరికీ ఉపయోగపడేలా 'కామన్ పూల్ పార్కింగ్'గా పరిగణించాలని నిర్ణయించింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రయోజనం చేకూరనుంది.

తెగుళ్ల ఉద్ధృతి నమోదు బాధ్యత ఏవోలదే

వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు

ఈనాడు, అమరావతి: వ్యవసాయాధికారులు వారంలో ఒకరోజు పంటల్లో తెగుళ్ల ఉద్ధృతి అధికంగా ఉన్న ప్రాంతాల్లో పర్యటించి, ఆ వివరాలను యాప్‌లో నమోదు చేయాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు సూచించారు. ఈ-పంట, డిజిటల్ అసిస్టెంట్లపై సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో సమీక్షించారు. 'ఇప్పటి వరకు 4,41,167 ఎకరాల్లో 1,65,843 మంది రైతులకు సంబంధించి పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేశాం. బహువార్షిక ఉద్యాన పంటలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి' అని వెల్లడించారు. ఉద్యాన పంటల నమోదు సమయంలో పంటల రకాలను పేర్కొనాలని ఆ శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు వివరించారు.

ఆర్అండ్‌బీ ఈఎన్‌సీగా వివేకానందరెడ్డి

ఈనాడు, అమరావతి: రహదారులు భవనాల శాఖ చీఫ్ ఇంజినీర్ (సీఈ) ఎంవీఆర్ వివేకానందరెడ్డిని ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ)గా నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వు జారీ చేసింది. ఈ శాఖలో రెండు ఈఎన్‌సీ పోస్టులుంటాయి. ఇటీవల నయీముల్లా పదవీ విరమణ చేయడంతో ఒక పోస్టు ఖాళీ అయింది. ఆ స్థానంలో వివేకానందరెడ్డిని ఈఎన్‌సీగా నియమించారు. ఈయన రాష్ట్రంలో రోడ్ల విభాగాన్ని పర్యవేక్షిస్తారు. మరో ఈఎన్‌సీ రామచంద్ర పరిపాలనతో పాటు జాతీయ రహదారుల విభాగాన్ని చూస్తున్నారు.

డిగ్రీ అధ్యాపకుల నిరసనలు

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల ఐకాస ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కళాశాలల్లోనూ భోజన విరామ సమయంలో అధ్యాపకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలిపారు. అధ్యాపకులకు వెంటనే బదిలీలు చేపట్టాలని, హోదాలో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు.

ఎల్‌బీఎస్ఎన్ఏఏ డైరెక్టర్ శ్రీరాం తరణికంటికి సెక్రెటరీ హోదా

ఈనాడు, దిల్లీ: ఐఏఎస్‌కి ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ ఇచ్చే లాల్‌బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ (ఎల్‌బీఎస్ఎన్ఏఏ) డైరెక్టర్‌గా పని చేస్తున్న 1992వ బ్యాచ్ త్రిపుర క్యాడర్ తెలుగు ఐఏఎస్ అధికారి శ్రీరాం తరణికంటి సెక్రెటరీ స్థాయికి పదోన్నతి పొందారు. ప్రస్తుతం అదనపు కార్యదర్శి స్థాయిలో ఉన్న ఆయనను ప్రస్తుతం ఉన్నచోటే కొనసాగిస్తూ సెక్రెటరీ హోదా కల్పిస్తున్నట్లు కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాలశాఖ సోమవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈయన స్వరాష్ట్రం తెలంగాణ. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రాథమిక విద్యాభ్యాసం, మద్రాస్ ఐఐటీలో ఇంజినీరింగ్ చేశారు. ఇదివరకు హైదరాబాద్‌లోని ఎన్ఐఆర్‌డీ రిజిస్ట్రార్‌గా, సింగరేణి కాలరీస్ డైరెక్టర్‌గా, ఐఆర్‌డీఏఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఫైనాన్షియల్ అడ్వయిజర్‌గా పనిచేశారు.

ఐదు ముఖ్యమైన అంశాలపై నివేదిక ఇవ్వండి

కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి టీవీ సోమనాథన్

ఈనాడు, అమరావతి: త్వరలో జరగనున్న ఐదో జాతీయ ప్రధాన కార్యదర్శుల సమావేశ ఏర్పాట్లు, కొన్ని చట్టాల డీ రెగ్యులేషన్ అంశాలపై పలు రాష్ట్రాల సీఎస్‌లు, కేంద్ర పాలిత ప్రాంతాల అడ్మినిస్ట్రేటర్లతో కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి టీవీ సోమనాథన్ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి రాష్ట్రం నుంచి ఐదు ముఖ్యమైన అంశాలపై నివేదిక సమర్పించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పాల్గొన్నారు.

హంద్రీనీవాతో భూగర్భ జలానికి ఎంత మేలు?

- ఎంత విస్తీర్ణంలో,ఎంతలోతులో రీఛార్జి ఉంది?
- అధ్యయనానికి ప్రభుత్వం నిర్ణయం
- బార్క్‌తో ఒప్పందం
- కాలువ 554 కి.మీ. పొడవునా పరిశీలన

ఈనాడు, అమరావతి: రాయలసీమ జిల్లాల్లో కాలువల్లో నీటి ప్రవాహాల వల్ల భూగర్భ జలాలపై ఎలాంటి ప్రభావం పడుతోంది? అవి ఎంత ఉపయుక్తంగా ఉంటున్నాయనే అంశాలపై శాస్త్రీయ అధ్యయనానికి శ్రీకారం చుట్టారు. ఇందుకు బాబా అణుశక్తి పరిశోధన కేంద్రం (బార్క్)తో రాష్ట్ర భూగర్భ జలవనరులశాఖ ఒప్పందం చేసుకుంది. ఇందుకు హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కింద రాయలసీమ అన్ని జిల్లాల్లో కాలువలు ప్రవహించే 554 కి.మీ. మార్గాన్ని ఎంచుకున్నారు. సీమ జిల్లాల్లో కాలువల ద్వారా నీటిని తరలించే క్రమంలో రెండు వివాదాలు ఏర్పడుతున్నాయి. రైతులకు, జలవనరులశాఖ అధికారులకు మధ్య భిన్నాభిప్రాయాలు ఏర్పడుతున్నాయి.

రైతులు, నాయకుల వాదన ఇలా:

ఈ కాలువలకు లైనింగ్ చేయొద్దు. ప్రవాహ సామర్థ్యం పెంచాలంటే కాలువలు వెడల్పు చేయాలి. దీనివల్ల కాలువ ప్రవాహమార్గంలో భూగర్భ జలాలు వృద్ధిచెంది ఆయకట్టుకూ ప్రయోజనం కలుగుతుంది. ఈ ప్రాంత ఆయకట్టుకు నీళ్లు మళ్లించుకునేందుకు వీలుంటుంది.

జలవనరులశాఖ అధికారులు:

కాలువలకు లైనింగ్ చేయకపోతే నీరంతా ఇంకిపోతుంది. చివరివరకు నీళ్లు వెళ్లట్లేదు. ఫలితంగా రూ.వందల కోట్లు ఖర్చుచేసినా ఆశించిన ఫలితాలు రావు. పైగా ఇంకిపోవడం వల్ల.. ఎత్తిపోసిన నీరు భూమిలో చేరుతోంది. మళ్లీ బోర్ల సాయంతో పైకి తోడి వాడుకోవాల్సి వస్తోంది.

హంద్రీనీవాపై జలవనరులశాఖ ఏం చెప్పింది?

- కృష్ణా వరదనీటిని 1,649 మీటర్ల ఎత్తుకు 70 చోట్ల పంపుహౌస్‌లు ఏర్పాటుచేసి ఎత్తిపోస్తున్నారు. 554 కి.మీ. పొడవునా కాలువలు తవ్వారు.
- ప్రధాన కాలువ ప్రారంభంలో 2,200 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తే తొలిదశలో 216 కిలోమీటర్ల చివరకు 1,200 క్యూసెక్కులే మిగులుతోంది.
- 304 కి.మీ.కు వెళ్లే సరికి 750 క్యూసెక్కులు, 370 కి.మీ.కు వెళ్లేసరికి 550 క్యూసెక్కులు, 400 కి.మీ.కు చేరేసరికి 400 క్యూసెక్కులే మిగులుతోంది. దాదాపు 1,600 క్యూసెక్కులు నష్టపోతున్నామని లెక్కతేల్చారు.
- పుంగనూరు బ్రాంచి కాలువలో 400 క్యూసెక్కులు మళ్లిస్తే చివరకు వెళ్లేసరికి 15 క్యూసెక్కులే మిగులుతోంది.
- కుప్పం బ్రాంచి కాలువలో చివరకు నీరు చేరడమే కష్టమవుతోంది. అందుకే తొలిదశలో కాలువ వెడల్పు, ఆ తర్వాత లైనింగ్‌కు ప్రభుత్వం పచ్చజెండా ఊపి పనులు చేపట్టింది.

ఇప్పుడు ఏమిటీ అధ్యయనం?

బార్క్ సంస్థ హంద్రీనీవా కాలువ 554 కి.మీ. పొడవునా అధ్యయనం చేస్తుంది. హంద్రీనీవా వల్ల భూగర్భ జలాలు ఎంతమేర రీఛార్జి అవుతున్నాయి? వాటి వల్ల ఎంత మేర ప్రయోజనం కలుగుతుందనేది ఈ అధ్యయన లక్ష్యం. కాలువను ఆనుకుని ఐసోటోప్స్ ఆధారంగా ఈ అధ్యయనం చేస్తారు. కాలువ జలాల్లో ఉన్న ఐసోటోప్స్... ఆ సమీపంలో ఎంత దూరం ఈ జలాలు ఇంకాయి? ఎంత లోతుకు రీఛార్జి అయ్యాయో పరిశీలిస్తారు. కాలువలోను, సమీప భూగర్భంలోను, సమీప చెరువుల్లోను ఈ పరిశీలన జరుగుతుంది. అనేక దూరాల్లో నీటి శాంపిల్స్ తీసుకుంటారు. లైనింగ్ ఉన్న చోట, లేనిచోటా అధ్యయనం జరుగుతుంది. వర్షపు నీటినీ అధ్యయనం చేస్తారు. హంద్రీనీవా కాలువ వల్ల ఎంత రీఛార్జి, వర్షాల వల్ల ఎంత రీఛార్జి అన్నది తేలుస్తారు. బార్క్‌కు కావాల్సిన గణాంకాలను భూగర్భ జలవనరులశాఖ అందిస్తుంది. ఏడాది పొడవునా పరిశీలించి ఆ తర్వాత నివేదిక సమర్పిస్తారు.

ఆసుపత్రుల్లో పారిశుద్ధ్య నిర్వహణ టెండర్ల ఖరారు

- మూడు జోన్లలో 6 ప్యాకేజీల కింద కేటాయింపు

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ ఆసుపత్రుల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణ టెండర్ల ప్రక్రియ ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. సోమవారం నిర్వహించిన బిడ్ ఫైనలైజేషన్ కమిటీ (బీఎఫ్‌సీ) సమావేశంలో వైద్య విద్య సంచాలకుల (డీఎంఈ), సెకండరీ హెల్త్ సంచాలకుల(డీఎస్‌హెచ్) పరిధిలోని 136 ఆసుపత్రుల్లో పారిశుద్ధ్య నిర్వహణకు గుత్తేదారులను ఖరారు చేశారు. డీఎంఈ పరిధిలో క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ లిమిటెడ్ (నెలకు రూ.4.68 కోట్ల చొప్పున), ఆల్ సర్వీసెస్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ (రూ.4.47 కోట్లు), పద్మావతి హాస్పిటల్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (రూ.5.14 కోట్లు)లను అర్హులుగా గుర్తించారు. డీఎస్‌హెచ్ పరిధిలోని ఆసుపత్రుల్లో పారిశుద్ధ్య పనులకు అజైల్ సెక్యూరిటీ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (నెలకు రూ.2.64 కోట్ల చొప్పున), క్వాలిటీ ప్రాపర్టీ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ (రూ.2.66 కోట్లు), శ్రీ కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ (రూ.2.62 కోట్లు)లను ఎంపిక చేశారు.

లోపాలకు తావివ్వకుండా ఎంపిక

ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) పర్యవేక్షణలో మే 30న శానిటేషన్ టెండర్లు పిలిచి, జులై 2 ఆఖరు తేదీగా నిర్ణయించారు. అంతకుముందు పిలిచిన టెండర్లు సాంకేతిక కారణాలతో రద్దయ్యాయి. దాంతో నిబంధనల్లో మార్పులు చేసి, డీఎంఈ పరిధిలోని 28 బోధనాసుపత్రులు, జీజీహెచ్‌లకు.. డీఎస్‌హెచ్ పరిధిలోని 108 జిల్లా ఆసుపత్రులు, ఇతర ఆసుపత్రులకు మళ్లీ వేర్వేరుగా టెండర్లు పిలిచారు. జూన్ 10న ప్రీ బిడ్ సమావేశం, 13న అభ్యంతరాల స్వీకరణ, అనుమానాల నివృత్తికి అవకాశం ఇచ్చారు. జులై 7న టెక్నికల్ బిడ్లు, ఆగస్టు 4న టెక్నికల్ బిడ్లు, 8న ఫైనాన్షియల్ బిడ్లు తెరిచారు. పారిశుద్ధ్య టెండర్లలో లోపాలకు తావివ్వకుండా అర్హతలను గుర్తించేందుకు ప్రభుత్వం ఏపీఎంఎస్ఐడీసీ టెక్నికల్ ఎవల్యూషన్ కమిటీ, నలుగురు హెచ్‌వోడీలతో మరో కమిటీని నియమించింది. రాష్ట్రంలో మూడు జోన్ల పరిధిలో ఆరు ప్యాకేజీల్లో పారిశుద్ధ్య పనులను అర్హత సాధించిన ఆరు సంస్థలకు అప్పగించాలని బిడ్ ఫైనలైజేషన్ కమిటీ నిర్ణయించింది. ఆయా సంస్థలకు డీఎంఈ, డీఎస్‌హెచ్‌లు పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యతలు అప్పగించి పర్యవేక్షిస్తారు. కాగా, టెండర్లలో తిరస్కరణకు గురైన రెండు సంస్థలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి.

ఏటీఎస్ విధానాన్ని తక్షణం ఉపసంహరించండి

- తెదేపా కేంద్ర కార్యాలయంలో ట్యాక్సీ ఓనర్లు, డ్రైవర్ల వినతి

ఈనాడు, అమరావతి: రవాణా వ్యవస్థ మనుగడకు ఆటోమేటిక్ ఫిట్‌నెస్ టెస్టింగ్ సిస్టమ్ (ఏటీఎస్) పెనుముప్పుగా పరిణమించిందని, తక్షణం దాన్ని ఉపసంహరించుకోవాలని ఏపీ ట్యాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ విధానంతో వాహనాల ఇంజిన్లు, టైర్లు, ఇతర ముఖ్య భాగాలకు హాని జరుగుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం వినతిపత్రం సమర్పించారు. వివిధ సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి తెదేపా నేతలు సలగల రాజశేఖర్, స్వామినాయుడు వినతులు స్వీకరించారు. గతంలో ఆర్మీలో పనిచేసిన తనకు కడప జిల్లా బద్వేలు మండలంలో ప్రభుత్వం ఇచ్చిన 5 ఎకరాల్ని దక్కకుండా చేయాలని రెవెన్యూ అధికారులు ప్రయత్నిస్తున్నారని ప్రకాశం జిల్లా కొమరోలుకు చెందిన మాలేపాటి వెంకటేశు వాపోయారు. తన భూ వివరాల్ని ఆన్‌లైన్ చేయకుండా రెవెన్యూ సిబ్బంది ఇబ్బందిపెడుతున్నారని నెల్లూరు జిల్లా ఉదయగిరికి చెందిన సయ్యద్ హైదర్‌అలీ ఫిర్యాదు చేశారు. 23 ఏళ్లుగా ప్రాథమిక పాఠశాలలో వంట పనిచేస్తున్న తనను అన్యాయంగా తొలగించారని చిత్తూరు జిల్లా యాదమరి మండలం చిన్నిరెడ్డిపల్లెకు చెందిన రజిని ఫిర్యాదు చేశారు.

12 మార్కెట్ కమిటీలకు పాలకవర్గాల నియామకం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 12 మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రకాశం జిల్లా (కనిగిరి, కొండపి), పశ్చిమగోదావరి(ఉండి), కృష్ణా(పామర్రు), శ్రీసత్యసాయి(తనకల్లు, పెనుకొండ), నంద్యాల(ఆత్మకూరు), పల్నాడు(మాచర్ల), పార్వతీపురం మన్యం(పార్వతీపురం), అంబేడ్కర్ కోనసీమ(రామచంద్రాపురం, ముమ్మిడివరం), అన్నమయ్య జిల్లా(రాయచోటి) వ్యవసాయ మార్కెట్ కమిటీలు, పాలకవర్గాలకు ఛైర్మన్‌లను, సభ్యులను నియమించారు.

వారిపై 13 వరకు తొందరపాటు చర్యలొద్దు

ఈనాడు, అమరావతి: పులివెందుల వైకాపా కార్యాలయం నుంచి పోలీసుస్టేషన్ వరకు అనుమతి లేకుండా వైకాపా నేతలు ర్యాలీ చేయడంపై ఎంపీడీవో ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదుచేసిన కేసులో నిందితులందరిపై ఈ నెల 13 వరకు తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. 12న జడ్పీటీసీ ఎన్నిక నేపథ్యంలో ఈ మేరకు ఉత్తర్వులిస్తున్నట్లు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి సోమవారం పేర్కొన్నారు.

- అనుమతి లేకుండా ర్యాలీ చేసిన వ్యవహారంలో వైకాపా ఎంపీ అవినాష్‌రెడ్డి, వైకాపా రాష్ట్ర ప్రధానకార్యదర్శి సతీష్‌కుమార్‌రెడ్డి, మరికొందరిపై పోలీసులు కేసు నమోదుచేశారు. తమపై కేసును కొట్టేయాలని కోరుతూ నిందితులు కొందరు దాఖలుచేసిన వ్యాజ్యంపై సోమవారం హైకోర్టు విచారణ జరిపింది. రాష్ట్ర పీపీ ఎం.లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లపై నమోదు చేసిన కేసు ఏడేళ్లలోపు జైలు శిక్షకు వీలున్న వేనన్నారు. ఈ నేపథ్యంలో బీఎన్ఎస్ఎస్ 35(3) ప్రకారం నోటీసు ఇచ్చి వివరణ తీసుకుంటామన్నారు.

తదుపరి చర్యలొద్దు: హైకోర్టు

వైకాపా నేతలు లింగాల రామలింగారెడ్డితో పాటు మరికొందరిపై హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ ఎట్రాసిటీ చట్టం కింద నమోదుచేసిన కేసులో ఈ నెల 13 వరకు తదుపరి చర్యలు తీసుకోవద్దని పులివెందుల పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఈ నెల 12న జడ్పీటీసీ ఎన్నిక నేపథ్యంలో ఈ మేరకు ఉత్తర్వులిస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి పేర్కొన్నారు. కులం పేరుతో దూషించి దాడి చేశారంటూ తెదేపా నేత ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా వైకాపా నేతలు రామలింగారెడ్డితో పాటు మరో 50 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తమపై కేసును కొట్టేయాలని కోరుతూ నిందితుల్లో కొందరు హైకోర్టును ఆశ్రయించారు. సోమవారం జరిగిన విచారణలో పిటిషనర్ల తరఫు న్యాయవాది దుష్యంత్‌రెడ్డి వాదనలు వినిపించారు. జడ్పీటీసీ ఎన్నికల్లో పాల్గొనకుండా అడ్డుకునేందుకు పిటిషనర్లపై తప్పుడు కేసు నమోదు చేశారన్నారు. పోలీసుల తరఫున పీపీ ఎం. లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ..'నిందితులు ఫిర్యాదిదారును కులం పేరుతో దూషించారు. దాడి చేశారు. బాధితులు ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ఎస్సీ ఎస్టీ ఎట్రాసిటీ కేసులో బాధితుల వాదన వినకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి వీల్లేదు. బాధితులకు నోటీసులు జారీచేయండి. తర్వాత మధ్యంతర ఉత్తర్వులపై నిర్ణయం తీసుకోండి. బాధితులకు నోటీసు తప్పనిసరి అంటూ సుప్రీంకోర్టు, హైకోర్టు పలు సందర్భాల్లో తీర్పులిచ్చాయి' అని పేర్కొన్నారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయమూర్తి.. ఈ నెల 12న జడ్పీటీసీ ఉప ఎన్నిక ఉన్నందున స్వల్ప కాలానికి ఈ కేసులో నిందితులపై తదుపరి చర్యలను నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. విచారణను వాయిదా వేశారు.

సింగిల్ జడ్జి ఉత్తర్వులు సరైనవే: ధర్మాసనం

పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలను సజావుగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో, నిష్పాక్షికంగా నిర్వహించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులు సరైనవేనని హైకోర్టు ధర్మాసనం స్పష్టంచేసింది. మరోవైపు పిటిషనర్ ఇచ్చిన వినతిపై ఎస్ఈసీ తగిన ఉత్తర్వులు జారీచేసిందని గుర్తుచేసింది. అప్పీల్‌ను పరిష్కరించింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హరీ, జస్టిస్ కుంచం మహేశ్వరరావుతో కూడిన ధర్మాసనం సోమవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

- తటస్థంగా ఉండే ఎన్నికల పరిశీలకులను నియమించాలని, సీసీటీవీ కెమెరాలతో ఎన్నికల ప్రక్రియను రికార్డు చేయాలని, బ్యాలట్ బాక్సులను తరలించేటప్పుడు, స్ట్రాంగ్‌రూములలో భద్రపరిచేటప్పుడు పోలింగ్ ఏజెంట్లను అనుమతించాలని, ప్రతిపక్ష నేతలను అరెస్టు చేయకుండా పోలీసులను నిలువరించాలని కోరుతూ వైకాపా నేతలు సింగిల్ జడ్జి వద్ద వ్యాజ్యాలు వేశారు. విచారణ జరిపిన న్యాయమూర్తి.. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్ఈసీతో పాటు జిల్లా కలెక్టర్, పోలీసులను ఆదేశించారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ వైకాపా నేతలు ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. సోమవారం జరిగిన విచారణలో సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. తటస్థ పరిశీలకులను నియమించాలని, సీసీ కెమెరాలతో రికార్డు చేయాలని కోరిన వినతిని సింగిల్ జడ్జి తిరస్కరించారన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. సజావుగా ఎన్నికలు నిర్వహించాలని సింగిల్ జడ్జి సరైన ఉత్తర్వులు ఇచ్చారని స్పష్టం చేసింది.

ఈడీ విచారణకు హాజరైన సినీ నటుడు రానా



ఈనాడు, హైదరాబాద్: గేమింగ్ యాప్‌లకే ప్రచారం చేశాను తప్ప బెట్టింగ్ యాప్‌లకు కాదని, నిబంధనల ఉల్లంఘనకు పాల్పడలేదని సినీ నటుడు దగ్గుబాటి రానా ఈడీ అధికారులకు చెప్పినట్లు తెలుస్తోంది. బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన పలువురు సినీ ప్రముఖులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) విచారిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ప్రకాశ్‌రాజ్, విజయ్ దేవరకొండలను విచారించింది. రానా జులై 23వ తేదీనే విచారణకు హాజరు కావాల్సి ఉండగా... ఆయన విజ్ఞప్తి మేరకు విచారణను అధికారులు వాయిదా వేశారు. ఈ మేరకు సోమవారం ఉదయం 10.30 గంటల సమయంలో రానా ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. తనవెంట పలు దస్త్రాలను తీసుకొచ్చారు. తాను ప్రచారం చేసిన సంస్థలకు చెందిన ఒప్పందపత్రాలు వాటిలో ఉన్నట్లు తెలుస్తోంది. విచారణ ముగిసిన అనంతరం మధ్యాహ్నం 2.40 గంటలకు తిరిగివెళ్లారు. అవసరమైతే మరోసారి పిలుస్తామని ఆయనకు ఈడీ అధికారులు చెప్పినట్లు సమాచారం.

పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వైకాపా వినతి

ఈనాడు, అమరావతి: పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికలకు సంబంధించి మంగళవారం పోలింగ్ జరగనున్న నేపథ్యంలో అక్కడ అన్ని పోలింగ్ కేంద్రాల్లో, వాటి బయటా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని వైకాపా డిమాండ్ చేసింది. ఆ పార్టీ ప్రతినిధుల బృందం విజయవాడలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్(ఎస్ఈసీ)ను సోమవారం కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించింది. తర్వాత మాజీ మంత్రులు పేర్ని నాని, జోగి రమేష్ విలేకరులతో మాట్లాడారు. "పులివెందులలో ఎన్నికల యంత్రాంగం ఓటర్లకు ఓట్ల స్లిప్పులను పంపిణీ చేస్తూ వెళుతుంటే.. వారి వెనకే తెదేపా వాళ్లు వెళ్లి ఓటుకు రూ.10వేలు ఇస్తామని ఆశచూపి ఆ స్లిప్పులను ఓటర్ల నుంచి తీసేసుకుంటున్నారు. ఎవరైనా ఇవ్వబోమంటే భయపెడుతున్నారు. ఎస్ఈసీకి ఈ విషయాన్ని తెలిపితే, భద్రత కోసం ఏ ఊర్లో ఎంత మంది పోలీసులను నియమించామనేదీ ఎస్పీ వివరాలు పంపారంటున్నారు. ఎన్నికల అధికారులు, పోలీసులు పేపర్‌పైనే ఉన్నారు" అని పేర్ని నాని విమర్శించారు. జోగి రమేష్ మాట్లాడుతూ.. "జగన్ అడ్డా అయిన పులివెందులలో ఒక్క జడ్పీటీసీ స్థానాన్ని గెలిస్తే జగన్, వైకాపా శ్రేణుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయవచ్చనుకుని.. చంద్రబాబు అక్కడ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు" అని ఆరోపించారు.

'సీఏపీఎఫ్ మాజీ సైనికులకు అన్ని సదుపాయాలు కల్పించాలి'

ఈనాడు, అమరావతి: డిఫెన్స్ మాజీ సైనికుల మాదిరిగానే సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్సెస్ (సీఏపీఎఫ్) మాజీ సైనికులకు సైతం అన్ని సదుపాయాలు కల్పించాలని.. సీఏపీఎఫ్ విశ్రాంత సైనికుల సంక్షేమ సంఘం కోరింది. ఈ మేరకు సోమవారం తెదేపా కేంద్ర కార్యాలయంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ రాజశేఖర్‌బాబుకు, జనసేన రాష్ట్ర కార్యాలయంలో ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజుకు వేర్వేరుగా వినతులు అందజేశారు. తమకు అన్ని సదుపాయాలు కల్పించాలంటూ కేంద్రం ఆదేశాలిచ్చినా.. అవేమీ అమలు కావడం లేదన్నారు. 2012లో కేంద్రం జారీ చేసిన జీవో అమలు, సైనిక సంక్షేమ మండళ్ల ఏర్పాటు, ఇంటి పన్ను మినహాయింపు వినతుల ద్వారా కోరినట్లు పేర్కొన్నారు.

ఏపీయూఐఏఎంఎల్ ఇన్‌ఛార్జ్ సీఈవోగా సంపత్‌కుమార్

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పట్టణ మౌలిక సదుపాయాలు, ఆస్తుల నిర్వహణ సంస్థ (ఏపీయూఐఏఎంఎల్) ఇన్‌ఛార్జ్ సీఈవోగా పి.సంపత్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం పురపాలక శాఖ సంచాలకుడిగా ఉన్న ఈయనకు ఏపీయూఐఏఎంఎల్ సీఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రాజెక్ట్ టైగర్, ఎలిఫెంట్ కింద ఏపీకి కేటాయించిన నిధుల్లో 33% విడుదల

లోక్‌సభలో కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ వెల్లడి

ఈనాడు, దిల్లీ: ప్రాజెక్ట్ టైగర్, ఎలిఫెంట్ కింద ఏపీకి 2020-21 నుంచి 2024-25 మధ్య కేంద్ర ప్రభుత్వం రూ.35.51 కోట్లు కేటాయించగా, ఇంత వరకు రూ.11.71 కోట్లు (33%) విడుదల చేసిందని కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ వెల్లడించారు. లోక్‌సభలో సోమవారం తెదేపా ఎంపీలు బైరెడ్డి శబరి, కలిశెట్టి అప్పలనాయుడులు అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు.

ఏపీలోని సిమెంట్ పరిశ్రమల్లో ఫ్లైయాష్ వినియోగం 38.67%

మూడేళ్లలో ఏపీలోని వివిధ థర్మల్ విద్యుత్తు కేంద్రాల నుంచి వెలువడిన ఫ్లైయాష్‌లో 38.67% మాత్రమే సిమెంట్ పరిశ్రమల్లో వినియోగించినట్లు కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ తెలిపారు. లోక్‌సభలో అనంతపురం తెదేపా ఎంపీ జి.లక్ష్మీనారాయణ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు.

42% మాధ్యమిక పాఠశాలలకు బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లు

ఏపీలోని 6,930 మాధ్యమిక పాఠశాలల్లో 2,910 (42%) పాఠశాలలకు బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లు ఉన్నట్లు కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి జయంత్ చౌధరి తెలిపారు. లోక్‌సభలో తిరుపతి వైకాపా ఎంపీ మద్దిల గురుమూర్తి అడిగిన ప్రశ్నకు ఆయన జవాబిచ్చారు. మిగిలిన వాటికి భారత్ నెట్ కింద దశల వారీగా కనెక్షన్లు ఇవ్వనున్నట్లు చెప్పారు.

ఒప్పంద లెక్చరర్ల క్రమబద్ధీకరణ పునః ప్రారంభించాలి: ఎమ్మెల్సీ గోపిమూర్తి

ఈనాడు, అమరావతి: ఎన్నికల కోడ్ కారణంగా చివరి దశలో నిలిచిపోయిన ఒప్పంద లెక్చరర్ల సర్వీసు వెంటనే క్రమబద్ధీకరించాలని ఎమ్మెల్సీ గోపిమూర్తి డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఇంటర్మీడియట్ విద్యా మండలి వద్ద ఒప్పంద లెక్చరర్లు ధర్నా నిర్వహించారు. అనంతరం జేడీ తాతారావుకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ఒప్పంద లెక్చరర్ల క్రమబద్ధీకరణను ఎన్నికల కోడ్ వరకు తాత్సారం చేయడంతో ఈ ప్రక్రియ పెండింగ్‌లో పడిందని పేర్కొన్నారు. ఒప్పంద లెక్చరర్ల అసోసియేషన్ నాయకులు మాణిక్యం గొర్ల, బీజేగాంధీ, రత్నకుమారి మాట్లాడుతూ.. కూటమి అధికారంలోకి రాగానే న్యాయం చేస్తామని సీఎం చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు.

హయ్యర్ పింఛను చెల్లింపులకు మరోసారి అవకాశమివ్వాలి: ఎన్ఎంయూఏ

ఈనాడు, అమరావతి: ఈపీఎఫ్ నుంచి వచ్చిన నోటీసులు చూసుకోకపోవడంతో.. సకాలంలో హయ్యర్ పింఛను కంట్రిబ్యూషన్ చెల్లించలేకపోయిన ఆర్టీసీ ఉద్యోగులకు.. మరోసారి డబ్బులు చెల్లించేందుకు అవకాశం ఇవ్వాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) కోరింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని రీజనల్ పీఎఫ్ కమిషనర్‌కు సోమవారం లేఖ రాసినట్లు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు తెలిపారు. ఒడిశాలోని రవుర్కెలా ఈపీఎఫ్ ట్రస్ట్ పరిధిలో ఇటువంటి అవకాశం కల్పించారని, ఇక్కడ కూడా దీనిని అమలు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. ఆర్టీసీలో 58 ఏళ్లు నిండిన వేల మంది ఉద్యోగులు ఈ నోటీసులు చూసుకోకపోవడంతో హయ్యర్ పింఛనుకు అర్హత పొందలేకపోయారని, వీరందరికీ మరోసారి అవకాశం ఇవ్వాలని కోరినట్లు వెల్లడించారు.

'పరీక్షలు పాత విధానంలోనే నిర్వహించాలి'

ఈనాడు, అమరావతి: పాఠశాల విద్యార్థులకు నిర్వహించే ఫార్మెటివ్, సమ్మెటివ్ పరీక్షలను పాత విధానంలోనే నిర్వహించి, మార్కులు ఆన్‌లైన్ నమోదు వరకు పరిమితం చేయాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ గోపీమూర్తి కోరారు. విద్యాభవన్‌లో సోమవారం డైరెక్టర్ విజయరామరాజును కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ.. "మూల్యాంకన పుస్తకాల్లో పరీక్షలు రాయడం, ఓఎమ్మార్ షీట్‌లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం ఉపాధ్యాయులకు కష్టంగా ఉంటుంది. ఓఎమ్మార్ షీట్‌లను అప్‌లోడ్ చేసే పద్ధతిని విరమించుకోవాలి. ఇలాంటివి చేసేందుకు ఉన్నత పాఠశాలలకు బోధనేతర సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్‌లను నియమించాలి. ప్రాథమిక పాఠశాలల ఆన్‌లైన్ కోసం క్లస్టర్ల వారీగా కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించాలి. విద్యార్థుల హాజరు నమోదుకు ఉదయం 10 గంటల వరకు సమయం ఇవ్వాలి. డీఎస్సీ కంటే ముందు అంతర్ జిల్లాల బదిలీలు చేపట్టాలి. పాఠశాలల్లో చేపట్టే మౌలిక సదుపాయాల పనుల నుంచి టీచర్లకు మినహాయింపు ఇవ్వాలి. అంధ ఉపాధ్యాయులకు హాజరు మినహాయింపు ఇవ్వాలి" అని విన్నవించారు.

ఆ వాహనం నిర్వాహకులు ఏర్పాటు చేసింది

నటి నిధి అగర్వాల్ వివరణ



ఇంటర్నెట్‌డెస్క్: భీమవరంలో జరిగిన ఈవెంట్‌కు నిర్వాహకులు ఏర్పాటు చేసిన వాహనంలో మాత్రమే వచ్చానని నటి నిధి అగర్వాల్ తెలిపారు. ఏపీ ప్రభుత్వ బోర్డు ఉన్న వాహనంలో ఆమె కనిపించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. దీనిపై నిధి అగర్వాల్ ఎక్స్ వేదికగా వివరణ ఇచ్చారు. "ఇటీవల భీమవరంలో ఓ స్టోర్ ప్రారంభోత్సవానికి హాజరైన సందర్భంగా జరిగిన పరిణామాలపై సోషల్ మీడియాలో వైరలవుతున్న వార్తలు నా దృష్టికి వచ్చాయి. నేను అక్కడ ప్రయాణించడానికి ఈవెంట్ నిర్వాహకులే కారు ఏర్పాటు చేశారు. అది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానిదని తెలిసింది. ఫలానా వాహనం పెట్టాలని నేను కోరలేదు. అది కార్యక్రమం అవసరార్థం పూర్తిగా స్థానిక నిర్వాహకులు చేసిన ఏర్పాటు మాత్రమే" అని ఆమె పేర్కొన్నారు.

గ్రామకంఠం, వ్యవసాయేతర భూములకు యాజమాన్యధ్రువీకరణ పత్రం

ఈనాడు, అమరావతి: గ్రామకంఠం, వ్యవసాయేతర భూములకు సంబంధించి ఫారం జీకే-2 తయారీ పూర్తయ్యాక.. యాజమాన్య హక్కు ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని సీసీఎల్ఏ, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.జయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామం యూనిట్‌గా జీకే-ఎక్స్ తయారు చేయాలని సూచించారు. యాజమాన్య ధ్రువీకరణ పత్రాన్ని ఎలక్ట్రానిక్ రూపంలో తయారు చేసి ఇవ్వాలని, అది తెలుగు, ఆంగ్ల భాషల్లో ఉండాలని పేర్కొన్నారు. ఇది రిజిస్టర్డ్ దస్తావేజుకు సమానంగా ఉంటుందని తెలిపారు. అందరికీ ఇళ్లు పథకం కింద గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల పంపిణీలో భాగంగా మార్గదర్శకాలు జారీ చేశారు.

ఏపీడీసీఎఫ్ఎల్ స్టాండింగ్ కౌన్సెల్‌గా న్యాయవాది రాజేష్‌కుమార్

ఈనాడు, అమరావతి: ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ (ఏపీడీసీఎఫ్ఎల్) తరఫున హైకోర్టులో వాదించేందుకు న్యాయవాది గుండపు రాజేష్‌కుమార్ స్టాండింగ్ కౌన్సెల్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు న్యాయ శాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పదవిలో ఆయన మూడేళ్లపాటు కొనసాగనున్నారు.

13న ధర్నాకు ప్రైవేట్ డిగ్రీ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ పిలుపు

ఈనాడు, అమరావతి: తాడేపల్లిలోని సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయం వద్ద ఈ నెల 13న శాంతియుత ధర్నా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ డిగ్రీ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఏపీపీడీసీఎంఏ) ఓ ప్రకటనలో తెలిపింది. 2023-24 నుంచి పెండింగ్‌లో ఉన్న ఆరు విడతల ఆర్‌టీఎఫ్ నిధుల విడుదలలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయరాం, పైడిరాజు తెలిపారు. డిగ్రీ కళాశాలల నిర్వహణలో ఆర్థిక సమస్యలతో సతమతమవుతుంటే.. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవద్దని కలెక్టర్లు ఆదేశాలు ఇస్తున్నారని అన్నారు.

(c) eenadu